Dwaraka

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: శుద్ధ సప్తమి ఉ. 11.50 వరకు, అనంతరం అష్టమి; నక్షత్రం: అశ్వని తె. 4.30 వరకు, అనంతరం భరణి; అమృతకాలం: రా. 9.30 నుండి 11.10 వరకు; వర్జ్యం: రా. 12.34 నుండి 2.08 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com Journalism first!

సంపుటి:56 • సంచిక:283 • బుధవారం 24 జనవరి 2018 • హైదరాబాద్ ✻ పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

వచ్చే ఎన్నికల్లో శివసేన ఒంటరిపోరు



ముంబై: శివసేన ఒంటరి పోరాటానికి సై అంటోంది. 2019 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో జతకట్టే ప్రస్తక్తేలేదని ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగే అంశంపై పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో తీర్మానం చేసినట్లు శివసేన ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు. తమ తీర్మానానికి పార్టీ నేతలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో శివసేన మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాల్లో కనీసం25 స్థానా లను,288 అసెంబ్లీ స్థానాల్లో 150 స్థానాలను కైవశం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. హిందుత్వ ఎజెండాతో గత ఎన్నికల్లో శివసేనతో పొత్తు పెట్టుకున్న బీజేపీ మూడేళ్లలో నిరుత్సాహపరిచిందని.. అధికారం కోసమే తమపార్టీని వాడుకుందని సంజయ్ ఆరోపించారు. జమ్ము కశ్మీర్ విద్రోహ శక్తులు దాడులు చేస్తుంటే..ప్రధాని మోడీ మాత్రం ఇజ్రాయెల్ ప్రధానితో గాలిపటం ఎగరవేస్తూ ఎంజాయ్ చేస్తున్నారని శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే విమర్శించారు. మరోసారి పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉద్ధవ్ థాక్రే ప్రధాని మోడీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



మంగళవారం దావోస్ ప్లీనరీ సదస్సులో ప్రధాని మోడీ

మోడీ దశ దిశానిర్దేశం!

ప్రధాని నరేంద్ర మోడీ దావోస్ ఆర్థిక సదస్సులో కీలకోపన్యాసం చేసిన సందర్భంగా పది అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు.

- 1997లో 400 బిలియన్ డాలర్ల వద్ద ఉన్న జీడీపీ ఇప్పుడు ఆరింతలైంది.
- అప్పట్లో యూరో లేదు. బ్రెక్సిట్ ఊసే లేదు. లాడెన్ తెలీదు. హ్యారీ పోటర్ లేదు.
- టెక్నాలజీకి అతి పెద్ద ఉదాహరణ సోషల్ మీడియా.
- డేటా ఉన్నవారి చేతుల్లోనే ప్రపంచం.
- ప్రపంచీకరణ మసకబారిపోతున్నది. రెచ్చిపోతున్న రక్షణవాద శక్తులు
- గ్లోబలైజేషన్‌కు అడ్డుకట్టలు.. సుంకాల గేట్లు
- సమాకలనం, ఏకత విలువలను విశ్వసిస్తాం. భారత ప్రజాస్వామ్యం, భిన్నత్వానికి గర్విస్తుంటాం
- ఉగ్రవాదం ప్రమాదకరం. యువతపై దాని ప్రభావం బాధాకరం.
- పర్యావరణం బాగోగులు భారతీయ సంస్కృతిలో ఒక భాగం. పునరుద్ధరణీయ ఇంధనానికి పెద్ద పీట
- లైసెన్స్ రాజ్‌కు గుడ్‌బై. రెడ్ టేప్‌కు కత్తెర. విదేశీయులకు ఎర్ర తివాచీ. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తలుపులు బార్లా... భారత్‌లో తయారీ చాలా సులభం

మేమెంతో ఎదిగాం!

భారత్‌లో పెట్టుబడులతో ఆరోగ్యం.. సౌభాగ్యం • శాంతి, శ్రేయస్సు, భద్రత మీ సొంతం

మీరంతా రారండి!

ప్రపంచ దేశాలకు ప్రధాని మోడీ పిలుపు • దావోస్ ప్లీనరీలో కీలకోపన్యాసం

దావోస్: 48వ ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ చారిత్రక ప్రసంగం చేశారు. 1997లో నాటి ప్రధాని దేవెగౌడ తర్వాత మళ్లీ 20 ఏళ్లకు వేదికను చేరుకున్న నరేంద్ర మోడీకి అరుదైన గౌరవం లభించింది. 48వ ఆర్థిక సదస్సు ప్రత్యేక ప్లీనరీలో స్విస్ ప్రధాని ప్రారంభోపన్యాసం తర్వాత, వేలాది మంది ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం మోడీకి దక్కింది. ఈ సందర్భంగా మోడీ పలు కోణాల్లో ప్రపంచ అభివృద్ధిని, సవాళ్లను ప్రస్తావిస్తూ కీలక ఉపన్యాసం చేశారు. ప్రసంగం చాలా మటుకు హిందీలోనే సాగింది. సంస్కరణలు, నిర్వహణ, రూపాంతరం భారత విజయ మంత్రంగా అభివర్ణించిన

➪ 11వ పేజీలో...

మోడీ ప్రసంగ పాఠం - 4లో



మోడీజీ... పేరుకుపోయిన సంపద గురించి

దావోస్‌లో చెప్పండి

ప్రధాని మోడీకి రాహుల్ వ్యంగ్య ట్వీట్

11

"ప్రియమైన ప్రధాని మోడీ గారికి... స్విట్జర్లాండ్‌కు స్వాగతం! భారత్‌లో ఉన్న ఒకే ఒక్క శాతం ధనికులు దేశ సంపదలో 73 శాతాన్ని ఎలా దక్కించుకోగలిగారో దయచేసి దావోస్ అతిథులకు చెప్పండి. ఇందుకు సంబంధించి మిమ్మల్ని సన్నాహపరచడానికి ఒక నివేదికను జోడిస్తున్నాను. ధనికుల కోసం పనిచేస్తూ వారి రుణాలను మాత్రమే మాఫీ చేసే సంస్కృతి గురించి కూడా చెప్పండి."



దావోస్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో తెలంగాణ ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు

దావోస్‌లో బిజీ దిగ్గజాలతో భేటీలు

పెట్టుబడుల కోసం పారిశ్రామికవేత్తలతో మంత్రి కేటీఆర్ వరుస సమావేశాలు

మంచుదిబ్బలకు పరవశించిన కేటీఆర్

ఫోటోలకు ఫోజులిచ్చిన చంద్రబాబు, కేటీఆర్, లోకేష్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థికసదస్సు ప్రారంభ ప్లీనరీ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు మంగళవారం పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి సురేష్‌ప్రభుతో పాటు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భారతీయ కంపెనీల సీఈవోలు, చైర్మన్లు, మరికొందరు ఆర్థికవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు. బుధవారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ సమావేశాల్లో కేటీఆర్ అనేక ప్లీనరీ సెషన్లలో ప్రసంగిస్తారు. 25న జరగనున్న ప్లీనరీ సెషన్‌లో లెవరేజింగ్ డిజిటల్ టు డెలివర్ వాల్యూ టు సొసైటీ అన్న అంశంపై ఆయన ప్రసంగిస్తారు. అదేరోజు కేంద్రమంత్రి సురేష్ ప్రభు పాల్గొనే రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని ప్రమోటింగ్ డిజైనింగ్ ఇన్ ఇండియా అన్న అంశంపై కేటీఆర్ ప్రసంగిస్తారు. తెలంగాణ ఏర్పడిన మూడున్నరేళ్ళలో ప్రపంచ ఆర్థిక సదస్సుకు తెలంగాణ రాష్ట్రానికి అవగాహన వస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున కేటీఆర్ మొదటిసారిగా

➪ 2వ పేజీలో...

కేసీఆర్ అంటే నాకిష్టం

పొగిడితే మీకేంటి నష్టం!



మంగళవారం కరీంనగర్‌లో మూడు ఉమ్మడి జిల్లాల కార్యకర్తల సమావేశంలో పవన్ కల్యాణ్

వందేమాతరం నినాదానికి ఉన్నంత శక్తి తెలంగాణ పదానికి ఉంది

తెలంగాణ నేలతల్లికి జీవితాంతం రుణపడి ఉంటా

తెలంగాణ ఆశయాల కోసం జనసేన నిలబడుతుంది

మాటిస్తున్నా.. మాపార్టీని ఎందులో విలీనం చేయను

కాంగ్రెస్ నేతలంతా నా అన్నదమ్ములే: పవన్

కరీంగనగర్/హైదరాబాద్, ఆంధ్రప్రభ: నాకు కేసీఆర్ అంటే తొలి నుంచి ఇష్టం. ఎందు కంటే రాజకీయాల్లో ఉంటూ ప్రజల కోసం పోరాటంచేసే ఎవరినైనా నేను గౌరవిస్తా. వారితో నేను విభేదించొచ్చు... ఆ రోజుకి వారితో కొన్ని సమస్యల మీద విభేదిస్తానని అన్నారు. నేను నా జీవితంలో ఎక్కువ పెరిగింది తెలంగాణలోనే. నాకు తెలంగాణ అంటే చాలా ఇష్టం, ప్రేమ కూడా అని పవన్ అన్నారు. తెలంగాణ భావోద్వేగం నాకు చాలా దగ్గరగా ఉంటుంది. అందుకే ఈ రాష్ట్రమంటే నాకు అమితమైన ప్రేమ, గౌరవం, ఇష్టం అని చెప్పారు. కులాలను కలిపే ఆలోచనా విధానానికి 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జరుగుతున్నపుడు తాను ఆ రోజు కోరుకున్నది తెలంగాణ రావాలని అని అన్నారు. నేను తెలంగాణ వ్యతిరేకిని కాదని, నాకు తెలం గాణ అంటే ఇష్టం, ప్రేమ అంతేకాదు ప్రాణం కూడా అని అన్నారు. కరీంనగర్‌లో జరుగుతున్న 'చలోరే.. చల్' సభ మంగళవారం స్థానిక శుభం గార్డెన్స్‌లో జరిగింది. నాలుగేళ్ళ పసిబిడ్డ తెలంగాణ రాష్ట్రమని, దానిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. తెలంగాణ

➪ 3వ పేజీలో...

ఫీ'జులుం' చేస్తే క్రిమినల్ కేసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విద్యాచట్టం ప్రకారం రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో వార్షిక ఫీజులను ఎటువంటి పరిస్థితుల్లో పెంచరాదని ప్రభుత్వం మరోసారి స్పష్టంచేసింది. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి ఇష్టానుసారంగా విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేయాలని చూస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది. 2018-19 విద్యాసంవత్సరానికి పాత ఫీజులనే అమలు చేయాలని డొనేషన్ల పేరుతో విద్యార్థుల ముక్కుపిండి ఫీజులను వసూలు చేయాలని చూస్తే పాఠశాలల అనుబంధ గుర్తింపును రద్దు చేస్తామని తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులను వెలువరించింది. పాఠశాల యాజమాన్యాలతో ఇదివరకు నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలే యథాతథంగా అమలవుతాయని స్పష్టంచేసింది. భవనాల నిర్మాణాలకు, మౌలిక సదుపాయాలు,

➪ 2వ పేజీలో...

బీరు బాబులకు ధరల షాక్



•రూ. 15 నుంచి 20కు పెంపు • ఫిబ్రవరి 1నుంచి అమలు • ధరల పెంపునకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు • పది రోజుల్లో నివేదిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ వేసవిలో ఫుల్‌గా బీరు తాగా ఎంజాయ్ చేద్దామనుకునే మందుబాబులకు ఇదో బ్యాడ్ న్యూస్. వచ్చే నెల ఒకటవ తేదీనుంచి రాష్ట్రంలో బీరు ధరలను పెంచాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలుస్తోంది. ఒక్కో బీరు బాటిల్ ధరను రూ.20 నుంచి 30 వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవలె బీరు మినహా ఇతర మద్యం ధరలను పెంచిన ప్రభుత్వంపై బీరు ఉత్పత్తిదారుల సంస్థలు తాము ఉత్పత్తి చేస్తున్న మద్యం ధరలను కూడా పెంచాలని తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చినట్టు తెలుస్తోంది. ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వం ఓ ఉన్నతస్థాయి అధికారుల బృందాన్ని నియమించి ధరల పెంపునకు సంబంధించి వారినుంచి ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించినట్టు సమాచారం. ఈనెల చివరిలోపు నివేదిక అందజేయాలని రెండు, మూడు రోజుల్లో ధరల పెంపునకు సంబంధించిన నిర్ణయం వెలువడుతుందని అధికారులు చెబుతున్నారు. వేసవి ప్రారంభమయ్యేలోపే ధరలను పెంచాలని ఇప్పటికే బీరు ఉత్పత్తిదారుల సంస్థల ప్రతినిధులు పలుమార్లు ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు గౌడ్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, ఎక్సైజ్‌శాఖ కమీషనర్‌ను కలిసి అభ్యర్థించాయి. ఈ మేరకు వినతిపత్రాలు కూడా అందజేశాయి. పొరుగు రాష్ట్రాల్లో మద్యం ధరలతో పాటు ప్రజలు ఎక్కువగా సేవించే బీరు ధరలను పెంచారని వారు నివేదించారు. పెరిగిపోయిన ఖర్చులు, ఇతరత్రా సమస్యల కారణంతో బీరు ఉత్పత్తికి సంబంధించిన వ్యయం పెరిగిపోయిందని ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన ధరలు తమకు గిట్టుబాటుగా లేవని వారంటున్నారు. కనీసం ఓ బీరు సీసాకు రూ.30 పెంచితేనే తమకు ఉపయుక్తంగా ఉంటుందని

➪ 2వ పేజీలో...



ఎస్సై సునీతారెడ్డి



సీఐ మల్లికార్జున రెడ్డి

పోలీస్ శాఖ పరువు తీశారు.. ఇద్దరూ సస్పెండయ్యారు

వీరిద్దరి ఆరు నెలల కాల్‌డేటా పరిశీలన • నలుగురి స్టేట్‌మెంట్ల రికార్డ్ • ఓటుకు నోటు కేసుతో బలపడిన బంధం • నా భార్యను క్షమించి తప్పుచేశా: సునీత భర్త

5 లో



సహకార ఎన్నికలకు నో ఛాన్స్

- నోటిఫికేషన్ విడుదలకు దాటిపోయిన గడువు
- ముఖ్యమంత్రి పరిశీలనలో పొడిగింపు ప్రతిపాదన
- రాజకీయ కోణంలో కేసీఆర్ సమాలోచనలు
- పర్సన్ ఇన్‌ఛార్జిలా? పాలక మండళ్లా..?
- ఇదే అంశంపై నిపుణులతో చర్చలు
- రెండు, మూడు రోజుల్లో తుదినిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పట్లో అవకాశం లేనట్లేనని ప్రభుత్వం సంకేతాలిచ్చింది. చట్టపరంగా, రాజకీయంగా ఏ కోణంలో చూసినా అందుకు అవకాశం లేకపోవడంతో పొడిగింపు ప్రతిపాదనలను సీఎం కేసీఆర్ స్వయంగా పరిశీలిస్తున్నారు. వచ్చే నెలాఖరుతో పదవీకాలం ముగుస్తుండడంతో అధికారుల నేతృత్వంలో పర్సన్ ఇంఛార్జిల నియామకమా? లేక ఇప్పుడున్న పాలక మండళ్ళ కొనసాగింపా? అన్న అంశంపై రాజకీయ నిపుణులతో ఆయన సమాలోచనలు జరుపుతున్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లోనే ఇందుకు సంబంధించి తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇదే అంశంపై అధ్యయనం చేసిన మంత్రివర్గ ఉపసంఘం క్షేత్రస్థాయి పరిస్థితులు, పరిణామాలపై ఇటీవలే ముఖ్యమంత్రికి నివేదికను సమర్పించింది. సహకార పరపతి వ్యవస్థ, నియమ నిబంధనలు, సాధ్యాసాధ్యాలపై తాజాగా సహకార శాఖ ప్రతిపాదనలు అందజేసింది. ప్రతి ఆరు నెలలకోసారి పొడిగిస్తూ ఇప్పుడున్న పాలక మండళ్ళనే మరోదఫా కొనసాగించాలన్న దిశగానే ప్రభుత్వం మొగ్గు చూపుతోంది.

ఎన్నికలు నిర్వహిస్తేనే బాగుంటుందని గతంలో కేసీఆర్ అభిప్రాయం వ్యక్తం చేసినప్పటికీ ప్రస్తుతం ఏ కోణంలో చూసినా అందుకు సమయం చాలని పరిస్థితి నెలకొంది. ఒకవేళ ఎన్నికలు నిర్వహించాలనుకుంటే గత ఏడాది డిసెంబర్ మొదటివారం నాటికే ఓటరు జాబితాలు సిద్ధం చేయాల్సి ఉంది. అందుకు ఎంత లేదన్నా రెండు నెలల సమయం అవసరమవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. కేసీఆర్ రాజకీయ వ్యూహాన్ని అంచనా వేస్తే ఈ పరిస్థితుల్లో ఇప్పుడున్న పాలకమండళ్ళను కొనసాగించక తప్పదు. ఈ విషయాన్ని నేరుగా స్పష్టం చేయలేక అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన మొత్తం ఏడుగురు మంత్రులతో కూడిన ఉపసంఘం నెల రోజులపాటు అధ్యయనం చేసి ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించింది. సహకార చట్టం ప్రకారం ఐదేళ్ళ కాలపరిమితితో ఎన్నుకోబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (ప్యాక్స్) పాలక మండళ్ళపట్ల కేసీఆర్ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఫిబ్రవరితో ముగుస్తున్న

➪ 3వ పేజీలో...

కాళేశ్వరంతో కష్టాలు తీరతాయి

• మల్లన్న సాగర్ ద్వారా తడ్కపల్లిలో 2230 ఎకరాలకు సాగునీరు : మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట, ప్రభన్యూస్ : కొద్దిరోజుల్లోనే కాళ్వేశ్వరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి మల్లన్న సాగర్ ద్వారా తడ్కపల్లిలో 2,230 ఎకరాలకు కాలువ ద్వారా సాగు నీరు అందించి వ్యవసాయాన్ని పండుగలా చేసే రోజులు చేరువలోనే ఉన్నాయని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. మంగళవారం రోజున మండల పరిధిలో తడ్కపల్లి గ్రామంలో 16 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నా యన్నారు. మల్లన్న సాగర్ ద్వారా త్వరలోనే గ్రామంలోని వ్యవసాయ పొలాలకు సాగు నీరు అందిస్తా మన్నారు. టన్నెలు ద్వారా నీటిని అందించనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్విని యోగం చేసుకోవాలన్నారు. తడ్కపల్లికి అత్యంత చేరువలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. విద్యా, వైద్యం, అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. ఒకటి రెండు రోజుల్లో తడ్కపల్లి గ్రామానికి కేంద్రీ య విద్యాలయం రానున్నట్లు తెలిపారు.

దావోస్‌లో బిజీ దిగ్గజాలతో భేటీలు



తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్‌తో ఏపీ ఐటీ మంత్రి లోకేష్, ఎంపీ గల్లా జయదేవ్

(మొదటిపేజీ తరువాయి)

హాజరయ్యారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ ప్రభుత్వ విధానాలు, రాష్ట్రంలోని వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ వేదికను సద్విని యోగం చేసుకోనున్నారు. ఈ సదస్సులో భాగంగా పలు కంపెనీలతో ఆయన సమావేశం కానున్నారు.

ఆర్థిక సదస్సు ప్రారంభ ప్లీనరీ అనంతరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, తెదేపా ఎంపీ గల్లా జయదేశ్, ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీతో పాటు పలువురు పారిశ్రామిక దిగ్గజాలను కేటీఆర్ కలిశారు. ప్లీనరీ అనంతరం మంత్రి పలు కంపెనీలతో సమావేశ మయ్యారు. ముఖ్యంగా ఇండోరమా వెంచర్స్ ఛైర్మన్ అలోక్ లోహియాతో సమావేశమయ్యారు. అలాగే థాయ్‌లాండ్‌కు చెందిన ఈ.గ్రూప్ తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకా శాలను పరిశీలిస్తామని లోహియా చెప్పారు. బ్యాంకాక్ నగరం కేంద్రంగా పనిచేస్తున్న ఈ-టెక్స్‌టైల్ ఎన్ఎంసి కంపెనీ టెక్స్‌టైల్ అనుబంధ ఉత్పత్తులకు



ప్రసిద్ధిగాంచింది. తెలం గాణలో ఉన్న టెక్స్‌టైల్స్ పరిశ్రమకు ఉన్న అవకాశాలను వివరించిన కేటీఆర్ వరంగల్ మెగా టెక్స్‌టైల్స్ పార్కులో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. దక్షిణ కొరియా నుంచి ఆ టెక్స్‌టైల్స్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు సంసిద్ధం వ్యక్తంచేయగా, ఇండోరమా కూడా ఈ పార్కులో పెట్టుబడులకు ముందుకు రావాలని కేటీఆర్ కోరారు.మంచు దిబ్బలతో నిండిపోయిన దావోస్ నగరాన్ని చూసి తెలంగాణ ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు పరవ శించిపోయారు. దావోస్ అందాలు అబ్బురపరుస్తున్నా యంటూ మంగళవారం ట్వీట్ చేశారు. తాను బస చేస్తున్న హోటల్ గది నుంచి సెల్ఫీ దిగి దాన్ని తన ట్విట్టర్ అకౌంట్‌లో పోస్టు చేశారు. దావోస్‌లో జరగనున్న ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వచ్చే విదేశీ ప్రతినిధులు మంచు తుపానుతో ఆలస్యంగా చేరుకుంటున్నారు. ఏకధాటిగా కురుస్తున్న మంచుతో హెలికాప్టర్‌లో ప్రయాణానికి కూడా తీవ్ర అంతరాయం కలుగుతోంది. జ్యూరిచ్ నుంచి దావోస్ రైలుమార్గం లోనూ మంచు పేరుకుపోవడంతో రవాణా స్తంభించి పోయింది. గత ఆరు రోజుల్లో ఐదు అడుగుల మేరకు మంచు పడినట్లు అధికారులు చెబుతున్నారు. 20 ఏళ్ళకోసారి ఇలాంటి పరిణామాలు దావోస్‌లో చూస్తున్నామని స్థానికులు చెప్పారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు ప్రారంభం రోజున ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేటీఆర్ పాల్గొన్నారు. ఈ క్రమంలో కేటీఆర్, చంద్రబాబు, లోకేష్‌లు కలిసి ఫోటోలు దిగారు. ఇద్దరు ఐటి మంత్రులు కొద్దిసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. స్థానికంగా పరస్పరం విమర్శించుకునే నాయకులు విదేశీ గడ్డపై కలిసి మెలిసి మాట్లాడుకుంటూ ఫోటోలకు ఫోజులిచ్చారు.

మహిళా చిత్రానికి నామినేషన్ల పంట

• 13 నామినేషన్లతో 'ది షేప్ ఆఫ్ వాటర్' • తొలిసారిగా నటీనటులతో నామినేషన్ల పరిచయం • పరిచయ వీడియోలో ప్రియాంక చోప్రా



దావోస్: ఆస్కార్ నామినేషన్ల ప్రకటన ఘట్టంలో మహిళకు అగ్రతాంబూలం దక్కింది. ఒక సముద్ర జీవితో వైవిధ్యమైన అనుబంధాన్ని ఏర్పరుచుకున్న మూగ మహిళ కథతో సంగీత దృశ్య కావ్యంగా తెరకెక్కిన ది షేప్ వాటర్ 13 నామినేషన్లతో 90వ అకాడమీ అవార్డుల నామినేషన్లను తుడిచిపెట్టేసింది. మరొక నామినేషన్ దక్కించుకొని ఉంటే లాలా ల్యాండ్, ఆల్ అబౌట్ ఈవ్, టైటానిక్ చిత్రాల సరసన 14 నామినేషన్లు పొందిన నాల్గవ చిత్రంగా నిలిచి ఉండేది. ఎనిమిది నామినేషన్లతో డన్‌క్రిక్, ఏడింటితో త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి, చెరి ఆరు నామినేషన్లతో ఫాంటమ్ థ్రెడ్, డార్కెస్ట్ అవర్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అలాగే ది పోస్ట్, గెట్ అవుట్, కాల్ మీ బై యువర్ నేమ్, లేడీ బర్డ్ కలుపుకొని మొత్తం తొమ్మిది చిత్రాలు ఉత్తమ చిత్రం విభాగానికి నామినేట్ అయ్యాయి. ఆస్కార్ చరిత్రలో బెస్ట్ డైరెక్టర్ విభాగానికి నామినేట్ అయిన ఐదవ మహిళగా లేడీ బర్డ్ డైరెక్టర్ గ్రెటా గెర్విగ్ నిలిచారు. డైరెక్టర్ నోలన్ తొలిసారిగా డన్‌క్రిక్ చిత్రానికి నామినేట్ కాబడ్డారు. స్టీవెన్ స్పీల్‌బర్గ్ డైరెక్షన్‌లో ది పోస్ట్ చిత్రంలో కేథరిన్ గ్రాహమ్ పాత్ర పోషించిన సీనియర్ నటీమణి మెరిల్ స్ట్రీప్ ఉత్తమ నటి విభాగానికి నామినేట్ అయ్యారు. ఆమె ఇప్పటిదాకా మూడు సార్లు ఆ అవార్డు గెలుచుకున్నారు. రోనన్ జె ఇజ్రాయెల్, ఈఎస్‌క్యూ చిత్రంలో నటించిన డెంజిల్ వాషింగ్టన్ ఉత్తమ నటుడు విభాగానికి ఎనిమిదవ సారి నామినేట్ అయ్యారు. ది పోస్ట్ చిత్రంలో మెరిల్ స్ట్రీప్‌కు దీటుగా నటించిన టామ్ హ్యాంక్స్ మాత్రం ఉత్తమ నటుడు విభాగానికి నామినేట్ కాలేకపోయారు. బెస్ట్ సినిమాటోగ్రఫీ విభాగంలో భారతీయ నటీమణి ప్రియాంక చోప్రా నటించిన పరిచయ వీడియో నిలిచింది.


ఆస్కార్ నామినేషన్లను యాక్టర్లు టిఫనీ హడ్డీష్, ఆండీ సెర్కిస్ ప్రకటించారు. ఆసక్తికరంగా ఈ ఏడాది ఆస్కార్ నామినేషన్లను కేవలం నటీమణులు మాత్రమే పరిచయం చేశారు. నామినేషన్లు పరిచయం చేసినవారిలో గాల్ గాడొట్, సల్మా హయెక్, రోసారియో డాసన్, రెబెల్ విల్‌సన్, మిచెల్ యెవా, మిచెల్ రోడ్రిగుజ్, తదితరులు ఉన్నారు. ఆస్కార్ పురస్కారాల ప్రదానం జిమ్మి కిమ్మెల్ అతిథేయిగా మార్చి నాల్గవ తేదీన జరుగుతుంది.

ఆస్కార్ నుంచి పులిమురుగన్ ఔట్

మోహన్ లాల్ హీరోగా నటించిన మలయాళ చిత్రం పులి మురుగన్(తెలుగులో మన్యంపులి) ఆస్కార్ రేసు నుంచి తప్పుకుంది. ఒరిజనల్ స్కోర్, ఒరిజనల్ సాంగ్ అనే రెండు కేటగిరిలకు సంబంధించి పులి మురుగన్ ఆస్కార్ నామినేషన్లక ు ఎంపిక కావడానికి పోటీ పడింది. పులిమురుగన్ చిత్రానికి గోపీ సుందర్ స్వరపరిచిన కాడనయుమ్ కాల్చిలంబే, మానతే మారికురుంబే అనే రెండు పాటలు ఒరిజనల్ స్కోర్ నామినేషన్‌కు పోటీ పడ్డాయి.

ఆర్థిక వ్యవస్థలో మహిళలను భాగస్వాములను చేయండి

ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టినాలాగార్డే



దావోస్: భారత్ ఆర్థిక సేవలరంగంలో సంస్కరణలు కొనసాగిస్తూనే.. తక్షణమే ఆర్థిక వ్యవస్థలో మహిళలను భాగ స్వాములు చేయడంపైన దృష్టి పెట్టాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టినా లాగార్డే మంగళవారం నాడు పేర్కొన్నారు. ఇక్కడ జరుగుతున్న అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో భాగంగా ప్రత్యేకంగా మహిళా సీఈవోల సదస్సులో మాట్లాడిన తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. ఐఎంఎఫ్ పరిశోధనలో తేలిందేమిటంటే ఉద్యో గాల్లో మహిళలు చేరితే భారత్ ఆర్థిక వ్యవస్థలో 27శాతం వరకు వృద్ధి కనిపిస్తోందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎక్కువగా వివక్షతక ు గురవుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే దీనిపై దృష్టిపెట్టాలని ఆమె ప్రభుత్వానికి సూచించారు. భారత్ ఆర్థిక వ్యవస్థ గురించి ప్రస్తావిస్తూ.. ఐఎం ఎఫ్ అంచనా ప్రకారం భారత వృద్ధిరేటు 7.4 శాతానికి ఎగబా కుతుందని.. ప్రపంచంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారత్ ముందుందన్న విషయంలో ఎలాంటి అను మానాల్లేవన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు గురించి ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో ప్రభుత్వం ఎలాంటి సంస్క రణలు తీసుకు వస్తుందో దాన్ని బట్టి వృద్ధి రేటు ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశా రు. భారత్ సంస్కరణలను నిరంతరం కొన సా గించాలని.. ముఖ్యంగా ఆర్థికసేవల రం గంలో కొనసాగించాలని కోరారు. దీంతో పా టు ముఖ్యంగా లింగవివక్షపై దృష్టి పెట్టాలని కోరా రు. మహి ళలను ఆర్థిక వ్యవస్థలో భాగ స్వామ్యం భారత్ దృష్టి పెట్టాలని తాను మనసారా కోరుకుంటున్నానని.... మహి ళలను కూడా పురుషులతో సమానంగా ఉద్యోగా వకా శాలు కల్పిస్తే భారత ఆర్థిక వ్యవస్థ మరితం పటిష్టం అవు తుం దన్నారు. సోమవారం నాడు విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తాజా నివేదిక ప్రకారం చూస్తే ఐఎంఎఫ్ అంచనా ప్రకా రం 2018లో భారత్ జీడీపీ వృద్ధిరేటు 7.4శాతానికి చేరు తుం దని అంచనా వేయగా.. చైనా 6.8 శాతంగా నమోద వుతుందని అంచనా వేసింది. ఆర్థిక వ్యవస్థలో భారత్ శరవేగంగా దూసుకు పోతుందని తేలుతుందన్నారు. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం 2019లో భారత్ జీడీపీ వృద్ధిరేటు 7.8శాతానికి ఎగబాకుతుందని అంచనా వేసింది.

మేడారం భక్తులకు సకల సౌకర్యాలు

• అభివృద్ధి పనులు ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు చందూలాల్, మహేందర్‌రెడ్డి



భూపాలపల్లి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరకు తరలివచ్చే భక్తులకు జాతర ప్రాంతంలో సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి అన్నా రు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 29 నుండి 3వ తేది వరకు గిరిజన సాంప్రదాయాల ప్రకారం జరిగే మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరలో భక్తులు సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పనులను మంగళవారం గిరిజన పర్యాటక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్, దేవాదాయశాఖ మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి మహేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడారం జాతరకు ఈ సారి కోటీ 25 లక్షల మంది భక్తుల హాజరుకానున్నట్లు అంచనా వేస్తున్నామని అన్నారు. గత జాతరకు కోటి మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారన్నారు. ఈ జాత రలో గత 20 రోజుల్లో 30 లక్షల మందికి పైగా ్తలు అమ్మవార్లను దర్శించుకున్నా రన్నారు. గత ఆది వారం ఒక్క రోజే పది లక్షల మంది హాజ రై తల్లులను దర్శించుకున్నారన్నారు. దేశం నలు మూలల నుంచి వచ్చే భక్తుల వాహనాలు ట్రాఫిక్ స వ ు స్య ల్లో చిక్కకుండా గత జాతర మాదిరిగానే ఈ సారి కూడా వన్‌వేను ఏర్పాటు చేయడం



జరిగిందన్నారు. నేటి నుంచి అమల్లోకి వస్తుందన్నారు. పదివేల మంది పోలీసులు ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగ కుండా బందో బస్తు కొనసాగిస్తారని, అంతే కాకుండా ట్రాఫిక్ నియం త్రణలో కీలకమైన భూమిక పోషి స్తారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వివక్షచూపకుండా మేడారం సమ్మక్క - సార లమ్మ గిరిజన మహాజాతరకు జాతీయ హోదా ఇవ్వాలని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా కేంద్రానికి లేఖ పంపిండం జరిగిందన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను జాతరకు వచ్చే భక్తులు తెలుకునేలా ఐటీడీఏ ఆధ్వర్యంలో మ్యూజీయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

అంతకుమందు గిరిజన సంస్కృతిక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ నిలువెత్తు బంగారాన్ని అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండి రమణారావు, జిల్లా కలెక్టర్ కర్ణన్, జిల్లా ఎస్పీ ఆర్.భాస్కరన్, జాయింట్ కలెక్టర్ అమయ్ కుమార్, ములుగు సబ్ కలెక్టర్ విపి. గౌతమ్ , పీఓ ఐటీడీఏ చక్రధర్ రావు తదితరులున్నారు.

బీరు బాబులకు ధరల షాక్



(మొదటిపేజీ తరువాయి)

లేనిపక్షంలో ఆర్థిక ఇబ్బందులు పడవలసి వస్తుందని వారు మంత్రి, అధికారులను కలిసిన సమయంలో ఆవేదన వ్యక్తంచేసినట్టు సమాచారం. బీరు ఉత్పత్తి సంస్థలు డిమాండ్ చేస్తున్నట్టుగా రూ.30 పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని రూ.15 నుంచి 20 వరకు ధరను సీసాకు పెంచే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి చెప్పారు.

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో అత్య ధికంగా బీర్ల అమ్మకాలు జరుగుతున్నట్టు సమాచారం. డిసెంబర్ 31వ తేదీ రాత్రి, దసరా, ఇతరత్రా పర్వదినాల్లో బీర్ల అమ్మకాలు అత్యధికంగా ఉంటా యని ప్రభుత్వం నిర్ణయించిన ప్రస్తుత ధర ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని బీరును ఉత్పత్తి చేస్తున్న సంస్థలు స్పష్టంచేశాయి.

బస్సుల జాతర

• 4200 ప్రత్యేక బస్సులు : రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మేడారం జాతరకు 23 ప్రాంతాల నుండి 4,200ల బస్సులు తిప్పాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రత్యేక బస్సుల్లో సుమారు 20 లక్షల మంది భక్తులు ప్రయాణం చేస్తారని భావిస్తున్నారు. ఆర్టీసీ తరపున భక్తులకు 5 లక్షల వాటర్ బాటిల్స్ అందచేసేందుకు కూడా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీలోని అన్ని రకాల బస్సులను ప్రత్యేక ఛార్జీలతో నడిపించబోతున్నారు. మేడారంలో 51 ఎకరాల స్థలంలో తాత్కాలిక బస్ స్టాండును ఏర్పాటు చేస్తున్నారు. జాతర సమీపంలో భక్తుల సౌకర్యార్థం 40 బస్సులను ఉచితంగా నడిపించాలని కూడా నిర్ణయించారు. గత సంవత్సరం 3,755 ప్రత్యేక బస్సుల్లో 14.82 లక్షల మంది భక్తులు ప్రయాణం చేశారు. జాతర కోసం 11 వేల మంది సిబ్బందిని నియమించారు. రవాణా ఏర్పాట్లకు ప్రభుత్వం ఆర్టీసీకి రూ. 2.48 కోట్లు మంజూరు చేసింది. జాతరకు సుమారు కోటీ 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులకు బస్సు సౌకర్యం పైన మంగళవారం మేడారంలో రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి సమీక్షించారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావుతో పాటుగా సంబంధిత అధికారులు, జిల్లా యం త్రాంగం సమీక్షలో పాల్గొన్నారు. ప్రత్యేక విధుల్లో ఇద్దరు కార్య నిర్వా హకసంచాలకులు, పది మంది రీజినల్ మేనేజర్లు, మహిళా అధికారులతో కలిపి 150 మంది ఉన్నతా ధికారులను ప్రత్యేక విధుల్లో నియమించడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. కరీంనగర్ రీజియన్ నుండి 531, ఖమ్మం రీజియన్ నుండి 375, ఆదిలాబాద్ రీజియన్ నుండి 304, వరంగల్ రీజియన్ నుండి 21 50, వరం గల్, సమీప ప్రాంతాల నుం డి మరో 205, రంగా రెడ్డి రీజియన్ నుండి 80 ప్రత్యేక బస్సులను మేడారం జాత రకు నడి పించ బోతు న్నామని వెల్ల డిం చారు. ఆర్డినరీ మినహా అన్ని బస్సులకు అడ్వా న్స్ బుకింగ్ సౌక ర్యం కల్పించారు. తాడ్వా యి, మేడారంతో పాటుగా ఇతర ముకింగ్ కేంద్రాల్లో 36 టికెట్ కౌంటర్లు, 450 టికెట్స్ జారీ చేసే యంత్రాలను అందు బాటులో ఉంచడం జరుగుతుంది. ఈ నెల 31 నుండి ఫిబ్రవరి 4 వరకు ఆర్టీసీ మినీ బస్సులను జాతర సమీపానికి నడిపించే విధంగా చర్యలు తీసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో 36 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించే విధంగా నిఘాను కట్టుదిట్టం చేశారు.

జాతరకు 'పోలీసు యాప్'

తెలంగాణ కుంభమేళ మేడారం జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పోలీసు శాఖ ప్రత్యేక మొబైల్‌యాప్‌ను రూపొం దిం చింది. ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్న జాతరకు రెండు తెలుగు రాష్ట్రా లతో పాటు దేశంలోని వేర్వేరు రాష్ట్రా లలో నుంచి భారీ ఎత్తున భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా జాతరకు వచ్చే భక్తులకు ప్రయాణం, సూచనలు పొందు పరిచారు. యాప్‌లో సమాచారం సులభంగా అందరికీ అర్థమయ్యేలా ఉండేందుకు వీలుగా ఇంగ్లీషు, తెలుగులో సమాచారాన్ని ఉంచారు.

గిరిజన మ్యూజియం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మేడారంలో గిరిజన సంస్కృతికి, చరిత్రకు అద్దంపట్టే ప్రత్యేక మ్యూజియం ఏర్పాటైంది. సమ్మక్క-సారలమ్మ చరిత్రతో పాటు గిరిజనుల సంస్కృతిని కళ్ళకుకట్టే మ్యూజియాన్ని రూ.3కోట్ల వ్యయంతో ప్రభుత్వం 22రోజుల్లోనే నిర్మించగా.. మంగళవారం ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి చందూలాల్, దేవాదాయశాఖా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలు ప్రారంభించారు. సమ్మక్క-సారలమ్మ ఆదివాసీ మ్యూజియం నిర్మాణానికి రెండేళ్లక్రితమే ఐదెకరాల స్థలం కేటాయించగా, ఇపుడు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి జాతరకు అందుబాటులోకి తెచ్చారు. గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు డాక్టర్ డి.సత్యానారాయణ దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. సమ్మక్క-సారలమ్మలు క్రీ.శ.13వ శతాబ్దంలో జీవించినట్లు చరిత్ర చెబుతుండగా, ఆనాటి సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు తలెత్తేలా మ్యూజియాన్ని రూపొందించారు. సమ్మక్క-సారలమ్మ చరిత్ర సులభంగా అర్థమయ్యేలా శిల్పరూప ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. రాతియుగం, రాక్షసయుగం నాటి చిత్రాలను కూడా మ్యూజియంలో ఉంచారు.

ఫీజులుం చేస్తే క్రిమినల్ కేసులు

(మొదటిపేజీ తరువాయి)

వసతి సౌకర్యాల పేరుతో ఫీజులు కాకుండా ఇతరత్రా మొత్తాలను విద్యా ర్థుల నుంచి తీసుకునే ప్రయత్నాలను కొన్ని పాఠశాలల యాజ మాన్యాలు చేస్తున్నా యన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, రాష్ట్రంలోని ఏ పాఠశాలపైనైనా ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని ప్రభు త్వం హెచ్చరించింది. 1983 విద్యాచట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి పూర్తిగా ఉందని, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ వంటి విద్యావిధానంతో హైదరాబాద్ జంటనగరాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో యాజమాన్యాలు ఇంటర్నేషనల్ స్కూళ్ళు, గ్లోబల్ స్కూళ్ళు, ఇతరత్రా పేర్లతో పాఠశాలలను నిర్వహిస్తున్నాయని ఈ పాఠశాలల యాజ మాన్యాలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులను తీసుకుంటున్నట్టు తెలుస్తోందని ప్రభుత్వం తెలిపింది. ఫీజులు పెంచినా, విద్యార్థుల నుంచి వసూలు చేసినా న్యాయ పరమైన చర్యలు తీసుకుంటామని సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై పోలీసు కేసులను పెట్టేందుకు కూడా వెనకాడేది లేదని ప్రభుత్వం స్పష్టంచేసింది.

భవిష్యత్తులో పాఠశాల నిర్వహించకుండా అనుబంధ గుర్తింపు రద్దుచేసి సదరు పాఠశాల యాజమాన్యానికి పెద్దఎత్తున అపరాధ జరిమానా విధిస్తామని హెచ్చ రించింది. తాజాగా ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను ధిక్కరించి ఏ పాఠశాల యాజమాన్యమైనా ఫీజులను వసూలు చేసినట్టు తెలిసినా, విద్యాచట్టాన్ని పక్కనబెట్టి నిబంధనల్లో మార్పులు చేసినా చర్యలు తప్పవని ఆ ఉత్తర్వులో హెచ్చరించింది.

కేసీఆర్ అంటే నాకిష్టం

పొగిడితే మీకేంటి నష్టం!

(మొదటిపేజీ తరువాయి)

తనకు పునర్జన్మఇచ్చిందని, తుదిశ్వాస వరకు ఈ గడ్డకు రుణపడి ఉంటానని శపథం చేశారు. ప్రాంతీయతను విస్మరించని జాతీయ భాగం జనసేన పార్టీ లక్ష్యమని పవన్ ఉద్ఘాటించారు. యువత పాతికేళ్ళ యుద్ధానికి సిద్ధం కావాలని ఆయన పిలు పునిచ్చారు. తనకు ఎవరితోనూ విభే దాలు లేవని, అవినీతి రాజకీయాలపైనే జనసేన పోరాటం చేస్తుందని హెచ్చ రించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వచ్చిన అశేష జనవాహిణి నుద్దేశించి పవన్ ప్రసంగించారు. తెలంగాణ అంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. రాజకీయాల్లో మంచికోసం నిలబడతానని, తేడావస్తే తెగిస్తానని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. తెలుగు రాష్ట్రాల్లో జనసేన వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగుతుందని పునరుద్ఘాటించారు. కులాలను కలిపే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన చెప్పారు. తెలంగాణ నుంచి తన రాజకీయ యాత్రను ప్రారంభించానని తెలంగాణ నేలతల్లికి ఆఖరిశ్వాస వరకు రుణపడి ఉంటానని చెప్పారు. జై తెలంగాణ నినాదం వందేమాతరం అంతటి గొప్ప నినాదామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ తనకు జన్మనిస్తే తెలంగాణ పునర్జన్మనిచ్చిందని స్పష్టంచేశారు. ప్రమాదం నుంచి తనను కాపాడి కొండగట్టు ఆంజనేయుడు పునర్జన్మనిచ్చారని అందుకే తెలంగాణ నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్నానని చెప్పారు. జై తెలంగాణ... ఆ నినాదం తనకు అణువణువు పులకరింత ఇస్తుందని, వందేమాతరం ఎలాంటి పదమో, మంత్రమో జై తెలంగాణ కూడా అలాంటి గొప్ప మహా వ్యాఖ్యమని అన్నారు. దేశమంతా స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు మాత్రం సంవత్సరం తర్వాత వచ్చిందని, దేశమంతా పండుగ జరుపుకుంటే తెలంగాణ ఇంకా తమ స్వేచ్ఛ ఎప్పుడు అనుకుంటూ గడిపిందని అన్నారు. ఆ సమయంలో గుండెల్లో మారు మోగిన నినాదమే జై తెలంగాణ అని ఆయన తెలిపారు. కరీంనగర్ నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని సాగిస్తున్నం దునకు తనకెంతో ఆనందంగా, గర్వంగా ఉందని అన్నారు.

జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన పవన్ 2009 నుంచి తాను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. మార్చి 14వ తేదీలోపు జనసేన పార్టీకి సంబంధించిన పూర్తి కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. తన సినిమాల్లో తెలంగాణ భాష, కలలకు ప్రాధాన్యతనిచ్చానని చెప్పారు. కొన్ని కులాలకే అధికారం పరిమితమైందని, ఆర్థిక భద్రత అన్ని కులాలకు ఉండాలని హితవు పలికారు. ప్రాంతీయ విభేదాలు సమాజానికి శ్రేయస్కరం కాదని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వేరైనా అందరం ఒక్కటేనని ఆయన స్పష్టంచేశారు. కాంగ్రెస్ నాయకులు తనపై ఆరోపణలు చేస్తున్నారని, పవన్ కళ్యాణ్ కేసీఆర్‌ను ఎలా మెచ్చుకుంటు న్నారని నిలదీస్తున్నారని గుర్తుచేశారు.

నిబద్ధత, బాధ్యతతో కూడిన రాజకీయాలు చేస్తా

తెలుగు రాష్ట్రాల్లో నిబద్ధత, బాధ్యతతో కూడిన రాజకీయాలు చేస్తానని పవన్ అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా జనసేన పోరాడుతుందని స్పష్టంచేశారు. ఏ పార్టీకి సిద్ధాంతాలు లేకుండా ముందుకు వెళ్ళలేమని, జనసేన సిద్ధాంతాలను ఏడు సిద్ధాంతాలుగా విభజించామని చెప్పారు. కులాలను కలిపే ఆలోచనా విధానం పార్టీ సిద్ధాంతమన్నారు. ఏ ఒక్కరితో శత్రుత్వం పెట్టుకోదలుచుకోలేదని చెప్పారు. తెలంగాణ యాస, భాష, సంస్కృతిని తన సినిమాల్లో ప్రోత్సహిస్తానని, సంస్కృతికి గౌరవం ఇవ్వకపోతే ఎవరికైనా బాధ కలుగు తుందని అన్నారు. తెలంగాణ యాస, భాషను గౌరవించి ఉనికిని బలంగా చాటిచెప్పాలని బతుకమ్మ, సమ్మక్క సారలమ్మ, సదర్ ఉత్సవాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాలు వేరు కాదని, దేశం కోసమే తన తాపత్రయమని తెలంగాణను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క నాయకుడిపై ఉందని ఉందన్నారు. తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎటువంటి పోరాటానికైనా తాము సిద్ధమని చెప్పారు. సమస్యలు తెలియజేస్తా.. పరిష్కారం చూపిస్తా.. అవినీతిలేని సమాజం కోసం యువత నడుం బిగించాలి అంటూ పవన్ పేర్కొన్నారు.

నేను మడమ తిప్పే మనిషిని కాదు.. మాట ఇస్తే తిరిగి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు.. జనసేనను వేరే పార్టీలో విలీనం చేయాల్సి వస్తే నేను మీ ముందు ఎలా ఉంటాను అని అన్నారు. 2019లో తెలంగాణలోనూ జనసేన పార్టీ పోటీ చేస్తుందని తెలంగాణ యువత, ఆడపడుచుల ఆకాంక్షే జనసేన ఆకాంక్ష అని అన్నారు. తెలంగాణ ఆశయాల కోసం జనసేన నిలబడు తుందని తనకు అండగా ఉండాలని మీ కుటుంబంలో తనను ఒకడిగా చూడాలని ఆయన కోరారు.

రాజకీయాల్లో కొత్త రక్తం రావాలని పిలుపునిచ్చారు. అవినీతిపై, పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతామన్నారు. సామాజిక న్యాయమంటే సీట్లు ఇవ్వడం కాదని గుర్తుచేశారు. కొన్ని కులాలకే రాజకీయం పరిమితమైందని యాసను, సాంప్రదాయాలను గౌరవించే రాజకీయాలు రావాలని, మతాల ప్రస్తావన లేని రాజకీయమే జనసేన విధానమని చెప్పారు. ఆర్థిక భద్రత అందరికీ కల్పించాలని, ప్రాంతీయతను గౌరవించుకోకపోతే విభేదాలు పొడసూపుతాయని చెప్పారు. ప్రజల బాధల కోసం తానున్నానని, రాజకీయాల్లో ఉండి ప్రజల కోసం పోరాడే వారిని గౌరవిస్తానని, తన గుండె దేశం కోసమే కొట్టుకుంటుందని చెప్పారు. జనసేన బలం ఎంతో చూసుకుని 2019లో జరిగే ఎన్నికలకు సిద్ధమవుతుందని చెప్పారు. రాజకీయాల్లో విమర్శించే వారిని పట్టించుకునే సమయం కూడా తనకు లేదని, బంగారు తెలంగాణ భవిష్యత్తు కోసం పోరాడుతానని చెప్పారు.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆంధ్రా వారిని పిలవలేదన్న బాధ కలిగించిందని, తెలంగాణ కవులు, కళాకారుల ఉనికిని గట్టిగా చాటాలనే ఉద్దేశంతో ఆంధ్ర ప్రాంతానికి చెందిన కవులు, రచయితలను ప్రపంచ తెలుగు మహాసభలకు పిలవలేదేమోనని భావించానని చెప్పారు. నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేస్తూ ప్రజల సమస్యలు, వాటి పరిష్కారానికి మార్గాలను ప్రభుత్వాలకు తెలియజేస్తానని అప్పటికీ ఆ సమస్యలు పరిష్కారం కాకపోతే పోరాడేందుకు కూడా సిద్ధమేనని హెచ్చరించారు.

అసలు సిసలైన అభివృద్ధి, అవినీతిరహిత సమాజం ఒక రోజులో సాధ్యం కాదని పాతికేళ్ళ సుదీర్ఘ యుద్ధానికి



అందరూ సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ యువత తనకు అండగా నిలబడాలని తనకు డబ్బు అవసరం లేదని ప్రజాభిమానానికి మించిన సంపద ఏదీ లేదని అన్నారు. ప్రేమ ముందు ద్వేషం చాలా చిన్నదని, తనను ద్వేషించేవారిని పట్టించుకోనని చెప్పారు. దేశ విభజన అనంతరం హిందూరాజ్యంగా ప్రకటించే అవకాశమున్నా కుల, మత ప్రస్తావన లేకుండా రాజకీయాలు ఉండాలన్న ఉద్దేశంతో ఆనాడు పెద్దలు ఆ నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేశారు. తాను ఏ పార్టీకీ, ఎవరికి తొత్తును కానని, ఎవరితోనూ శత్రుత్వం లేదని, ఉండాల్సిన అవసరం కూడా లేదని చెప్పారు.

మీ వెంటే మేముంటాం

జనసేనానికి మెగా హీరోల మద్దతు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జనసేనకు మెగాహీరోలు జై కొట్టారు. బాబాయ్ మీ వెంటే మేం అంటూ ఛలోరేఛలోరేఛల్.. కార్యక్రమానికి ఆల్‌ది బెస్ట్ చెప్పారు. చిరంజీవి తనయుడు రామ్‌చరణ్‌తేజ్ ..పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు కోట్ చేస్తూ ఛలోరే..ఛలోరేఛల్ కార్యక్రమాన్ని భలే శక్తివంతంగా స్టార్ట్ చేశారు బాబాయ్.. అమోఘం. జై జనసేన అంటూ ట్వీట్ చేశారు. మరో మెగాహీరో నాగబాబు తన యుడు వరుణ్‌తేజ్ కూడా ఆల్‌ది బెస్ట్ బాబాయ్.. మీకు మరింత శక్తి లభించాలి. జై జనసేన అంటూ ట్విట్టర్ ద్వారా తన స్పందన తెలిపారు. ఇక మేనల్లుడు సాయిధరమ్ తేజ్ మీవెంటే మేము.. జై జనసేన అంటూ ట్విట్టర్ సందేశం పంపాడు. మెగాహీరోల స్పందనతో అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కొత్తగూడెంలో పవన్ బస

భద్రాద్రి కొత్తగూడెం, ప్రభన్యూస్ : జనసేన అధినేత, ప్రముఖ సినీ నటుడు పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చేరుకున్నారు. కరీంనగర్ పర్యటన ముగించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బయల్దేరిన పవన్ కళ్యాణ్ షెడ్యూల్‌లో పేర్కొన్న సమయం ప్రకారం 6.30గంటలకు కొత్తగూడెం చేరుకున్నారు. బస చేసేందుకు కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్ హౌజ్‌కు చేరుకునే సమయంలో ఆయన కోసం ఎదురు చూస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు తన వాహనం ఓపెన్ టాప్ నుంచి అభివాదం చేశారు. అక్కడి నుంచి గెస్ట్ హౌజ్‌లోకి వెళ్లిపోయారు. పవన్ కళ్యాణ్‌ను కలిసేందుకు పార్టీ అభిమానులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు భారీగా తరలివచ్చారు.

ఆయన్ను కలిసేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో వెనుదిరిగారు. అనంతరం జిల్లాలోని కాపు సంఘం నేతలతో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. బుధవారం ఉదయం 9.30గంటలకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నుంచి ఖమ్మంకు రోడ్ షో ద్వారా బయల్దేరనున్నారు. ఖమ్మంలో జరిగే ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉమ్మడి జిల్లాల సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ విధి విధానాలపై మాట్లాడనున్నారు. కొత్తగూడెం నుంచి బయల్దేరే రోడ్ షోకు పవన్ కళ్యాణ్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరానున్నారు.



'పెట్టుబడి మద్దతు' అమలుకు సిద్ధంకండి

- సచివాలయం నుంచి సీఎస్ వీడియోకాన్ఫరెన్స్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో 'పెట్టుబడి మద్దతు' పథకం అమలుకు తగిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సి.పార్థసారధి జిల్లాల యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ పథకానికి సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా వ్యవసాయాధికారులతో మంగళవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు పంటకు పెట్టుబడి పథకాన్ని అమలు చేయడమే భూ ప్రక్షాళన ముఖ్యోద్దేశమని అన్నారు. రెవెన్యూశాఖ ఇచ్చే భూమి డేటాను అనుసరించి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందజేయడం బాధ్యతగా స్వీకరించా లన్నారు. సాగుకు పెట్టుబడి సహకార పథకం అమలు, అలాగే భవిష్యత్తులో రైతులకు అందజేయనున్న ఎటువంటి కార్యక్రమాలైనా, పథకాల అమలుకైనా భూములకు సంబంధించిన డేటా చాలా కీలకమన్నారు.

రైతులకు అందించనున్న పంట పెట్టుబడి మొత్తాన్ని చెక్కు రూపంలో రైతులకు అందించనున్నట్లు పార్థసారధి చెప్పారు. పాసు పుస్తకాల్లో సమాచారం. రైతులకు చెక్కులు అందజేసినపుడు చెక్కుల్లో పేర్కొనే సమాచారం ఎక్కడా అంతరాలు లేకుండా డాటా పక్కాగా పొందుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంపై అమలు పట్ల కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, విధానకర్తలు ఆసక్తితో గమనిస్తున్నారని అన్నారు. ఈ పథకంతో రెవెన్యూశాఖ అందజేసే భూమి డేటా భవిష్యత్తులో అన్నింటికీ కీలకం కానుందన్నారు. మండలాల సంఖ్య, గ్రామాల సంఖ్య, రైతుల ఖాతాల సంఖ్య, భూ విస్తీర్ణం వంటి సమాచారాన్ని చాలా పక్కాగా తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ సభలు త్వరగా పూర్తిచేసి నూటికి నూరుశాతం డేటాను సరిచూసుకుని పొందుపరచాలన్నారు. ఈ డేటా ఆధారంగానే బడ్జెట్ కూడా రూపొందనుంది. అందువల్ల రైతు పేరుతో సహా భూ విస్తీర్ణం, అసలు యజమానులు అనే వివరాలు వివరాలు సక్రమంగా ఉన్నపుడే చెక్కుల పంపిణీ సులభమవుతుందని అన్నారు.

ఏఈవో నుంచి డీఏఈ స్థాయి వరకు వ్యవసాయ అధికారులను రెవెన్యూశాఖ పనిలో భాగస్వామ్యం అయ్యేలా చూడాలని జాయింట్ కలెక్టర్లను కోరారు. రెవెన్యూ, వ్యవసాయశాఖల సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వి.కరుణ మాట్లాడుతూ, భూ సమగ్ర సర్వేకు సంబంధించిన డేటా సేకరణలో సిబ్బంది చాలా కృషి చేశారని అభినందించారు. ఇప్పటి వరకు రైతులకు సంబంధించిన భూమి సమాచారం 93 శాతం పూర్తయిందని, మిగతా డేటా బేస్ పని ఏ మేరకు వచ్చింది, డేటాలో తప్పొప్పుల సవరణలు, చేర్పులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉందని గుర్తుచేశారు. డేటా పొందుపర్చడంలో క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సందేహాలకు ఎన్ఐసి ప్రతినిధులు శివాజీ, కృష్ణలు స్పందించారు. ఈ కార్యక్రమంలో భూపరిపాలన డైరెక్టర్ వి.కరుణ, వ్యవసాయ కమిషనర్ డాక్టర్ ఎం.జగన్మోహన్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సహకార ఎన్నికలకు నో ఛాన్స్!

(మొదటిపేజీ తరువాయి)

ప్యాక్స్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులను మరో మూడేళ్ళు పొడిగించాలన్న ప్రతిపాదనకు ఆయన సూచనప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 906 సహకార సంఘాలకు ఓటే విధానాన్ని వర్తింపజేయాలని కూడా ఆయన నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఎన్నికల పరిణామాలపై ఆచి, తూచి అడుగులు

ఈ పరిస్థితుల్లో ఎన్నికలకు వెళితే రాజకీయ వ్యవస్థతో ముడి పెట్టుకుని ఉన్న క్షేత్రస్థాయి పరపతి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. 2019 ఎన్నికల నేపథ్యంలో సహకార ఎన్నికలను వాయిదా వేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది. ప్రభుత్వానికుండే విశిష్టాధికారాల మేరకు ప్రాథమిక సహకార సంఘాల గడువు ముగిసిన తర్వాత గరిష్టంగా ఆరు నెలల్లోగా గడువును పొడిగిస్తూ ఆర్డినెన్స్‌ను జారీ చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి మూడుసార్లు ఆర్డినెన్స్‌ల ద్వారా పదవీ కాలాన్ని పొడిగించేందుకు వీలుంది. ఆ తర్వాత తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని చట్టం చెబుతోంది. కానీ ప్రభుత్వం తలుచుకుంటే మంత్రిమండలి తీర్మాణంతో మరోసారి కూడా గడువును కొడిగించే అధికారం ఉందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు.

అయితే, ఆ ఆర్డినెన్స్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టి సభ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే సార్వత్రిక ఎన్నికల నాటికి సహకార సంఘాల గడువు పొడిగింపుల ప్రక్రియను కొనసాగిస్తారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాతే ప్యాక్స్‌లకు కొత్త పాలకమండళ్ళ ఏర్పాటుకు సంబంధించి చర్యలకు పూనుకోవాలన్న ఆలోచనతోనే కేసీఆర్ ఉన్నారు.

పర్సన్ ఇంఛార్జిలుగా అధికారులను నియమించాలి : ఎం.డి సర్దార్



వచ్చే నెలాఖరుతో గడువు ముగియనున్న సహకార సంఘాల పాలక మండళ్ళకు పర్సన్ ఇంఛార్జిలుగా అధికారులనే నియమించాలని తెలంగాణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ సర్ధార్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం పరిస్థితులు ఎన్నికలకు అనుకూలంగా లేకపోవడంతో తిరిగి ఆరు నెలల పాటు పొడిగించాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ, రాజకీయ పదవుల్లో ఉన్నవారికి అవకాశం ఇవ్వవద్దన్నారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో సహకార శాఖ అధికార యంత్రాంగం పర్యవేక్షణలో సంఘాలు విజయవంతంగా పనిచేస్తాయని అభిప్రాయ పడ్డారు. మొదటి ఆరు నెలల పాటు అధికారులకు అవకాశం ఇచ్చి వచ్చే ఖరీఫ్‌లో లక్ష్యాలను, ఫలితాలను బేరీజు వేయాలన్నారు. పరిస్థితుల్లో తప్పకుండా మార్పు కనిపిస్తుందని, దాన్ని బట్టి వచ్చే ఎన్నికల వరకు ఏ విధానాన్ని అవలంబిస్తే మంచిదన్న కోణంలో పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచిం చారు. 120 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సహకార వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతు సమన్వయ సమితులు విజయ వంతంగా పనిచేస్తే పరపతి సంఘాలను రద్దు చేయాలన్న దిశగా ఆలోచిస్తున్న ప్రభుత్వం ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని సర్ధార్ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పరిశీలన తర్వాతే తుది నిర్ణయం : కార్యదర్శి పార్థసారథి



ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరుతో ముగియనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక మండళ్ళ పొడిగింపుపై తుది నిర్ణయం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నదని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సి.పార్థసారధి తెలిపారు. ఇందుకు సంబంధించి సీఎం కేసీఆర్‌కు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం లేదన్నారు. సహకార చట్టం లోని నిబంధనల ప్రకారం గడువు ముగిసిన సహకార పరపతి సంఘాల పాలకమండళ్ళకు ఆరు నెలల పాటు పొడిగించే అవకాశం ఉందన్నారు. అయితే, రైతులతో ఎన్నుకోబడ్డ పాలక మండళ్ళ సభ్యులను కొనసాగిస్తారా? లేక అధికారులను పర్సన్ ఇంఛార్జిలుగా నియమిస్తారా? అన్న అంశంపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ఫైలు ప్రస్తుతం సీఎం కార్యాలయ ఉన్నతాధికారుల పరిశీలనలో ఉందన్నా రు. త్వరలోనే అధికారిక నిర్ణయం వెలువడు తుందన్నారు.



ఇప్పుడున్న పాలకమండళ్ళనే కొనసాగించాలి : ఎడవల్లి జనార్ధన్

గడువు ముగుస్తున్న పాలక మండ ళ్ళకు ఎన్నికలు నిర్వహించే సమయం, అవకాశం లేనిపక్షంలో ప్రభుత్వ ఇప్పుడున్న పాలక మండళ్ళనే కొనసాగిం చాలని వ్యవసాయ పరపతి సంఘాల చైర్మన్ల సంఘం ప్రతినిధి ఎడవల్లి జనార్ధన్ సూచించారు. గడిచిన ఐదేళ్ళ కాలంగా క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులపై తమకున్న అవగాహన మరొకరికి ఉండదని స్పష్టం చేశారు. ఇంతకాలం పాటు రైతుల సమస్యలు, పరపతి విధానం, చేయూత పూరిస్థాయి సమన్వయంతో జరిగిందని పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నా, పంటల సాగు, దిగుబడి లక్ష్యాలను చేరుకోవాలన్నా ఇప్పుడున్న పాలకమండళ్ళను మరో ఆరు నెలల పాటు కొనసాగించడం అవశ్యమని తెలిపారు. లేనిపక్షంలో క్షేత్రస్థాయిలో సహకార వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని జనార్ధన్ అభిప్రాయం వ్యక్తం చేశారు.



యాదాద్రి లడ్డూకు యమక్రేజ్

భక్తుల రద్దీకి అనుగుణంగా తయారీకి అదనపు సిబ్బంది నియామకం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తిరుపతి లడ్డూకు ఎంత పేరు వచ్చిందో తెలంగాణలోని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహా స్వామి లడ్డూకు కూడా దాదాపు అంతే పేరు వస్తోంది. యాద్రాది జిల్లాలోని లక్ష్మీనరసింహా స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు దేవస్థానం అమ్మే లడ్డూ కోసం పోటీపడుతున్నారు. ఈ లడ్డూ చాలా రుచిగా ఉండడంతో భక్తులు వీటికోసం బారులు తీరుతున్నారు. ఆలయానికి వచ్చిన వారంతా వీలైనన్నీ లడ్డూలు తీసుకుపోవడానికి ఆసక్తి చూపిస్తు న్నారు. ఒక్కోసారి భక్తులకు లడ్డూలు దొరకని పరిస్థితి నెలకొంటుంది. యాదాద్రి దేవస్థానంలో పెద్ద లడ్డూ ప్రసాదం డిమాండ్ పెరుగుతోంది. చిన్న లడ్డూలు 100 గ్రాములు, పెద్ద లడ్డూలు 500 గ్రాములు పరిమాణంలో తయారు చేస్తున్నారు. ప్రతిరోజు 20 నుంచి 30 వేల మంది పెద్ద లడ్డూలను, 50 వేల వరకు చిన్న లడ్డూలను అమ్ముతున్నామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. శని, ఆదివారాలతో పాటు ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని బట్టి ఈ డిమాండ్ రెండు, మూడు రెట్లకు పైగా ఉంటుంది. లడ్డూకు డిమాండ్ పెరగడంతో రోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు దీని తయారీలో సిబ్బంది నిమగ్నమవుతున్నారు. వీటి తయారీ కోసం అదనపు సిబ్బందిని సైతం నియమించు కున్నారు. దేవస్థానానికి వచ్చే ఆదాయంలో సగానికిపైగా లడ్డూ ప్రసాదం నుంచే సమకూరుతుందని అధికారులు తెలిపారు.

ఓటర్ల సవరణకు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణకు షెడ్యూల్ ప్రకటించింది. 83 గ్రామీణ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టనుంది. ఈ మేరకు ఈసీ ఓటర్ల ముసా యిదా జాబితాను విడుదల చేసింది. ఓటర్ల జాబితాపై ఫిబ్రవరి 14 వరకు అభ్యంతరాలు, వినతులను స్వీకరించ నున్నారు. ఫిబ్రవరి 4,12 తేదీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించ నున్నారు. తదనంతరం మార్చి 24న ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. జనవరి 1వ తేదీనాటికి 18 సంవత్సరాలు నిండినవారు ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం మంగళ వారం విడుదల చేసినఒక ప్రకటనలో తెలిపింది.

పంచాయతీ పోరుపై తర్జనభర్జన

- తొందరొద్దంటున్న సీనియర్ నేతలు
- కొత్త పంచాయతీలకు మరింత సమయం
- బడ్జెట్ సమావేశాల తర్వాతే నిర్వహణకు అవకాశం
- అధినేత కేసీఆర్ నిర్ణయం కోసం ఎదురు చూపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామపంచాయతీ ఎన్నికలు ముఖ్యమంత్రి కెసిఆర్ భావించినట్లు ఫిబ్రవరిలో జరుగుతాయా? సాంకేతికంగా ఇది సాధ్యమవుతుందా? ముందస్తు ఎన్నికల వాతావరణం దేశవ్యాప్తంగా నెలకొన్న నేపథ్యంలో ఇపుడీ.. స్థానిక ఎన్నికలు పెట్టుకుని సమయాన్ని, దృష్టినీ మరల్చుకోవడం ఎందుకన్న అభిప్రాయం కొందరు సీనియర్ మంత్రులలో వ్యక్తమవుతోందా? అసలు అధినేత మనసులో ఏముంది? టిఆర్ఎస్ వర్గాల్లో దీనిపై తర్జనభర్జన జరుగుతోంది. ఫిబ్రవరిలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఇటీవల ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖరరావు కలెక్టర్‌ల సమావేశంలో చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8వేలకు పైగా కొత్త పంచాయతీలుండగా, మరో నాలుగువేలకు పైగా కొత్తపంచాయతీలు ఏర్పాటుకానున్నాయి. కొత్తపంచా యతీల ఆమోదానికి సంబంధించి సాంకేతికంగా పలు ప్రక్రియలు జరగాల్సిఉన్నందున మార్చి నాటికి గానీ ఇది పూర్తికాకపోవచ్చని చెబుతు న్నారు. మార్చిలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా, ఏప్రిల్‌లో పార్టీ ఆవిర్భావసభ.. కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఇక ప్రభుత్వపరంగా.. కాళేశ్వరం, మిషన్‌భగీరథ ఫలితాల కోసం అధికారయంత్రాంగం, మంత్రులు తీవ్రస్థాయిలో కష్టపడుతున్నారు. ప్రభుత్వం పెట్టుకున్న భారీపనులకు సంబంధించి.. ఫలితాలు వచ్చే సమయం ఆసన్నమైంది. స్థానికంగా కూడా నియోజకవర్గాల్లో ప్రభుత్వం చేపట్టిన పనులను ఫలితాలదిశగా తీసుకెళ్ళాల్సిన సమయం ఇదే. ఎమ్మెల్యేలు కూడా సగంలో ఉన్న అభివృద్ధిపనులను, చివర్లో ఉన్న అభివృద్ధి పనులను వదిలి దాదాపు నెలరోజుల పాటు ఎన్నికల కోసం కష్టపడడం.. రకరకాల వ్యూహాలు అవలంభించడం, పదవుల దగ్గర ఒత్తిడిని ఎదుర్కోవడం ఎందుకన్న అభిప్రాయాన్ని కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత గ్రామపంచాయతీలకు జూలై వరకు పదవీకాలం ఉండగా, ప్రస్తుత చట్టం ప్రకారం మూడుమాసాలలోపు మాత్రమే ఎన్నికలు నిర్వహించవచ్చు. ఎన్నికలు నిర్వహించాల నుకుంటెనే ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో ఈమేరకు సవరణలు చేసే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. జమిలిఎన్నికలకు కేంద్రం సమాయత్త మవుతు న్నదన్న సంకేతాల నేపథ్యంలో.. నవంబర్, డిసెంబర్‌లో సాధారణ ఎన్నికలు జరిగినా పార్టీని సిద్దంగా ఉంచాలి.. ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీ లను అప్పటికే నెరవే ర్చాలి.

ఎన్నికల ఏడాది.. అనేక వరాలు ప్రకటించి ప్రజల దృష్టినంతా టిఆర్ఎస్ వైపే ఉండేలా చూసుకోవాలి.. కొత్త హామీలు.. కొత్త మ్యానిఫెస్టోకు సంబం ధించి కూడా కసరత్తు చేసి నిర్ణయానికి రావాలి.. ఇలాంటి కీలక పనులన్నీ ఉన్న సమయంలో పంచాయతీ ఎన్నికలకు వెళ్తే దృష్టి మరలే అవకాశాలు ఉన్నాయని, అన్నీ ఆలోచించాలని కొందరు సీనియర్ మంత్రులు అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది. అయితే ముఖ్యమంత్రి కెసిఆర్ అంతరంగంలో ఏముందో నేతలకు అంతుబట్టడం లేదు.

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పంచాయతీ ఎన్నికలు.. సెమీ ఫైనల్‌గా భావించి ముందుకు వెళ్ళాలను కుంటున్నారా? ప్రజా నాడిని ఒడిసిపట్టి ..అందుక నుగుణంగా దిద్దు బాటు చర్యలు చేపట్టే అవకాశం ఉందని భావిస్తు న్నారా? లేక అనవస రంగా రిస్క్ ఎందుకు తీసుకోవాలన్న కొందరు సీనియర్ల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసు కుంటారా? ముఖ్య మంత్రి కెసిఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారు.. ఏవిధంగా పార్టీని అడుగులు వేయిస్తారు అన్న అంశాలపై పార్టీలో ఉత్కంఠ నెలకొంది.

ముచ్చటగా.. మూడు సర్వేలు..

రాష్ట్రంలో ప్రభుత్వం, పార్టీ పరిస్థితి, ఎమ్మెల్యేల పని తీరుపై ప్రభుత్వానికి రెగ్యులర్‌గా వచ్చే నివేదికలపై ఆధార పడకుండా ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ముఖ్యమంత్రి కెసిఆర్ మూడు సర్వేలు నిర్వహిస్తున్నట్లు పార్టీవర్గాల్లో ప్రచారముంది. ఎమ్మెల్యేల పని తీరుపై, మంత్రుల పనితీరుపై ఒక సర్వే, ప్రభుత్వ పథకాలపై ప్రజలేమ నుకుంటున్నారు.. సంతృప్తిగా ఉన్నారా? అసంతృప్తిగా ఉన్నారా? ఇంకా ఏం కోరుకుంటున్నారు అన్న అంశాలపై మరో సర్వే, నియోజకవర్గాలలో పార్టీ పరిస్థితిపై ఒక సర్వే ప్రైవేటు ఏజెన్సీలు ఇప్పటికే చేపట్టినట్లు సమాచారం. మేడారం జాతరముగియగానే ఫిబ్రవరి తొలివారంలో సిఎం ఈ నివేదికలను క్రోడీకరించి.. నేతలకు దిశానిర్దేశం చేయవచ్చన్న చర్చ వినిపిస్తోంది. మొత్తంగా ఇప్పటినుండి ఎన్నికలకు సిద్ధమైన సైనికుల్లా ప్రజల్లోనే ఉండి ప్రజల మనోభావాలను గుర్తించి.. అందు కనుగుణంగా వ్యవహ రించాలని, లోపాలు ఏవైనా ఉంటే సరిచేసు కోవాలని సిఎం నేతలకు సూచించనున్నారు. ఇదేక్రమంలో ఎమ్మెల్యేలు లేనిచోట నియోజకర్గ ఇన్‌ఛార్జిలను కూడా ఖరారుచేసే అవకాశం కనబడుతోంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 24 జనవరి 2018

సమితిలో పాక్‌కు చెంపపెట్టు!

సమయం దొరికినప్పుడల్లా అంతర్జాతీయ వేదికలపై కాశ్మీర్ అంశాన్ని ప్రస్తావించే పాకిస్తాన్‌కు ఐక్య రాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ చేసిన స్పష్టీకరణ ముమ్మాటికీ చెంపపెట్టే.కాశ్మీర్ అంశంపై సమితి జోక్యం చేసుకునే అవకాశమే లేదని ఆయన స్పష్టం చేసి భారత్ వాదాన్ని బలపర్చారు. అయితే, ఈ సమస్యతో సంబంధం ఉన్న అన్ని పక్షాల వారూ కోరితే సలహా ఇచ్చేందుకు సిద్ధమేనని ఆయన పేర్కొనడం ఆశ్చర్యకరం. కాశ్మీర్ అంశం విషయంలో మూడవ పక్షం జోక్యం పనికి రాదని మన దేశం మొదటి నుంచి నిర్ద్వంద్వంగా ప్రకటిస్తోంది. అలాంటప్పుడు దీనిని అంతర్జాతీయ సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం ఎవరు చేసినా అది ఎంతమాత్రం సమర్ధనీయంకాదు. నలభై ఐదేళ్ళ క్రితం ఆనాటి ఇరుదేశాల ప్రధానులు ఇందిరా గాంధీ, జుల్ఫికర్ ఆలీ భుట్టో కుదుర్చుకున్న సిమ్లా ఒప్పందం, పదిహేనేళ్ళ క్రితం నవాజ్ షరీఫ్,వాజ్‌పేయిలు కుదుర్చుకున్న లాహోర్ ఒప్పందం ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. అయినప్పటికీ,పాక్ ప్రధాని, మంత్రులు కాశ్మీర్‌పై నోటికొచ్చినట్టు మాట్లాడుతూనే ఉన్నారు. వాజ్‌పేయి హయాంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని అదేపనిగా ఉల్లంఘిస్తున్న పాకిస్తాన్‌కి కేంద్ర హోం మంత్రి రాజ్ నాథ్ సింగ్ రెండు రోజుల క్రితం ఘాటైన హెచ్చరిక చేశారు. సరిహద్దుకు ఆవలివైపునకు కూడా వెళ్ళి పొరుగు సేనలకు గట్టి గుణపాఠం చెప్పగల సత్తా మన సేనలకు ఉందన్న ఆయన ప్రకటన అంతరార్థం మరో సారిమెరుపు దాడికి వెనకాడబోమని హెచ్చరించ డమే. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారాన్ని చేపట్టే సమయంలో ఆనాటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ని ఆహ్వానించడం,రెండేళ్ళ క్రితం కాబూల్ నుంచి తిరిగి వస్తూ, లాహోర్‌లో మజిలీ చేసి షరీఫ్ జన్మదినోత్సవ వేడుకలకు హాజరు కావడం పొరుగుదేశంతో భారత్‌కి వైరం లేదని స్పష్టం చేయడమే. అదే సందర్భంలో మన భూభాగం మీదికి ఉగ్రవాదులను ఉసిగొల్పితే ఎంత మాత్రం సహించబోమని హెచ్చరించేందుకే మెరుపు దాడి (సర్జికల్ స్ట్రయిక్) జరిపించారు.దౌత్యంతో పరిష్కారం కాకపోతే దండోపాయమే శరణ్యమన్న సంకేతాన్ని ఆయన పాక్‌కి అందించారు. పాక్‌పట్ల ప్రధాని మోడీ అనుసరిస్తున్న వైఖరికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి కూడా మద్దతు లభిస్తోంది. ముంబాయిపై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌పై విచారణ జరిపించాలంటూ ఆయన ఇటీవల పాక్ ప్రభుత్వాన్ని హుకూం జారీచేశారు. జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల్లో ట్రంప్ స్థిర నిర్ణయాలు తీసు కోక పోవడం వల్లే ఆయన హెచ్చరికలను పాక్ వంటి దేశాలు ఖాతరుచేయడం లేదు. అదే సందర్భంలో అగ్రరాజ్యం హోదా కోసం తహతహలాడుతున్న చైనా వెనకేసుకుని రావడం వల్ల పాక్ రెచ్చిపోతోంది. సయీద్‌పై విచారణ జరిపించాలంటూ ట్రంప్ చేసిన సూచన ను పాక్ బేఖాతరు చేయడమే ఇందుకు నిదర్శనం. కాశ్మీర్ విషయంలో జోక్యం చేసుకోబోమని అమెరికా కూడా గతంలో చాలా సార్లు స్పష్టంచేసింది. కాశ్మీర్‌లోకి పాక్ నుంచి చొరబాట్లను అరికట్టడంలో మన సైన్యం చాలా మటుకువిజయాన్ని సాధించింది. పాక్ సైనికుల కాల్పుల ను ఎప్పటికప్పుడు తిప్పికొట్టడంలో మన సైనికులు ప్రాణాలకు తెగిస్తున్నారు. ఇటీవల పాక్ సైనికుల కాల్పుల్లో పలువురు జవాన్లు, సరిహద్దు గ్రామాల పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై మన ప్రభుత్వం తీవ్రంగాస్పందించింది. ఒక వంక సరిహద్దుల్లో చొరబాట్లను తిప్పికొట్టడం,మరో వైపు కాశ్మీర్‌లో యువత ఉగ్రవాద సంస్థల ఉచ్చులో పడకుండా కాపాడటంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ద్విముఖ వ్యూహం సత్ఫలితాలనిస్తోంది. కాశ్మీర్‌లో భద్రతాదళాలపై యువకులు రాళ్ళు రువ్వుతున్న సంఘటనలు చాలా వరకు తగ్గిపోయాయి. స్టాఫ్ సెలక్షన్ పరీక్షల్లో అగ్రస్థానం సాధించిన అంజుమన్ బషీర్ ఖాన్ ఖట్టక్‌ని ప్రధాని నరేంద్రమోడీ ఆకాశవాణి మన్‌కీ బాత్ ప్రసంగంలో అభినందించారు. కాశ్మీరీ యువకులంతా అతడి మార్గంలో నడవాలని పిలుపు ఇచ్చారు.ఇది ఆహ్వానించదగిన పరిణామం.కాశ్మీర్ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న పట్టువిడుపుల వైఖరి సత్ఫలితాలనిస్తున్నదనడానికి ఇదే నిదర్శనం. అదే సందర్భంలో సంప్రదింపుల ప్రక్రియ కొనసాగించేందుకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని స్పష్టం చేసేందుకే కేంద్రం దూతగా దినేశ్వర్ శర్మను ప్రధాని నియమించారు. కాశ్మీర్‌పై మరిన్ని చర్యలు కేంద్రం తీసుకోవాలని శాంతికాముకులు కోరుకుంటున్నారు.

మంచిమాట

సత్యాన్ని ఆవిష్కరించడం, మంచిని ఆచరించడం - ఇవి రెండే తత్వశాస్త్రం లక్ష్యాలు.

- వోల్టేర్

చీపురుకి మురికి: ఆప్ పంచాయతీ

లాభదాయక పదవులు నిర్వహిస్తున్నందుకు గానూ ఇరవై మంది ఆప్ శాసన సభ్యులు అనర్హతకి గురవుతున్నారు.. ఎన్నికల సంఘం సిఫార్సుల మేరకు, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయంతో. ఈ పరిస్థితి ఏర్పడడంలో ఎన్ని రాజకీయాలు దాగివున్నప్పటికీ, అసలు దోషం ఆప్ పార్టీ స్వయంకృతమే. చట్టసభల్లో సభ్యులై ఉండీ, ప్రభుత్వం పరిధిలోని ఏ రకమైన లాభదాయక పదవినీ చేపట్ట రాదని, చేపడితే అనర్హత వేటు పొంచి ఉంటుందనీ స్పష్టమైన నియమాలను చట్టాల్లో పొందుపరచడం జరిగింది. ఆ రకంగా అధినేత లైనా ఇబ్బందులు పడిన ఉదంతాలు గతంలో ఉన్నాయి. అయినా కేజ్రీవాల్ రిస్కు తీసుకున్నారు, తమ పార్టీలో రాజకీయ అవసరాల నిమిత్తం. తెలిసే తీసుకున్న నిర్ణయానికి ఆయన భాధ్యత వహించవల్సిందే మరి. పైగా బలమైన రాజకీయ శత్రువు లున్నప్పుడు, ఛాన్స్ ఎలా తీసుకుంటారు? తాను స్వచ్ఛమైన రాజకీయాలే చేస్తాను అని వచ్చిన మనిషి, తానూ ఆ తానులో ముక్కయి పోయారు. ఊడ్చాల్సిన చీపురుకే ఉన్న మురికంతా అంటినట్టు తయారైంది పరిస్థితి. ఎన్నికల కమిషన్ నిప్పు కాకపోవచ్చు. కాకాక్షి న్యాయం అమలు చెయ్యొచ్చు. కానీ అందుకు అవకాశం కల్పించింది తానే కదా.

-డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీ పురం.

ప్రపంచానికి భారత్ కరదీపిక

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో మంగళవారం ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక వేదికలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్ఫూర్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ళు వివరించారు. వాతావరణ కాలుష్యం వల్ల ఏర్పడుతున్న విపరిణామాలను వివరించారు. వాటిని అరికట్టడానికి అభివృద్ధి చెందిన దేశాలు మిగిలిన దేశాలకు ఏవిధంగా సహకరిస్తున్నాయని ప్రశ్నించారు. డేటాను సేకరించ గలిగిన వాడే ప్రపంచాన్ని అదుపు చేయగలుగుతాడని తన ప్రసంగంలో అన్నారు. భారతీయ తత్వాన్నీ, తత్వవేత్తలనూ, మహాత్ముడిని, విశ్వకవి రవీంద్రుని ప్రస్తావిస్తూ ఆయన ప్రసంగించారు. నరేంద్ర మోడీ ప్రసంగ పాఠం...



దావోస్ ప్లీనరీ సదస్సులో ప్రధాని మోడీతో స్విస్ కాన్ఫెడరేషన్ అధ్యక్షుడు ఎలెన్ బెర్సెట్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం చైర్మన్ క్లాజ్ ష్వాబ్

నాకు చక్కని ఆహ్వానం పలికినందుకు స్విట్జర్లాండ్ ప్రభుత్వానికీ, ప్రజలకు నా కృతజ్ఞతలు. చివరిసారి 1997లో భారత ప్రధాన మంత్రి దావోస్ సదస్సులో పాల్గొన్నారు. అప్పటి ప్రధాని దేవెగౌడ దీనికి హాజరయ్యారు. 48వ ప్రపంచ ఆర్థిక వేదికలో పాల్గొనడం నాకు సంతోషాన్ని కలిగిస్తోంది. చీలిపోయిన ప్రపంచానికి భవిష్యత్తును సృష్టించే ఉద్దేశంతో ఈసారి దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సమావేశమవుతోంది. ఇప్పటికే దావోస్ చాలా ముందుంది. 1997లో భారత జిడిపి 400 బిలియన్ డాలర్లు. ఇప్పుడది ఆరు రెట్లు పెరిగింది. 1997లో యూరో చెలామణీలో లేదు. బ్రెక్సిట్ చోటుచేసుకోలేదు. ఒసామా బిన్ లాడెన్ గురించి ప్రపంచం వినలేదు. హ్యారీ పోటర్ గురించీ ప్రపంచానికి తెలీదు. చదరంగ క్రీడాకారులు కంప్యూటర్ చేతిలో ఓటమి చెందాల్సిన పరిస్థితుల్లో లేరు. గూగుల్ లేదు. అమెజాన్ గురించి శోధిస్తే, అడవులు, నదులకు సంబంధించిన సమాచారం కనిపించేది. ఆ కాలంలో పక్షులు మాత్రమే ట్వీట్ చేసేవి. రెండు దశాబ్దాల అనంతరం ఇప్పుడు పరిస్థితేమిటి? ప్రపంచమూ, సమాజమూ కూడా సంక్లిష్టమైన సమాచార వ్యవస్థలో చిక్కుకుని పోయాయి. సాంకేతికంగా నడుస్తున్న మన సమాజం ప్రపంచంలోని వివిధ అంశాలను తీవ్రంగా ప్రభావితంచేస్తోంది. సాంకేతికత మన జీవితాల్లోకి ఎంతగా చొచ్చుకొచ్చిందో చెప్పడానికి సామాజిక మాధ్యమమే అతి పెద్ద ఉదాహరణ. ప్రపంచాన్ని అది చీలుస్తోంది. కలుపుతోంది. సూక్ష్మంగా చెప్పాలంటే ప్రపంచాన్ని శాసిస్తోంది. ప్రపంచమంతా సమాచారం వెనక పరుగెడుతోంది. ఎందుకంటే డేటా ఎవరి దగ్గరుంటే వారు ప్రపంచాన్ని శాసించగలుగుతున్నారు. ఎవరు అదుపు చేస్తే వారిదే ఆధిపత్యమవుతోంది. ఆర్థికంగానూ, రాజకీయంగానూ ప్రపంచంలో వేగంగా మార్పులు సంభవిస్తున్నాయి. శాంతి, సుస్థిరత, రక్షణ అంశాలు కొత్తకొత్తవీ, తీవమైనవి అయిన సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి. మానవత్వపు భవితపై సమాధానాలను వెతుక్కోవల్సివస్తోంది. ఈ వాతావరణంలో ఉద్భవిస్తున్న అనేక జటిలమైన ప్రశ్నలకు జవాబులు తెలియాల్సుంది. మనం సాధిస్తున్న అభివృద్ధి మన మధ్య అంతరాలను పెంచుతోందా అనే అనుమానాలు కూడా రేకెత్తుతున్నాయి. ఉజ్వలమైన భవిత కోసం మనకు ఎదురవుతున్న అడ్డంకులు, దూరాలను అధిగమించాల్సి ఉంది. భారత దేశంలో మేము ప్రజలందర్నీ ఐకమత్యంగా ఉంచడానికి ప్రాధాన్యమిస్తాం. విభజించడానికి కాదు. ప్రపంచమంతా ఒకటే కుటుంబమని భారతీయ తత్వవేత్తలు వేలాది సంవత్సరాలుగా చెబుతూనే ఉన్నారు. మరోవంక శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతికత, ఆర్థిక ప్రగతి మానవ జీవితాలను పురోగమింపజేస్తాయి. అదే సమయంలో ఇవి బాధాకరంగానూ పరిణమించవచ్చు. ఈ మార్పులు అడ్డుగోడలను సృష్టిస్తున్నాయి. అవే మన మార్గాన్నీ, శాంతినీ క్లిష్టతరం చేస్తున్నాయి. వేలాది సంవత్సరాలక్రితం మన పవిత్ర గ్రంథాలు మనని భూమి పుత్రులుగా అభివర్ణించాయి. అలాంటప్పుడు మానవులకూ, పర్యావరణానికి మధ్య యుద్ధాన్ని ఎందుకు సృష్టించుకుంటున్నాం? అవసరాన్ని బట్టి వినియోగం ఉండాలని భారత జాతిపిత మహాత్మాగాంధీ అనునిత్యం నమ్మేవారు. దురాశను వ్యతిరేకించారు. ఆ ఆలోచన నుంచి మనం పారిపోయి చాలా దూరం వచ్చేశాం. ప్రకృతిని దోచేశాం. దీన్ని అభివృద్ధి అనాలా.. లేకక్షీణత అనలా మనని మనం ప్రశ్నించుకోవాలి. మన మధ్య విభేదాలను పారదోలి, సవాళ్ళను స్వీకరించాలి. అలా మనం చేశామా అని మనని మనం నిజాయితీగా ప్రశ్నించుకోవాలి. వాతావరణంలోకి విడిచిపెట్టే వ్యర్థాలను తగ్గించుకోవాలని ప్రతి ఒక్కరూ అంటారు. ఎన్ని అభివృద్ధి చెందిన దేశాలు అందుకు తగిన సాంకేతికతను అవసరమైన దేశాలకు అందించాయి? మంచు ఖండాలు కరిగిపోతున్నాయి. ఆర్కిటిక్ ఖండంలో మంచు అదృశ్యమవుతోంది. ద్వీపాలు నీటిలో మునిగిపోతున్నాయి. వేడి పెరిగిపోతోంది. చల్లదనమూ అదే స్థాయిలో ఉంటోంది. అతివృష్టి, కరవు పీడిస్తున్నాయి. ఇవన్నీ ప్రకృతి ప్రకోపాలు. ఇవి ప్రతి చోటా కనిపిస్తున్నాయి. చివరకు స్విట్జర్లాండ్‌లో కూడా ఇరవైయేళ్ళలో ఎప్పుడూ చూడని హిమపాతాన్ని చూస్తున్నాం. దీనికి కారణం వాతావరణంలో మార్పులు.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఈనాడు అన్ని దేశాలు ఒకే వేదికపైకి చేరి ఉమ్మడి సమస్యలపై చర్చించుకోవడం, పరిష్కారాలను అన్వేషించడం అత్యంత అవసరం. ప్రస్తుతం మనం అందుకోసమే ఇక్కడికి చేరుకున్నాం. ప్రపంచ దేశాలు ఈనాడు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య ఉగ్రవాదం. ఉగ్రవాదం ఒక ప్రాంతానికో, మతానికో, దేశానికో పరిమితమైనది కాదు. ఉగ్రవాదం విసిరే సవాల్‌ని ఎదుర్కోవడంలో అరమరికలు ఉండరాదన్నదే భారత్ విధానం. ఉగ్రవాద ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో నేను మీ అందరికీ వివరంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉగ్రవాదుల్లో మంచి వారు, చెడ్డవారనే తేడా ఉండదు. ఎక్కువ ప్రమాదకారులు, తక్కువ ప్రమాదకారులనే తేడాలుండవు. ఉగ్రవాదం ప్రపంచంలో ఏమూలన ఉన్నా, ఎవరు పాల్పడినా తీవ్రంగా ఖండించాల్సిందే. ఈ విషయంలో తన,పర భేదాలు ఉండరాదన్నదే మా విధానం.

వేలాది సంవత్సరాల క్రితం మన పవిత్ర గ్రంథాలు మనని భూమి పుత్రులుగా అభివర్ణించాలయి. అలాంటప్పుడు మానవులకూ, పర్యావరణానికి మధ్య యుద్ధాన్ని ఎందుకు సృష్టించుకుంటున్నాం? అవసరాన్ని బట్టి వినియోగం ఉండాలని భారత జాతిపిత మహాత్మాగాంధీ అనునిత్యం నమ్మేవారు. దురాశను వ్యతిరేకించారు.

ప్రపంచం ఈనాడు ఎదుర్కొంటున్న మరో ముఖ్య సమస్య భూతాపం. భూతాపాన్ని అరికట్టేందుకు తరచూ జరిగే అంతర్జాతీయ సదస్సుల్లో తీసుకునే నిర్ణయాలు తుచ తప్పకుండా అమలు కావాలి. ఉద్గారాల తగ్గింపు విషయంలో అగ్రరాజ్యమైనా, అభివృద్ధి చెందుతున్న దేశమైనా, అన్ని దేశాలూ తమకు సమాన బాధ్యత ఉందనే విషయాన్ని మరిచిపోరాదు. ఈ విషయంలో భారత్ మొదటి నుంచి ఒకే విధానంతో ముందుకు సాగుతోంది. భూతాపాన్ని అరికట్టేందుకు ఉద్దేశించిన నిర్ణయాలు అమలులో ఎవరు నిర్లిప్తంగా వ్యవహరించినా, యావత్ మానవాళిపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

భారత్‌లో గడిచిన మూడున్నర సంవత్సరాల్లో భారీ మార్పులొచ్చాయి. 125 కోట్ల మంది భారతీయుల ఆశలూ, ఆశయాలసాకారానికి ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తోంది. ఉద్యోగాల కోసం ఎదురు చూసే యువతరం ఇప్పుడు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదుగుతోంది. మనలో ఉన్న విభేదాలను పక్కన పెట్టి భుజంభుజం కలిపి ముందుకు సాగాలనే భావన ప్రతి ఒక్కరిలో ఏర్పడుతోంది. ఇందుకు మా ప్రభుత్వం తీసుకున్న, తీసుకుంటున్న చర్యలే దీనికి కారణం.

సంస్కరణలు, చేతనత్వమూ, మార్పులూ మా మార్గం. ప్రభుత్వం తీసుకున్న అనేక కీలక నిర్ణయాల వల్ల ఇప్పుడు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, భారత్‌లో పర్యటించడం, భారత్‌లో వస్తువులు తయారు చేయడం ఇప్పుడు గతంలో ఎన్నడూ లేనంతగా సులభతరం అయింది. లైసెన్స్ రాజ్‌కి భరతవాక్యం పలకాలని మేం ప్రతిన తీసుకున్నాం. రెడ్ టేపిజాన్ని పూర్తిగా తొలగించి దాని స్థానే రెడ్ కార్పెట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐల) కు కొత్త ద్వారాలు తెరిచాం. కాలం చెల్లిన 1400 పైగా చట్టాలకు చరమగీతం పాడాం. వస్తు, సేవా పన్ను (జిఎస్‌టి)ని ప్రవేశపెట్టి ఆర్థిక సంస్కరణల్లో కొత్త పుంతలు తొక్కాం. పాలనలో పారదర్శకతను పెంచడానికి, ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి నిరంతరం కృషి చేస్తున్నాం పాలనా వ్యవహారాల్లో సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నాం. ప్రజాస్వామ్యం, చైతన్యస్ఫూర్తి, జనసాంద్రత మా గమ్యాలకు రూపునిస్తున్నాయి.

2014లో దేశ వ్యాప్తంగా 600 కోట్ల మంది ప్రజలు తొలిసారిగా ఒకే పార్టీకి మెజారిటీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సబ్‌కా సాత్,సబ్ కా వికాస్ నినాదంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు జేస్తున్నాం. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ చర్యల్లో భాగంగానే నిరుపేదలకు బ్యాంకుల్లో జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరిపించే ఏర్పాట్లు చేశాం. లింగ వివక్ష లేకుండా స్త్రీ, పురుషులకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తున్నాం. సంక్షేమ పథకాల ఫలాలు అసలైన లబ్దిదారులకు చేరేందుకు డిజిటల్ విధానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నాయి. డీమానిటైజేషన్ (పెద్దనోట్ల రద్దు) ద్వారా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నాం. సమ్మిళిత అభివృద్ధి అనేదానిని సాకారం చేస్తున్నాం. డిజిటల్ రంగంలో కూడా సమ్మిళిత అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం. అందరూ, అన్ని స్థాయిల్లో వారు భాగస్వాములయ్యేట్టు చేయగలిగినప్పుడే అభివృద్ధికి సార్థకత ఏర్పడుతుంది.

జాతి పిత మహాత్మాగాంధీ ఓ సందర్భంలో చెప్పిన విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను. తలుపులు, కిటికీలు మూసుకుని కూర్చోవడం మా అభిమతం కాదు. ప్రపంచంలో అన్ని వైపుల నుంచి గాలులు, వెలుతురు మా ఇంట్లోకి ప్రసరించాలి. అవి మా ఇంటికి ముప్పు కారాదన్నదే మా సిద్ధాంతం. తరతరాలుగా భారత్ ఈ సిద్ధాంతాన్నే నమ్ముతోంది, ఆచరిస్తోంది. భిన్నత్వంలోని విశిష్టతను భారత్ అర్థం చేసుకుంది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ప్రాముఖ్యాన్ని భారత్ గుర్తించింది. గౌరవించింది.

ఈనాడు మానవాళి ఎదుర్కొంటున్న మూడో సమస్య నానాటికీ పెరుగుతున్న స్వీయ ప్రయోజన కాంక్ష. ప్రపంచీకరణ నానాటికీ కుచించుకుని పోతున్నది. ప్రతి ఒక్కరూ అన్ని దేశాలూ కలిసి ఉండాలని నొక్కి వక్కాణిస్తుంటారు. అదే సందర్భంలో ప్రపంచీకరణ బాగా కుచించుకుని పోతోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన అంతర్జాతీయ సంస్థలు ప్రపంచంలో ఇప్పుడు కొత్తగా కనిపిస్తున్న చైతన్యాన్ని ఆహ్వానించాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల వాణి అంతర్జాతీయ సంస్థల్లో వినిపించేందుకు ఆస్కారం కలిగించాలి. ప్రపంచీకరణను అడ్డుకోవాలని కొన్ని దేశాలు చూస్తున్నాయి. ఇందుకు ఉదాహరణ కొత్తగా ప్రవేశపెట్టిన టారిఫ్ ఆంక్షలను చెప్పుకోవచ్చు. మిమ్మల్నందరినీ భారత్‌కి ఆహ్వానిస్తున్నాను. ఆరోగ్యం, ఐశ్వర్యంతో సంపూర్ణత్వం కోసం మా దేశానికి రండి. శాంతి, సౌభాగ్యాల కోసం మా దేశానికి రండి. మీరు ఎప్పుడొచ్చినా సుస్వాగతమే.

భారత్ వసుధైక కుటుంబ సిద్ధాంతానికి తరతరాలుగా కట్టుబడి ఉంది. విశ్వకవి రవీంద్ర నాథ్ కవిత ఇందుకు నిదర్శనం. భారత్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు స్వర్గ ధామం. అరమరికలు అడ్డుగోడలు లేని సమాజం మాది అని అన్నారు ఆ కవితలో. విశ్వకవి ఆకాంక్షను నిజం చేద్దాం.

అంతర్జాతీయ ఆర్థిక, భద్రతా సంస్థల్లో సంస్కరణలు అవశ్యం. ప్రపంచఆర్థిక పురోగతి మరింత వేగాన్ని పుంజుకోవాలి. మానవాళికి ముప్పుగా తయారైన సమస్యలను ఎదుర్కోవడంలో భారత్ ఎప్పుడూ సహకరిస్తూనే ఉంది. ఐక్యరాజ్య సమితి శాంతిదళాల్లో భారత్ సైనికుల సంఖ్య ఎక్కువగా ఉండటమే ఇందుకు నిదర్శనం. ఇరుగుపొరుగు దేశాల్లో, మిత్ర దేశాల్లో సమస్యలు ఉత్పన్నమైనప్పుడు, ప్రకృతివైపరీత్యాలు సంభవించినప్పుడు వెంటనే స్పందించడం మా సంప్రదాయం. సుస్థిరంగా, పారదర్శకంగా, ప్రగతి పథంలో సాగే భారత్ యావత్ ప్రపంచానికీ ఎప్పుడూ కరదీపికే.

పారిశ్రామికోత్పత్తిపై దృష్టి పెట్టాలి

కేంద్రంలో నరేంద్రమోడీ నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఏ) ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగేళ్ళవుతున్న పూర్వ రంగంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న పార్లమెంటు లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై వివిధ రంగాలలో, దేశ ప్రజల్లో కోటి ఆశలు కలుగుతున్నాయి. మోడీ ప్రధాని అయ్యాక తొలి రెండేళ్ళలో దేశంలోని అనేక ప్రాంతాల్లో దుర్భిక్షాలు, వరదలు, అకాల అధిక వర్షాలవల్ల, ఆ తర్వాత ముడిసరకులు, పంట ఉత్పత్తుల ధరలు దారుణంగా పడిపోయి వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొం టోంది. నల్లధనాన్ని వెలికితీసే పేరిట 2016 డిసెంబర్ 8న ప్రధాని మోడీ పెద్దనోట్ల రద్దును ప్రకటించడం, ఆ తర్వాత 6 నెలలకు దేశవ్యాప్తంగా ఒకేపన్ను పేరిట జిఎస్‌టిని అమలు చేయడం వల్ల, చిన్న, మధ్యరకం పరిశ్రమలు, వివిధ వృత్తులపై తీవ్ర ప్రభావం కారణంగా లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. దేశంలో దాదాపు 85 శాతం మందికి ఉపాధి కల్పించే అసంఘటిత రంగం కుదేలైంది. భారత్ ప్రధానంగా వ్యవసాయదేశం. రైతే దేశానికి వెన్నెముక అని చెబుతున్న పాలకులు, వివిధ రాష్ట్రాల ఏలికలు ఏవో అరకొర చర్యలు తప్పితే 55 శాతం జనాభాకు ఉపాధి కల్పించే సేద్యం, అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధిపై తగిన శ్రద్ధ వహించని కారణంగా జీవన భద్రత లేక కోట్లాది మంది అన్నదాతలు, నిరుపేదలు, కార్మికులు తల్లడిల్లుతున్నారు. దశాబ్దం క్రితం పశ్చిమ దేశాలను ఆవరించిన ఆర్థిక మాంద్యం క్రమంగా భారత్‌కు వ్యాపించింది. సేద్యానికి, వివిధ రంగాలకు రుణసాయమందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల మొండి బాకీలు రూ.10 లక్షల కోట్లకు పెరిగిన ఫలితంగా కొత్తగా రూ.2.10 లక్షల కోట్ల మేర మూలధనాన్ని సమకూరుస్తామని కేంద్రం ప్రకటించింది.

పెద్ద పారిశ్రామిక, వాణిజ్య సంస్థల నుండి మొండిబాకీల వసూలులో బ్యాంకులు విఫలమైన, రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నాయి. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు, కల్పిస్తామని, ఉపాధి అవకాశాలు భారీగా పెంచుతామని, ఉత్పత్తి రంగానికి ఊతమిస్తామనీ మోడీ ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలు కానందున యువతలో తీవ్ర నిరాశ, అసహనం పెరుగుతున్నాయి. ఈ పూర్వరంగంలో జైట్లీ ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో పెట్టుబడులు పునరుద్ధరించి, పారిశ్రామికోత్పత్తిని పెంచడం, ఉపాధి, ఉద్యోగాల కల్పన, వ్యవసాయ వృద్ధిని గణనీయంగా మెరుగుపరచడం, విద్య, ఆరోగ్య రంగాలలో పెట్టుబడులు పెంచి, సామాన్యులకు అందుబాటులోకి తేవడంపై ప్రభుత్వం కేంద్రీకరించాల్సి ఉంది. దేశంలో ఏటా 2 కోట్ల మంది కొత్తగా నిరుద్యోగ సైన్యంలో చేరుతున్నారు. వారందరికీ ఉపాధి, ఉద్యోగాల కల్పనకు వ్యవసాయం అనుబంధ రంగాలు, సేవలు, వ్యాపారం, గనులు, తయారీరంగాలు ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు నూతనోత్తేజం కల్గించేలా పెట్టుబడులు, రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పించడం ఎంతో అవసరం. వస్తుసేవల పన్ను రేట్లను కొన్ని వస్తువులపై తగ్గించినా గిరాకీ పెంచడానికి ప్రాధాన్యమిచ్చి పన్ను రేట్లు మరింత తగ్గించాలి. జాతీయ రహదార్లు, రైల్వేలు, రేవులు తదితర మౌలిక రంగాలలో పెట్టుబడులు పెంచాలనే ప్రభుత్వ ప్రయత్నాలు అభినందనీయమే. పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం - ప్రైవేటు రంగ సంయుక్త రంగం సంయుక్త ప్రాజెక్టులను నిర్ణీత కాల వ్యవధిలో అమలు చేసి సత్ఫలితాల సాధనకు ప్రోత్సహించాలి. దేశ, న్యాయ పాలికలో వివిధ స్థాయిలలో లక్షల కేసులు సత్వర పరిష్కారానికి తగు మార్గాలను అన్వేషించి అమలు చేయాలి. దేశంలో విద్యపై ప్రస్తుతం ప్రభుత్వ వ్యయం జిడిపిలో 3.2 శాతంగా ఉంది.



విద్యపై వ్యయాన్ని రానున్న సంవత్సరాలలో క్రమంగా 6 శాతానికి పెంచాలి. ప్రస్తుతం ఐటిఐ, పాలిటెక్నిక్‌లు, ఇంజనీరింగ్ కళాశాలలు, ఇతర సాంకేతిక శిక్షణా సంస్థలను ఆధునికీకరించి వర్తమాన దేశీయ అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా ప్రమాణీకరించాలి. దేశ విద్యార్థుల, యువతలో సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని పెంచితేనే వారికి విశ్వవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రాథమిక, మాధ్యమిక, హైస్కూలు స్థాయిల్లో విద్యాప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయ ఖాళీలను, యూనివర్శిటీలు, ఇంజనీరింగ్ కళాశాలల్లో అధ్యాపక స్థానాల భర్తీకి, వారికి తగు శిక్షణ ద్వారా సామర్థ్యం పెంపునకు బడ్జెట్‌లో నిర్దిష్ట ప్రతిపాదనలు చేయాలి. దేశంలో ప్రజారోగ్య రక్షణకు ప్రస్తుతం జిడిపిలో కేవలం 1.5 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారు. వచ్చే ఐదేళ్ళలో ప్రజారోగ్యానికి చేసే వ్యయాన్ని జిడిపిలో 2.5 శాతానికి పెంచాలని 2017 జాతీయ ఆరోగ్య విధానం ప్రతిన బూనింది. కేంద్రం ఈ లక్ష్య సాధన దిశగా ముందడుగేయాలి. అంతర్జాతీయ మహిళా ఆరోగ్య పరిరక్షణపై 2017 లో రూపొందించిన ప్రపంచ ఆరోగ్య నివేదికలో భారత్ అధో స్థానంలో ఉండటం ఆందోళనకర అంశం. అందువల్ల మహిళల ఆరోగ్య పరిరక్షణ పై కేంద్రం మరింత శ్రద్ధవహించి, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తగినంత మంది డాక్టర్లతో పటిష్టం చేస్తే గ్రామీణ ప్రజల ఆరోగ్యం మెరుగవుతుంది. ఇటీవలికాలంలో క్యాన్సర్, మూత్రపిండాలు, నర రోగాలు, గుండె జబ్బులు తదితర ప్రాణాంతక వ్యాధులు ముదిరిపోతున్నందున అఖిల భారత వైద్యశాస్త్రాలసంస్థ(ఎఐఐఎంఎస్) వంటిసూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులను వివిధ ప్రాంతాలలో ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పి ఆధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవడంపై బడ్జెట్‌లో ప్రాధాన్యమివ్వాలి.

దేశంలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ఉపాధి కల్పనకు కేంద్రం అత్యంత ప్రాధాన్యమివ్వాలి. ఉపాధి - ఉద్యోగ కల్పనలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని గణాంకాలు ఘోషిస్తున్నాయి. మాటలు కోటలు దాటుతు న్నాయే గానీ ఆచరణ గడపదాటడం లేదనేది నిష్ఠురసత్యం. వంది మాగధులు, భజన మాధ్యమాలలో ఎంత ఊదర గొట్టినా మోడీ వైఫల్యం కాదనలేనిది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి వల్ల చతికిల బడ్డ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి ప్రత్యేక రాయితీలిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ఈ ఏడాది వివిధ రాష్ట్రాలు, శాసనసభల ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న తరుణంలో తీవ్రదుస్థితిలో వున్న సేద్యం అనుబంధ రంగాలను గట్టెక్కించాల్సిన కీలక కర్తవ్యం కమలనాధులదే. దేశంలో 2015 లో దాదాపు 13 వేలమంది అన్నదాతలు రుణభారం వల్ల అప్పులపాలై 39 శాతం ఖర్చులు పెరిగి గిట్టుబాటు ధరలు రాక దాదాపు 20 శాతం మంది, కుటుంబ, తదితర సమస్యలవల్ల 41 శాతం మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు గణాంకాలు ఘోషిస్తున్నాయి. 2004 - 2014 సంవత్సరాల మధ్య సేద్యపురంగ జిడిపి 3.7 శాతం కాగా కేంద్రంలో ఎన్‌డీయే 45 నెలల పాలనలో అది 1.85 శాతానికి పడిపోవడం భారత వ్యవసాయరంగ తీవ్ర దుస్థితికి నిదర్శనం.

వాతావరణంలో తీవ్ర ఒడిదుడుకులు, ప్రధాని పంటల బీమా పథకం కింద రైతులకు బీమా కల్పించడంలో వైఫల్యం, సేద్యపు పెట్టుబడులకు అవసరమైన సంస్థాగత రుణాలు అందుబాటులో లేక రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి తీర్చలేక, పంటలకు గిట్టుబాటు ధరలు రాక పోవడం, మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం వంటి వివిధ కారణాల వల్ల అన్నదాతలు నిరాశా నిస్పృహలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వచ్చే ఐదేళ్ళలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ పదే పదే ప్రకటిస్తున్నా కేంద్రం ఆ దిశగా నిర్దిష్ట చర్యలు తీసుకోకుంటే కాడి - మేడి కింద పడేసి పట్టణాలకు కూలీలుగా వలస వెళ్ళే రైతుల సంఖ్య మరింత పెరగడం ఖాయం. ప్రధాని కృషి సంచాయి యోజన దేశంలో ఏకీకృత మార్కెట్ ఇ-నామ్ అమలు అంతంతే. దేశంలో సత్వర నీటిపారుదల పథకం (ఎఐబిపి) పథకం కింద చేర్చిన 89 ప్రాజెక్టులలో 23 ప్రాజెక్టులను రెండేళ్ళ క్రితమే పూర్తి చేస్తామని ఆర్థికమంత్రి ఆరంభంలో ప్రకటించినా అవి నేటికీ నత్తనడకన సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం, తెలంగాణాలో కాళేశ్వరం వంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు కేంద్రం భారీ సాయం అవసరం. దేశంలో సాగు యోగ్యమైన 16 కోట్ల హెక్టార్లలో కేవలం 41 శాతం భూమికే (6.5 కోట్ల హెక్టార్లు) సాగునీటి సౌకర్యముంది. అందులో కూడా సాగుకంటే వృధా అయ్యే నీరే అధికం. అందువల్ల ప్రతినీటి బొట్టుకూ అధిక పంటనిచ్చే సూక్ష్మసాగును ప్రోత్సహించాలి.

దేశ ప్రగతి సేద్యం అనుబంధ పాడి, మత్స్య, చేనేత రంగాలపైనే అధికంగా ఆధారపడివుంది.ఈ రంగాలకు నూతనోత్తేజం కల్పించేలా బడ్జెట్ వుండాలి. సేవా, తయారీ, సూక్ష్మ, చిన్న, మధ్య పరిశ్రమల పునరుద్ధరణకు, ప్రాధాన్యమివ్వాలి. గుజరాత్ ఎన్నికల సరళిని గుర్తించి ఈ రంగాలను ప్రోత్సహించకపోతే కమలనాధులకు దేశ ప్రజలు తగు గుణపాఠం నేర్పడం తథ్యం.

● పతకమూరు దామోదర్ ప్రసాద్, 9440990381

నేటి నుంచి శారదా పీఠం

వార్షికోత్సవాలు



విశాఖఎడ్యుకేషన్, ప్రభన్యూస్: విశాఖ శ్రీ శార దా పీఠాధిపతులు స్వరూ పానందేంద్ర సరస్వతీ మహా స్వామి ఆధ్వర్యంలో 24 నుంచి 27 వరకూ శార దాపీఠం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించను న్నట్లు స్వరూ పానందేంద్ర సరస్వతీ మహాస్వామి తెలి పారు. 24 ఉదయం 8 గం టల 30 నిమిషాలకు గణప తి పూజ, పుణ్యాహ వాచన, పంచగ వ్యప్రాసన, దీక్షాధా రణతో ప్రారంభమయి ఈ వేడుకల్లో తొలిరోజు అగ్నిమధనం, మహాగణపతి హోమంతో ప్రారంభమవుతాయని తెలిపారు. కృష్ణయజుర్వేద సంహితయాగం తోపాటు శ్రౌత సభలు ప్రారంభమవుతుందన్నారు. విద్యా, వ్యాపారవృద్ధి కోసం లక్ష్మిగణపతి హోమం జరుగుతుందని తెలిపారు. యజుర్వేద సంహితయాగం, వనదుర్గా మహాయాగం జురుగుతాయన్నారు. గురువారం మేధాదక్షిణామూర్తికి పంచామృతాభిషేకాలు, చతుర్వేదసంహితయాగం, స్కంధయాగం నిరాజన మంత్ర పుష్పాల సమర్పణ ఉంటుందని చెప్పారు. మన్యుసూక్త హోమం జరుగు తుందని చెప్పారు. శుక్రవారం శ్రీ వల్లీ దేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి, వపనదుర్గకు పంచామృతాభిషేకాలు, వివాహ, సంతాన ప్రాప్తికి సుబ్రహ్మణ్య హోమం నిర్వహిస్తామన్నారు.

ఐశ్వర్యం భోగప్రాప్తికి రుద్రహోమం జరుగుతుం దన్నారు. శుక్రవారం 26 సాయంత్రం 5 గంటలకు వల్లీదేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామికి రథోత్సవం అనంతరం కళ్యాణం జరుగుతుందన్నారు. శనివారం శారదామాతకు పంచామృతాభిషేకం జరుగుతాయన్నారు. 27న ముగింపు సందర్భంగా ఉత్సవాలల్లో పాల్గొనే పండితులను విశాఖ శ్రీ శారధా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి చేతులు మీదుగా ఘనంగా సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. వేద విద్యార్థులకు ఉపకార వేతనాలు వితరణ జరుగుతుందని తెలిపారు. ఈ వార్షికోత్సవాలకు దేశం నలు మూలల నుంచి నిష్ణాతులైన వేదపండితులు, ప్రముఖులు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 6 గంటలకు 24, 25న శాస్త్రీయ సంగీతం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 26వ తేదీ సాయంత్రం వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యశ్వేరస్వామి రథోత్సవం, తారకాసుర వధ విశేషంగా జరుగుతుందన్నారు.

27,29న పర్యావరణ విద్యపై పరీక్షలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంట ర్మీడియట్ ఆధ్వర్యంలో నైతిక, మానవ విలువలు, పర్యావరణ విద్యపై మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 27, 29 తేదీల్లో ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. 2006 సంవత్సరంలో నైతిక, మానవ విలువలు, 2014 సంవత్సరంలో పర్యావరణ విద్యపై పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మాత్రమే ఇంటర్ ఉత్తీర్ణత హాజరు సర్టిఫికెట్‌ను ఇస్తున్నామన్నారు. గతంలో జరిగిన పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు పాత హాల్ టికెట్‌తోనే ఈ పరీక్షలకు హాజరుకావాలన్నారు.

పోలీసుశాఖ పరువు తీశారు

ఇద్దరూ సస్పెండ్ అయ్యారు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాసలీలల వ్యవహారంలో ఏసీబీ ఏఎస్పీ సునీతారెడ్డి, కల్వకుర్తి సీఐ మల్లికార్జునరెడ్డిలు సస్పెండ్ అయ్యారు. తన వివాదాస్పద వ్యవహార సరళితో పోలీసు శాఖ పరువు తీసిందనే ఆరోపణలపై ఏసీబీ అడిషినల్ ఎస్పీ సునీతారెడ్డిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీబీలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఏఎస్పీతో అక్రమ సంబంధం పెట్టుకుని, సోమవారం ఆమె భర్తకు అడ్డంగా దొరికిపోయాడు కల్వకుర్తి సీఐ మల్లికార్జునరెడ్డి. ఏఎస్పీ భర్త ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రాథమిక విచారణ అనంతరం, మల్లి కార్జునరెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు ఏఎస్పీ స్టేట్‌మెం ట్‌ను కూడా కేపీహెచ్‌బీ పోలీసులు రికార్డు చేశారు. ఆమె తన ఇష్టపూర్వకంగానే సీఐతో ఉన్నట్లు తెలియజేసిందని పోలీసు వర్గాల సమాచారం. కాగా, ఆమెను తాను వివాహం చేసుకోవాలని భావిస్తున్నాని, విడాకులు వచ్చిన తర్వాత పెళ్లి చేసు కుంటామని ఉన్నతాధికారుల ముందు మల్లికార్జునరెడ్డి వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది.

నా భార్యను క్షమించి తప్పుచేశా : సునీత భర్త సురేందర్‌రెడ్డి

ఏసీబీ ఏఎస్పీపై భర్త సురేందర్‌రెడ్డి మంగళవారం సంచలన ఆరోపణలు చేశారు. తన భార్యతో సీఐకి 2016 నుంచి సంబంధం ఉందని చెప్పారు. పెద్దల సమక్షంలో రాజీకి వచ్చినా తన భార్య తనను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్యను క్షమించడమే తాను చేసిన నేరం అన్నారు. ఇద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంతకుముందు తమ మధ్య గొడవ ఉన్నప్పటికీ తాము రాజీకి వచ్చామని, కానీ తన భార్య తనను మళ్లీ మోసం చేసిందని వాపోయారు.

ఒటుకు నోటు కేసు దర్యాప్తునాటి బంధం

ఏసీబీలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఏఎస్పీతో కల్వకుర్తి సీఐకి మధ్య బంధం బలపడేందుకు రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు కారణమైనట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తు బాధ్యతల్లో ఉండగా సునీతారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డిలు వ్యక్తిగత విషయాలను మాట్లాడుకునేవారు. ఈ సమయంలోనే వారి మధ్య సాన్నిహిత్యం పెరిగి తన భర్తతో కలిసి ఉండలేనని సునీత, తను భార్యతో సఖ్యంగా లేనని మల్లిఖార్జున్‌రెడ్డిలు ఒకరితో ఒకరు చెప్పు కున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ పెళ్లి చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న మల్లికార్జున్‌రెడ్డిని ఏసీబీ నుంచి బదిలీ చేశారు. అయినప్పటికీ వారి మధ్య సాన్నిహిత్యం మాత్రం తగ్గలేదని తెలుస్తోంది. వివాదం రేగిన అనంతరం మల్లికార్జునరెడ్డి వివరణ పేరుతో వాట్సాప్‌లో ఒక సందేశం చక్కర్లు కొడుతోంది.

ఘటన పూర్వాపరాలు..

ఓ ఇన్‌స్పెక్టర్.. అర్ధరాత్రి ఓ మహిళా ఎఎస్పీ ఇంట్లో నుంచి వస్తుండగా ఆమె భర్త మాటు వేసి పట్టుకున్న విషయం తెలిసిందే. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇది జరిగిది. ఏసీబీలో ఏఎస్పీ హోదాలో పనిచేస్తున్న మహిళా అధికారి 2007లో గ్రూప్ 1 అధికారిగా పోలీస్‌శాఖలో చేరారు. 2010లో ఆమెకు సురేందర్‌రెడ్డితో పెళ్లయింది. ప్రస్తుతం భార్యాభర్తలు హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్నారు. ఇటీవల తన భార్య ఫోన్లో అనుమానాస్పద మెసేజ్‌లు గమనించిన భర్త సురేందర్‌రెడ్డి ఆమెను అనుమానించాడు. సీఐ ఆ సందేశాలు పంపించాడు.గతంలోనూ ఇదే సీఐ విషయంలో వారికి విభేదాలు వచ్చాయి. ఈ సందేశాల నేపథ్యంలో పాత సంబంధాలు కొనసాగుతున్నాయని నిర్ధారణకు వచ్చారు. సురేందర్‌రెడ్డి వారి కదలికలపై నిఘా వేశాడు. సురేందర్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఎగుమతుల వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపార రీత్యా లండన్ వెళ్లి రెండు రోజుల క్రితం తిరిగి వచ్చినా ఆ విషయాన్ని భార్యకు తెలియనివ్వలేదు. అదే సమయంలో సీఐ ఉప్పల్‌లోని ఆయన ఇంటికి కాకుండా.. తన ఇంటికి వచ్చినట్లు గుర్తించాడు. తన అమ్మ, అత్త(ఏఎస్పీ తల్లి)తో కలిసి అపార్టుమెంట్ వద్ద మాటు వేశాడు. రాత్రి రెండు గంటలకు సీఐ ఫ్లాట్ నుంచి వస్తుండగా పట్టుకున్నాడు. సీఐ అతనిని నెట్టివేస్తూ పరుగెత్తే ప్రయత్నం చేశాడు. కానీ, అత్త, తల్లి అతనిపై దాడికి దిగారు. వెంటపడి మరీ చెప్పులతో దేహశుద్ధి చేశారు.

ఆరు నెలల కాల్‌డేటా పరిశీలన...

మరోవైపు ఏసీబీ ఎఎస్పీ, సీఐ కేసులో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. సునీత నివాసం ఉండే ఇందు ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీకెమెరా పుటేజీలో వీరిద్దరి దృశ్యాలు లభ్యమయ్యాయి. గత నెల రోజులుగా వీరి రాకపోకలు పరిశీలించారు. సునీత ఇంటికి ఏయే సమయాల్లో, ఎన్నిసార్లు మల్లికార్జున్ వచ్చాడన్న వివరాలను పోలీసులు సేకరించారు. దీనికితోడు సునీత, మల్లికార్జున్‌ల ఆరు నెలల కాల్‌డేటాను పోలీసులు తెప్పిస్తున్నారు.

ఆ నలుగురి స్టేట్‌మెంట్లు రికార్డ్ చేశారు...

మరోవైపు ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు నలుగురి స్టేట్‌మెంట్లను పోలీసులు రికార్డ్ చేశారు. సునీత భర్త సురేందర్‌రెడ్డి, ఆమె తల్లి ప్రవల్లిక, పెద్దమ్మ, సురేందర్‌రెడ్డి స్నేహితుడి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు.

ఏసీబీ ఏఎస్పీ సునీతారెడ్డి స్టేట్‌మెంట్ రికార్డ్, సీఐని ప్రశ్నించిన పోలీసులు

రాసలీలల వ్యవహారంపై ఏసీబీ ఏఎస్పీ ఇంటికి కేపీహెచ్‌బీ పోలీసులు మంగ ళవారం వెళ్లారు. ఆ తర్వాత సీఐని ప్రశ్నించారు. దీనిపై ఐజీ స్టీఫెన్ రవీంద్ర.. డీజీపీకీ నివేదిక ఇచ్చినట్లు సమాచారం. కాగా, పోలీసు శాఖలో మరోసారి అనైతిక వ్యవహారం రచ్చకెక్కిన విషయం తెలిసిందే. గతంలో ఆబిడ్స్‌లోని ఓ హోటల్ ఇన్‌స్పెక్టర్, మహిళా ఎస్సై ఒకే గదిలో ఉండగా ఆమె భర్త పట్టుకున్నారు. ఇప్పుడు హైదరాబాద్‌లో మరో సీఐ బాగోతం వెలుగుచూడటం కలకలం రేపుతోంది.

మంద కృష్ణకు బెయిల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షు డు మందకృష్ణ మాదిగకు బెయిల్ మంజూరైంది. ఆయనకు కొన్ని షరతులతో కూడిన బెయిల్‌ను సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు మంగళవారం మంజూరు చేసింది. ఈ నెల 2న చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసులో భాగంగా న్యాయమూర్తి షర తులతో కూడిన బెయిల్ మంజూరు చేవారు. పోలీసుల అనుమతి లేకుండా ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఉపవాసదీ క్ష చేసినందుకు, ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేసినందుకు ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదైన సంగతి విదితమే.

కేసీఆర్ ఓ నియంతలా వ్యవహరిస్తున్నారు

రాజ్యాంగ బద్ధంగా, శాంతియుతంగా ఎస్సీ వర్గీకరణ కోసం నిరసన చేస్తే తనను సిఎం కేసీఆర్ అకారణంగా జైల్లో పెట్టడం అప్రజాస్వామికమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు.

మంగళవారం చంచల్‌గూడా జైల్ నుంచి విడుదల అయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో కేసీఆర్ అహంకార ధోరణితో ఓ నియంతలా వ్యవహరించడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు.

గజల్ బెయిల్ వాయిదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : లైంగిక వేధింపుల కేసులో గాయకుడు గజల్ శ్రీనివాస్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణను నాంపల్లి కోర్టు నేటికి వాయిదా వేసింది. బెయిల్ మంజూరు చేయాలని గజల్ తరపు లాయర్ ఈ నెల 12న కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. గజల్ శ్రీనివాస్ 20 రోజులకు పైగా జైలులో ఉన్నారని, ఇప్పటికైనా బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు పిటిషన్ విచారణ నిర్ణయాన్ని నేటికి వాయిదా వేసింది.

ఆర్టీసీ ఎంప్లాయిస్ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టిఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి చాడా వెంకటరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఎంప్లాయిస్‌కు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికులు ప్రజా రవాణా రంగంలో మేరుగైన సేవలందిస్తునే తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించవలసి ఉందన్నారు. కార్మిక చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కండక్టర్ల ఉద్యోగ భద్రత, ప్రమాదరహితంగా వాహనాలు నడిపించడంలో డ్రైవర్లు సుశిక్షితులు కావడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించవలసి ఉందన్నారు. ఆర్టీసీ కార్మికుల వేతన సవరణలో తీవ్రమైన జాప్యం జరుగుతుందని చాడా వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు యూనిఫామ్ కూడా ఇవ్వలేని పరిస్ధితి దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె. రాజిరెడ్డి, కె, భాస్కర్ రావు పాల్గొన్నారు.

హజ్ కమిటీలో ఇద్దరు కొత్త సభ్యులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ హజ్ కమిటీలో ప్రభుత్వం ఇద్దరికి కొత్తగా స్దానం కల్పించింది. ప్రభుత్వం నియమించిన సత్తార్ గుల్షానీ రాజీనామా చేయడంతో కమిటీని పునర్వ్యవస్దీకరించడం జరిగింది. ఆయన స్దానంలో షమీమా ఆగా, డాక్టర్, అఖీల్ హష్మిలను నియమించింది. ఈ మేరకు మంగళవారం మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి దానకిషోర్ అధికారిక ఉత్తర్వులు వెలువరించారు. సభ్యులు మూడేళ్ల పాటు పదవిలో ఉంటారు.

రోడ్ల నిర్మాణానికి రూ.2.10 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : షాద్‌నగర్ శాసనసభ నియోజక వర్గంలో రోడ్ల నిర్మాణం కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి నుండి ప్రభుత్వం రూ. 2.10 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ఆర్ధికశాఖ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. స్దానిక శాసనసభ్యుడు చేసిన విజ్ఞప్తి మేరకు గ్రామ పంచాయతీలు, తండాలు, ఆవాసాల, మండల కేంద్రాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు నిధుల మంజూరుకు అనుమతించడం జరిగిందన్నారు.

78 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రయాణికుల రద్దీ పెరగడంతో వివిధ ప్రాంతాల నుండి 78 వీక్లీ ప్రత్యేక రైళ్లు నడిపించడానికి దక్షిణ మధ్య రైల్వే సిద్దమైంది. ఈ రైళ్లలో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేస్తారు. పుదుచ్చేరి - సాంత్రాగచ్చి (కోల్‌కత్త), చెన్నై - సాంత్రాగచ్చి మధ్యన ఈ ప్రత్యేక వీక్లీ రైళ్లను వేసవి కాలంలో నడిపించబోతున్నారు. రిజర్వేషన్ ప్రక్రియ వెంటనే ప్రారంభమైందని కూడా పేర్కొన్నారు. పుదుచ్చేరి - సాంత్రాగచ్చి - పుదిచ్చేరి మధ్యన 26 ప్రత్యేక రైళ్లను ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో నడిపించబోతున్నారు. అదే విధంగా చెన్నై సెంట్రల్ నుండి సాంత్రాగచ్చి మధ్యన మరో 26 రైళ్లను ఏప్రిల్, మే, జూన్‌లో నడిపించడానికి ప్రణాళిక సిద్దం చేశారు. విజయవాడ మీదుగా సాంత్రాగచ్చి నుండి చెన్నై సెంట్రల్ వరకు 26 రైళ్లను నడిపించడం జరుగుతుంది.

కర్నూలు డీఎఫ్‌వో రాసలీలలు



కర్నూలు క్రైం, ప్రభ న్యూస్: అటవీ సంపదను కాపా డాల్సిన అటవీశాఖ నిఘా అధికారి నీతిమాలిన పనికి దిగారు. మహిళతో రాసలీలలు కొనసాగిస్తూ అడ్డంగా పోలీసులకు దొరికిపోయిన సంఘటన కర్నూలు జిల్లాలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నా యి. కర్నూలు డివిజన్ ఫారెస్టు నిఘా అధికారి వెంకటేశ్వరరావు గత కొంత కాలం నుండి మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించేవారు. కార్యాలయంలో కూడా కొంతమంది మహిళలను అసభ్యకర మాటలతో వేధింపులకు దిగేవారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి పట్టణ శివారు సమీపంలోని మాసామసీదు వద్ద ఒక ఇంటిలో మహిళతో రాసలీలలు కొనసాగిస్తున్న విషయం బయటపడింది. సమాచారం అందుకున్న విద్యార్థి సంఘాల నేతలు తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటి బయట తాళం వేసి డీఎఫ్‌వో లోపల మహిళతో రాసలీలలు కొనసాగిస్తున్న వీడియోలు కూడా చిత్రీకరించారు. పోలీసులు రూం తాళం తెరిచి రెడ్‌హ్యాండెడ్‌గా రాసలీలలు కొనసాగిస్తున్న డీఎఫ్‌వో వెంకటేశ్వరరావును సంబంధిత మహిళను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం పోలీసుస్టేషన్‌కు తరలించారు. డీఎఫ్‌వో నిఘా అధికారి వెంకటేశ్వరరావు రాసలీలలు వ్యవహారం బయటకు పొక్కడంతో సోషల్ మీడియాలో హల్‌చల్ అయింది. వెంటనే అటవీశాఖ ఉన్నతాధికారులు కూడా స్పందించారు. వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసేందుకు రంగం సిద్దం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా వెంకటేశ్వరరావుపై అటు వారి కుటుంబ సభ్యుల నుండి కానీ, ఇటు రాసలీలలు కొనసాగించిన మహిళ నుండి కానీ ఎలాంటి ఫిర్యాదులు పోలీసులకు అందకపోవడంతో వారిని వదిలివేశారు. తదుపరి విచారణ నిమిత్తం చర్యలు తీసుకుంటామని తాలుకా పోలీసుస్టేషన్ ఎస్సై గిరిబాబు తెలిపారు. ఇదిలా వుండగా వెంకటేశ్వరరావు రాసలీలలు కొనసాగించిన మహిళతో గత కొద్దికాలం నుండి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు సమాచారం. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఈ మహిళ గత మూడు సంవత్సరాల క్రితం కర్నూలులోనే ఈయన నివాసంలో వంటమనిషిగా పనిచేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వారిద్దరి మధ్య వివాహేతర సంబంధానికి పరిస్థితులు దారితీస్తున్నట్లు సమాచారం. డిఎఫ్‌వో రాసలీలల వ్యవహారం హల్‌ఛల్ చేయడంతో అటవీశాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. వెంకటేశ్వరరావుపై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్దమవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కావాలనే కొం తమంది గిట్టనివారు అటవీశాఖ నిఘా అధికారి వెంకటేశ్వరరావును ఈ సంఘటనలో ఇరికించే కుట్రకు పాల్పడ్డారని కొంతమంది అటవీశాఖ సిబ్బంది చెబుతున్నారు. విద్యాసంఘాల నాయకులు మాత్రం వెంకటేశ్వరరావును సస్పెండ్ చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

సీబీఐ కస్టడీకి లియోనియో రిసార్ట్ ఎండీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నకిలీ డాక్యుమెంట్లను సమర్పించి 11 జాతీ య బ్యాంకులను మోసం చేశారన్న అభియోగంపై అరెస్టైన లియోనియో రిసార్ట్ ఎండి చక్రవర్తిరాజును సిబిఐ మూడు రోజుల కస్టడీకి తీసుకుంది. నాలుగు రోజుల క్రితం చక్ర వర్తిరాజును సిబిఐ అరెస్టు చేసిన విష యం తెలిసిందే. కేవలం 30 ఎకరాల భూమిని కలిగి ఉన్న చక్రవర్తి రాజు 610 ఎకరాల భూమి ఉన్నట్లు బ్యాంకులకు నకిలీ డాక్యుమెంట్లను సమర్పించి భారీ ఎత్తున రుణం తీసు కున్నారు. రుణం చెల్లించక పోవ డంతో అనుమానం వచ్చిన బ్యాంక్ యాజమాన్యాలు డాక్యుమెంట్లను పరిశీలించగా నకిలీవని తేలడంతో సిబిఐకి ఫిర్యాదు చేయడం, కేసు నమోదు చేసుకున్న సిబిఐ ప్రాథమిక నేర నిర్ధారణను గుర్తించి అరెస్టు చేశారు. బ్యాంక్ మేనేజర్లు, ఫీల్డ్ సిబ్బందితో కలిసి చక్రవర్తిరాజు ఈ మోసానికి పాల్పడ్డట్లు సిబిఐ గుర్తిం చింది. ఈ వివరాలన్నింటినీ రాబట్టేం దుకు కస్టడీకి ఇవ్వాలని ప్రత్యేక కోర్టు లో పిటిషన్ వేయగా న్యాయస్థానం మూడు రోజుల కస్టడీకి అను మతించింది. దీంతో చక్రవర్తిరాజును అధికారులు చంచల్‌గూడ జైలు నుంచి మంగళవారం తమ కస్టడీకి తీసుకున్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అఖిల భారత యువజన సంఘం (ఏఐవైఎఫ్) రాష్ట్ర నూతన కమిటిని మంగ ళవారం ఎన్నుకున్నారు. రా ష్ట్ర అధ్యక్షులుగా సిద్దినేని కరు ణాకర్, ప్రధాన కార్యదర్శిగా మారుపాక అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పంజాల శ్రీనివాస్, నెర్లకంటి శరత్ తదితరులు ఎన్నికయ్యారు

అధికారంలోకి వస్తే...

యాదవ కార్పొరేషన్:జగన్

నెల్లూరు, ప్రభన్యూస్ బ్యూరో: తెలుగుదేశం ప్రభుత్వంలో యాదవులకు భద్రత లేకుండా పోతోంది... వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వహయాంలో వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపడానికి ఆయన ఎంతో కృషిచేశారు. అయితే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యాదవులకు భరోసా భద్రత కల్పించడంతో పాటు రాష్ట్రంలో యాదవ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు.

ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ఆయన మంగళవారం చిత్తూరుజిల్లా పాదయాత్రను ముగించుకుని ఉదయం 10.45 గంటలకు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలోకి అడుగుపెట్టారు. పెళ్ళకూరు మండలం ప ునబాక గ్రామ సరిహద్దు వద్ద జిల్లా నేతలు జగన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేరళ మంగళ వాయిద్యాలతో భారీ జనసమీకరణతో ఆయనకు వైకాపా శ్రేణులు బ్రహ్మరధం పట్టాయి. అక్కడినుండి ఆయన తన పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం పునబాక కండ్రిగకు చేరుకుని ఆ ప్రాంత మహిళలతో ముఖాముఖిగా మాట్లాడారు. అనంతరం ఆర్లపాడు క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకుని అఖిలభారత యాదవసంఘం నాయకులతో సమావేశమయ్యారు. కొంతసేపు వారి సమస్యలను విన్న జగన్ అదే ప్రాంతంలో తన పాదయాత్రను కొనసాగిస్తూ యాదవులనుద్దేశించి మాట్లాడారు. గతంలో యాదవుల జీవితాలకు ఎంతో భద్రత భరోసా ఉండేదని, ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వారికి భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే వారిని అన్నిరకాల ఆదుకోవడంతో పాటు వారికోసం ప్రత్యేక యాదవ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి వారిని ఆర్ధికంగా మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయన కండ్రిగవద్ద మహిళలతో ముఖాముఖిగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నా రని, గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఆయన సాధించిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. వైకాపా అధికారంలోకి వస్తే మహిళలకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు 45 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ వృద్ధాప్య పింఛన్ రూ.2 వేలు వంతున అందిస్తామన్నారు. అలాగే పొదుపుసంఘాల రుణాలన్నింటినీ మాఫీ చేస్తానన్నారు.


ఆక్టోపస్ మాక్ డ్రిల్‌లో అపశ్రుతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పోలీసు శాఖలో అత్యంత కీలకమైన విభాగం ఆక్టో పస్ నిర్వహించిన మాక్ డ్రిల్‌లో అపశృతి చోటు చేసుకుంది. ఆదిబట్ల ప్రాంతంలో ఆక్టోపస్ సిబ్బంది మంగళవారం మాక్ డ్రిల్‌ను నిర్వహించింది. విపత్కర పరిస్థితులలో శత్రువును ఎలా మట్టుబెట్టొచ్చు, శత్రువుల చేతిలో బంధీలుగా ఉన్న వారిని ఎలా సురక్షితంగా కాపాడవచ్చు అనే అంశాలతో ఆక్టోపస్ వరదలు, అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తులలో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రత్యేక తర్ఫీదును ఇస్తుంది. ఇందులో భాగంగా శిక్షణా తీరును పరిశీలించి ఫలితాలను అంచనా వేసేందుకు ఆదిబట్ల ప్రాంతంలో మాక్ డ్రిల్‌ను చేపట్టారు. ఈ డ్రిల్‌లో ఎదురెదురుగా వస్తున్న బస్సు, కారు ఢీ కొనడంతో అయిదుగురు సిబ్బంది గా యాల పాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు క్షతగాత్రులను ఎల్‌బి నగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో సురేష్, లక్పతి, రాహుల్, భవానిసింగ్, చెన్న కేశవరెడ్డి, శేఖర్ అని తెలిసింది. ఆస్పత్రిలో చేరిన వారి లో లక్పతి పరిస్థితి విషమంగా ఉందని, అతడికి వెంటిలేషన్‌పై చికిత్స అంది స్తు న్నా మని, చెన్న కేశవ్‌కు శస్త్ర చికిత్స చేయడం జరిగిందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

స్టార్టప్‌లకు ఆధునిక టెక్నాలజీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఫేస్‌బుక్ భాగస్వామ్యంతో టి-హబ్ ఏఆర్, వీఆర్ టెక్నాలజీని మరింత అందుబాటులోకి తేనున్నాయి. ఈ రెండు సంస్థలు కలిసి ఇండి యా ఇన్నోవేషన్ హబ్ యాక్సలేటర్ ప్రోగ్రామ్‌ను మంగళవారం ఆవి ష్కరించాయి. ఏఆర్, వీఆర్ స్టార్టప్‌ల కోసం పనిచేస్తున్నాయని, ఇవి ఫేస్‌బుక్‌తో ఒప్పందం చేసుకోవడంతో స్టార్టప్‌లకు అత్యాధునిక టెక్నాలజీ అందుతుందని టి-హబ్ సీఈవో జై కృష్ణన్ చెప్పారు. ఈ మేరకు ఫేస్‌బుక్ ప్రతినిధి సత్య, జై కృష్ణన్ అవగాహన పత్రాలను మార్చుకున్నారు.

ఎన్‌టీఆర్ భవన్‌లో లోకేష్ జన్మదిన వేడుకలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ఐటిశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి కన్వీనర్ నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని ఎన్‌టిఆర్ భవన్‌లో ఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. లోకేష్ శత వసంతాలు సుఖసంతోషాలతో జీవించాలని భగవంతున్ని ప్రార్థించారు. తెలంగాణ పార్టీ శ్రేణుల తరఫున ఆయనకు జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ తెలంగాణ నాయకులు ఎల్.రమణ, రావుల చంద్రశేఖరరెడ్డి, బుచ్చిలింగం తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీని ముట్టడిస్తాం



నిరుద్యోగ గర్జనలో ఆర్ కృష్ణయ్య

నల్గొండ (టౌన్), ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకపోతే వచ్చే అసెంబ్లీ సమా వేశాల్లో అసెంబ్లీ ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చ రించారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని బండారు గార్డెన్‌లో నిరుద్యోగ యువ గర్జనలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం అంటూ తెలంగాణ ఉద్యమ నాయకులు ఎన్నికల ముందు ఊరూ..వాడా ఊదరగొట్టారు. రాష్ట్రం వచ్చి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగాలు భర్తీ చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని 1200 మంది యువకులు, విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకుంటే కనీసం 12మందికి కూడా ఉద్యోగాలు ఇచ్చిన పాపాన కేసీఆర్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రాజకీయ పదవులతో కేసీఆర్ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను సంతోషపెడుతున్నారని అన్నారు. పది జిల్లాలు ఉన్న తెలంగాణను 31జిల్లాలుగా విభజించినా అట్టి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు లేక పరిపాలన స్తంభించి పోయిందని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్రయువజన సంఘం అధ్యక్షులు నీలా వెంకటేష్, రాష్ట్రప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొల్లం మల్లయ్య యాదవ్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు ప ల్లెబోయిన శ్యామ్‌సుందర్, బీసీ సంఘం మహిళా నాయకురాలు మామిడి పద్మ, విద్యార్థి సంఘం అధ్యక్షులు జిల్లేపల్లి ఆంజనేయులు, అయితగోని జనార్ధన్‌గౌడ్‌లు ఉన్నారు.

'కేసీఆర్, చంద్రబాబు తొత్తుగా పవన్'



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జనసేన అధి నేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ నేత లు మూకుమ్మడి దాడి మొదలు పెట్టారు. మ రో వైపు టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ కూడా పవన్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆయన గురిం చి మాట్లాడి తన స్థాయిని తగ్గించుకోనని అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి కితాబిచ్చే విధంగా పవన్ మాట్లాడటంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులతో పవన్ కల్యాణ్ సర్దుబాటు చేసుకుని.. యాత్రలు చేస్తున్నాడని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు ఆరోపించారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన వారిని ప్రజల్లోకి వెళ్లనీయకుండా.. రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన పవన్ యాత్రలకు ప్రభుత్వం అనుమతివ్వడంలో ఆంతర్యమేమిటని వీహెచ్ ప్రశ్నిం చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, టీజేఏసీ చైర్మన్ కోదండరామ్‌లు తెలంగాణ ద్రోహులా..? అంటూ ఆయన నిలదీశారు. తెలం గాణాలో అంతా బాగుంటే పవన్ యాత్ర ఎందుక ు చేస్తున్నారో చెప్పాలని వీహెచ్ డిమాండ్ చేశారు. పవన్ తనతో వస్తే తెలంగాణాలో సమస్యలను చూపిస్తానని అన్నారు. ఇసుక మాఫియా, మిర్చి రైతులకు సంకెళ్లు, దళితులపై దాడులు, రైతుల ఆత్మహత్యలు, ధర్నాచౌక్ ఎత్తివేత పవన్‌కు కనిపించడం లేదా..? మండిపడ్డారు. పవన్ రాజకీయ నాయ కుడు కాదని, ఆయనకు దళితులంటే తెలియదన్నారు. తెలంగాణలో నియంత పాలన సాగుతుంటే పవన్ ఎలా మెచ్చుకుంటారని ఆయన ప్రశ్నించారు. పవన్‌కు దమ్ముంటే ఆంధ్రలో తిరగాలని వీహెచ్ సూచించారు. ఏపీలో ముద్రగడ పద్మనాభం పర్యటనకు టీడీపీ ప్రభుత్వం అనుమతివ్వని విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారులను పక్కకు నెట్టేసిన కేసీఆర్ ద్రోహులను పక్కన పెట్టుకుంటున్నారని కోదండరామ్ అన్నారు. ఇవన్ని ప్రజలు గమనిస్తున్నట్లు ఆయన తెలిపారు.

Andhraprabha business 2018

బిజినెస్

హెరిటేజ్ ఫుడ్స్ సీఎఫ్ఓకు

● ఐసీఏఐ అవార్డు

హైదరాబాద్ : హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌కు చెందిన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ప్రభాకరనాయుడికి 11వ ఐసీఏఐ అవార్డు 2017 (ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్ ఆఫ్ ఇండియా) నుంచి లభించినట్లు ప్రకటించింది. సీఏ- సీఎఫ్ఓ అద్భుతమైన ప్రతిభను.. వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో చూపించినందుకు ఆయన కేంద్ర వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభుత చేతుల మీదుగా జరవన్ని 19, 2018న ఈ జరనిగిన ఒక కార్యక్రమంలో అందుకున్నారు. కార్యక్రమానికి నీలేశ్ వికామ్‌సే, ప్రెసిడెంట్ ఐసీఏఐ, ఎన్‌డీ గుప్తా వైస్ ప్రెసిడెంట్ ఐసీఏఐలు పాల్గొన్నారు. ప్రతి ఏడాది ఐసీఏఐ సభ్యుల్లో ఆయా రంగాల్లో సాధించిన విజయాలకు గుర్తింపుగా ఈ అవార్డు ఇవ్వడం జరుగుతుంటుంది. ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును దృష్టిలో ఉంచుకొని వివిధరంగాల్లో పనిచేసే సీఎఫ్ఓలకు ఇది ప్రేరణగా ఉంటుందని ఐసీఏఐ భావిస్తోంది. అవార్డుపై బ్రహ్మణి నారా హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్పందిస్తూ.. ప్రతిష్టాత్మకమైన ఐసీఏఐ నుంచి లభించిన అవార్డుతో తమ యాజమాన్యంతో పాటుఉద్యోగుల్లో మనోధైర్యం మరింత పెరుగుతుందని ఆమె అన్నారు.



పెట్టుబడులకు... భారత్ స్వర్గధామం



● ఆకర్షణీయ దేశాల్లో 5వ స్థానం

● సీఈవోల సర్వేలో వెల్లడి



దావోస్ : పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన దేశాల్లో భారత్ ఐదవస్థానంలోనిలిచింది. వృద్ధిరేటులో ప్రపంచస్థాయిలో రికార్డుస్థాయికి చేరుకునే అవకాశం ఉందని పలువురు సీఈవోలు నిర్వహించిన సర్వేలో తేలిందని గ్లోబల్ కన్సెల్టెన్సీ పీడబ్ల్యుసీ మంగళవారం పేర్కొంది.తాజా సీఈవోల సర్వే ప్రధానమంత్రి నరేంద్రమోడీకి కొండంత బలాన్ని ఇస్తుంది. ఎందుకంటే ఆయన అంతర్జాతీయ ఇన్వెస్టర్లతో సోమవారం, మంగళవారం కలవనున్నారు. సీఈవోల సమావేశంలో ఆయన పెట్టుబడుల ఆకర్షించడానికి సీఈవో సర్వే నివేదిక బాగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం భారత్ ఆర్థిక వ్యవస్థ కొంత మందగమనంలో కొనసాగుతోంది. ముఖ్యంగా తయారీరంగం డీలాపడింది. దీంతో ఉద్యోగావకాశాలు సృష్టింలేకపోతోంది. ఈ సమావేశంలో మోడీ తనకు అనుకూలంగా చెప్పుకొనే అంశాల విషయానికి వస్తే గత కొన్ని సంవత్సరాల నుంచి పలు కీలకరంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు జోరందుకున్నాయని చెబుతారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి సగభాగంలో ఎఫ్‌డీఐ 17 శాతం పెరిగి 2500 కోట్ల డాలర్లకు చేరిందని.. ప్రైవేట్ పెట్టుబడులు మందగించినా.. ఎఫ్‌డీఐలో మాత్రం పెద్దమొత్తంలో వచ్చాయని,, 2016-17 ఆర్థికసంవత్సరంలో మొట్టమొదటిసారి దేశంలోకి 600 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. 2017లో చైనా ఎఫ్‌డీఐ 137 బిలియన్ డాలర్లతో పోల్చుకుంటే చాలా తక్కువే. కాగా చైనా ఎఫ్‌డీఐ మాత్రం సుమారు 8శాతం మాత్రమే పెరిగింది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ అమెరికా నెంబర్ వన్‌లో నిలవగా.. భారత్ మాత్రం 5స్థానంలో నిలిచింది. వచ్చే 12 నెలల కాలానికి చూస్తే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థతో పాటు వ్యాపారరంగాలు జోరందుకుంటాయన్న విశ్వాసాన్ని పీడబ్ల్యుసీ 21వ సీఈవో సర్వేలో పేర్కొంది. గ్లోబల్ సీఈవోలో 46 శాతం మంది పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన దేశం అమెరికా అని ముక్తకంఠంతో ఘోషించాయి. తర్వాతస్థానం చైనా 33 శాతం, జర్మనీ మూడవ స్థానంతో 20శాతం, నాలుగవ స్థానంలో బ్రిటన్ 15 శాతం మంది సీఈవోలుమొగ్గుచూపగా.. భారత్ ఐదవస్థానంతో 9 శాతం సీఈవోలు మొగ్గుచూపారు. జపాన్‌ను భారత్ వెనక్కి నెట్టింది. కేవలం 8శాతం మంది సీఈవోలు మద్దతు పలికారని నివేదికలో వివరించింది. పీడబ్ల్యుసీ ఇండియా చైర్మన్ శ్యామల్ ముఖర్జీ మాట్లాడుతూ... గత ఏడాది నుంచి భారత్ ఆర్థికవ్యవస్థ మెరుగుపడుతూ వస్తోంది. దీనికి ప్రభుత్వం నిర్మాణాత్మకమైన సంస్కరణలు తీసుకురావడమేనని తెలిపారు. తమ క్లయింట్లు చాలా మంది భారత్ వృద్ధిపట్ల నమ్మకంతో ఉన్నారని, దీంతో పాటు ప్రభుత్వం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్; తయారీరంగంతో పాటు నైపుణ్యంపై లెవనెత్తిన అంశాలపై ప్రభుత్వం స్పందిస్తోందని తెలిపారు. దీంతో పాటు కొత్త కొత్త



సమస్యలు తెర పైకి వస్తున్నాయన్నారు. వాటిలో ప్రధానంగా సైబర్‌సెక్యూరిటి, వాతావ రణంలో మార్పులు తదితర అంశాలపై తమ క్లయింట్లలో ఆందోళన వ్యక్తమవుతుందని పీడబ్ల్యుసీ నివేదికలో వివరించింది.54 శాతం మంది సీఈవోలు తమ సిబ్బంది పెంచుకుంటామని చెబుతుండగా. 18 శాతం సీఈవోలు సిబ్బందిని తగ్గించుకుంటామని చెప్పారు. ఏ రంగాలకు సిబ్బంది ఎక్కువగా డిమాండ్ ఉంటుందన్న అంశాల విషయానికి వస్తే హెల్త్‌కేర్‌లో 71 శాతం, టెక్నాలజీ రంగంలో 70 శాతం, బిజినెస్ సర్వీసెస్ 67 శాతం, కమ్యూనికేషన్స్ 60 శాతం, ఆతిథ్యం (హాస్పిటాలిటి, లీజర్) 59 శాతం గా ఉంటాయని సీఈవో నివేదికలో వివరించింది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గాడినపడుతుందన్న అంచనాతో పాటు 40శాతం మంది సీఈవోలు రాజకీయ అనిశ్చితపై, సైబర్ ముప్పు పట్ల ఆందోళన వ్యక్తంచేయగా.. 41 శాతం మంది టెర్రరిజం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. 38 శాతం మంది నైపుణ్యం కొరత లభించక సతమతమవుతున్నట్లు.. 35 శాతం మంది జనాకర్షకత పట్ల ఆందోళన వ్యక్తం చేయగా.. కరెన్సీ ఒడిదుడుకులపై 29శాతం మంది, వినియోగదారుల్లో మారుతున్న అభిరుచుల పట్ల 26శాతం మంది ఆందోళన వ్యక్తం చేసినట్లు సీఈవో సర్వేలో పేర్కొంది. ఆర్థికవ్యవస్థకు ముప్పు అంశాల్లో టెర్రరిజం టాప్ 10లో ఆక్రమించింది. గతేడాది టెర్రరిజం వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని 20 శాం మంది అభిప్రాయపడ్డారు. దీంతో పాటు విపరీతమైన నియంత్రణపై 42 శాతం మంది సీఈవోలు ఆందోళన వ్యక్తం చేయగా, 36 శాతం మంది పన్ను భారాలపై ఆందోళన వ్యక్తం చేశారు.కాగా పీడబ్ల్యుసీ మొత్తం 1293 సీఈవోలతో ఇంటర్వ్యూలు చేసింది. ఈ సర్వేలో ఆగస్టు నుంచి నవంబర్ 2017 వరకు మొత్తం 85 దేశాల్లో నిర్వహించింది.

సెన్సెక్స్ @ 36,000

● నిఫ్టీ 11,000 మార్కుకు ● కొనసాగుతున్న బుల్‌రన్‌ర్యాలీ

ముంబై : స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు సరికొత్త చరిత్రను సృష్టించాయి. వరుసగా ఐదో రోజు లాభాలతో దూసుకుపోవడమే కాకుండా బీఎస్ఈ మొట్టమొదటిసారి 36వేల మార్కును దాటిపోయింది. నిఫ్టీ 11,000 మార్కెట్‌ను దాటింది. బ్యాంకింగ్, లోహ, ఐటి, ఇన్‌ఫ్రా రంగానికి చెందిన షేర్లు భారీ కొనుగోళ్లు కనిపించాయి. మొత్తానికి మార్కెట్లో ర్యాలీ ఏర్పడ్డానికి ప్రధాన కారణం. అంతర్జాతీయ ద్రవ్యనిధి 2018-19 ఆర్థిక సంవత్సరంలో భారత జడీపీ 7.4 శాతానికి ఎగబాకుతుందని అంచనా వేయడమే కారణం. దీంతో ప్రపంచంలోనే భారత్ శరవేగంగా దూసుకుపోతున్న ఆర్థిక వవస్థగా నిలదొక్కుకుంటుందని అంచనా వేసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 36,139.96 మార్కును దాటిపోయింది. సుమారు 341.97 పాయింట్ల వరకు దాటిపోయింది. కాగా సోమవారం 35,798.01 మార్కును దాటిపోయింది. గత నాలుగు ట్రేగింగ్ సెషన్‌లలో సూచి 1,026.96 పాయింట్ల వరకు పెరిగింది.

ఇదిలా ఉండగా విదేశీ పోర్టు పోలియో ఇన్వెస్టర్లు నికరంగా రూ.1567.51 కోట్లుషేర్లు కొనుగోలు చేయ గా.. దేశీయసంస్థాగత మదుపరులు రూ.461.87 కోట్ల షేర్లు విక్రయించారని స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్ల విష యానికి వస్తే ఎస్‌బీఐ 3.48 శాతం, టాటాస్టీల్ 3.72 శాతం, ఓఎన్‌జీసీ 3.60 శాతం, ఐసీఐసీఐబ్యాంకు 3.06 శాతం, కోల్ ఇండియా 3.04 శాతం, ఇండస్ ఇండ్ బ్యాంకు 2.37 శాతం, ఇన్ఫోసిస్ 2.16 శాతం, డాక్టర్ రెడ్డీస్ 1.24శాతం, ఎంఅండ్ఎం 1.14 శాతం, రిల్ 1.08 శాతం, ఐటీసీ 1.08 శాతం, ఎస్ బ్యాంకు 1.01 శాతం, మారుతి సుజుకి 0.97 శాతం వరకు లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంకు 1.28 శాతం లాభంతో ముగిసింది. క్యూ3లో నికరలాభం 25.34 శాతం వృద్ధితో రూ. 726.44 కోట్లు ఆర్జించింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు మదుపరులను బాగా ఆకర్షిస్తున్నాయి. ఇక గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే లాభాలతోనే ముగిశాయి.



ఐటీ పరిమితిని రూ. 3 లక్షలకు పెంచండి

● ఎస్‌బీఐ నివేదిక

న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం ఏడవ వేతన కమిషన్ సిఫారసులను అమలు చేయడం వల్ల వ్యక్తిగత ఆదాయం బాగా పెరిగింది. దీంతో ఆదాయపు పన్ను రేటును రూ.50వేలు పెంచి రూ.3లక్షలకు పెంచాలని సోమవారం నాడు ఎస్‌బీఐ ఈకోవ్రాప్‌లో పేర్కొంది. ఆదాయపు పన్ను పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.2.50 లక్షల నుంచి రూ.3.00 లక్షలకు పెంచడం వల్ల సుమారు 75 లక్షల మందికి లబ్ది చేకూరుతుందని నివేదికలో పేర్కొంది. ఎస్‌బీఐ ఈకోవ్రాప్ నివేదికలోనే గృహ రుణాలపై వడ్డీ రాయితీని ప్రస్తుతం రూ.2లక్షల వరకు అనుమతిస్తున్నారని.. దీన్ని రూ.2.5 లక్షలకు పెంచాలని సూచించింది. దీంతో గృహ రుణాలు తీసుకున్న సుమారు 75 లక్షల మందికి లబ్ది చేకూరుతుంది. ప్రభుత్వంపై కేవలం రూ.7,500 భారం పడుతుందని స్పష్టం చేసింది. కాగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఐదవ, పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. కాగా ప్రభుత్వం ఆదాయపు పన్ను శ్లాబ్‌లను క్రమంగా పెంచుకుంటూపోతోంది. 1990లో రూ.22,000లనుంచి 2014-15 నాటికి రూ.2.5 లక్షల వరకు పెంచుకుంటూపోయింది. దీంతో పాటు బ్యాంకుల్లో పొదుపు డిపాజిట్లపై రాయితీలు ఇవ్వాలని సూచించింది. బ్యాంకుల్లో టెర్మ డిపాజిట్లపై టీడీఎస్ పరిమితిని ప్రస్తుం పరిమితి నుంచి రూ.10వేలకు పెంచాలని సూచించింది. అలాగే టాక్స్ సేవింగ్స్ టెర్మ్ డిపాజిట్లపై ప్రస్తుతం ఉన్న లాకిన్ పీరియడ్ 5 సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాలకు కుదించాలని సూచించింది. మొత్తానికి వచ్చే బడ్జెట్‌లో ప్రధానంగా వ్యయసాయం, ఎంఎస్ఎంఈ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, చౌకరకం గృహాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరింది.

బీజేపీ రాకతో పెట్రో మంట

న్యూఢిల్లీ : పెట్రోల్ ధరలు మంగళవారం నాడు దేశ రాజధానిలో తారాస్థాయికి చేరాయి. కేంద్రంలో భారతీయ జనతాపార్టీ 2014లో అధికారపగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి డిజెల్ ధర రికార్డుస్థాయిలో రూ.63.20 పలికింది. దీంతో చమురుమంత్రిత్వ శాఖ ప్రభుత్వాన్ని ఇంధనంపై సుంకం తగ్గించాలని కోరే పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీలో పెట్రోల్ లీటరు రూ.72.38కిచేరింది. మార్చి 2014 తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. ప్రభుత్వం పెట్రోల్, డిజిల్ ధరలను రోజువారి సవరించడం మొదలుపెట్టింది. కాగా డిసెంబర్ రెండవ వారం నుంచి పెట్రోల్ ధరలు రూ.3.31 వరకు పెరిగాయి. ముంబైలో పెట్రోలు ఏకంగా రూ.80 మార్కుకు చేరింది. దేశంలో ఎక్కడా ఈ స్థాయిలో పెట్రోల్ ధర లేదు. ముంబైలో డిజిల్ రూ.67.30కి పలుకుతోంది. దీనికి కారణంస్థానికపన్నులు లేదా వ్యాట్ అధికంగా ఉండటమేకారణం. డిసెంబర్ రెండవ వారం నుంచి డిజిల్ ధర లీటరు రూ.4.86 వరకు పెరగిందని చమురు కంపెనీలు చెబుతున్నాయి. ఇంతకు ముందు పెట్రోల్, డిజిల్ ధరలు పెరగడానికి ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడమే. 2018-19 బడ్జెట్‌లో చమురుపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని చమురు మంత్రిత్వశాఖ ఆర్థికమంత్రిత్వశాఖను కోరనుంది.

వాతావరణ మార్పిడిపై పోరాడుదాం

దావోస్: జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో కలిసి కట్టుగా అందరం కలిసి పెరిగి పోతున్న అసమానత, టెర్రరిజం, వాతావరణం మార్పిడి, వాణిజ్యపరమైన రక్షణాత్మకమైన ధోర ణిపై పోరాడుదామని స్విస్ ప్రెసిడెంట్ అలైన్ బర్సెట్ మంగళవారం పిలుపునిచ్చారు. జాతీయ, అంత ర్జాతీయ సంస్థల మధ్య భాగ స్వామ్యం తప్పనిసరి అని... ఒకరిపై ఒకరికి నమ్మకం తగ్గిపోతోందని.. రాజకీయంగా బలమైన నిర్ణయాలు తీసుకోకపోతే బలహీనమైన, పేదదేశాలు ఇబ్బందులు పడాల్సి వస్తు ందని ఆయన అన్నారు. తక్షణమే ఈ ముప్పు నుంచి గట్టెక్కాలంటే జాతీ య, అంతర్జాతీయ స్థాయిలో కలిసికట్టుగా బలమైన నిర్ణయాలు తీసుకో వాల్సిన అవసరం ఉందన్నారు. పిలుపునిచ్చారు.



ఇండిగో రిపబ్లిక్ డే సేల్

● ప్రారంభం ధర రూ. 797

న్యూఢిల్లీ : స్పైస్‌జెట్ తర్వాత ఇండిగో కూడా రిపబ్లిక్ డే సందర్భంగా డిస్కౌంట్ ఆఫర్లను ప్రకటించింది. అన్నీ చార్జీలు కలుపుకుని రూ.797కే టికెట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఆఫర్ జనవరి 22 నుంచి జనవరి 25 వరకు కొనసా గుతుంది. ప్రయాణ తేదీలను జనవరి 22 నుంచి ఏప్రిల్ 15లోగా ఉండేలా ప్రణా ళిక సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని కంపెనీ వెబ్‌సైట్‌లో వివరాలు ప్రకటించింది. పరిమిత కాలానికి ఉండే ఈ ఆఫర్ పరిమితి స్థాయిలో టిక్కెట్లు ఉన్నాయని తెలిపింది. అయితే ఈ స్కీంలో టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు టిక్కెట్లు రద్దు చేసుకుంటే కెన్సెలేషన్ రిఫండబుల్ ఉండదని, కేవలం చట్టబద్దంగా వసూలు చేసే పన్నులుమాత్రం రిఫండ్ ఇవ్వడం జరుగుతుందని వెబ్‌సైట్‌లో పేర్కొంది.



ఇండస్ట్రీ 4.0తో రిస్క్

● భావి భారత్‌కు ముప్పు ● సామాజిక ఉపద్రవాలు,ఆదాయంలోఅసమానత

● చైనా, దక్షిణాఫ్రికాలదీ ఇదే పరిస్థితి: డెలాయిట్ గ్లోబెల్

● దావోస్ ఆర్థిక సదస్సుకు పరిశోధక నివేదిక సమర్పణ



దావోస్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) లాంటి అత్యున్నత సాంకేతికతలను అందిపుచ్చుకోవడం వల్ల భారత్, దక్షిణాఫ్రికా, చైనా లాంటి దేశాలు భవి ష్యత్తులో సామాజిక ఉపద్ర వాలు, ఆదాయ అసమా నతలో పెంపుదలను ఎదుర్కోవాల్సి వస్తుందని డెలాయి ట్ గ్లోబల్ తన పరిశోధక నివేదికలో హెచ్చరిం చింది. ఎగ్జిక్యూటివ్‌లు ఇండస్ట్రీ 4.0 గా పిలిచే నాల్గవ పారిశ్రామిక విప్లవం నుంచి వచ్చే మార్పులును అర్థం చేసుకునే పరిస్థితిలో ఉన్నారు కానీ వాటి వల్ల తమకు ఎంతవరకు ప్రయోజనం లభిస్తు ందనే దానిపై అంత కచ్చితంగా లేరని సదరు నివేదిక పేర్కొంది. సోమవారంనాటి ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్)కు ఈ నివేదికను సమర్పించారు. ఇండస్ట్రీ 4.0 డిజిటల్ టెక్నాజీలను ప ుణి కిపుచ్చుకుంటుంది. సదరు సాంకేతి కత లలో ఎనలిటిక్స్, ఏఐ, కాగ్నిటివ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ అంశా లు(ఐఓటీ) లాంటివి ఉన్నాయి. ఇండస్ట్రీ 4.0 ఫలితంగా మూడు దేశాలు మరీ ము ఖ్యంగా భారత్(32 శాతం), దక్షిణాఫ్రికా(28 శాతం), చైనా(23 శాతం) సామాజిక ఉప్రదవాలు, ఆదాయ అసమానతలో పెంపుదలను ఎదుర్కోనున్నాయని డెలాయిట్ నివేదిక హెచ్చరించింది.

ఆర్థిక, రాజకీయ మార్పులతో సామాజిక చీలికలు

ఇటీవలి కాలంలో ఈ దేశాలు కీలకమైన ఆర్థిక లేదా రాజకీయ మార్పు లకు గురయ్యాయి. ఆ క్రమంలో కొన్ని సంద ర్భాల్లో అధిక వృద్ధి ఫలించినప్పటికీ, అవి గతంలో కనీవినీ ఎరు గని సామాజిక చీలికలను సైతం తీసుకువచ్చాయని పేర్కొంది. అది భవిష్యత్తులో సామాజిక అంశాలను మరింతగా బీటలు వారుస్తాయని సూచించింది. సర్వేలో పాల్గొన్నవారిలో ఐదవ వంతు మంది తాము సామాజిక ఉపద్రవాలు, ఆదాయంలో అసమానత పెంపుదలను ఎదుర్కొంటామని భావిస్తున్నట్టు తెలిపారు. అదే దక్షిణ అమెరికా, లాటిన్ అమెరికా ఎగ్జిక్యూటివ్‌ల విషయానికి వచ్చేసరికి వారిలో వరుసగా ఎనిమిది శాతం, ఆరు శాతం మంది మాత్రమే ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇక అమెరికన్లయితే దీనికి భిన్నంగా స్పందించారు. సర్వేలో పాల్గొన్న అమెరికన్ ఎగ్జిక్యూటివ్‌లలో 48 శాతం మంది ఇండస్ట్రీ 4.0 పట్ల అత్యంత ధీమా కనబరిచారు. దాని పట్ల కార్యకర్తలుగా వ్యవహరించడంలో వారి సామర్థ్యాల పట్ల ధీమాగా ఉన్నారు. ఇదే విషయమై ఈఎంఈఏ ప్రాంతపు ఆత్మ విశ్వాసం 36 శాతంతో మరింత మితవాదాన్ని ప్రదర్శించింది.

గొప్ప అవకాశానికి తోడు అంతే ముప్పు

ఇండస్ట్రీ 4.0 కు చోదక శక్తిగా వ్యవహరిస్తున్న వేగవంతమైన అధునాతన సాంకేతికతలు అసమానమైన అంతర్జాతీయ అనుసంధానం మరియు పెరుగుతున్న జనాభాతో కూడిన ఒక వాతావరణంలో సామాజిక, ఆర్థిక మార్పును శరవేగంగా తీసుకు వస్తున్నాయి అని డెలాయిట్ గ్లోబల్ సీఈవో పునీత్ రెంజెన్ తెలిపారు. అది గొప్ప అవకాశంతో పాటుగా ముప్పును సైతం అందించే కాలం అని పునీత్ చెప్పారు.

విశాల దృక్పథంతో విజయం

ఇలాంటి ఒక కొత్త శకంలో ఒక విశాలమైన దృక్పథం కలిగినవారే విజేతలవుతారు అని డెలాయిట్ గ్లోబల్ సీఈవో తెలిపారు. అలాంటివారు వాణిజ్యం మరియు సామాజిక అవసరాలు, ఆర్థిక పరిణామాలు మరియు సృజనాత్మక వ్యూహాలు, వర్క్ ఫోర్స్ ఉత్పాదకత మరియు బాగుండటం పట్ల ప్రజల స్థిర చిత్తం, ప్రస్తుత సాంకేతికతల సమ్మిళితం మరియు పూర్తిగా కొత్త పరిష్కారాల సృష్టి మధ్య సంబంధాలను చూడగలరు అని ఆయన చెప్పారు. డెలాయిట్ గ్లోబెల్ 19 దేశాల్లో 1,600 మంది సి-లెవల్ ఎగ్జిక్యూటివ్‌లపై సర్వే జరిపింది.

పేద దేశాలకు సంపద పంచండి




దావోస్: పాశ్చాత్యదేశాలు అభివృద్ధి చెందు తున్న దేశాల మద్దతులేకుండా మనలేవని, ప్రస్తుతం బీటలు వారిన ప్రపంచంలో ఏ ఒక్క దేశం దాన్ని పరిష్కరిచంలేదని మాజీ ఆర్‌బీఐ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. పాశ్చాత్యదేశాల పేరు చెప్పకుండా ఈ దేశాల ప్రజల్లో వృద్ధాప్యం బారిన పడే వారే ఎక్కువగా ఉన్నారని, వారి అవసరాలను తీర్చ డానికి అభివృద్ధి చెందుతున్న దేశాల వారి నుంచి సహా యం కావాల్సి ఉంటుందని అన్నారు. ఇలాంటి సమయంలో ఈ దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు తమ లబ్ధిలో కొంత భాగం పంచి ఇవ్వాలన్నారు. పాశ్చాత్య దేశాలు తమ వైఖరిని వీలైనంత త్వరగా మార్చుకోవాలని లేదంటే ప్రస్తుతం సంక్షో భంతో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచ సమస్యలను పరిష్కరించలేమన్నారు. పాశ్చా త్యదేశాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రస్తావిస్తూ.. టెక్నాలజీ, వృద్ధాప్యం, వాతావరణలో మార్పు లతో ఇబ్బందులుపడుతున్నారని రాజన్ పేర్కొన్నారు.

సంస్కరణలతో వృద్ధి రేటు రెండంకెలకు



న్యూయార్కు : భారత ప్రభుత్వం అతి పెద్ద సంస్కరణలు ఉదాహరణకు కార్మిక చట్టాలు, భూసేకరణలో పెద్దెత్తున సంస్కరణలు తీసుకొస్తే వృద్ధిరేటు 10 శాతానికి ఎగబాకే అవకాశం ఉందని మాజీ నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అరవింద్ పనగారియా అన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం మొదటి మూడుసంవత్సరాల పాలనలో వృద్ధిరేటు 7.5శాతం సాధించిందని, అయితే పెద్ద సంస్కరణలు .. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను తేవడంతో వృద్ధిరేటు కాస్తా మందగించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం భారత్ వృద్ధిరేటు 6.5 శాతం సాధిస్తుందని.. ఈ రేటు కూడా మంచి రేటేనే అని ఆయన అన్నారు. త్వరలోనే తిరిగి 8 శాతం వృద్ధిరేటు సాధించే స్థాయికి వస్తుందనడంలో ఎలాంటి అనుమానం లేదని ఆయన ఇక్కడ ప్రతిష్టాత్మకమైన కొలంబియా విశ్వవిద్యాలయంలో న్యూ ఇండియా లెక్చర్ సీరీస్‌లో మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమానికి భారత్ కౌన్సులేట్ జనరల్ ప్రారంభించింది.

భారత్‌కు పెట్టుబడులవసరం



ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా విదేశీ పెట్టుబ డులకు భార త్‌లో అపారమైన అవకా శాలున్నాయని కేంద్రమంత్రి పీయూ ష్‌గో యెల్ దావోస్‌లో మంగళ వా రం చెప్పా రు. సంక్షోభంలో చిక్కుకున్న ప్రపం చం లోని సమస్యలను తీర్చడానికి భార త్ ముందుంటుందని, వీటిలో భార త్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ పాత్రతో పాటు సామా జిక ఉద్రి క్తతతో పాటు టెర్రరిజానికి వ్యతిరేకంగా... వాతావరణం మార్పులపై భారత్ పాత్ర క్రమంగా పెరిగిపోతోందని గోయెల్ ప్రపంచ ఆర్థిక సదస్సులో మాట్లాడుతూ అన్నారు. ప్రస్తుతం భారత్‌సూపర్ పవర్‌గా, కొత్త ఆర్థికవ్యవస్థమారడాన్ని ప్రపంచ ఆసక్తిగా గమనిస్తోందని ఆయన అన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి భారత్ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా మారుతోందన్నారు. భారత్ మౌలికరంగంలో రెండు లక్షలకోట్ల డాలర్ల పెట్టుబడులకు అవకాశాలున్నా యన్నారు.

కిట్‌లు ప్రయివేటుకిస్తే కష్టమే!

- ప్రైవేటులో అమలు చేస్తే పరిస్థితి మళ్లీ మొదటికే
- పెదవి విరుస్తున్న అధికారులు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ప్రభుత్వ ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రైవేటులోనూ కేసీఆర్ కిట్ అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రైవేటు కాలేజీలకు అనుబంధంగా ఉండే ఆస్పత్రుల్లోనూ ఈ పథకాన్ని అమలుచేసేందుకు కసరత్తు చేస్తుండగా ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వానికి చెందిన కొందరు ఉన్నతాధికారులు పెదవి విరుస్తున్నారు. ఈ పథకాన్ని ప్రైవేటులో అమలు చేస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య అమాంతం తగ్గిపోతుందని ఇన్ని రోజులు కష్టం వృథా నేనని వారు పేర్కొంటున్నారు. కేసీఆర్ కిట్ పథకం వలన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చాలా పెరిగాయని ప్రస్తుతం బెడ్‌లు దొరకని పరిస్థితి నెలకొందని, ఇలాంటి సమయంలో మళ్లీ ప్రైవేటు ఆస్పత్రులకు మేలు జరిగే విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు తగ్గుముఖం పడతాయని వారు పేర్కొంటున్నారు. ఎలాగైనా ఈ విషయమై సీఎం పునరాలోచించు కోవాలని వారు కోరుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రులకు తగ్గిన ఆదాయం

వీరి విషయం ఇలా ఉంటే ప్రైవేటు మెడికల్ కాలేజీకి చెందిన యాజమాన్యాలకు గతంలో కాన్పులు చేస్తే లక్షల్లో బిల్లులను దోచుకునే వారు ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం వలన ప్రైవేటు ఆస్పత్రులకు ఆదాయం తగ్గిపోయింది. దీనివల్ల కూడా మెయింటనెన్స్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని దీనిని పూడ్చుకోవడానికి వైద్య విద్యార్థులు ఈ పథకం వలన చాలా మేలు జరుగుతుందని అనే కొత్త ప్రతిపాదనను తీసుకొచ్చి ఒక వినతిపత్రం ఇచ్చినట్టు తెలిసింది. దీనిపై సీఎం కూడా పూర్తి స్థాయి కసరత్తు చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

ప్రభుత్వ వైద్య విద్యార్థులకు అవగాహన

ప్రభుత్వ వైద్య కాలేజీల ఆస్పత్రుల్లో కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేస్తుండడంతో ఈ కాలేజీల్లోని విద్యార్థులకు కాన్పు చికిత్సలు, శస్త్ర చికిత్సలపై అవగాహన ఉంటోంది. ప్రైవేటు కాలేజీ వైద్య విద్యార్థులకు ఈ పథకంపై అవగాహన ఉండదు. అందుకే ఈ పథకాన్ని ప్రైవేటు వైద్య కాలేజీల అనుబంధ ఆస్పత్రుల్లో అమలు చేయాలని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వంతో తమ బాధను వెలిబుచ్చాయి. దీంతో ప్రభుత్వ ప్రైవేటులోనూ దీనిని అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, ఇతర పరికరాలు కలిపి సహజ కాన్పు అయితే రూ.2వేలు సిజేరియన్ అయితే రూ.5వేలు ఖర్చవుతోంది. ప్రైవేటు వైద్య కాలేజీల ఆస్పత్రుల్లో కేసీఆర్ కిట్లకు అనుమతిస్తే సిజేరియన్లను నియంత్రించ వచ్చని, ప్రైవేటు వైద్య కాలేజీల్లో జరిగే ప్రతి కాన్పుకు రూ.3వేల చొప్పున చెల్లించాలని ఒక ప్రతిపాదన వచ్చింది.


వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి

ఈ పథకం అమలు తరువాత ప్రభుత్వ ఆస్పత్రులపై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెరుగుతుండడం వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి పెంచుతోంది. వైద్య పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలైనా మరో ఏడాది వరకు పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రైవేటు బోధనాసుపత్రుల్లోనూ కేసీఆర్ కిట్ పథకం అమలును వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యామ్నాయంగా భావిస్తోంది. కేసీఆర్ కిట్‌ల వలన చాలామంది ప్రసవాలకు వస్తున్నా ఆ తరువాత చూపించుకోవడానికి మాత్రం మామూలుగా ప్రైవేటుకు వెళుతున్నారు. రాజకీయ నాయకుల్లో ఎక్కువ మందికి మెడికల్ కాలేజీలు ఎక్కువగా ఉన్నాయి. వారు ఈ విషయమై సీఎంపై ఒత్తిడి తీసుకొచ్చి టీచింగ్ ఆస్పత్రుల్లో ఈ పథకం అమలు జరిగేలా పూర్తి స్థాయిలో కసరత్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై తగ్గనున్న ఒత్తిడి

కేసీఆర్ కిట్ పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన వారికి రూ.12వేలు అదే కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.13 వేల చొప్పున సర్కారు చెల్లిస్తోంది. నాలుగుదశలుగా ఈ సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు జరిగిన వెంటనే శిశువు సంరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన కిట్‌ను అందిస్తున్నారు. రాష్ట్రంలో ఏటా 7 లక్షల కాన్పులు జరుగుతుండగా కేసీఆర్ కిట్ పథకం అమలుకు ముందు ఏడాదిలో కేవలం 2 లక్షల కాన్పులే ప్రభుత్వాసుపత్రుల్లో జరిగేవి. తాజాగా ఈ పరిస్థితి మారింది. 2017 జూన్ 2న ప్రారంభమైన కేసీఆర్ కిట్ పథకంతో ఏడు నెలలోనే రాష్ట్ర వ్యాప్తంగా 1.83 లక్షల కాన్పులు ప్రభుత్వాసుపత్రుల్లో జరిగాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఏటా దాదాపు 4.50 లక్షల కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగాయి.

సీఎంతో మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటాం



ప్రైవేటు మెడికల్ కాలేజీ యాజమాన్యాలు కేసీఆర్ కిట్‌ను ప్రవేశపెట్టాలని వినతిపత్రం ఇస్తే ఇచ్చి ఉండొచ్చు. ఒకవేళ ఇస్తే దాని అమలుపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. కేసీఆర్ ఢిల్లీ స్థాయిలో పేరు వచ్చింది. అందుకే దానిపై ఆచి తూచి అడుగు వేస్తాం. ఈ విషయమై సీఎంతో మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటాం.

కొత్త ప్రతిపాదన తెరపైకి

వైద్య విద్యార్థులకు కాన్పు చికిత్సలపై పూర్తి స్థాయిలో అవగాహన పరిపూర్ణత కల్పించడమే లక్ష్యంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో కేసీఆర్ కిట్ పథకం అమలు చేయాలన్న ప్రతిపాదనను ప్రైవేటు మెడికల్ కాలేజీ యాజమాన్యాలు కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చాయి.

ప్రైవేటు వైద్య కాలేజీలకు అనుబంధంగా ఉండే ఆస్పత్రుల్లో ఈ పథకాన్ని అమలు చేయడం వలన సహజ కాన్పులకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తామని ప్రైవేటు యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. రాష్ట్రంలో ప్రస్తుతం 22 వైద్య కాలేజీలు ఉండగా వాటిలో ఆరు ప్రభుత్వ, ఒకటి ఈఎస్ఐ, మూడు ప్రైవేటు మైనార్టీ, పన్నెండు ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. అన్ని కాలేజీల్లో కలిపి 3,200 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఆరు ప్రభుత్వ కాలేజీలో కలిపి 1,000 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా మిగిలిన సీట్లన్నీ ప్రైవేటు కాలేజీలవే. ఎక్కువ మంది ప్రైవేటు కాలేజీలోనే వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. అందుకే ఈ విషయమై ప్రైవేటు యాజమాన్యాలు ముందడుగు వేసినట్టు తెలిసింది. దీని వల్ల వీరు కోల్పోతున్న ఆదాయాన్ని మళ్లీ పునరుద్ధరించు కొవచ్చన్న ఆలోచనలో వారు ఉన్నట్టు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆస్పత్రులపై భారం తగ్గుతుంది

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.నరసింగ రెడ్డి

ఈ పథకం అన్ని బోధనా ఆస్పత్రులతో పాటు ప్రైవేటు లోనూ అమలు చేయడం వలన రోగులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయితే గంటల తరబడి నిలబడాల్సి వస్తుంది. ప్రైవేటులో ఒకవేళ అమలు ఆరోగ్య శ్రీ పథకం కింద కొన్ని ప్రైవేటు ఆస్పత్రులను ఈ పథకం అమలు చేస్తే బాగుంటుంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న దానికంటే ఎక్కువ పనిభారాన్ని వైద్యులు చేస్తున్నారు. కేసీఆర్ కిట్ వలన అది కాస్తా అదనపు భారంగా మారింది.

2న బీజేపీ మహిళా మోర్చా యుద్ధభేరి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మహిళల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలు...మంత్రి వర్గంలో మహిళకు స్థానం కల్పించకపోవడం...వడ్డీలేని రుణాలు, డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వడంలో జరుగుతున్న జాప్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ భాజపా రాష్ట్రమహిళా మోర్చా యుద్ధభేరి కార్యక్రమాన్ని నిర్వహించాలని తలపెట్టింది. ఫిబ్రవరి 2వ తేదీన హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణమండపంలో తలపెట్టింది. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు ఆకుల విజయ తెలిపారు. మహిళల పట్ల తెరాస ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. డ్వాక్రా మహిళలను ఆ పార్టీ కార్యకర్తలుగా ఉపయోగించుకుంటుందే తప్ప....వారి సంక్షేమానికి ఎలాంటి నిర్ణయాలను తీసుకోవడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెరాస అధికారంలోకి వచ్చి సుమారు నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు మంత్రివర్గంలో మహిళ ఎమ్మెల్యేకు స్థానం కల్పించకపోవడం శోచనీయమని అన్నారు. మహిళల శక్తిసామర్థ్యాలపై సిఎం కేసీఆర్‌కు నమ్మకం లేదా? అని ప్రశ్నించారు.మహిళలు పోరాటం చేయందే తెలంగాణ రాష్ట్రం వచ్చిందా? అని ఆమె నిలదీశారు. కేసీఆర్ కిట్లు...కళ్యాణ లక్ష్మీ పేరుతో మహిళలను తెరాస ప్రభుత్వం మభ్యపెడుతోందని ఆమె విమర్శించారు.

డ్వాక్రా గ్రూపులకు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను ఇస్తానని చెప్పిన కేసీఆర్ మాటలు నీటిమీద రాతలయ్యాయని అన్నారు. అలాగే మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేస్తామని చెప్పిన కేసీఆర్ ఇప్పటి వరకుఎంతమందిని తయారు చేశారో చెప్పాలని ఆమె సవాల్ విసిరారు. పండుగకు చీరలిస్తాం...సంబరాలకు సరుకులిస్తాం అని చీప్ ట్రిక్స్‌తో ప్రచారం చేసుకుని చివరకు ఆ నిధులను కూడా తెరాసనేతలే దిగమించారని ఆకోపించారు. అలాగే ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళు కళగానే విగిలిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. చిన్న ఇళ్ళలో మహిళలు పడుతున్న సమస్యలను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళను కట్టించి ఇస్తామని చెప్పి ప్రభుత్వం చేతులెత్తేసిందని అన్నారు. హైదరాబాద్ నగరంలో అక్కడక్కడ, సిఎం ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని ఎరవాడ గ్రామంలో తప్ప ఎక్కడ నిర్మించారని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రచారమే తప్ప...అర్హులైన వారికి ఇళ్ళు రావడం లేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిపించడానికే యుద్ధభేరీ సభను ఏర్పాటు చేసినట్లు ఆకుల విజయ తెలిపారు.

డివైడర్ ఢీకొని కారు బోల్తా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా.. డ్రంకెన్ డ్రైవ్ చేపడుతున్నా నిబంధనలు పట్టని రీతిలో మద్యం తాగి వాహనాలు నడిపే వారి సంఖ్య నానాటికి పెరుగుతోంది. నగరంలోని ప్యారడైజ్ దగ్గర రోడ్డు ప్రమాదం సంభవించింది.

ఫ్లైఓవర్‌పై కారు బోల్తాపడింది. రాంగ్‌రూట్‌లో వచ్చి డివైడర్‌ని డీకొని కారు ప్రమాదం చోటు చేసుకుంది. మద్యం మత్తులో కారు నడపడమే కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కారును అక్కడే వదిలిపెట్టి పరారయ్యారు. సమాచారన్నందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

31లోగా మీడియా అవార్డులకు ఎంట్రీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మిషన్‌కాకతీయ మీడియా అవార్డులకు ఎంట్రీలు పంపేందుకు ఈనెల 31చివరితేదీ అని ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు కార్యాలయం మంగళవారం తెలిపింది. మిషన్‌కాకతీయ గురించి అద్భుతంగా రాసిన పత్రికా జర్నలిస్టులు, ప్రసారం చేసిన టివి జర్నలిస్టులు, వార్తాసంస్థలకు తగిన రీతిలో అవార్డులు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు మంత్రి హరీష్‌రావు ఓఎస్‌డి శ్రీధర్‌రావు దేశ్‌పాండే తెలిపారు. తెలంగాణ జనజీవితంపై మిషన్ కాకతీయ ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఎంట్రీలను పంపించాల్సిందిగా ఆయన కోరారు.

రైతు ఆత్మహత్య

సారంగాపూర్,ప్రభన్యూస్: నిర్మల్ జిల్లా అడెల్లి తండాకు చెందిన రాథోడ్ అనిల్(33) అనే రైతు అప్పుల బాధ భరించలేక మంగళవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మండల ఎస్సై రవీందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు అనీల్‌కు నాలుగు ఎకరాల భూమి ఉండగా అప్పు చేసి మరో ఎకరం భూమిని గత సంవత్సరం కొనుగోలు చేసి దాంట్లో పత్తి పంట వేయగా గులాబీ పురుగు తెగుళ్ళతో పంట చేతికి రాలేదు. పత్తి పంటను ఏరివేసి గత నెలలో మొక్కజొన్న పంటను వేశాడు. ఇంతలోనే అప్పుకట్టే సమయం రానే వచ్చింది. అప్పు ఎలా కట్టాలో అనే దిగులుతో రాత్రి వేళ పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు.

బ్యాంకును మోసగించిన ఇద్దరికి జైలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తప్పుడు పత్రాలను సమర్పించి బ్యాంకు నుంచి రూ. 6.40 కోట్లు అప్పు తీసుకున్న ఇద్దరు వ్యక్తులకు సిబిఐ కోర్టు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. విజయబ్యాంక్ యాజమాన్యం జి. శ్రీనివాస్, జి. భాస్కరరావు అనే ఇద్దరు వ్యక్తులు తప్పుడు పత్రాలను తనఖాగా పెట్టి వి రెంట్ లోన్‌లు తీసుకున్నారని సిబిఐకి 2014లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసును నమోదు చేసుకున్న సిబిఐ దర్యాప్తు జరిపి నిందితులను దోషులని కోర్టుకు ఆధారాలను సమర్పించింది. ఈ ఆధారాలను పరిశీలించిన సిబిఐ ప్రత్యేక కోర్టు ఇద్దరిలో శ్రీనివాస్‌కు అయిదేళ్ళ జైలు శిక్ష, భాస్కరరావుకు మూడేళ్ల జైలు శిక్షవిధిస్తూ తీర్పు వెలువరించింది. అంతేకాకుండా లక్షా 40 వేల రూపాయల జరిమానాను కూడా విధించిందని సిబిఐ ఒక ప్రకటనలో తెలియజేసింది.

విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి

మాస్ కాపీయింగ్‌కు సహకరించే టీచర్లను ప్రాసిక్యూట్ చేయండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ కారణంగా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు దారుణంగా పడిపోతున్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. తద్వారా కళాశాలల నుంచి బయటికి వచ్చిన వారు ఉద్యోగ విఫణిలో సంబంధిత ఉద్యోగాలకు ఎంపిక కాలేక పోతున్నారని హైకోర్టు వ్యాఖ్యానించింది. సామూహిక చూచిరాతను ప్రోత్సహించిన ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటేనే , ఆ భయంతో ఈ చర్యలకు పాల్పడకుండా ఉంటారని హైకోర్టు అభిప్రాయపడింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావు లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

ఐమాక్స్ థియేటర్‌పై ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ:హైదరాబాద్ లోని ఐమాక్స్ థియేటర్‌పై తార్నాకకు చెందిన విజయ్‌గోపాల్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఐమ్యాక్స్‌లోని బిగ్‌స్క్రీన్ థియేటర్‌లో ప్రేక్షకులు కూర్చునేందుకు 14 వరుసల్లో సీట్లు ఉన్నాయని, ఒక్కో వరుసలో 47 సీట్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అయితే, ఆ సీట్ల మధ్య దారి వదలలేదు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు బయటకు వెళ్లడం కష్టమంటూ ఈ మేరకు హైకోర్టుకు ఓ లేఖ రాశారు.

దీనిపై స్పందించిన హైకోర్టు ఆ లేఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)గా స్వీకరించింది. ఈ మేరకు ఐమాక్స్ థియేటర్ యాజమాన్యంతో పాటు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, అగ్నిమాపక శాఖ డీజీపీకి నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో ఆదేశించింది.

మియాపూర్ భూములపై నివేదికివ్వండి

తెలంగాణ సర్కారుకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దాదాపు 693 ఎకరాల మియాపూర్ భూ అక్రమ రిజిస్ట్రేషన్ల కేసులో కూకట్ పల్లి పోలీసు ఠాణాలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లో తాజా దర్యాప్తు స్థాయి నివేదికను మూడు వారాల్లో తమ ముందుంచాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.గంగారావు లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసులో అవసరమైతే అదనపు చార్జ్ షీటు వేస్తామని, తాజా దర్యాప్తు నివేదికను సమర్పిస్తామని తెలంగాణ అడ్వకేట్ జనరల్ గత విచారణ సమయంలో హామీ ఇచ్చినట్లు ధర్మాసనం గుర్తు చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయ వాది సంజీవ్ కుమార్ వాదనలు వినిపిస్తూ తాజా దర్యాప్తు స్థాయి నివేదికతో పాటు ఈ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాల ప్రతిని సమర్పించేందుకు మూడు వారాల గడువు కావాలని అభ్యర్థించారు. ఈ వివాదాస్పదమైన 693 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ల పై సుప్రీంకోర్టు స్టేటస్ కో ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వాదనలు వినిపించేందుకు గానూ ఆ ప్రతిని పిటిషనర్ రఘునందన్ రావు కు ముందుగానే అందజేయాలని ధర్మాసనం ఎస్ జీపీని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్ లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.మియాపూర్ లో రూ.వెయ్యి కోట్ల విలువైన 693 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూ కుంభకోణం పై సీబీఐ చేత దర్యాప్తు జరిపించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ తెలంగాణ భాజాపా అధికార ప్రతి ని ధి,రఘునందన్ రావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

రైతులకు పరిహారంలో అలసత్వంపై హైకోర్టు ఆగ్రహం

ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు హెచ్చరిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతుల నుంచి ముందుగా భూములు తీసుకుని పరిహారం చెల్లించకుండా కోర్టుల చుట్టూ తిరిగేలా చేస్తే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో భూసేకరణ ప్రక్రియను నిలిపివేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను హైకోర్టు హెచ్చరించింది. ప్రభుత్వాలు అనుసరిస్తున్న అవాంఛనీయమైన విధానంపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో ఏపీ ఇంతవరకు ఎలాంటి నివేదికను సమర్పించకపోవడం పట్ల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక వేళ వారు ప్రమాణ పత్రాలతో రాకుంటే వచ్చే విచారణ తేదీనాడు కోర్టుకు హాజరు కావాలంటూ ఆదేశిస్తామని హైకోర్టు ఇరు రాష్ట్రాల సీఎస్‌లను హెచ్చరించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావు లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ 3వారాలకు వాయిదా వేసింది.భూములను సేకరించిన రైతులకు పరిహారం ఇచ్చే వ్యవహారంపై మహబూబ్ నగర్ జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి జి.వెంకట కృష్ణయ్య రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన హైకోర్టు విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే. భూములు కోల్పోయిన రైతులకు రూ.500 కోట్లు చెల్లించాల్సి ఉందని ఆ నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ..ఈ వ్యవహారంలో మూడు వారాల్లో నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రజాహిత వ్యాజ్యం

నారాయణ, శ్రీచైతన్య కాలేజీలకు నోటీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు కాలేజీల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటంపై ఉమ్మడి హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో మూడు వారాల్లో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రతివాదులైన ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, హోంశాఖ కార్యదర్శులతో పాటు రెండు రాష్ట్రాల ఇంటర్ బోర్డులు, నిమ్స్, నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావు లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

ఆటోను ఢీకొన్న లారీ..ఇద్దరి దుర్మరణం

12 మందికి గాయాలు



తాండూరు రూరల్, ప్రభన్యూస్ : వేగంగా వెళుతున్న లారీ ఓ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు దుర్మరణం చెందగా మరో 12మంది గాయాలపాలయ్యారు. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా మారింది. మంగళవారం మధ్యాహ్నం తాండూరు మండల పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం చించొల్లి తాలుకా, రుస్తుమ్‌పుర్‌కు చెందిన ఆటో(కెఎ32ఎ 4220) 14మందితో గ్రామం నుంచి బయల్దేరింది. తాండూరు మండలం అంగడిపేటగా పిలువబడే పర్వతాపూర్ గ్రామంలో పురుడు కార్యక్రమానికి వెళుతుండగా మార్గమధ్యలోని అల్లాపూర్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ(ఎపి07 టిజి 7668) ఆటోను ఢీకొట్టింది. ఈ క్రమంలో ఆటోలో ముందు కూర్చున్న పూజారి రమణ(50), పూజారి నాగమ్మ (50)లకు తీవ్రగాయాలై రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అదేవిధంగా ఆటోలో ఉన్న 12మందికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కరణ్‌కోట్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రేణుకారెడ్డి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. ఘటనా స్థలంలో ఇద్దరు మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రి మార్చురికి తరలించారు.

ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పారిపోతుండగా పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు సమాచాం. మరోవైపు మృతుడు పూజారి రమణ భార్య జగదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

యాదాద్రీశుని హుండీ లెక్కింపులో నగదు తస్కరణ

మహిళా ఉద్యోగి చేతివాటం


కేసు నమోదు..రిమాండ్‌కు తరలింపు



యాదగిరిగుట్ట, ప్రభ న్యూస్ : యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం హుండీ లెక్కింపులో చేతివాటం ప్రదర్శించి మహిళా ఉద్యోగి పట్టుబడ్డారు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. హోంగార్డులు, సీసీ కెమెరాల పర్యవేక్షణలలో యాదగిరికొండ పైన దేవస్థానం హుండీలను లెక్కించారు. చైర్మన్ బి. నర్సింహ్మామూర్తి, ఆలయ ఈవో ఎన్. గీత, దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో యాదగిరికొండ పై హుండీ లెక్కింపును ప్రారంభించారు. దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. దేవస్థానంలో పని చేసే కందాల సరోజ కాలకృత్యాలకు వెళ్ళే నెపంతో పలుమార్లు లెక్కింపు మధ్య నుండి లేచి వెళ్ళినట్లు, మరోవారు కూడా ఆమె టాయిలెట్‌కు వెళ్తుండగా అనుమానంతో మహిళా హోంగార్డులు శారద, రాజేశ్వరి ఆమెను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో సరోజ వద్ద 27 వేల 280 రూపాయలు పట్టుబడ్డాయి. దీంతో దేవస్థానం ఈవో ఎన్. గీత ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. యాదగిరిగుట్ట ఎస్‌హెచ్‌వో అశోక్‌కుమార్ నేతృత్వంలో సదరు ఉద్యోగిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన స్థానికంగానూ, భక్తులలో చర్చనీయాంశమైంది. ఆ వెనువెంటనే సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా ఈవో గీత మాట్లాడుతూ సదరు మహిళా ఉద్యోగి సరోజ పై శాఖపరమైన క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని, దేవస్థానం ఉద్యోగుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు.

ఏసీబీకి చిక్కిన ఆర్డీవో


వాటర్ ప్లాంట్ యజమాని నుంచి రూ. 40 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



ఆర్మూర్‌రూరల్, ప్రభ న్యూస్ : నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీఓ)గా విధులు నిర్వహిస్తున్న బాలే శ్రీనివాస్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. స్థానిక వాటర్ ప్లాంట్ యజమాని బదాం రాజ్‌కుమార్ వద్ద నుంచి రూ.40వేలు తీసుకుంటుండగా హైదరాబాద్‌లోని ఏసీబీ డిప్యూటి డైరెక్టర్ ఎం. రమణ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం ఉదయం దాడి చేసి పట్టుకున్నారు. ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ రమణకుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఆర్మూర్ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న బాలే శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గత ఏడాది నవంబర్ 20న ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లిలలోని 15 వాటర్ ప్లాంట్లను ఐఎస్ఐ అనుమతులు లేవని సీజ్ చేశారన్నారు. సీజ్ చేసిన వాటర్ ప్లాంట్లను పున:ప్రారంభించడానికి గాను వాటర్ ప్లాంట్ అసోసియేషన్ కోశాధికారి, మంజీరా డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ యజమాని బదాం రాజ్ కుమార్ ఆర్డీవోను సంప్రదించినట్లు తెలిపారు. దీనికి ఆర్డీవో రాజ్‌కుమార్ వద్ద రూ. 40 వేలు డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఆర్డీవో డబ్బులు డిమాండ్ చేయడంతో రాజ్‌కుమార్ హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేయ డంతో ఉదయం వలపన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ ఆర్డీఓ శ్రీని వాస్ జగిత్యాల వాస్తవ్యుడు. ఆర్డీవో శ్రీనివాస్‌కు జగిత్యాలలోని అపార్ట్‌మెంట్‌లో మూడు ప్లాట్లు, హైదరాబాద్‌లో ఒక ప్లాట్, మెడ్చల్, బొల్లారంలో ఇంటి స్థలాలు ఉన్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా రాయికల్ మండలం అలిపూర్‌లోని ఆర్డీఓ అత్తగారింట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నట్లు తెలిపారు. రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి ఆర్డీఓ శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ దాడులలో ఏసీబీ డియస్పీ కిరణ్‌కుమార్, కరీంనగర్ ఏసీబీ సీఐ వేణుగోపాల్, హైదరాబాద్ ఏసీబీ సీఐలు సతీష్ కుమార్, రమేష్ రెడ్డి, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పక్షులు ఎంతదూరం ఎగురుతాయి?

రజనీ, కమల్ రాజకీయ ప్రవేశంపై స్టాలిన్ వ్యాఖ్య



చెన్నై: తమిళ సూపర్ స్టార్స్ రజనీకాంత్, కమల్ హాసన్‌ల రాజకీయ ప్రవేశాన్ని డిఎంకె పరిహాసం చేసింది. కొత్త పక్షులు ఎగరడానికి ప్రయత్ని స్తున్నాయని వ్యాఖ్యానించింది. వారికున్న బలంతో ఎంతదూరం వెళతారు ఉన్న చోటనే ఉండి పోతారని పేర్కొంది. మంగళవారం డిఎంకె వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకె. స్టాలిన్ తన పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం అనేది ఆకాశం వంటిది అందరికి అది సాధారణం... ఎన్నో పక్షులు ఎగరవచ్చు. కాని కొన్ని పక్షులు మాత్రమే సుదూరాలను దాటి తమ లక్ష్యాలను చేరుతాయి అని అన్నారు. డిఎంకె ఉన్నత ఎత్తుల్లో ఎగురుతోంది. మా పార్టీ ప్రజల సంక్షేమం గురించే అన్నివేళలా ఆలోచిస్తుంది అని స్టాలిన్ అన్నారు.

కశ్మీర్ అంశంలో యుఎన్ జోక్యం చేసుకోదు

• చర్చల ద్వారానే పరిష్కారం • యుఎన్ సెక్రటరీ జనరల్ అంటోనియో గెటెర్రస్ వెల్లడి

యునైటెడ్ నేషన్స్: కశ్మీర్ అంశం పరిష్కారంలో ఐక్యరాజ్య సమితి మధ్య వర్తి పాత్రను పోషించదని సమితి సెక్రెటరీ జనరల్ అంటోనియో గుటెర్రస్ అన్నారు. ఇరు దేశాలు తమ మధ్య ఉన్న వివాదాలు, సరిహద్దు సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని పేర్కొన్నారు. ఈ మేరకు సమితి సెక్రె టరీ జనరల్ కార్యాలయ అధికార ప్రతినిధి స్టెఫాని డుజారిక్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. సమితి చీఫ్, అన్నివేళలా మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉంటారు. కాని ప్రతీ ఒక్కరు ఇందుకు అంగీకరించవలసి ఉంటుందని చెప్పారు. సరిహద్దుల్లో భారత్, పాకిస్తాన్‌ల ఘర్షణల కారణంగా రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తీవ్రమ వుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాకు ఈ విషయం తెలుసు గత 10 రోజులుగా పరిస్థితిని గమనిస్తున్నామన్నారు. సెక్రెటరీ జనరల్ ఈ సమస్యను పరిష్కరించడంలో ఏకాగ్రతను చూపటంలేదన్న ప్రశ్నకు బదులిస్తూ డుజెర్రిక్.. అంటోనియో గుటెర్రస్ అన్ని వేళలా మధ్యవర్తిత్వం నెరపడానికి సిద్ధంగా ఉంటా రు. ఐక్యరాజ్య సమితి జోక్యంను ఇరుదేశాలు అంగీకరించాల్సి ఉంటుంది అని చెప్పారు. కశ్మీర్ అంశంలో 3పక్షం జోక్యాన్ని భారత్ వ్యతిరేకిస్తోన్న విషయం తెలి సిందే.. కాగా పాకిస్తాన్ మధ్యవర్తిత్వంకోసం ఎటువంటి వ్యతిరేకత తెలపడం లేదు.

ఫిబ్రవరి 10 నుంచి కర్నాటకలో రాహుల్ పర్యటన



బెంగళూరు: కర్నాటక అసెంబ్లీకి వచ్చే ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఫిబ్రవరి 10వ తేదీ నుంచి రాష్ట్రంలో మూడు రోజులపాటు పర్యటిస్తారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు జి.పరమేశ్వర మంగళవారం ఇక్కడ విలేకరులతో అన్నారు. మొదటగా జిల్లా నేతలు, ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులతో కాంగ్రెస్ అధ్యక్షుడు సమావేశమవుతారు. హోస్‌పేటలో నిర్వహించతలపెట్టిన ఒక భారీ సదస్సును ఉద్దేశించి రాహుల్ ప్రసంగిస్తారు. పార్టీ నేతలతో కలిసి బస్సు యాత్ర చేపడతారు. పలు చోట్ల ప్రజలతో మాట్లాడుతారు. కలబురగి వద్ద రాత్రికి విశ్రమిస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి బీదర్‌కు యాత్ర చేపడతారు. అనంతరం రాహుల్ గాంధీ ఢిల్లీ తిరిగి వెళతారని పరమేశ్వర వివరించారు. కర్నాటక అసెంబ్లీకి ఎన్నికలు ఈ ఏడాది ముంచుకొస్తున్నాయి.

జైనాబ్ రేప్ కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు

లాహోర్: పాకిస్తాన్‌లో ఏడేళ్ల చిన్నారి జైనాబ్ రేప్, హత్యకేసులో ప్రధాన నింది తుడు పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు లో నిందితుడు ఇమ్రాన్ అలీ(23) తన నేరాన్ని అంగీకరించాడని పోలీసులు తెలిపారు. ఇమ్రాన్‌ను రెండు వారాల క్రితమే పోలీసులు అరెస్టు చేశారు. జైనాబ్ తల్లి తండ్రులు ఇమ్రాన్ ఈ నేరం చేసివుండకపోవచ్చని పేర్కొనడంతో పోలీసులు ఇమ్రాన్‌ను విడిచిపెట్టారు. పంజాబ్ ప్రభుత్వ అధికార ప్రతినిధి మాలిక్ అహ్మద్ ఈ మేరకు వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. అయితే ఈ విషయం డిఎన్ఏ పరీక్ష జరిపిన అనంతరం నిర్ధారించుకుంటామని వారు తెలిపారు. జనవరి 5న మతానికి సంబంధించి విద్యను అభ్యసించడానికి నివాసానికి సమీపంలో ఉన్న కేంద్రానికి వెళ్లిన జైనాబ్ కనిపించకుండా పోయింది. జనవరి 9న బాలిక మృత దేహం షాబాజ్ ఖాన్ రోడ్ వద్ద చెత్త కుప్పలో దొరికింది. పోలీసులు ఇప్పటివరకు 1000 అనుమానితులకు డిఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. కాగా సుప్రీంకోర్టు ఆదివారం ఈ కేసులో దోషులను పట్టుకునేందుకు ఐజీపీకి 24 గంటల సమయం ఇచ్చింది.

రాంగోపాల్‌వర్మపై అనంతపురంలో పోలీస్ కేసు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంచలన దర్శకుడు రాంగోపాల్‌వర్మపై అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ మహిళా మోర్చా నేతలు ఫిర్యాదు చేశారు. నీలి చిత్రాల నటి మియా మాల్కోవాతో ఆర్జీవీ తెరకెక్కిస్తున్న గాడ్, సెక్స్ అండ్ ట్రూత్ సినిమాపై వారు మండిపడ్డారు. దేవుళ్లను కించపరుస్తూ అశ్లీల చిత్రం రూపొం దించిన వర్మపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వర్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, గత శుక్రవారం విజయవాడలో కూడా బీజేపీ మహిళామోర్చా నేతలు వర్మపై కేసు పెట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వర్మ తన తీరు మార్చుకోకపోతే ప్రతిఫలం అను భవించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

చైనా స్మగ్లర్ నుంచి రూ.52 లక్షల బంగారం స్వాధీనం

• ఐజీఐఏలో ఘటన

న్యూఢిల్లీ: ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.52 లక్షల విలువైన బంగారాన్ని చైనాకు చెందిన ఓ స్మగ్లర్ నుంచి కస్టమ్స్ అధికారులు మంగళవారంనాడు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అతడు దుబాయ్ నుంచి శనివారం వచ్చాడని తెలిసిందని, అతనిపై అనుమానం వచ్చి అతని వద్దనున్న బ్యాగ్ సోదాచేయగా అందులో 15 బంగారు కడ్డీలున్నాయని, అవి 1.7 కేజీల బరువున్నట్లు అధికారులు తెలిపారు. బంగారు కడ్డీలు ప్రస్తుతం మార్కెట్‌లో 52.28 లక్షల విలువచేస్తాయని కస్టమ్స్ శాఖ తెలిపింది. స్మగ్లర్ చైనాకు చెందిన వ్యక్తని, అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

రాంపూర్హట్: పశ్చిమ బెంగాల్‌లో రాంపూర్హట్ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో వివాహ బృందంలోని నలుగురు మృతిచెందారు. కాగా ఈ ప్రమాదంలో మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. వివాహబృందం ప్రయాణిస్తున్న వాహనాన్ని 60వ జాతీయ రహదారి వద్ద మంగళవారం ఉదయం ట్రక్ ఢీకొనడంతో ఘటన ప్రాంతంలోనే నలుగురు మృతి చెందారన్నారు. వాహన డ్రైవరు కూడా ఘటనలో చనిపోయాడన్నారు. మృతులను బసంతా హజారా(32), లాబాణ్య ప్రమాణిక్ (58), ప్రహ్లాద్ (24), బిప్లబ్ (25)గా గుర్తించామన్నారు. వీరిలో హజారా వాహన డ్రైవర్ అని ఇతను సంఘటనప్రాంతంలోనే మరణించాడన్నారు. ప్రమాదంలో గాయపడిన వధువు మరో ముగ్గురిని బుర్ద్వాన్ ఆసుపత్రికి వైద్యం కోసం తరలించామన్నారు. వీరి పరిస్థితి విషమంగానే ఉందన్నారు. వరుడుతోపాటు గాయపడిన మరో వ్యక్తిని రాంపూర్హాట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని పోలీసులు తెలిపారు.

థానే రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

థానే: ట్రక్‌తో ఓ మోటార్‌సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మరణించారు. ఈ ఘటన థానేలోని భివాండీ టౌన్‌షిప్‌లో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భివాండీ నుంచి వెళుతున్న మోటార్‌సైకిల్‌ను ఎదురుగా ట్రక్ వచ్చి ఢీకొందని, టూవీలర్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మరణించినట్టు పోలీసు అధికారులు తెలిపారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాలను ఐజీఎమ్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.చనిపోయినవారు అలగ్ నజీర్ హుసేన్(23), మహ్మద్ అన్వర్ అన్సారీ(20), సమీర్ ఫారూక్ అన్సారీ(20)గా గుర్తించినట్టు అధికారులు చెప్పారు. అయితే, ట్రక్ డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యంగా నడపటమే కారణమని, అతనిపై మోటార్ వాహనాల యాక్ట్ కింద కేసు నమోదుచేసినట్టు భివాండీ తాలూకా పోలీసులు పేర్కొన్నారు.

అలస్కాలో తీవ్ర భూకంపం

• రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.9గా నమోదు • సునామీ హెచ్చరికలు జారీ, ఉపసంహరణ • ఆస్తి, ప్రాణ నష్టం ఫిర్యాదులు రాలేదు • అలస్కా హోంలాండ్ సెక్యూరిటీ ఏజెన్సీ వెల్లడి





అంకొరేజ్(అలస్కా): తీవ్రమైన భూకంపం అలస్కాను అతలాకుతలం చేసింది. మంగళవారం ఉదయం 12.30 గంటలకు గల్ఫ్ ఆఫ్ అలస్కాలోని కొడియాక్ ద్వీపానికి ఆగ్నేయ దిశలో 170 మైళ్ల దూరంలో ఈ భూకంపం సంభవించిందని అలస్కా డివిజన్ హోం ల్యాండ్ సెక్యూరిటీ, ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఒక ప్రకటన చేసింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.9గా నమోదైంది. భూకంప ప్రకంపనలు కొనసాగిన సమయంపై వచ్చిన నివేదికల్లో తేడాలు చోటుచేసుకున్నాయి. తొలుత 8.2 తీవ్రతగా ప్రకటనలు రాగా అనంతరం తీవ్రత 7.9గా ప్రకటించారు. ప్రకంపనలు 90 సెకండ్లపాటు కొనసాగాయని కొడియాక్ దీవికి ఈశాన్య దిక్కులో 230 మైళ్ల దూరంలో ఉన్న సివార్డ్ నగరంలో అగ్నిమాపక శాఖ అధికారి ఎడ్డీ ఆథే చెప్పారు. పెద్దపెద్ద బండరాళ్లు దొర్లినట్లు భయంకర శబ్దం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. భూకంపంతో అలస్కా సముద్ర తీరంలో అలలు తొలుత ఉవ్వెత్తున ఎగసిపడడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు లోనయ్యారు. జాతీయ సునామీ కేంద్రం అధికారులు సునామీ హెచ్చరికను జారీచేసి అనంతరం అలల ఉధృతి తగ్గటంతో సునామీ హెచ్చరికలను ఉపసంహరించారు. ఈ భూకంప వల్ల ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగినట్లు తమకు ఫిర్యాదులు రాలేదని హోం లాండ్ సెక్యూరిటీ తెలిపింది. అలస్కాలోని అతిపెద్ద పట్టణం అంకొరేజ్, భూకంపం సంభవించిన కొడి యాక్ దీవికి 200 మైళ్ల దూరంలో ఉండటంతో భూకంపంతో ప్రభావితం కాలేదు. తొలుత భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 8.2గా నమోదైందని యుఎస్‌జీఎస్ ప్రకటించింది. దీనితో అలస్కా తీర ప్రాంతం, కెనడాలోని బ్రిటిష్ కొలంబియాలో సునామీ హెచ్చరికను జారీచేయగా అమెరికా పశ్చిమ సముద్ర తీరంలో పరిస్థితులను నిరంతరం గమనిస్తూ అక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు. సునామీ భయం లేదన్న అమెరికా, జపాన్ అధికారుల ప్రకటనతో అమెరికా ఊపిరి పీల్చుకుంది. వాషింగ్టన్, ఒరేగాన్, క్యాలి ఫోర్నియా, హవాయ్ ప్రాంతాల్లో అప్రమత్తత హెచ్చరికలను అధికారులు ఉపసంహరించకున్నారు. అలస్కా, కొడియాక్‌లో ముందు జాగ్రత్తగా ప్ర జలను 100 అడుగుల ఎత్తైన టవర్లపైకి తరలిస్తున్నామని పోలీసు అధి కారులు మీడియాకు చెప్పారు. గత 19 ఏళ్లుగా అలస్కాలో నివసిస్తును న్నప్పటికీ ఇటువంటి భూకంపం చూడలేదని గవర్నర్ బిల్ వాకర్ చెప్పారు.

ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు మంగళవారం దోమల్‌గూడా, రామకృష్ణామఠ్‌లో ఘనంగా జరిగాయి. సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున వివిధ కళాశాలలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్‌ను స్ఫూర్తిగా తీసుకుని దేశభద్రతలను, సమగ్రతను కాపాడతామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. స్వామి వివేకానందా, భారతమాతా, నేతాజీ చిత్రపటాలను ముందుగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం విద్యార్థులను ఉద్దేశించి స్వామి బోధమయానందా, సెంట్రల్ కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ శాఖ అదనపు డైరెక్టర్ జే. చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ, దేశం నుంచి బ్రిటీష్ సైనికులను తరిమికొట్టడంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పాత్ర అనిర్వచనీయ మైనదన్నారు. భారతదేశ భద్రతను, సమగ్రతను కాపాడడంలో ఆయన చూపిన ధైర్యం....నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి ఫౌండేషన్ చీఫ్ కోఆర్డినేటర్ రవిశంకర్ చావలి, వనజాకుమర్, అభిలాష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నేతాజీకి అహింసపై నమ్మకం లేదు

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు అహింసపై నమ్మకం లేదని, అహింస ద్వారా స్వాతంత్ర్యం సాధించలేమని నేతాజీ నమ్మేవారని పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి మంగళవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. నేతాజీ 121వ జన్మదినోత్సవం సందర్భంగా త్రిపాఠి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటం చేసిన గొప్ప నాయకుల్లో నేతాజీ కూడా ఒకరు అన్నారు. జైహింద్, ఢిల్లీ చలో, నాకు రక్తం ఇవ్వండి నేను మీకు స్వేచ్ఛ ఇస్తాను అని నేతాజీ స్పష్టం చేశారన్నారు. మహాత్మాగాంధీ, నేతాజీ ఇరువురివి భిన్న ధ్రువాలైనా వీరిద్దరు మధ్య పరస్పరం గౌరవం ఉండేదన్నారు. డైరెక్టర్ ఆఫ్ నేతాజీ రిసెర్చ్ బ్యూరో ప్రొఫెసర్ సుగతా బోస్ మాట్లాడుతూ 1944లో నేతాజీ ఆజాద్ హింద్ రేడియో ద్వారా గాంధీజీని ఉద్దేశించి దేశవిముక్తి కోసం చేస్తున్న పోరాడుతున్న తమను ఆశీర్వదించవలసిందిగా సందేశం పంపారన్నారు.

విభజన సమస్యలపై పార్లమెంటులో పోరాడతాం

• 184 పద్దు కింద చర్చకు, ఓటింగ్‌కు పట్టుబడతాం • రాహుల్ తో భేటీ అనంతరం ఏపీసీసీ చీఫ్ రఘువీర



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన హామీలతో పాటు ఆ సందర్భంగా సభలో ఇచ్చిన హామీలను అమలు కోసం పార్లమెంటులో పోరుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఈ అంశంపై రూల్ 184 కింద చర్చతో పాటు ఓటింగ్‌కు పట్టుబట్టేందుకు అంగీకరించారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం ఢిల్లీలో తమ పార్టీ అధినేత రాహుల్ గాంధీని కలిసిన అనంతరం ఈ విషయం మీడియాకు వివరాలు వెల్లడించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత మర్యాదపూర్వకంగా తొలిసారి కలిసిన పీసీసీ చీఫ్ రఘువీరా, రాష్ట్ర సమస్యలపై తాము చేస్తున్న పోరాటాల గురించి వివరించారు. పోలవరం ప్రాజెక్టు కోసం ఈ మధ్య చేపట్టిన పాదయాత్ర, ఇతర ఆందోళనలపై ముద్రించిన పుస్తకాలను రాహుల్‌కు అందజేశారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత అంశాలు, పరిస్థితుల గురించి వివరించారు. పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, అలాగే విభజన హామీల అమలు విషయంలో ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నాయని రఘువీరా వివరించారు. రాష్ట్ర సమస్యలపై తాము పోరాడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలంటే పార్లమెంటు ఉభయ సభల్లో గట్టిగా నిలదీయాల్సిన అవసరం ఉందని రాహుల్ గాంధీకి రఘువీరా సూచించారు. ఇందుకు వెంటనే అంగీకరిస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న మల్లికార్జున్ ఖర్గేకు ఫోన్ చేసి చర్చకు నోటీసులిచ్చేందుకు సిద్ధమవ్వాల్సిందిగా రాహుల్ గాంధీ సూచించారు. భేటీ అనంతరం ఆంధ్రప్రదేశ్ భవన్లో మీడియాతో మాట్లాడిన రఘువీరా, విభజన హామీలు గాలికొదిలి కేవలం సీట్ల పెంపు కోసం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి వ్యూహాలు రచిస్తున్నారని విమర్శించారు. తాము ఈ సీట్ల పెంపునకు వ్యతిరేకం కానప్పటికీ, ప్రత్యేక హోదా సహా విభజన హామీలన్నీ నెరవేరిస్తేనే సీట్ల పెంపు ప్రతిపాదనకు సహకరిస్తామని రఘువీరా స్పష్టం చేశారు. ప్రాధాన్యతాంశాలను వదిలేసి సీట్ల పెంపు మీద మాత్రమే దృష్టి పెట్టడాన్ని తాము నిరసిస్తున్నామని అన్నారు. రెండు రాష్ట్రాల్లోనూ విభజన హామీలు అమలు పరిచేలా తాము పోరాటం చేస్తామని, పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సమయంలో సభలోపల, వెలుపల కూడా ఆందోళన చేపడతామని రఘువీరా తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికార ప్రతిపక్షాలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని, హామీలు అమలు చేయడం కాంగ్రెస్ వల్లనే సాధ్యమని నమ్ముతున్నారని రఘువీరా చెప్పుకొచ్చారు. రఘువీరాతో పాటు రాహుల్ గాంధీని కలిసినవారిలో గిడుగు రుద్రరాజు తదితరులున్నారు.


ఎంబీబీఎస్ విద్యార్థిని ఆత్మహత్య

• తల్లిదండ్రులదీ వైద్య వృత్తే...

లూధియానా: కేరళకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని జోయెల్ జోసెఫ్(20) లూధియానాలో సోమవారంనాడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. లూధియానాలోని ప్రైవేటు క్రిష్టియన్ మెడికల్ కళాశాలలో చదువుతోంది. అక్కడే కళాశాల హాస్టల్‌లో వుంటూ చదువుకుంటోందని పోలీసులు వెల్లడించారు. శీతాకాల సెలవులకు వెళ్లి జనవరి 8న కళాశాలకు తిరిగి వచ్చిందని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ విలియమ్ భట్ తెలిపారు. జోసెఫ్ తల్లిదండ్రులు కువైట్‌లో వైద్య వృత్తిలో పనిచేస్తున్నారని, ఘటనను ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు భట్ వెల్లడించారు. అయితే జెసెఫ్ హాస్టల్ గదిలో గోడపై 'నా మరణానికి నేనే బాధ్యరాలిని' అని రాసివుందని లూధియానా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో హర్‌జిందర్ సింగ్ పేర్కొన్నారు. స్నేహితులు కూడా జోసెఫ్ అలవాట్లలో కానీ, ఆమె నడవడికలో ఎటువంటి తేడాను గుర్తించలేదని పోలీసులకు తెలిపారు. జోసెఫ్ మృతదేహాన్ని పోస్టమార్టమ్‌కు పంపినట్లు పోలీసులు పేర్కొన్నారు.

డ్రగ్స్ కేసు కంచికేనా?

• చార్జిషీటు దాఖలులో జాప్యం.. • బెయిల్‌పై విడుదలైన నిందితులు • డ్రగ్స్‌కు కేరాఫ్‌గా మారిన భాగ్యనగరం



ఫైల్ ఫొటో

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపిన హైదరాబాద్ డ్రగ్స్ కేసు దర్యాప్తు పూర్తిస్థాయిలో చతికిలబడిందా? అన్న అనుమానాలు రేకెత్తుతు న్నాయి. హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియాలు ఎంతగా బరితెగించాయి? చివరికి 8,9 తరగతి చదివే పాఠశాల విద్యార్థులను సైతం డ్రగ్స్ బానిసలుగా చేసిన వైనాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ నేతృత్వంలోని బృందం అత్యంత సాహసంతో బహిర్గతపర్చింది. కేసులోని కీలక నిందితులు కాల్విన్, మైక్ కమింగా, గాబ్రియేల్, విజయవాడకు చెందిన లేడీ డాన్ సంగీతలను అరెస్టు చేశారు. వారిని విచారించి, వారి వారి కాల్‌డేటాను సైతం ఎక్సైజ్ సిట్ విశ్లేషించింది.

ఆ విశ్లేషణ ఆధారంగా పలు కీలక సమాచారాన్ని సంగ్ర హించింది. ఆ సమాచారం ఆధారంగా టాలీవుడ్‌కు చెందిన 12 మంది సినీస్టార్స్‌ను రోజుకు ఒకరు చొప్పున 12 రోజుల పాటు విచారణ చేసింది. డ్రగ్స్ వాడకం, వినియోగం, సరఫరా నేరమని ఎక్సైజ్ సిట్ పేర్కొంది. పబ్ కల్చర్ విస్తృతియే డ్రగ్స్‌మాఫియా చెలరేగిపోవడానికి కారణమని భావించింది. పబ్‌లు, క్లబ్‌ల యాజ మాన్యాలను పిలిచి ప్రశ్నించింది కూడా. సినీ స్టార్స్, కీలక నిందితుల విచారణ సందర్భంలో మరిన్ని సంచలనమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నగరంలో వున్న పబ్‌లన్నింటికీ స్లీపింగ్ పార్టనర్స్‌గా ప్రముఖ సినీస్టార్స్, రాజకీయ నేతలు ఉన్నట్లు ఎక్సైజ్ సిట్ గుర్తించినట్లు సమాచారం. ఈ విధంగా అన్ని కోణాల నుంచి ఎక్సైజ్ సిట్ సమగ్ర సమాచారాన్ని సెకరించింది. మరోవైపు ఈ డ్రగ్స్ మాఫియాలు డ్రగ్స్‌ను ఎక్కడ్నించీ.. ఏయే దేశాల నుంచి తెప్పిస్తున్నారన్న అంశంపై సైతం పరిశీలన చేసింది. అయితే ఆయా దేశాల నుంచి నగరానికి డ్రగ్స్ చేరకుండా ఉండేందుకు అనువైన చర్యలను చేపట్టింది. తపాలాశాఖ, ఇతరత్రా కార్గో సర్వీసు అధికారులతో సమావేశమైంది. 18-35 సంవత్సరాల వయస్సున్న వారు డ్రగ్స్‌ను తెప్పించుకునే వీలుందని.. ఈ క్రమంలో వారికి డ్రగ్స్ చేరకుండా ఉండే విధంగా ప్రయత్నించింది. తొలివిడత 12 మంది సినీ స్టార్స్‌ను విచారించిన ఎక్సైజ్ సిట్ తదుపరి విచారణలో మరికొంతమంది సినీస్టార్స్‌తో పాటు ప్రముఖులు, నేతలను విచారించేందుకు రంగం సిద్ధం చేసింది. రెండో లిస్టులో టాలీవుడ్‌లో పెద్దల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో, టాలీవుడ్ పెద్దలు సీఎంకు ఓ లేఖ రాశారు. ఆ లేఖలో పరిశ్రమకు సంబంధించిన వారెవరైనా ఉంటే తాము చర్యలు తీసుకోగలమని చెప్పుకొచ్చారు.


ఇదే క్రమంలో ప్రభుత్వం డ్రగ్స్ వాడకం దారులను డ్రగ్స్ బానిసలుగా పరిగణించాలని పేర్కొంది. దీంతో, అంతకుముందు రెండో లిస్టు సిద్ధం చేసినా ఎక్సైజ్ సిట్ దానిని విడుదల చేయలేదు. మరోవైపు 12 మంది సినీ స్టార్స్ విచారణ సందర్భంలో వారిలో కొందరి బ్లడ్ శాంపిల్స్‌ను తీసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపింది. ఆ ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక కోర్టుకు చేరిందని, రెండు, మూడు రోజుల్లోనే తమ వద్దకు వస్తుందని ఆ తర్వాత చర్యలుంటాయని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు చెబుతూ వస్తున్నారు. చార్జిషీట్ క ూడా దాఖలు పరుస్తామని ప్రకటనలు చేస్తూ వచ్చారు. ఇదే క్రమంలో చార్జిషీట్ దాఖలు లేటవడంతో ఆ కేసులో అరెస్టు చేసిన నిందితులంతా బెయిల్‌పై బయట పడుతుండటం గమనార్హం.

హైదరాబాద్ డ్రగ్స్ కేసు బయటపడినప్పట్నించీ నగరంలో డ్రగ్స్ వాడకం, వినియోగం, సరఫరా తగ్గిపోతాయని అంతా భావించారు. అందుకు భిన్నంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ రాజ్యమేలుతున్న సంగతి తెలిసిందే. శివారులలో కొన్ని మూతపడ్డ ఫ్యాక్టరీలను లీజుకు తీసుకుని డ్రగ్స్ మాఫియాలు డ్రగ్స్ తయారీకి పాల్పడుతున్నారు. ఇటీవల కూకట్‌పల్లిలో నేరెళ్ల చంద్రశేఖర్ అనే డ్రగ్స్ వ్యాపారిని మధ్యప్రదేశ్(ఇండోర్)కి చెందిన 11 మంది గ్యాంగ్ అంతమొందించింది. ఆ కేసులో నిందితులను పోలీసులు ఇంతవరకు అరెస్టు చేయకపోవడం గమనార్హం. ఇంకా డ్రగ్స్ సరఫరాకు పాల్పడుతూ పలువురు ఎక్సైజ్, పోలీసులకు చిక్కుతుండటం గమనార్హం. డ్రగ్స్ కేసు బయటపడిన అనంతరం సే టూ నో డ్రగ్స్ పేరిట ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన కార్యక్రమానికి సైతం ఆదరణ అంతంత మాత్రమే. మరి ఈ నేపథ్యంలో హైదరాబాద్ డ్రగ్స్ కేసులో ఎక్సైజ్ సిట్ కొనసాగింపు చర్యలకే పరిమితమవుతుందా? లేక కఠిన చర్యలకు ఉపక్రమిస్తుందా? అన్నది ఎక్సైజ్ సిట్‌కే తెలియాలి.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివాహ రిజిస్ట్రేషన్

కోచి: వివాహ రిజిస్ట్రేషన్ ఇప్పుడు మరింత సులభతరమైంది. వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే వధూవరులు ఇద్దరూ భౌతికంగా హాజరుకావాలిసి ఉండగా కేరళ హైకోర్టు ఈ నియమానికి సడలింపు ఇచ్చింది. భార్యాభర్తలు ఇరువురూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అంగీకారం తెలిపితే వివాహ రిజిస్ట్రేషన్ నమోదు అవుతుందని కేరళ హైకోర్టు తెలిపింది. మరో దేశంలో నివసిస్తున్న వ్యక్తి ఉనికిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు నిర్ధారిస్తుందని న్యాయస్థానం తెలిపింది. కొల్లంకు చెందిన ప్రదీప్ కొడివేడు క్లోటస్, అతని భార్య బెరిల్ ప్రదీప్ అభ్యర్థన మేరకు కేరళ హైకోర్టు ఈ తీర్పు వెల్లడించింది. 2000లో ఒక చర్చిలో ప్రదీప్, బెరెల్ వివాహం చేసుకున్నారు. అనంతరం ప్రదీప్ 2001లో కుటుంబ సభ్యులతో ఐర్లాండ్లో ఉన్నాడు. ఆ తర్వాత అతను 2016లో ఎల్1 వీసా కింద అమెరికా వెళ్లారు. అమెరికాలో శాశ్వత నివాసం పొందడానికి వారికి వివాహ సర్టిఫికెట్ సమర్పించవలసి ఉంటుంది. దీనికోసం వీరు కేరళ అధికారులకు దరఖాస్తు చేసుకున్నా అధికారులు అంగీకరించలేదు. వీరిద్దరూ అమెరికాలో ఉన్నందున అధికారులు నిరాకరించారు. వారు తమ వివాహం రిజిస్టర్ కోసం అమెరికా విడిచిపెట్టినట్లయితే తిరిగి ప్రవేశించేందుకు అమెరికన్ అధికారులు అనుమతించరని భయంతో వారు ఇండియా వచ్చేందుకు సమ్మతించలేదు. ఎట్టకేలకు వీరి అభ్యర్థన కేరళ అంగీకరించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివాహ రిజిస్ట్రేషన్‌కు అనుమతించింది. 2014లో ఢిల్లీ హైకోర్టు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివాహ ప్రమాణ పత్రాలను జారీ చేయాలని నిర్ణయించింది.

దుర్గ గుడి ఈవోగా పద్మ



అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడ ఇంద్రకీలాద్రి ఎగ్జిక్యూటివ్ అధికారిగా డాక్టర్ ఎం. పద్మను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో నలుగురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ బదిలీల్లో విజయవాడ దుర్గ గుడి ఆలయ నూతన ఈవోగా ఐఏఎస్ అధికారిణి డాక్టర్ ఎం పద్మ నియమితులయ్యారు. కాగా పద్మ ఇప్పటికే బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆమె మరో రెండు రోజుల్లో ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే రోడ్డు భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్‌ప్రసాద్, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ కార్యదర్శిగా గోపాలకృష్ణద్వివేది, (జీఏడీ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు), ఇక సీనియర్ ఐఏఎస్ అధికారి జేఎస్వీ ప్రసాద్‌ను ప్రభుత్వం రిజర్వులో ఉంచింది. ఆయన జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశాలు ఇచ్చింది.



'తెలంగాణ రెసిడెన్షియల్ స్కూళ్లు దేశానికే ఆదర్శం'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రెసిడెన్షియల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను పంజాబ్ సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల బృందం మంగళవారం సందర్శించింది. గౌలిదొడ్డి గురుకుల పాఠశాల, ఐఐటి అకాడమీలో ఏర్పాట్లను పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధనా పద్ధతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పేదలకు నాణ్యమైన విద్య అందించడంతుంటుందని వ్యాఖ్య నించారు. పంజాబ్ అధికారుల బృందానికి రిపు దమన్ సింగ్ నేతృత్వం వహించారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు దూరదృష్టితో అమలు జరుపుతున్న విద్యా విధానం దేశంలో తా ఆదర్శంగా ఉందని ఆయన అన్నారు. పేదలకు అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల అభిరుచికి అను గుణంగా వివిధ రంగాల్లో ప్రోత్సహిం చడం హర్షనీయం అన్నారు. తెలంగాణ రెసిడెన్సియల్ మోడల్ స్కూల్ విధానం దేశంలోనే అత్యుత్తమం అని రిపు దమన్ సింగ్ వ్యాఖ్యా నించారు. ఈ విధానాన్ని అమలు జరపాలనే ఆసక్తితోనే తెలంగాణలో పర్యటిస్తున్నామని వివరిం చారు. గురుకుల పాఠశాలలను సందర్శించిన అనంతరం పంజాబ్ ప్రతినిధి వర్గం తెలంగాణ సాంఘీక సంక్షేమ రెసిడెన్సియల్ విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్. ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్‌తో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. సంచాలకులు కరుణాకర్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గురుకుల పాఠ శాలల్లో అమలవుతున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను ప్రవీణ్ కుమార్, కరుణా కర్‌లు పంజాబ్ అధికారులకు వివరిం చారు. తెలం గాణలోని గురుకుల పాఠశాలల్లో చదువుకునే విద్యా ర్థుల సంఖ్య 2020 నాటికి 8 లక్షలకు చేరుకుం టుందని వివరించారు. రెసిడెన్సియల్ స్కూల్స్‌ను మరింత పరిపుష్టం చేయడా నికి ప్రభుత్వం రాబోయే రోజుల్లో రూ. 15,000ల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమైందని తెలియచేశారు.

ఏపీలో నలుగురు ఐఏఎస్‌ల బదలీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో నలుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తోన్న 2004 బ్యాచ్‌కు చెందిన ఎం.పద్మను విజయ వాడ దుర్గగుడి ఈవోగా నియమించారు. కార్మిక ఉపాధి శిక్షణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నీరబ్‌కుమార్‌ను నియమించగా, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ ముఖ్య కార్య దర్శిగా గోపాలకృష్ణ ద్వివేదిని నియమిం చారు. కాగా, సీనియర్ ఐఏఎస్ అధికారి జేఎస్వీ ప్రసాద్‌ను రిజర్వ్‌లో ఉంచుతున్నట్లు సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది.

మూడేళ్లలో చైనాను అధిగమిస్తాం

- సంస్కరణలతోనే 2 ట్రిలియన్ డాలర్లకు చేరిన ఆర్థిక వ్యవస్థ
- టెక్నాలజీని యువత అందిపుచ్చుకోవాలి: ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)తో పన్ను చెల్లింపులు పెరుగుతాయని, దీనిద్వారా వచ్చే రాబడితో అభివృద్ధి కార్య క్రమాలు చేపట్టేందుకు అవకాశాలు పెరుగుతాయని ఉప రాష్ట్ర పతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. పన్నుల చెల్లింపులో ఏకీకృతం, ఒకే విధానం, దేశవ్యాప్తంగా ఒకే పన్నురేటు, పారదర్శకత పెరిగి దేశమంతా ఒకే పన్ను చెల్లించే వ్యవస్థ ఏర్పడిందని ఆయన చెప్పారు. ఫైనాన్స్, టాక్సేషన్, మార్కె టింగ్ రంగాలలో సమకాలీన సవాళ్ళు అన్న అంశంపై కేశవ మెమోరియల్ విద్యాసంస్థలలో ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సును మంగళవారం ఆయన ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వ విద్యాలయ ఉపకులపతి రామచంద్రం, యూజీసీ సభ్యులు గోపాలరెడ్డి, కేశవ మెమోరి యల్ విద్యాసంస్థల అధ్యక్షుడు జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ, 90వ దశాబ్దంలో వచ్చిన సరళీకరణవల్ల దేశం త్వరితగతిన ఎదిగే ఆర్థిక శక్తిగా ఆవిర్భవించిందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ రెండు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. మాజీ ప్రధాని దివంగత పివి నరసింహారావు ప్రభుత్వం ప్రారంభిం చిన సంస్కరణలను వాజ్‌పేయి అమలు చేయగా, ప్రస్తుతం మోడీ ప్రభుత్వం కూడా వాటినే కొనసాగిస్తున్నాయని వెంక య్య చెప్పారు. రానున్న కాలంలో పెరుగుతున్న మధ్య తరగతి దేశ ఆర్థిక రంగాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందని అన్నారు.

దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ళలోపు వయస్సు వారే ఉన్నందున వీరికి ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉంద న్నారు. కేవలం డిగ్రీల కోసమే విద్య కాకుండా మెరుగైన జీవ నం కొనసాగించేందుకు ఉపయోగపడేలా ఉండాల న్నా రు. ఇందుకోసం నైపుణ్యాలను అందిపుచ్చుకోవా లని, పోటీ ప్రపం చంలో నిలదొక్కుకునేలా యువత అన్వేష ణలు చేపట్టా లని వెంకయ్య సూచించారు. ప్రభుత్వ రంగం ఒక్కటే ఉపాధి కల్పించలేదని, ప్రైవేట్ రంగంలో పెరుగుతున్న అవకా శాలను యువతరం సద్విని యోగం చేసుకోవాల న్నారు. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఇంక్యుబేటర్, ఇన్నోవేషన్స్ నినా దంతో ప్రధాని దేశాన్ని డిజిటల్ ఇండి యా గా తీర్చిదిద్దే ప్రయ త్నం చేస్తున్నా రని చెప్పారు.

పన్ను చెల్లింపుదారులను పెంచేం దుకే పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి వ్యవస్థను తెచ్చారని, ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న తరుణంలో పన్ను చెల్లింపులు పెరిగి ఆదాయం సమకూరితే రోడ్లు, పాఠశా లలు, ఆసుపత్రుల, ఇతర మౌలి క సదుపా యాల కల్పనకు అవకాశం పెరుగు తుం దని వెంకయ్య నాయుడు అన్నారు.

దేశ జాతీయ ఉత్పత్తిలో పన్నుల వాటా 16 శాతం ఉందని, అమెరికాలో 24 శాతం, చైనాలో 30లో శాతం ఉంటుందని తెలిపారు. దేశంలోని ప్రతి పౌరుడు పన్ను చెల్లించడం బాధ్యతగా గుర్తించాలని ఆయన సూచిం చారు. 2018లో ఆర్థిక వృద్ధిరేటు 7.3 శాతం ఉంటుం దని ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ ద్రవ్యనిధి అంచనా వేశాయ న్నారు. అయితే ఆర్థిక కార్యకలాపాలు విస్తరించిన తరుణంలో 10-15 ఏళ్ళలో ప్రపంచంలోనే మూడవ ఆర్థిక శక్తి భారత్ ఎదుగు తుందని ఆయన చెప్పారు. పెద్దనోట్ల రద్దుతో బ్యాంకు లకు 2.11 లక్షల కోట్ల నిధులతో రుణ లభ్యత పెరిగి ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన పన్ను సంస్కరణలు, పెరుగుతున్న నిత్యావ సరాల ధరలు, ప్రపంచ ఆర్థిక రంగంలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితులు, భారత్ ఆర్థిక రంగంపై ప్రభావం చూపు తాయని, ఈ సవాళ్ళను ఎదుర్కొనేలా కళాశాలలు పాఠ్యాం శాలను రూపొందించి, సమకాలీన అవసరాలకు తగిన విధంగా విద్యార్థులు స్పందించేందుకు వారిని సంసిద్ధు లను చేయాలని వెంకయ్య నాయుడు సూచించారు.



పుస్తకం విజ్ఞాన గని: నాయిని

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పుస్తకం అజ్ఞానం నుండి జ్ఞానం వైపు తీసుకెళుతుందని రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లో ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న పుస్తక ప్రదర్శనలో మంగళవారం నాడు ఆయన పాల్గొని ప్రసం గిస్తూ సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహి యా రచనలకు ప్రభావితుడై రాజకీయ రంగంలో ప్రవేశిం చానన్నారు. పుస్తకానికి అనితరమైన శక్తి ఉందని, పుస్తక పఠనం పాఠకులను ఉత్తేజపరుస్తుందన్నారు. పుస్తక ప్రద ర్శన నిర్వాహకుడు జూలూరి గౌరీశంకర్, సినీ దర్శకుడు నర్సింగ్‌రావు, ఎన్.శంకర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమి టీ సభ్యులు వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తే చర్యలు

పోలీసు శాఖలో విధులను నిర్వహిస్తూ శాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తే కఠిన చర్య లు చేపడతామని రాష్ట్ర హోం. కార్మికశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలి పారు. అవినీతి నిరోధక శాఖలో అడిషినల్ ఎస్పీగా పనిచేస్తున్న సునీత, కల్వ కుర్తి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న వై.మల్లికార్జునరెడ్డి వ్యవహారం శాఖ ప్రతిష్టకు భంగం కలి గించే విధంగా ఉన్నందున సస్పెండ్ చేశామని, మున్ముందు ఈ రకమైన సంఘ టనలు పునరావృతం కానీయరాదని హోంమంత్రి పోలీసు సిబ్బందిని హెచ్చరిం చారు.

భాగ్యనగరంలో అంతర్జాతీయ రామాయణ ఉత్సవం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అంతర్జాతీయ రామాయణ ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. రవీంద్రభారతిలో జరిగిన ఉత్సవ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రెండురోజుల పాటు రామాయణ చరిత్ర, సాంస్కృతిక వైభవం చాటేలా నృత్యప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు. ఆసియా దేశాలకు చెందిన పలువురు కళాకారులు ఉత్సవంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ సంద ర్భంగా మయన్మార్ రామాయణగ్రూప్ ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. బుధవారం సింగపూర్ రామాయణగ్రూప్ ప్రదర్శన జరగనుంది. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.



రహదారుల అభివృద్ధిలో రాష్ట్రం నెంబర్ వన్

- జూన్ నాటికి కాళేశ్వరం జలాలు: మంత్రి తుమ్మల

రామగుండం, ప్రభ న్యూస్ : రహదారుల అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా, రామగుండం పెద్దంపేట రైల్వే ఓవర్‌బ్రిడ్జిని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో 2వేల కిలోమీటర్ల కంటే తక్కువగా జాతీయ రహదారులు ఉండేవని, మూడున్నరేళ్లలో జాతీయ రహదారులు 3వేల కి.మీలకు పెరిగాయన్నారు. జాతీయ రహదారుల్లో జాతీయ సగటుకంటే ఎక్కువ రహదారులు మన రాష్ట్రంలోనే ఉండడం గర్వకారణమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు 2018 జూన్ నాటికి మొదటి ఫేజ్ పూర్తి చేసుకొని ప్రజలకు గోదావరి జలాలు అందు తాయన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించని విధంగా సంక్షేమ రంగానికి తమ ప్రభుత్వం రూ.45వేల కోట్లను కేటాయించిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న విధానాల వల్ల విద్యుత్ సమస్య పూర్తిగా తొలిగిపోయిం దన్నారు. ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర గొప్ప దన్నారు. రామగుండంనకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఎన్టీపీసీలో అదనంగా 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేలా కేంద్రాల నిర్మాణం జరుగుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులను చూసి గవర్నర్‌తోపాటు కేంద్ర జలమండలి సభ్యులు ప్రశంసలు కురిపించారన్నారు. ప్రతి ఇంటికి నల్లానీరు అందించడమే లక్ష్యంగా మిషన్ భగీరథ పనులు చురుగ్గా సాగుతున్నాయని, ప్రాజెక్టులను అడ్డుకునేందుకు అభివృద్ధి నిరోధకులు 197 కేసులు వేశారన్నారు. ఆడపిల్లల వివాహాలకు కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా రూ. లక్షా 116 అందిస్తున్నా మన్నారు. పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ మాట్లాడుతూ అధికారుల సహకారంతో ఆర్ఓబీ త్వరితగతిన నిర్మాణమైం దన్నారు. పెద్దపల్లిలో నాలుగు, మంచిర్యాలలో మూడు ఆర్ఓబీలు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. రూ.5వేల కోట్లతో రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునరుద్ధరించామన్నారు. రామ గుం డం రైల్వేస్టేషన్‌లో ఐదు ఎక్స్‌ప్రెస్‌రైళ్లు ఆగే విధంగా అధికా రులను ఒప్పించామన్నారు. కలెక్టర్ దేవసేన మాట్లాడుతూ రాష్ట్ర వృద్ధిరేటు దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. అనంతరం మంత్రులు రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు, జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు, మేయర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణకు నేపాల్ కితాబు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ అభివృద్ధిపై నేపాల్ బృందం ప్రశం సలజల్లు కురిపించింది. శాసనమండలి ఆవరణలో మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డిలతో ఆస్మాన్ నేపాల్ స్వచ్ఛందసంస్థ టీం నాయకురాలు రాధా కోయిరాలా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవల్ కిషోర్ యాదవ్‌లు మంగళవారం ఉమ్మడిరంగారెడ్డి జిల్లాలో తాము జరిపిన పర్యటన వివరాలను వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల భోధనాపద్ధతులు ఆధునికంగా ఉన్నాయన్నారు. బాలకార్మిక వ్యవస్థరూపు మాపేందుకు తెలంగాణ ప్రభుత్వంపెట్టుకున్న లక్ష్యాలు త్వరగా నెర వేరాలన్న ఆకాంక్షను రాధాకోయిరాలా, నవల్ కిషోర్యాదవ్ వ్యక్తం చేశారు. తెలంగాణలో తాము గమనించిన విషయాలను నేపాల్ ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్ళి అక్కడ కూడా తెలంగాణ తరహాలో విద్యావ్యవస్థపటిష్టతకు కార్య క్రమాలు అమలుచేయాలని కోరుతున్నామన్నారు. ఛైర్మన్ స్వామిగౌడ్, చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్‌లను నేపాల్ రావాల్సిందిగా ఆస్మాన్ నేపాల్ సంస్థ ప్రతినిధులు ఆహ్వానిం చారు.

నంబర్‌వన్‌గా తెలంగాణ: మండలి ఛైర్మన్ స్వామిగౌడ్

నేపాల్ నుండి అధ్యయన బృందం తెలంగాణకు రావడం సంతోషకరమని రాష్ట్రశాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి దేశంలోనే తెలంగాణను నంబర్‌వన్‌గా నిలుపుతామన్నారు. త్వరలోనే నేపాల్‌లో పర్యటించి అక్కడి పరిస్థితులు అధ్యయనం చేస్తామన్నారు. గడచిన మూడేళ్ళలో తెలంగాణ నేపాల్‌కంటే అత్యధిక అభివృద్ధి సాధించిందని చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. తనను కలిసిన నేపాల్ ప్రతినిధి బృందానికి తెలంగాణ వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని వివరించానన్నారు.

ప్రభుత్వం బీసీలను విస్మరించింది



జహీరాబాద్‌లో బీసీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

జహీరాబాద్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్రప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తూ వారిని పట్టించుకోవడం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని పద్మశాలి భవన్‌లో బీసీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగిస్తూ బీసీల పట్ల ప్రభుత్వం కపట ప్రేమ చూపుతు వారిని మోసం చేస్తుందన్నారు. సమస్యలతో రాష్ట్రం కొట్టు మిట్టాడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం కేవలం హామీలకు పరిమితం అయిందని అన్నారు. తెలంగాణలో ఎక్కడ చూసినా సమస్యలు కనిపిస్తున్నా యని అన్నారు. బీసీలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రపంచ స్థాయిలో భారతదేశం చాలా గుర్తింపు పొందిందన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో సైతం భాజపా అధికారం చేపడుతుందన్నారు. అంతకు ముందు పస్తాపూర్ చౌరస్తా నుంచి భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ పథకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ మోర్చా అధ్యక్షులు నర్సింహులు, రాష్ట్ర ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అంజనేయులు, జిల్లా భాజపా అధ్యక్షులు కాసాల బుచ్చిరెడ్డి, రాష్ట్రనాయకులు నందీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా ఎన్నికల కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారతీయ జనతా పార్టీ ఎన్నికలకు సమాయ త్తమవుతోంది. క్షేత్రస్థాయి నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా పార్టీ పరిస్థితిని తెలుసుకురెటూనే అవసరమైన వ్యూహాలకు పదను పెట్టడం కోసం ప్రత్యేకంగా సమా వేశాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బుధ వారం వరంగల్, మహ బూబ్‌నగర్ పార్లమెంటరీ స్థాయి సమావేశాలు, 25వ తేదీన చేవేళ్ళ, మల్కాజ్ గిరి పార్లమెంటరీ నియోజకవర్గాల సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచా యితీరాజ్ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమార్, పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షు డు కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొంటారు.

ఎకో టూరిజానికి పెద్దపీట

- పెద్దమునగాల, చింతగూడల్లో కొత్తగా ఎకో టూరిజం: మంత్రి జోగురామన్న



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎకో టూరి జానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య తను ఇచ్చి అభివృద్ధి పరుస్తుందని అటవీ శాఖ మంత్రి జోగు రామన్న వివరిం చారు. అటవీ అభివృద్ధి సంస్థ కార్యక్రమాలను మంత్రి మంగ ళవారం సచివాలయంలో సమీక్షించారు. అనంతరం జోగు రామన్న విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ఎకో టూరిజానికి మంచి భవిష్యత్ ఉందని వివరించారు. ఎకో టూరిజాన్ని ప్రోత్సహిం చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఎకో టూరిజం అభివృద్ధికి అనువైన ప్రాంతాలను గుర్తించాలని అధికారును ఆదేశించామన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌తో నేరెడిగొమ్మ మండలం పెద్ద మునగాల గ్రామంలో రూ. 2 కోట్ల వ్యయంతో కొత్త ప్రాజెక్టులు చేపట్టామని జోగు రామన్న తెలిపారు. మంచిర్యాల జిల్లా జిన్నారం మండలం చింత గూడ గ్రామంలో రెండు కోట్లతో కొత్తగా ప్రాజెక్టు పనులు చేపట్టామన్నారు. గత కొంత కాలంగా అటవీ అభివృద్ధి సంస్థ గణనీయమైన అభివృద్ధిని సాధించిందని తెలియచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యూకలిప్టస్ అమ్మకాల ద్వారా రూ. 123 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. 2013 -14లో 44.92 లక్షల మెట్రిక్ టన్నుల యూకలిప్టస్ దిగుమడి రాగా, అదే 2017 -18లో యూకలిప్టస్ దిగుబడి 88.55 లక్షల మెట్రిక టన్నులకు చేరుకుందన్నారు. వెదురు ఆదాయం ఉమ్మడి రాష్ట్రంలో రూ. 5 కోట్లు కాగా స్వరాష్ట్రంలో ఈ ఏడాది రూ. 13 కోట్లు వచ్చిందని మంత్రి వివరించారు. అడవుల్లో మంటలను ఆర్పేందుకు నూతన సాంకేతికతను అందిపుచ్చు కుంటున్నామని, అందుకు ఆస్ట్రేలియా సాంకేతికతను వినియోగించడం జరుగుతుందన్నారు. దేశంలోనే మొదటి సారిగా హైదరాబాద్ కొండాపూర్‌లోని కొత్తగూడ వద్ద ఉన్న బొటానికల్ గార్డెన్‌లో పాలపిట్ట సైక్లింగ్ పార్కును ఏర్పాటు చేశామని మంత్రి తెలియచేశారు. ఈ పార్కుకు ప్రతి నెల దాదాపు 60 వేల మంది సందర్శకులు వస్తున్నారని వివరించారు. అటవీ అభివృద్ధి సంస్థ కార్యకలాపాలను మరింతగా విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి జోగు రామన్న తెలిపారు. ఎఫ్‌డిసి ఛైర్మన్ బండ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో ఎఫ్‌డిసీ పూర్తిగా నిరాదరణకు గురైందని తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్రంలో ఎఫ్‌డిసీ ఆదాయం 200 శాతం విస్తరించింద న్నారు. రానున్న రోజుల్లో ఎఫ్‌డిసిని మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. సమీక్షలో ఎఫ్‌డిసీ మేనేజింగ్ డైరెక్టర్ చందన్ మిత్రా తదితరులు పాల్గొన్నారు. సంస్థ పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో మంత్రికి వివరించారు. ఎర్ర చందనం పెంచడానికి తెలంగాణ భూములు అనువైనవి కావని ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి తెలిపారు. ఎర్ర చందనం చెట్లను పెంచాలనే ప్రతిపాదనను ఉపసంహరిం చుకున్నామని తెలిపారు. అటవీ నేలల స్వభావానికి అనుగుణంగా వృక్షాలను పెంచడం జరుగుతుందని జోగు రామన్న తెలిపారు.

జాతర పూర్తయ్యే వరకూ లారీలు బంద్ చేయాలి: పొన్నాల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. ఇసుక లారీల వల్ల ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆయన విమర్శించారు. మేడారం జాతర పూర్తయ్యే వరకు మేడారం రాహ దారిపై ఇసుక లారీలను బంద్ చేయాలని కోరుతూ మంగళవారం ఆయన ప్ర భుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 4 వరకు జరిగే మేడారంలో సమ్మక్క- సారలమ్మ జాతర జరుగుతుందని, ఈ జాతర దేశంలోనే అతి పెద్దదని ఆయన పేర్కొన్నారు. మేడారం జాతరకు లక్షలాది మంది జనం వస్తారని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ములుగు వద్ద రెండు రోజుల క్రితం ఒక తహసిల్దార్ ఇసుక లారీ ఢీ కొట్టడం వల్ల చనిపోయారని, గతంలో సిరిసిల్లలో నెరెళ్లలో చాల మంది మృతి చెందారని సీఎస్‌కు రాసిన లేఖలో పొన్నాల గుర్తు చేశారు. మేడారంలో ప్రమాదాలకు తావు లేకుండా ప్రభుత్వం చూడాలని ఆయన పేర్కొన్నారు.

మిషన్ భగీరథతో విప్లవాత్మక మార్పులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రజల భాగస్వా మ్యం తోనే మిషన్ భగీరథను సమర్థవంతంగా నిర్వ హించ వచ్చని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్ అన్నా రు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక, సామాజిక వ్యవస్థలో మిషన్ భగీరథతో విప్లవాత్మక మార్పు రావడం ఖాయ మన్నారు. భగీరథలో ప్రజల భాగస్వా మ్యంపై ఎర్రమంజిల్‌లోని ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్ కార్యాల యంలో జరిగిన ఒక రోజు వర్క్ షాప్‌ను ఎస్‌పి సింగ్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రెండు నధుల మధ్య ఉన్నప్పటికీ తీవ్రమైన నీటి కొరత ఉంటుం దన్నారు. భౌగోళికస్వరూపంతో పాటు ఇతర అంశాలు ఇందుకు కారణమని, ఫలితంగా లక్షలాది మందికి తాగునీరు అందడం లేదన్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథను ప్రారంభించిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫలాలు మొదట ఎస్సీ, ఎస్టీలకే అందుతాయన్నారు. భగీరథ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని, 19 ఇంటెక్స్‌వెల్స్ పూర్తయ్యాయని, 50 నీటి శుద్ధి కేంద్రాలలో 46 పూర్తయ్యాయని, 91 శాతం పైప్‌లైన్ పనులు పూర్త య్యాయని వివరించారు. పది రోజుల్లో మిగతా పైప్ లైన్ పనులు పూర్తి కానుందని, తర్వాత 24,225 గ్రామా లకు దశల వారిగా బల్క్ నీటిని అందించ నున్నామన్నారు. మార్చ్ 15 నాటికి రాష్ట్రంలోని చివరి గ్రామానికి నీళ్ళందుతాయని అన్నారు. తర్వాత గ్రామాల్లో అంతర్గత నీటి సరఫరాపై దృష్టి కేంద్రీకరించ నున్నామని పేర్కొన్నారు.

యూనిసెఫ్ హైదరాబాద్ చీఫ్ రస్డియా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి సురక్షిత నీటిని అందిం చాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని యునిసెఫ్ ఇప్పటికే అభినం దించిందని గుర్తు చేశారు. సురక్షిత మంచినీటితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడు తుం దన్నారు. క్వాలిటీ ఆఫ్ వాటర్ ఈజ్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ అన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇఎన్‌సి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, మిషన్ భగీరథ ప్రారం భించినపుడు చాలా మంది కి అపోహ లుండేవని, వాటన్నిం టిని పటాపం చలు చేస్తూ త్వరలోనే ప్రతి గ్రామానికి బల్క్‌గా నీటిని అందించబోతున్నామని చెప్పారు.

రెండో దశ డీపీఆర్‌ను సిద్ధం చేయండి


మెట్రోరైల్ రెండవ దశ పనుల కోసం సమగ్ర కార్యా చరణ ప్రణాళిక (డీపీఆర్)ను రూపొం దించా లని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ ఆదేశించారు. ఇందుకు అవసరమైన కసరత్తును హైదరాబాద్ జిల్లా పరిసర జిల్లాల కలెక్టర్లతో కలిసి రూపొందించాలన్నారు. ప్రస్తుతం మెట్రో ఫేజ్-1 కింద సాగుతున్న పనులను ఈ సంవత్స రాంతం లోగా పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎలాంటి కాలయాపనకు తావుండకూడదని అన్నారు. మంగళవారం సచివాలయంలో ఎస్పీసింగ్ సంబం ధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న మెట్రో పనుల పురోగతి..... నాగోల్ నుంచి మియాపూర్ వరకు నడస్తున్న మెట్రోరైల్ ప్రయాణికులకు కల్పి స్తున్న ఇతర రవాణా సౌకర్యాలు....మెట్రో ఫేజ్-2 పనుల ప్రతిపాదనలపై ఆయన చర్చించారు. మెట్రోను నగరం నాలుగువైపుల నుంచి నడపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో మెట్రో ఫేజ్-1 పనులను సకాలంలో పూర్తి చేసు కుంటూనే....రెండవ దశ పనులపై దృష్టి సారిం చాలని సూచించారు.

ఆ ఎమ్మెల్యేలపై వేటెయ్యండి

- రాష్ట్రపతి, ఈసీకి రేవంత్‌రెడ్డి ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 21 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసినట్లుగానే.. తెలంగాణ రాష్ట్రంలోని తొమ్మిది మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలని కోరుతూ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి రాష్ట్రపతి, చీఫ్ ఎన్నికల కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు పార్లమెంట్ సెక్రటరిలుగా కొనసాగారని, మరో ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రభుత్వంలోని లాభదాయక పదువుల్లో నియామకమై విధులు నిర్వహిస్తున్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే డి. వినయ్‌భాస్కర్, కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్ సీఎం కార్యాలయంలో, మహబూబ్‌నగర్, తుంగతూర్తి ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, గాదారి కిషోర్‌లు డిప్యూటీ సీఎం కార్యాలయంలోనూ. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ విద్యాశాఖ మంత్రి కార్యాలయంలో, ఆషిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయంలోనూ పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం 2014 డిసెంబర్ 29న జీఓఎంఎస్ నెంబర్ 173 ను జారీ చేయగా రాజ్యాంగ విరుద్ధమైన ఈ చర్యపై హై కోర్టులో సవాల్ చేయడంతో 2015 మే 1న ఈ ఉత్తర్వులను హై కోర్టు రద్దు చేసిందని ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత కూడా మరో ముగ్గురు ఎమ్మెల్యేలు సోమారపు సత్యనారాయణ (రామగుండం) ఆర్టీసీ ఛైర్మన్‌గా, రసమయి బాలకిషన్ (మానుకొండూరు) సాంస్కృతిక శాఖ సారథిగా , బాల్కొం డ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్ మెంట్ ఛైర్మన్‌గా కేబినెట్ హోదాలో తెలంగాణ ప్రభుత్వం నియమించిందని రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా పదవు ల్లో కొనసాగడానికి వీల్లేదని తక్షణమే వేటు వేయాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మహిళలు, దళితులకు ప్రాతినిధ్యమేదీ?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెరాస ప్రభు త్వంలో దళితులు, మహిళలకు ప్రాతినిధ్యం లేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత గడీల పాలన సాగుతోందని తెలు గుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ దుయ్యబట్టారు. రాష్ట్రం లో నియంతృత్వ పాలన సాగుతోందని, ప్రభుత్వా న్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనా యించి వేధిస్తు న్నారని ఆయన మండిపడ్డారు. ఎందరో నియం తలు కాల గర్భంలో కలిసిపోయారని, కేసీఆర్‌కు కూడా అదే పరిస్థితి తప్పదని ఆయన హెచ్చ రించారు. తెదేపా కార్యకర్తల నాలుగవ బ్యాచ్ శిక్షణా తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ పోరాటాలతో ప్రజల్లో ఉం టుందని, ప్రజా సమస్యలపై రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. పార్టీని తెరాస లో విలీనం చేయాలని మోత్కుపల్లి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, ఆయన తన మాటలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మోత్కుపల్లి వ్యాఖ్యలపై జాతీయ పార్టీకి నివేదిక పంపిస్తామని ఆయన చెప్పారు. రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తెదేపాకే మళ్ళీ పట్టం కట్టే అవకా శాలు ఉన్నాయని అన్నారు. తెరాసను గడీల పాలన, దొరల పాలన అని నిన్నటి వరకు విమర్శించిన తెదేపా నాయకులు ఇప్పుడు అదే పార్టీలో విలీనం చేయాలని అనడం సమంజసమేనా అని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టుల రీడిజైనింగ్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పేరుతో ప్రజాధనాన్ని దోచుకుం టున్నారని రేవూరి ప్రకాశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. ప్రాణహిత-చేవెళ్ళకు దాదాపు 10వేల కోట్లను ఖర్చుచేస్తే తెరాస ప్రభుత్వం వచ్చి దాన్ని మూడుగా విడగొట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆయన చెప్పారు.

అసెంబ్లీ సీట్ల పెంపుపై కేంద్రం ఊగిసలాట



- పార్టీ ప్రయోజనాల లెక్కలు తేలనందునే జాప్యం
- రాజకీయ నిర్ణయంపై డైలమాలో అధిష్ఠానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అధికార పార్టీలను ఊరిస్తున్న అసెంబ్లీ సీట్ల పెంపు వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం ఊగిసలాట ధోరణి ప్రదర్శిస్తోంది. నిన్న మొన్నటి వరకు సీట్లు పెంచే ప్రసక్తే లేదని నిర్మొహమాటంగా తేల్చి చెప్పిన కేంద్రం, ఇప్పుడు ఎటూ తేల్చుకోలేక పోతోంది. విభజన హామీల్లో మిగతావాటి విషయంలో ఎలా ఉన్నా, సీట్ల పెంపు విషయంలో మాత్రం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకే మాటపై ఉన్న విష యం తెలిసిందే. వీలు దొరికితే చాలు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూనే ఉన్నారు. పదే పదే ఈ అంశంపై ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తూనే ఉన్నారు. ఈ మధ్య ఏడాదికి పైగా విరామం తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సీట్ల పెంపు గురించే ప్రధానంగా చర్చించారు. అయితే గతంలో మాదిరి మొహం మీదనే కాదని చెప్పకుండా, పార్టీ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, అమిత్ షాని కలవాలని ప్రధాని మోడీ సూచించినట్టు తెలుస్తోంది. దీంతో ఆయన వైఖరిలో మార్పు వచ్చిందనే సంకేతాలు తెలుగు రాష్ట్రాల్లో బలంగా వెళ్లాయి. ఇక ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల్లో సీట్ల పెంపు అమలైపోయినట్టుగానే కథనాలు అల్లేశారు. అసలు విషయానికొస్తే ప్రధానిని కలిసిన తర్వాత చంద్రబాబు నాయుడు సీట్ల పెంపు అంశంపై అమిత్ షాను కలిసి ఒప్పించాల్సిందిగా బాధ్యతను కేంద్రంలో సహాయ మం త్రిగా ఉన్న తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత వై.ఎస్. చౌదరి (సుజనా చౌదరి)కి అప్పగించారు. ఆయన ఈ వారం లో అమిత్ షాతో భేటీ కానున్నారు. అయితే సీట్లు పెంచే ప్రసక్తే లేదని నిర్మొహమాటంగా చెప్పిన మోడీ వైఖరిలో నిజంగానే మార్పు వచ్చిందా లేక మొహమాటం కొద్దీ అమిత్ షాను కలవమని చెప్పి తప్పించుకున్నారా అన్న విషయంపై ఢిల్లీ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

నిజానికి సీట్ల పెంపు మీద కేంద్ర ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఎటువంటి కదలిక లేదని సాక్షాత్తూ తెలుగుదేశం పార్టీ వర్గాలే చెబుతున్నాయి. కాకపోతే గత ఏడాది వెంకయ్య నాయుడు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో దీనిపై గట్టిగా కసరత్తు చేశారు. ఆయన చొరవతో కేంద్ర హోంశాఖలో కేబినెట్ నోట్ కూడా సిద్ధమైంది.

అది ఏ క్షణంలోనైనా కేబినెట్ సమావేశం ముందు కొచ్చేదే. కానీ ఈ దశలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ వ్యక్తం చేసిన అభ్యంతరాలు తెరపైకొచ్చాయి. ఈ నిర్ణయం వల్ల రాజకీయంగా భారతీయ జనతా పార్టీకి తెలుగు రాష్ట్రాల్లో ఏ మాత్రం ప్రయోజనం ఉండదని, పైపెచ్చు ఇటు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి, తెలంగాణలో టీఆర్ ఎస్‌కు మాత్రమే లబ్ది కలిగిస్తుందని వారు పేర్కొన్నారు. దీంతో కేంద్ర హోంశాఖ వద్ద కేబినెట్ నోట్ సైతం సిద్ధమైన దశలో ఫైల్ ఆగిపోయింది. అప్పటి నుంచి ఎక్కడ వేసిన గొం గళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఈ కేబినెట్ నోట్ సిద్ధం చేసే క్రమంలో కేంద్ర హోంశాఖ తొలుత అటార్నీ జన రల్ అభిప్రాయాన్ని తీసుకోగా, రాజ్యాంగ సవరణ చేస్తే తప్ప సీట్ల పెంపు సాధ్యపడదని తేల్చి చెప్పారు. ఆ తర్వాత కేంద్ర న్యాయశాఖ సైతం ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. తెలంగాణలో 119 స్థానాల నుంచి 153 స్థానాలకు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 175 స్థానాల నుంచి 225 స్థానాలకు, అంటే ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 2 అసెంబ్లీ స్థానాలు పెరిగేలా నాడు కేంద్ర హోంశాఖ కసరత్తు చేసింది. ఈ క్రమంలో 2001 నాటి జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకోవాలా, 2011 నాటి జనాభా లెక్కల్ని పరిగణలోకి తీసుకోవాలా అన్న ధర్మసందేహాన్ని సైతం వెలిబుచ్చింది. రాజ్యాంగ సవరణకు సైతం సిద్ధపడుతూ కేబినెట్ నోట్ తయారు చేసింది. కానీ రాజకీయ నిర్ణయం దగ్గర ఆగిపోయింది.

సీట్లు పెరిగితే ఎవరికి లాభం?

అసెంబ్లీ స్థానాల సంఖ్య పెంపుపై ఒక్కో రాజకీయ పార్టీ ఒక్కో రకమైన లెక్కలు వేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలు పెద్ద సంఖ్యలో ఇతర పార్టీల నేతల్ని చేర్చుకోవడంతో ఈ సమస్య మొదలైంది. పాతవాళ్లను వదులుకోకుండా కొత్తగా చేరినవారికి ఎన్నికల సమయంలో టికెట్లు ఇవ్వాలంటే సీట్ల సంఖ్య పెంచక తప్పదు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సుస్థిరత సాధించడం కోసం అసెంబ్లీ స్థానాల సంఖ్య పెంచాలని ప్రస్తావించడం తెలుగుదేశం, టీఆర్ఎస్ పార్టీలకు అవకాశంగా మారింది. విభజన చట్టంలో పొందుపరిచిన ఏ ఇతర హామీ కంటే కూడా ఈ సీట్ల పెంపుపైనే తమ సర్వశక్తులూ ఒడ్డి ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. సీట్లు పెరగలేదంటే కొత్తగా చేర్చుకున్న నేతలు, పార్టీకి మొదటి నుంచి సేవలందరిస్తున్న నేతల్లో ఎవరో ఒకరిని వదులుకోక తప్పని పరిస్థితి నెలకొంది. అందుకే ఈ సీట్ల పెంపు టీడీపీ, టీఆర్ఎస్‌కు తప్ప మరి ఏ ఇతర రాజకీయ పార్టీకి లాభం లేదని చెప్పుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉనికే లేకుండా పోయినప్పటికీ, తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ సైతం సీట్ల పెంపు విషయంలో వ్యతిరేక ధోరణినే ప్రదర్శిస్తోంది. విభజన చట్టంలోని హామీలన్నింటినీ అమలు చేస్తూ సీట్లు పెంచితే తమకు అభ్యంతరం లేదని, కేవలం తమ రాజకీయ ప్రయోజనాలు కాపాడే సీట్ల పెంపును మాత్రమే అమలు చేస్తామంటే అసలు అంగీకరించే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉండి, తెలుగు రాష్ట్రాల్లో సొంత బలాన్ని పెంచుకోవాలని చూస్తున్న బీజేపీ కూడా ఈ విషయంలో ప్రతికూలంగా వ్యవహరిస్తోంది. తమకు ప్రయోజనం లేని సీట్ల పెంపు హామీని ఎందుకు అమలు చేయాలన్న సందిగ్ధావస్థలో ఉంది.

పొత్తులకు లంకె!

సీట్ల పెంపుతో తమకు ప్రయోజనం లేదని భావిస్తున్న బీజేపీని ఒప్పించడం కోసం పెరిగే సీట్లలో పొత్తుల్లో భాగంగా అధిక భాగం బీజేపీకి కేటాయిస్తామన్న ప్రతిపాదన తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చినట్టు సమాచారం. బీజేపీకి కేంద్రంలో బలం పెరగాలంటే ఎక్కువ మంది ఎంపీలు అవసరం కాబట్టి, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఎక్కువ ఎంపీ సీట్లు కేటాయిస్తామని టీడీపీ చెబుతున్నట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఒక్క ఎంపీని కూడా గెలిపించుకునే సంఖ్యా బలం లేని బీజేపీకి సురేశ్ ప్రభును తమ బలంతో గెలిపించి తెలుగుదేశం పార్టీ బహుమతిగా ఇచ్చింది. ఈ అంశాన్ని గుర్తుచేస్తూ, సార్వత్రిక ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ ఎంపీ సీట్లు వదులుకునైనా అసెంబ్లీ సీట్ల పెంపు సాధించుకోవాలని చూస్తోంది. ఒకవేళ ఈ ప్రతిపాదన నిజమైన పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో సీట్లు పెంచడానికి బీజేపీకి అభ్యంతరాలు ఉండకపోవచ్చు. కానీ తెలంగాణలో టీఆర్ఎస్‌తో ఎలా వ్యవహరించాలన్న విషయంపైనే ఇంకా ఆ పార్టీకి స్పష్టత రాలేదని చెప్పుకుంటున్నారు. అందుకే నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని తెలుస్తోంది.



28న టీపీసీసీ ఆత్మీయ సమ్మేళనం..?

- బస్సుయాత్రకు ముందే ఐక్యతారాగం యోచన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్లను ఏకతాటిపైకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఎన్నికల సమయం సమీపిస్తున్న సమయంలో.. నాయకులు ఎవరికి వారే కాకుండా ఐక్యంగా ఉన్నారనే సమాచారం ప్రజలకు, పార్టీ కేడర్‌కు పంపేందుకు టీ పీసీసీ నాయకత్వం సిద్ధం అవుతోంది. అంతే కాకుండా వచ్చే నెల రెండో వారం నుంచి టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు, సీనియర్లు చేపట్టే బస్సు యాత్రలో నాయకులందరూ కలిసి ఉంటేనే ప్రయోజనం ఉంటుందని, ఎడ మొహం, పెడమొహంగా ఉంటే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంటుందని అభిప్రాయంతో కొంత మంది కాంగ్రెస్ నేతలు ఉన్నారు. అందుకనే బస్సుయాత్రకు ముందుగానే ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి కేంద్ర, రాష్ట్ర మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్లకు ఆహ్వానాలు పంపుతున్నారు. దీంతో నాయకులు ఏకతాటిపై రావడంతో పాటు నేతల మధ్య ఏమైనా చిన్న చిన్న విభేదాలు ఉంటే సర్దుకుని పోయే విధంగా ఈ ఆత్మీయ ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ ఆత్మీయ సమ్మేళనం పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత నివాసంలో ఈ నెల 28 నిర్వహించనున్నట్లు సమాచారం. జిల్లాల వారిగా చూస్తే పార్టీ ముఖ్యనేతల్లోనూ విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. ప్రధానంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా విషయానికి వస్తే టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే విధంగా విభేదాలు ఉన్నాయి. ఒకానొక దశలో టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌ను పరిగణలోకి తీసుకునేది లేదని కోమటిరెడ్డి బ్రదర్స్ బహటంగానే విమర్శలు చేశారు. దీంతో పార్టీ అధిష్టానం కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు అప్పట్లోనే వార్తలు వినిపించాయి. టీ పీసీసీ చీఫ్ పదవి నుంచి ఉత్తమ్‌ను మార్చి కొత్తవారికి అవకాశాలు ఇస్తారని కూడా ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఇలా తెలంగాణాలోని ప్రతి జిల్లాలో ముఖ్య నేతల మధ్య విభేదాలు ఉన్నాయని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. కాగా వీటన్నింటికి పార్టీ హైకమాండ్ చెక్ పెట్టి ఉత్తమ్‌నే టీ పీసీసీగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఉత్తమ్‌కు వ్యతిరేకంగా ఉన్న కొంత మంది సీనియర్లు కొంత వెనక్కి తగ్గారు. హైకమాండ్ తీసుకున్న నిర్ణయాన్ని ఈ కీలక సమయంలో వ్యతిరేకిస్తే పార్టీ ఇబ్బందులు తప్పవనే అంచనాకు వచ్చినట్లు ఉత్తమ్ వర్గీయులు చెబుతున్నారు. ఈ సమయంలో పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీ సీనియర్లను కలుపుకుని వెళ్లాలనే ఆలోచనకు ఉత్తమ్ వచ్చినట్లుగా సమాచారం. గతంలో ఉన్న చిన్న చిన్న సమస్యలను పట్టుకుని ఉండటం కంటే వాటన్నింటిని మర్చి.. ఐక్యతా రాగం వినిపించేందుకు ఆత్మీయ సమ్మేళం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే ఏ విధంగా ముందుకు పోవాలో ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. అయితే ఈ సమావేశానికి సీనియర్లందరూ వస్తారా..? లేక అత్యవసర పనులు ఉన్నాయని తప్పించుకుంటారా..? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

పాక్ సీజే స్కర్టు కామెంట్



ఇస్లామాబాద్: స్కర్టు గురించి వ్యాఖ్యలు చేసిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని పాకిస్తానీ మహిళా హక్కుల కార్యకర్తలు మంగళవారం తీవ్రస్థాయిలో విమర్శించారు. మహిళలు న్యాయవాద వృత్తి చేపట్టకుండా తీవ్రమైన లైంగికవాదాన్ని తన వ్యాఖ్యలతో బట్టబయలు చేసుకున్న చీఫ్ జస్టిస్ సఖీబ్ నిసార్ బహిరంగంగా క్షమా పణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు సీజే ఈ నెల 13న కరాచీలో ప్రసంగిస్తూ మాజీ బ్రిటీష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌ను ఉటంకిస్తూ ఒక మంచి ప్రసంగం మహిళ వేసుకున్న స్కర్టులా ఉండాలి. దేహం కనిపించకుండా ఉండాలి. అలాగే ఆసక్తిని రేకెత్తించాలి అని వ్యాఖ్యానించారు. దీనిపై మహిళా కార్యాచరణ వేదిక(డబ్ల్యూఏఎఫ్) కరాచీ విభాగం చీఫ్ జస్టిస్‌కు లేఖ రాసింది. ఈ వ్యాఖ్య తీవ్రమైన లైంగికవాదాన్ని, మహిళల పట్ల ద్వంద్వ వైఖరిని బట్టబయలు చేస్తున్నది. ఇలాంటి వైఖరితో న్యాయవాద వృత్తికి దూరంగా మహిళలను ఉంచుతున్నారు అని విమర్శించింది. అంతేకాక న్యాయ వ్యవస్థ సహా వేర్వేరు స్థాయుల్లో మహిళలు వేధింపులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది.



కోల్‌కతాలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఫుల్‌డ్రస్ రిహార్సల్ విన్యాసం

ప్రాచీన సంపద ఆనవాళ్లు గల్లంతు!

న్యూఢిల్లీ: ఉత్తర భారత దేశంలోని సుప్రసిద్ధ ప్రాచీన ఆలయం కుతుంబారి. కొన్ని శతాబ్దాల కిందటి ఈ ఆలయం ద్వారహట్ ప్రాంతంలో ఉండేది. పురావస్తు రికార్డుల్లో దీని ఆచూకీ గల్లంతయినట్లు 1960 దశకంలో అధికారులు గుర్తించారు. కుతుంబారి అదృశ్యమైనట్లేనని కొన్నేళ్ల తర్వాత అధికారులు ధృవీకరించారు. ఈ ఇలాంటి కుతుంబారీలు చరిత్రలో మరెన్నో ఉన్నాయి. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా ఎన్నో చారిత్రక వారసత్వ కట్టడాలు కనుమరుగు అవుతున్నాయి. కుతుంబారి తరహాలో భాగ్యరేఖ మారుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి వేగం పుంజుకుంది. నరేంద్ర మోడీ లాంటి క్రియాశీల నాయకులు మార్పును తీసుకొస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది మంచి పరిణామమే. కానీ కేవలం అభివృద్ధి పేరుతో వందలాది ప్రాచీన స్మారకాలు, శతాబ్దాల చరిత్రను ధ్వంసం చేయాలనుకోవడం అవివేకం. నాటి కట్టడాలను ధ్వంసం చేయడం లేదా, వాటి ఉనికిని క్షీణింప జేయడం ఎంతమాత్రం ఆమోదనీయం కాదు అని వాస్తవానికి, మెట్రో మార్గాలు, రోడ్ల విస్తరణ, కాలనీల ఏర్పాటు కారణంగా స్మారకాల పరిసర ప్రాంతాలకు విలువ పెరగడంతో వీటి రక్షణ ప్రమాదంలో పడింది అని భారతీయ ప్రాచీన కళలు, సంస్కృతి జాతీయ సంస్థ ఢిల్లీ విభాగం కన్వీనర్ స్వప్న లిడిల్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి లక్ష్యాలకు ప్రాచీన వారసత్వ సంపదను ధ్వంసం చేయడం దురదృష్టకరం అన్నారు. సరైన నిర్వహణ, మరమ్మతులు లేక చాలా వరకు ప్రాచీన కట్టడాలు పర్యాటకులకు చేరువ కావడం లేదు. పైపెచ్చు, రక్షణ చర్యలు కరువై ఈ ప్రాంతాలు తప్పుబట్టాయి. ఇలాంటి పరిణమాలు శతాబ్దాల చరిత్రను సమాధి చేస్తాయని కొల్లాం ఎంపీ ఎన్‌కే ప్రేంచంద్రన్ నిర్మొహమాటంగా చెప్పేశారు. వీటిని మన జాతికి పూర్వీకులు అందించిన వారసత్వ సంపదగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వీటి విలువను ద్రవ్య పరిభాషలో లెక్కించడం సాధ్యం కాదన్నారు. ఈ బిల్లు రాజ్యసభలో పాసయితే, ప్రాచీన చరిత్ర సమాధి కావడం ఖాయమన్న ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే డజన్ల సంఖ్యలో స్మారకాలను కోల్పోయాం.



- ప్రసిద్ధ కట్టడాల అన్వేషణలో ఆర్కియాలజీ విభాగం
- కాలగర్భంలోకి శతాబ్దాల చరిత్ర!
- ప్రకృతి విపత్తులు, పట్టణీకరణతో శిథిలమవుతున్న స్మారక నిర్మాణాలు



అంతుచిక్కని ప్రాచీన స్మారకాలు 24 ఉన్నాయి. ఇప్పుడు వీటిని అన్వేషించే పనిలో పురావస్తు యంత్రాంగం నిమగ్నమైంది. రికార్డుల సంరక్షణ లోపంతో కొన్ని ఉనికి కోల్పోయాయి. ప్రకృతి విపత్తులు, మానవ విధ్వంసాల మూలంగా మరికొన్ని ధ్వంసం అయ్యాయి. ఈ మధ్య కాలంలో ప్రాచీన స్మారకాలపై చట్టసభ్యులు పురవస్తు శాఖను నిలదీశారు. భారత కళలు, సంస్కృతికి చిహ్నాలైన వారసత్వసంపదను వెలికి తీయాలని కోరారు. దీంతో సదరు విభాగం రంగంలోకి దిగింది. కానీ, క్షేత్రస్థాయిలో వాటి గుర్తింపు ఎండమావిని తలపిస్తోంది. 24 స్మారకాల్లో మధ్యయుగం నాటి సమాధులు, అద్భుత కట్టడాలు, ఆలయాలు ఉన్నాయి. ఇందులో సగానికిపైగా నిర్మాణాలు దశాబ్దాల కిందటే కనుమరుగు అయ్యాయి.

అభివృద్ధికి చరిత్రను బలిచేయాలా?

అభివృద్ధి వెంట పరుగులు తీసే క్రమంలో శతాబ్దాల నాటి చరిత్రకు సాక్షీభూతాలైన ప్రాచీన సంపదను కోల్పోవాల్సిందేనా? వీటి పరిరక్షణ సాధ్యం కాదా? అన్న చరిత్ర కారుల, పురావస్తు నిపుణుల ఆందోళనతో ప్రభుత్వం, పురావస్తు యంత్రాంగం ఇటువైపు దృష్టిసారించాయి. దేశ మేధావులు, చరిత్రకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాచీన సంపదన అమూల్యం

ఆధునిక సమాజ నిర్మాణంలో అమూల్యమైన చారిత్రక వారసత్వ సంపదను చిన్నచూపు చూస్తున్నాం. కాదు.. కాదు.. వాటిని అడ్డు తొలగిస్తున్నాం. స్థానికులు, ప్రేవేటు సంస్థలు పెద్ద ఎత్తున కొత్త నిర్మాణాలకు పోటీపడుతున్నాయి. కబ్జాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్త చట్టం ప్రమాదకారి..

చారిత్రక స్మారకాల పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలపై ఇదివరకు కఠిన నిబంధనలు ఉండేవి. ఇప్పుడు వాటిని సడలిస్తూ పార్లమెంటులో (లోక్‌సభ) బిల్లును ఆమోదించారు. అయితే కొన్ని పక్షాలుఈ చర్యను తీవ్రంగా

అతిప్రాచీన కట్టడాల గుర్తింపు అసాధ్యం

పురాతన వారసత్వ సంపదకు పట్టణీకరణ కొంత, పర్యావరణం ఇంకొంత నష్టాన్ని కలిగించాయని ఏఎస్ఐ డైరెక్టర్ దేవకినందన్ దిమ్రి గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం పేర్కొంటున్న 24 స్మారకాల గుర్తింపు సరైనచర్య కాదన్నారు. ఎందుకంటే తాజా రోస్టర్‌లో బ్రిటీషుపాలనకు ముందు నుంచి ఉన్న స్మారకాలను చేర్చారు. పైగా కొన్ని 12వ శతాబ్దానికి సంబంధించినవి కూడా ఉన్నాయి. రాజస్థాన్‌లోని ఓ దేవాలయం అన్వేషనకు ఆదేశాలు జారీఅయ్యాయి.

ఇంతవరకు ఇదొకటి ఉందన్న విషయమే ఉనికిలో లేదు. జియోలొకేషన్‌కు పూర్వం వీటిని రికార్డుల్లో పొందుపరిచారు. ఆ తర్వాత రికార్డుల పునరుద్ధరణ జరగలేదు. అందువల్ల ఫలానా స్మారకం కచ్చితంగా ఎక్కడుందో గుర్తించడం సాధ్యం కాదు. కాలక్రమంలో పట్టణాలు, గ్రామాలు మారాయి.. వాటి పేర్లు మారాయి. స్థిరాస్తులు చేతులు మారాయి. కొన్నిటి జాడలు తెలిసినా అనివార్య కారణాల వల్ల సదరు ప్రాంతానికి చేరుకోలేక పోతున్నాం. కుతుంబారి విషయానికొస్తే నేనే స్వయంగా ఆ ప్రాంతానికి వెళ్లాను. స్థానికులతో మాట్లాడాను. వారినుంచి స్పష్టమైన జవాబు రావడం లేదు. ఒకప్పుడు ఉండేదే కానీ, ఇప్పుడు ఏమయిందో తెలీడం లేదంటున్నారు అని దిమ్రి తన అనుభవాలను వెల్లడించారు.

కృష్ణపట్నంలో భారీ రిఫైనరీ

అమరావతి, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది. రెండవ రోజు కూడా వివిధ బహుళజాతి కంపెనీల ప్రతినిధులతో, వాణిజ్య వేత్తలతో ఆయన భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం వద్ద భారీ ఆయిల్ రిఫైనరీని నెలకొల్పేందుకు సౌదీ ఆర్మ్‌కో సంస్థ ఆసక్తిని కనబర్చింది. ఇప్పటికే రాష్ట్రంలో రెండుసార్లు సంస్థ ప్రతనిధులు పర్యటించగా, మంగళవారం ముఖ్యమంత్రితో భేటీ నేపథ్యంలో కృష్ణపట్నం భారీ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు సంబంధించి కంపెనీ ప్రతినిధులు సంకేతాలిచ్చారు.తమ కార్యకలాపాలకు ఆంధ్ర ప్రదేశ్ కన్నా అనువైన ప్రదేశం లేదని పేర్కొన్న సౌదీ ఆర్మ్‌కో ముంబయిలో ఫిబ్రవరి నెలాఖరులో మరోసారి ఏ.పి బృందంతో చర్చిం చి ఒక స్పష్టతకు వస్తుంది. భేటీ సందర్భంగా ముఖ్యమంత్రి పట్టుదలను అభినందించిన సౌదీ ఆర్మ్‌కో ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్ సైద్ ఎ.అల్ హద్రమీ ఈ విషయంలో తాము మరింత ముందుకే వెళతామని ప్రకటించారు. కాగా ఏ.పి.లో భారీ ఆయిల్ రిఫైనరీకి సంబంధించి ముఖ్యమంత్రి గత కొంతకాలంగా చేస్తున్న యత్నాలు తాజా పరిణా మాలతో ఒక కొలిక్కి వచ్చినట్టే.గతంలో ముఖ్యమంత్రి సంప్రదింపులు జరిపిన కంపెనీలలో సౌదీ ఆర్మ్‌కో అత్యంత ప్రధానమైనది. కృష్ణపట్నంలో రిఫైనరీ ఏర్పా టుకు మొదటినుంచి ఈ కరపెనీ ఆసక్తిని ప్రదర్శిస్తోన్న నేపథ్యంలో రాష్ట్రంలో ఒండు సార్లు పర్యటించారు. కాగా ఈ కంపెనీ మహారాష్ట్రలో 40 బిలియన్ డాలర్ల పెట్టు బడితో ఐఓసిఎల్, హెచ్‌పిసిఎల్, బి.పి.సి.ఎల్ కంపెనీలతో సంయుక్త భాగస్వా మ్యంలో మెగా రిఫైనరీ ఏర్పాటు చేయాలని సౌదీ ఆర్మ్‌కో సంస్థ ప్రయత్నం చేసింది. అయితే సంయుక్త భాగస్వామ్యం కార్యాచరణకు రాలేదు. ఈ దశలో రిఫైనరీ ఏర్పా టుకు అన్ని అవకాశాలున్న ఏ.పిలోని కృష్ణపట్నంను గుర్తించింది. గత ఏడాది అక్టోబ ర్‌లో ఢిల్లీలో ఆర్మ్‌కో ఏషియా ఇండియా శాఖను ప్రారంభించింది. భారత పశ్చిమ తీరంలో భారీ చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు నిర్ణయించడం జరిగింది. భారత్ లో మరింత వాటా దక్కించుకునేందుకు కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆంధ్ర ప్రదేశ్‌లో 640 కిలోమీటర్ల మేర చమురు, రసాయనాలు, పెట్రోకెమికల్స్, ఇన్వెస్ట్ మెంట్ రీజియన్‌లో వుండటం, అంతే కాకుండా ఆరు సెజ్‌లు వున్న విషయాలను అధ్యయనం చేసిన సంస్థ రాష్ట్రంలోని కృష్ణపట్నం వైపుమొగ్గు చూపడం జరిగింది. ఈ దిశగా వారిని ఒప్పించి రాష్ట్రా నికి భారీ రిఫైనరీని రప్పించాలన్న లక్ష్యంగా ముఖ్య మంత్రి చేసిన యత్నాలు ఫలించేస్థితికి వచ్చాయని భావిస్తున్నారు. కృష్ణపట్నంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టుల అభివృద్ధికి శీఘ్రగతిన చర్యలు తీసుకుంటున్నామని ఏపీ



సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నారు. వ్యాపా రంలో సానుకూల వాతావరణంతో పారిశ్రామికాభివృద్ధిలో ఏ.పి స్థిరంగా దూసు కువెళుతోందని పేర్కొన్నారు.సౌదీ ఆర్మ్‌కో బృందంతో భేటీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చమురు సహజవాయు నిక్షేపాలు అపారంగా వున్న దృష్ట్యా పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరగా, సౌదీ ఆర్మీ వైస్ ప్రెసిడెంట్ సాను కూలం గా స్పందించారని పేర్కొన్నారు. నిరంతర సంబంధాలతో రాష్ట్రా నికి సౌదీ ఆర్మ్‌కో రాకకు పరిస్థితులు సానుకూలపరుస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ఫిబ్రవరిలో విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐఐ పెట్టుబడిదారుల సదస్సుకు సౌదీ ఆర్మ్‌కో హాజరుకావాల్సిందిగా ఆహ్వానించినట్టు చెప్పారు.రాష్ట్రా నికి 974 కిలోమీటర్ల మేర సముద్రతీరం వుందని, పెట్రోలియం, శుద్ధి పరిశ్రమలఏర్పాటుకు దేశంలోనే ఏ.పి ఎంతో అనుకూలమని పేర్కొన్నారు. తమ రాష్ట్రా న్ని రెండు పారిశ్రామిక కారిడార్‌లు వున్నాయని, కృష్ణపట్నంను లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. రిఫైనరీ ఏర్పాటు వాణిజ్యపరంగా ఎంతో లాభసాటి అన్నారు. స్వదేశంలో కూడా మార్కెటింగ్‌కు అనువుగా వుంటుందని చెప్పారు. రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థలను స్థాపించనున్నామని తెలిపారు.





మేమెంతో ఎదిగాం! మీరంతా రారండి!

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ప్రధానంగా రెండు అంశాలను స్పష్టం చేశారు. ఒకటి.. ప్రపంచం పట్ల భారత్ దృక్పథాన్ని వివరించారు. అంతర్జాతీయ సమాజ శ్రేయస్సులో భారత్ భాగస్వామ్యాన్ని గుర్తుచేశారు. తమ మానవ వనరులపై భారత్‌కు అపార విశ్వాసం ఉందన్నారు. అదే క్రమంలో భవిష్యత్ భారతాన్ని సదస్సు ముందు ఆవిష్కరించారు. ఇక రెండవ అశం.. ప్రపంచం ముందున్న పెను సవాళ్లు, తీవ్ర ఆందోళనలను ప్రస్తావించిన తొలి భారత ప్రధానిగా నిలిచారు. గత ఇరవై ఏళ్లలో చోటుచేసుకున్న పరిణామాలను వివరిస్తూ, బ్రెగ్జిట్, అమెజాన్, హారీపోట్టర్, సైబర్‌డాటా, ఒసామాబిన్ లాడెన్, ట్విట్టర్ తదితర అంశాలను ఉటంకించారు. ఆధునిక ప్రపంచాన్ని టెక్నాలజీ మన జీవన విధానాలను మార్చివేసిందన్నారు. రాజకీయాలు, ఆర్థికవ్యవస్థలను సాంకేతికతకు ప్రభావితం అయ్యాయని, వాతావరణ మార్పులు, తీవ్రవాద సవాళ్లను అధిగమించేందుకు ప్రపంచం ఏకమవ్వాలని నొక్కిచెప్పారు. తద్వారా ఉగ్రముప్పుపై అంతర్జాతీయ సమాజాన్ని అప్రమత్తం చేశారు. ఇప్పటి దాకా ద్వంద్వ వైఖరులు విని పిస్తున్న దేశాలను ఆలోచింపజేసేలా మోడీ ప్రసంగం సాగింది.

ప్రజాస్వామ్యమే మా జీవనశైలి

భిన్నమతాలు, సంస్కృతులు, భాషలు కలిగిన భారత దేశంలో అందరినీ ఏకతాటిపై ప్రజాస్వామ్యం నిలుపుతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అంకితభావం, వైవిధ్యం, స్థిరత్వం ప్రజాస్వామ్య ప్రత్యేకతలని చాటిచెప్పారు. అందుకే భారతీయ ప్రజాస్వామ్యం తమకొక రాజకీయ విధానమే కాదు.. జీవన శైలి కూడా అని స్పష్టం చేశారు. అవసరమైనంత వరకే దాచుకోవడం భారతీయుల విధానం. వసుధైక కుటుంబం అనేది భారతీయ తాత్విక చింతనగా అభివర్ణించారు. మనమంతా భూమిపుత్రులమనే మాటను గుర్తు పెట్టుకొని మనుగడ సాగించాల్సిన అవసరం ఉంది. నేటి తరం సుఖం కోసం ప్రకృతిని ధ్వంసం చేయొద్దు అని సూచించారు. మానవ శక్తిపై తనకు అపార నమ్మకముంది. సైబర్ సెక్యూరిటీ, అణు భద్రతలపై ప్రపంచం దృష్టి సారించాలి. 2022 నాటికి 170 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని మోడీ వివరించారు.

పెట్టుబడులకు భారత్ అనుకూలం

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయి. ఆరోగ్యం, సంపద, ప్రశాంత జీవితం కోరుకునే వారు ఇండియా రావాలి. శ్రేయస్సు, శాంతి కోసం ఇండియా రండి. మీకు భారత్ ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతూనే ఉంటుంది అని మోడీ తెలిపారు. గత 20 ఏళ్లలో భారత్ వేగంగా అభివృద్ధి చెందింది. 1997లో భారత జీడీపీ 400 బిలియన్ డాలర్లు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం అది ఆరు రెట్లకు పైగా పెరిగిందన్నారు. నాటికి నేటికి భారత ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. సమ్మిళిత అభివృద్ధి అనేది 120 కోట్ల మంది భారతీయుల ఆశయమన్నారు. మూడేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన భాజపా అనేక సంస్కరణలు చేపట్టిందని వివరించారు. వ్యాపార అనుకూల ర్యాంకింగ్‌లో భారత్ స్థానం ఇటీవల గణనీయంగా మెరుగుపడిందని గుర్తుచేశారు. ఏ ఒక్క వర్గానికో కాకుండా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందించాలనేది ఓ నినాదం తీసుకున్నట్టు చెప్పారు. ప్రపంచ ఆర్థిక ప్రగతిలో మరింత క్రియాశీలక పాత్ర పోషించేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. ప్రపంచ దేశాలు అభివృద్ధి దిశలో పయనించేలా ఈ సదస్సు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. పరస్పర ఆధారిత సమాజ అభివృద్ధిలో ఆర్థిక వేదిక సదస్సు చుక్కానీ మాదిరిగా వ్యవహరిస్తోందన్నారు. మనందరం కలసి సాగితే అభివృద్ధి నిజాయతీగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరిని కలుపుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దురాశకు, దోపిడీకి జాతిపిత మహాత్మాగాంధీ వ్యతిరేకమని చెప్పుకొచ్చారు.

వాతావరణ మార్పులు, ఉగ్రవాదం పెనుసవాళ్లు

వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు విశ్వం మనుగడకు ముప్పుగా మారాయి. రోజు రోజుకు మారుతున్న వాతావరణ పరిస్థితులు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న మరో తీవ్రమైన సమస్య ఉగ్రవాదమని, యావత్ ప్రపంచానికి అది పెను సవాళ్లు విసురుతోందన్నారు. విద్యావంతులైన యువకులు సైతం తీవ్రమైన భావజాలంతో ఉగ్రవాదానికి ప్రభావితమవుతున్నారని ప్రధాని ఆందోళన వ్యక్తంచేశారు. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి సరైంది కాదని హెచ్చరించారు. దాదాపుగా అన్ని దేశాలు ఉగ్రవాద సమస్యను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సాంకేతికపరంగా ఇంటర్నెట్, బిగ్ డేటాలతో ప్రపంచమంతా అనుసంధానమవుతుండగా.. సైబర్ పరిజ్ఞానం చెడు పనులకు వినియోగించకుండా నిరోధించడమే అసలైన సవాల్‌గా మారిందన్నారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని పునరుద్ఘాటించారు. మన మాట, పని, అన్ని విషయాలను సాంకేతికతే ప్రభావితం చేస్తోందని చెప్పారు. మనచుట్టూ మార్పులు అనివార్యం అవుతున్న నేపథ్యంలో నిబంధనల ఆధారిత అంతర్జాతీయ సహకారాన్ని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముక్కలైన ప్రపంచంలో ప్రధాన దేశాల సహకారం అవసరమని చెప్పారు. దేశాల మధ్య పరస్పర పోటీతత్వం అడ్డుగోడలు కాకూడదని హితవు పలికారు. ప్రపంచ శాంతిలో భారత్ ప్రధాన పాత్ర పోషిస్తోంది.

రెండు దశాబ్దాల్లో ఎన్నో మార్పులు..

హారీ పోట్టర్ పరిచయం లేని పేరు. పక్షుల ట్వీట్ల కాలంలో అమెజాన్ దండకారణ్యాన్ని తలపించింది. ఇదీ 1997 నాటి పరిస్థితులు. అప్పటితో పోల్చుకుంటే ఈ ఇరవై ఏళ్లలో ఎన్నో మార్పులు వచ్చాయి అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ప్రపంచంతోపాటు భారత్ కూడా స్థిరంగా అభివృద్ధి పరుగు అందుకుని నేడు ఈ స్థాయికి చేరిందని చెప్పారు. 1997లో దేవెగౌడ ఇక్కడకు వచ్చినప్పుడు ప్రపంచ ఆర్థికసదస్సు లక్ష్యం సమాజాన్ని అనుసంధానం చేయడానికే పరిమితమై ఉంది. ఇప్పుడది పురాతన లక్ష్యంగా కనిపిస్తోంది. లాడెన్ పేరు కొద్దిమందికే తెలుసు. హారీపోర్టర్ అపరిచితుడే. గూగుల్ అంతర్జాలంలోకి వచ్చేంత వరకు చదరంగం అంటే భయమే ఉండేదికాదు. పక్షులు మాత్రమే కూహూరాగాలు పలికేవి. మనుషులు కాదు. ఆ రోజుల్లో అమెజాన్ దట్టమైన అడవితో సమానంగా ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. గత రెండు దశాబ్దాల కాలంలో ప్రపంచం వేగంగా రూపాంతరం చెందింది. ముక్కలైన ప్రపంచం మెరుగైన భవిష్యత్ కోసం ఆలోచనలు పంచుకునే వేదికగా ఈ ఆర్థిక సదస్సు నిలుస్తోంది అని మోడీ వ్యాఖ్యానించారు.

స్వదేశానికి ప్రధాని

ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం భారత్‌కు తిరుగుముఖం పట్టారు. ఇక్కడ ప్రపంచ ఆర్థిక సదస్సులో కీలకోపన్యాసం చేసిన ఆయన అనేక మంది ప్రపంచ నేతలు, సీఈవోలను కలిశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. కకావికలైపోయిన ప్రపంచంలో భాగస్వామ్య భవిత నిర్మాణం శీర్షికగా ప్రారంభమైన ఈ యేటి డబ్ల్యూఈఎఫ్ ఆలోచనాత్మకంగా ఉంది. మన భావి తరాలకు ఒక ఉత్తమ భవితను అందించే మార్గాలను మనం చర్చించేలా చేసింది అని మోడీ కొనియాడారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత సదస్సుకు హాజరైన భారత ప్రధానిగా ఆయన నిలిచారు. మోడీ కలిసిన ప్రపంచ నేతల్లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడువా, నెథర్లాండ్స్ క్వీన్ మాక్సిమా, స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలెన్ బెర్‌సెట్ ఉన్నారు. దావోస్ వార్షిక సదస్సుకు వాణిజ్యం, రాజకీయం, కళ, విద్య, పౌర సమాజానికి చెందిన 3,000 మందికి పైగా ప్రపంచ నేతలు హాజరయ్యారు. వారిలో మునుపెన్నడూ లేని విధంగా 130 మందికి పైగా ప్రతినిధులతో భారత్ తన ఉనికిని చాటుకుంది.

వేచి చూశాకే వేటు వేశాం

- ఆప్ ఎమ్మెల్యేల అనర్హత వేటుపై కుండబద్దలుకొట్టిన నూతన సీఈసీ
- రెండు సార్లు ఇచ్చిన అవకాశాన్ని ఆప్ వినిగించుకోలేదు: ఓపీ రావత్
- రావత్ పై ఆప్ తీవ్ర విమర్శలు
- సీఈసీ వ్యాఖ్యల్లో నిజం లేదని ఆగ్రహం
- న్యాయం కోసం మరోసారి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్లు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల ప్రధానాధికారిగా బాధ్యతలు చేపట్టడానికి ఒకరోజు ముందే ఓం ప్రకాశ్ రావత్ ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపణలపై చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. లాభదాయక పదవుల వ్యవహారంలో ఎన్నికల కమిషన్ తమ వాదన కూడా వినకుండా అనర్హత వేటువేస్తూ రాష్ట్రపతికి సిఫార్స్ చేసిందన్న ఆప్ ఎమ్మెల్యేల ఆరోపణల్లో నిజం లేదని రావత్ కుండ బద్దలుకొట్టారు. వివరణ ఇవ్వాల్సిందిగా ఈసీ ఇచ్చిన రెండు అవకాశాలను ఆప్ వినియోగించుకోలేదని ఓ జాతీయ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 20 మంది ఆప్ ఎమ్మెల్యేలకు 2017 సెప్టెంబర్ 28న మొదటి సారి, నవంబర్ 2న రెండోసారి నోటీసులిచ్చామని..తమ నోటీసులకు ఆప్ బదులివ్వకుండా ఏకంగా విచారణను నిలిపివేయాలని కోరిందన్నారు. నోటీసులకు స్పందించకుండా ఆప్ ఎమ్మెల్యేలు ఈసీని నిలువరించే ప్రయత్నం చేశారు. ముందుగా తమ వాదన వినిపించకుండా విచారణే నిలిపివేయాలని కోరడంతోనే ఎన్నికల సంఘం ప్రధానాధికారి కొంతకాలం వేచిచూసి ఆ తర్వాత 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ రాష్ట్రపతికి సిఫార్స్ చేశారని రావత్ స్పష్టం చేశారు.



సీఈసీ వాదన అబద్ధం:ఆప్

తమ పార్టీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే ముందు వాదన వినేందుకు ఎన్నికల కమిషన్ రెండుసార్లు అవకాశమిచ్చిందన్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓపీరావత్ వ్యాఖ్యాలను ఆమ్ ఆద్మీ పార్టీ తోసిపుచ్చింది. తమ నేతలు విచారణ నిలిపివేయాలని ఎన్నడూ ఎన్నికల కమిషన్ ను కోరలేదని ఆప్ నేత రాఘవ్ ఛఢా అన్నారు. సీఈసీ నోటీసులపై స్పందిస్తూ తాము లేఖ రాశామని.. మా వాదన వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపామన్నారు. తమ లేఖపై ఈసీ స్పందించలేదని.. అలాంటప్పుడు తమ వాదన ఎన్నికల కమిషన్ ఎలా వినగలుగుతుందని చెప్పారు. ప్రతీ న్యాయవ్యవస్థ చట్టానికి లోబడి వ్యవహరించాలి. కానీ మా విషయంలో అలా జరగలేదు. సహజ న్యాయానికి లోబడి ఈసీ వ్యవహరించలేదు అని మండిపడ్డారు. 2017లో ఎన్నికల కమిషనర్ గా ఉన్న రావత్ అక్రంగా వ్యవహరించి ఆప్ కేసుల్లో అతిగా ప్రవర్తించారని ఆరోపించారు. రావత్ బీజేపీతో సత్సంబంధాలు కొనసాగిస్తూ తప్పు చేశారని మండిపడ్డారు. ఈసీ సిఫార్సుకు ఆమోదముద్ర వేసే ముందు రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కూడా రాజ్యాంగ ధర్మాన్ని పాటించలేదని ఆరోపించారు. లాభదాయక పదవులు అనుభవించిన హర్యానా, హిమాచల్ ప్రదేశ్,పంజాబ్, బెంగాల్, అస్సాం, మిజోరాం రాష్ట్రాల ఎమ్మెల్యేలపై అనర్హత వేటు ఎందుకుపడలేదని ప్రశ్నించారు. చత్తీస్ గఢ్ లో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ఆ రాష్ట్ర ఎమ్మెల్యేల లాభదాయక పదవుల వ్యవహారంపై ఈసీ ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. ఎన్నికల కమిషన్ ప్రధానమంత్రి సూచనల మేరకు నడుచుకుంటుందా అని సింగ్ సూటి ప్రశ్న వేశారు.

ఢిల్లీ హైకోర్టులో ఆప్ పిటిషన్లు

లాభదాయక పదవుల వ్యవహారంలో అనర్హత వేటు ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీపార్టీ ఎమ్మెల్యేలు మరోసారి ఢిల్లీ హైకోర్టు తలుపుతట్టారు. ఎన్నికల కమిషన్ సిఫార్సుకు రాష్ట్రపతి ఆమోదం నేపథ్యంలో అనర్హత వేటుపై ప్రభుత్వం ప్రకటనపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. 20 మంది ఆప్ ఎమ్మెల్యేల పిటిషన్ల స్వీకరించిన జస్టిస్ ఎస్ఆర్ రవింద్ర భట్, జస్టిస్ ఏకే చావ్లా నేతృత్వంలోని ధర్మాసనం నేడు విచారణ జరపనుంది. ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లపై త్వరితగతిన విచారణ జరపాలని వారి తరపు న్యాయవాది మనీష్ వశిష్ట ధర్మాసనాన్ని కోరారు.కేంద్ర ఎన్నికల కమిషన్ లాభదాయక పదవుల వ్యవహారంలో 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ రాష్ట్రపతికి సిఫార్స్ చేసిన రెండు రోజుల్లోనే వారిపై అనర్హతపై ప్రభుత్వ ప్రకటన విడుదలైంది.

పద్మావత్‌కు లైన్ క్లియర్

- రాజస్థాన్, మధ్యప్రదేశ్ పిటీషన్లను కొట్టేసిన సుప్రీం
- శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత రాష్ట్రాలదే
- పద్మావత్ పై ఏ రాష్ట్రం నిషేధం విధించొద్దని ఆదేశం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పద్మావత్ చిత్ర ప్రదర్శనపై నిషేధాన్ని ఎత్తివేయడాన్ని పునఃపరిశీలించాలని మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు, రాజ్ పుత్ కర్ణిసేన దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నిషేధాన్ని తొలగిస్తూ తాము ఇదివరకే ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరింది. దీంతో ఈనెల 25వ తేదీన ఈ సినిమా విడుదలకు లైన్ క్లియరైంది. మంగళవారం పద్మావత్ చిత్ర ప్రదర్శనపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీం చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా ధర్మాసనం విచారించింది. పద్మావత్‌పై నిషేధాన్ని ఎత్తివేస్తూ గురువారం తాము ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని పునరుద్ఘాటించింది. అలాగే శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. శాంతిభద్రతల్లో భాగంగా సినిమా ప్రదర్శనకు, ప్రేక్షకులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. ఈ అంశంలో ప్రభుత్వాలు తలదూర్చడం వల్లే సమస్యలు తలెత్తాయని వ్యాఖ్యానించింది.

అయితే సినిమా చూడొద్దని ప్రజలకు ప్రభుత్వాలు సలహా ఇవ్వొచ్చని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. సినిమాతో శాంతిభద్రతలకు ప్రమాదం ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వాలు రావొద్దని సూచించింది. సెన్సార్ బోర్డు ఈ సినిమాను క్లియర్ చేసిన తర్వాత, శాంతిభద్రతల సమస్య పేరుతో రావడమేమిటని వ్యాఖ్యానించింది. అయితే మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు తాము దాఖలు చేసిన పిటీషన్‌లో వివాదాస్పదమైన ఈ సినిమా ప్రదర్శన వల్ల శాంతిభద్రతలు సమస్య తలెత్తే అవకాశముందని, దీన్ని నివారించేందుకు సినిమాపై నిషేధం విధించాలని కోరాయి. సినిమాలో చరిత్రను వక్రీకరించారని రాజ్ పుత్ కర్ణిసేన వాదించింది. తమ ప్రజలు భావోద్వేగపరంగా రాణి పద్మావతితో ముడిపడి ఉన్నారని పేర్కొంది. గత గురువారం రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు పద్మావత్‌పై విధించిన నిషేధాన్ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ఇచ్చింది. శాంతిభద్రతల పరిరక్షణ రాష్ట్రాల బాధ్యతేనని వ్యాఖ్యానించింది. ఈ దిశలో ఇతర రాష్ట్రాలు సైతం నిషేధం విధించొద్దని ఆదేశాలిచ్చింది. న్యాయపరంగా అన్ని మార్గాలు పూర్తయినందున, సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించడం మినహా మరో అవకాశం లేదని రాజస్థాన్ హోంమంత్రి కఠారియా పేర్కొన్నారు.

పార్టీకి విరాళాలు 2వేలకు మించొద్దు

న్యూఢిల్లీ: అక్రమ ఆర్థిక లావాదేవీలకు దూరంగా ఉండాలని ఆదాయపు పన్ను శాఖ ప్రజలను హెచ్చరించింది. మంగళవారం ఈ మేరకు ఐటీ శాఖ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యంగా ప్రజలు రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. నగదు రూపంలో ఒక వ్యక్తి ఒక రాజకీయ పార్టీకి రూ.2000 మించకుండా విరాళం ఇవ్వవచ్చని ఐటీ శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. కాగా ఎన్నికల సమయంలో జరిగే నిధుల సమీకరణలో అక్రమాలను నిరోధించడానికి ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో ఎలక్టోరల్ బాండ్లను ప్రకటించింది. వీటిని ఎంపిక చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలనుంచి మాత్రమే కొనేందుకు ప్రజలకు అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియతో ఎన్నికల్లో పార్టీల నిధుల సమీకరణలో పారదర్శకతను పెంపొందించవచ్చని ప్రభుత్వం భావించింది ఈ నేపథ్యంలో ఐటీ శాఖ ఈ ప్రకటనను విడుదల చేసింది.

ప్రజలకు ఐటీ శాఖ పిలుపు

తాము విధించిన ఈ పరిమితులను ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని ఐటీ శాఖ హెచ్చరించింది. ఎవరైనాసరే బినామీ ఆస్తులు, నల్లధనం కలిగివుండి నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిస్తే తమ దృష్టికి తేవచ్చని ఇందుకు వారు తమ ఈ మెయిల్ బ్లాక్‌మనీఇన్ఫో అఇన్‌కంటాక్స్.జివోవీ.ఇన్/ ఎన్‌బ్లాక్ మనీ ఇన్ఫో అఇన్‌కంటాక్స్.జివోవీ.ఇన్ లేదా తమ శాఖ ప్రిన్సిపల్ కమిషనర్‌కు తెలుపువచ్చని ఐటీ శాఖ సూచించింది.

ఎంపీ గవర్నర్‌గా ఆనందీబెన్ ప్రమాణం

భోపాల్: మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ఆనందీబెన్ పటేల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, ఎంపీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, మంత్రివర్గ సహచరులు, ఇతర నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మధ్య ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హేమంత్ గుప్తా రాజ్‌భవన్‌లో ఆనందీబెన్ పటేల్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముందుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బసంత్ ప్రతాప్‌సింగ్ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ గవర్నర్‌గా ఆనందీబెన్ పటేల్‌ను నియమిస్తూ జారీ చేసిన నియామకపు ఉత్తర్వును నియమించారు. ఆనందీబెన్ ఇంతకుముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. తాజాగా ఎంపీ గవర్నర్‌గా ఆమె నియమితులయ్యారు. గతంలో రామ్ నరేశ్ యాదవ్ ఎంపీ గవర్నర్‌గా పనిచేసి సెప్టెంబరు 2016న పదవీ విరమణ చేశారు. అనంతరం గుజరాత్ గవర్నర్ ఓం ప్రకాశ్ కోహ్లీ ఎంపీ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా ఆనందీబెన్ పటేల్ మధ్యప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు.

మోడీజీ.. ధనికులకే భారత్ సంపదపై దావోస్‌కు చెప్పరూ

- ప్రధానిపై రాహుల్ వ్యంగ్య ట్వీట్

న్యూఢిల్లీ: దేశ సంపదలో 73 శాతం కేవలం ఒక్కశాతం భారతీయుల దగ్గరే ఎందుకు పోగుపడిందీ దావోస్‌లో అతిథులకు చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీని మంగళవారం సవాల్ చేశారు. మోడీని ఉద్దేశించిన ట్వీట్‌కు ఆక్స్‌ఫామ్ సర్వేను ఉటంకించిన ఒక వార్తా కథనాన్ని రాహుల్ జోడించారు. 2017లో ఉద్భవించిన సంపదలో 73 శాతం సంపన్నులైన ఒక్క శాతం ధనికులకే దక్కిందని సదరు సర్వే పేర్కొంది.

ప్రియమైన ప్రధాని, స్విట్లర్లాండ్‌కు స్వాగతం! భారత్ జనాభాలో ఒక్క శాతం దేశ సంపదలో 73 శాతాన్ని ఎలా దక్కించుకుందీ దయచేసి దావోస్‌కు చెప్పరూ. మిమ్మల్ని సన్నాహపరచడానికి ఒక నివేదికను జోడిస్తున్నాను అని కాంగ్రెస్ అధ్యక్షుడు ట్వీట్ చేశారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక సదస్సు నిమిత్తం దావోస్‌లో ఉన్న ప్రధానమంత్రిని ఆయన విదేశీ పర్యటనలను తరచుగా విమర్శించే రాహుల్.. ధనికుల కోసం పనిచేస్తూ వారి రుణాలను మాఫీ చేస్తున్నారంటూ మోడీపై దాడి చేశారు.

శాశ్వత పేదరికానికి గాంధీ కుటుంబం పేటెంట్: బీజేపీ

ప్రధానికి రాహుల్ చేసిన ట్వీట్‌పై బీజేపీ మండిపడింది. బీజేపీ జాతీయ అధికారప్రతినిధి జీవీఎల్ నరసింహారావు కాంగ్రెస్ అధ్యక్షుని ఉద్దేశించి ట్వీట్ చేశారు. పేదరికాన్ని శాశ్వతం చేసే నమూనా పాలనను మీ కుటుంబానికి చెందిన నెహ్రూ కాంగ్రెస్ పేటెంట్ చేసుకున్న ఫలితమే ఈ అసమానత. దాంతో కేవలం కాంగ్రెస్ మాత్రమే ధనవంతురాలైంది అని ఆయన విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలు చూస్తుంటే దేగిశను కుండ నువ్వు నల్లగా ఉన్నావు అన్నట్టుంది అని నరసింహారావు ఎద్దేవా చేశారు. గరిబీ హఠావో(పేదరిక నిర్మూలన) కాంగ్రెస్ పార్టీకి కేవలం ఒక నినాదంగా మిగిలిపోతే బీజేపీకి సంబంధించినంత వరకు సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్(అందరితో కలసి, అందరి అభివృద్ధి) నినాదం తన పాలనకు ఒక నమూనాగా నిలిచిందని ఆయన తెలిపారు.

అప్పట్లో అవినీతి భారత్: దేవెగౌడ

బెంగళూరు: 1997లో తాను దావోస్ సదస్సుకు హాజరైనప్పుడు భారత్‌కు అత్యంత అవినీతికరమైన దేశంగా పేరుండేదని మాజీ ప్రధాని దేవెగౌడ మంగళవారం గుర్తు చేసుకున్నారు. ప్రధానమంత్రి హోదాలో తాను ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైనప్పుడు ఇతర దేశాల దృష్టిలో మన దేశం అత్యంత అవినీతికరమైందిగా ఉండేదని ఆయన తెలిపారు. ఇప్పటి లాగా అప్పట్లో సదస్సు భారత్‌లో పెట్టుబడులకు అనుకూలంగా ఉండేది కాదని దేవెగౌడ చెప్పారు. గడ్డు కాలం అనుభవిస్తున్న దేశం పీకల్లోతు అప్పుల్లో ఉండేది. అప్పటి నుంచి ఇప్పటి దాకా పెట్టుబడులు, ఆర్థిక స్థితిగతులు ఇలా బహుముఖాలుగా దేశం పురోగతి సాధించింది అని ఆయన తెలిపారు. అప్పట్లో అభివృద్ధి చెందిన, చెందుతున్న, అభివృద్ధికి నోచుకొని దేశాలకు వేదికగా దావోస్ సదస్సు ఉండేది. పెట్టుబడులే లక్ష్యంగా సదస్సు సాగేది అని మాజీ ప్రధాని వెల్లడించారు.

సీజేఐపై అభిశంసనకు సీపీఎం ప్రయత్నం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాపై పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి తెలిపారు. వచ్చే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో సీజేఐపై అభిశంసన తీర్మానం పెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. సుప్రీం సంక్షోభం న్యాయవ్యవస్థ పరిధిలోనే పరిష్కారమౌతుందని తాము ఆశించినప్పటికీ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఏచూరి అన్నారు. సీజేఐపై అభిశంసన అంశంపై ఎన్సీపీ నేతతారిక్ అన్వర్, జేడీయూ రెబల్ నాయకుడు శరద్ యాదవ్ తో చర్చించారు. సుప్రీం సంక్షోభానికి తెర వేసేందుకు సమయం ఆసన్నమైందన్న ఏచూరి.. దేశంలో న్యాయవ్యవస్థకు ఎంతోప్రాముఖ్యత ఉన్న నేపథ్యంలో తాము స్పందించక తప్పదం లేదని చెప్పారు. సుప్రీం సంక్షోభం మొదలై రెండు వారాలు గడిచినా వివాదం పరిష్కారం కాలేదని..సీజేఐ కూడా తన వ్యవహార శైలిని మార్చుకోలేదని ఏచూరి వ్యాఖ్యానించారు. ఈనెల 29నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో సీజేఐపై అభిశంసన తీర్మానం పెట్టే అవకాశాలపై అన్ని ప్రతిపక్ష పార్టీలు సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. న్యాయవ్యవస్థ స్వేచ్ఛ, సమగ్రతను కాపాడేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

ప్రధానికి రేప్ బాధితురాలి రక్తంతో లేఖ

రాయ్‌బరేలీ: తనకు జరిగిన అన్యాయంపై చట్టాలు, కోర్టులు తగిన న్యాయం చేయలేదంటూ రేప్ బాధితురాలు తన రక్తంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆధిత్యానాత్‌కు లేఖలు రాసింది. జనవరి 20న రాసిన ఈ ఉత్తరం వివరాలను పోలీసులు మంగళవారం మీడియాకు వెల్లడించారు. నిందితులను కఠినంగా శిక్షించకుంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని ఉత్తరంలో బాధితురాలు పేర్కొంది. నిందితులకున్న బలమైన పలుకుబడి కారణంగా పోలీసులు వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. అంతేకాక వారు తనను కేసును ఉపసంహరించుకోవాలని తనపై ఒత్తిడి పెంచుతున్నారని బాధితురాలు వాపోయింది.

నాకు న్యాయం జరగకపోతే, ఆత్మహత్య చేసుకుంటాను అని లేఖలో బాధితురాలు పేర్కొంది. దీనిపై మీడియా ప్రతినిధులు ఎఎస్పీ శశి శేఖర్‌సింగ్‌ను అడుగగా.. నిందితులు దివ్య పాండే, అంకిత్ వర్మలపై బాధితురాలు తండ్రి ఫిర్యాదు మేరకు బారాబంకి పోలీస్‌స్టేషన్లో ఎఫ్‌ఐఆర్ మార్చి 24, 2017న నమోదు చేశామన్నారు. తన కుమార్తెపై రేప్‌కు పాల్పడ్డ నిందితుడు ఒక ఇంజినీరింగ్ విద్యార్థి అని... ఘటన అనంతరం.. తమను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. కాగా బాధితురాలి రక్తంతో రాసిన లేఖకు సంబంధించి వివారాలు తనకు తెలియదని ఎఎస్పీ తెలిపారు.

భారతీయులకు విమోచనం

న్యూఢిల్లీ: వేతన బకాయిల కోసం విధిలేని పరిస్థితుల్లో అక్రమంగా ఉంటున్న వేలాది భారతీయ కార్మికులకు కొండంత ఉపశమనాన్ని కువైట్ ప్రభుత్వం కలిగించింది. వారిపై ఎలాంటి పెనాల్టీ విధించబోమని మంగళవారం ప్రకటించింది. దీనికి ఉద్దేశించిన దండన విమోచనం(ఆమ్నెస్టీ) ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 22 దాకా అమల్లోకి ఉంటుంది. ఇది భారతీయ కార్మికులకు గొప్ప ఊరటగా వచ్చిందని వారి కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్త షహీన్ సయ్యాద్ తెలిపారు. ఆమ్నెస్టీ ప్రయోజనం పొందేవారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు చాలామంది ఉన్నారు. వారంతా స్వస్థలాలకు తిరిగి వెళ్లడానికి ఆత్రంగా ఉన్నారని తెలిసింది.

రోజుకు పెనాల్టీ రూ.424

కువైట్‌లో అక్రమంగా ఉంటున్నందుకు రోజుకు రెండు దీనార్లు అంటే రూ.424 పెనాల్టీ కట్టాలి. వేతనాల్లేక నెలల తరబడి ఉంటున్న కార్మికులు అంత భారీ మొత్తాన్ని అపరాధ రుసుముగా చెల్లించలేరు.

కార్మికులకు అండగా కేంద్ర మంత్రి

భారత విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.కె.సింగ్ ఇటీవలి కువైట్ పర్యటన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం ఆమ్నెస్టీ మంజూరు చేసింది. ఖరాఫీ నేషనల్ కంపెనీ నుంచి వేతనం పొందని కార్మికుల అంశాన్ని సింగ్ కువైట్ ప్రభుత్వం తీసుకువచ్చారు. భారత్‌కు తిరిగి రావాలని ఆశించే కార్మికులపై పెనాల్టీ మాఫీ దిశగా అక్కడి మంత్రితో సైతం మాట్లాడారు.

క్రీడాప్రభ

స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెదరర్ 20వ టైటిల్ సాధించడానికి మార్గం సుగమవుతోంది. సోమవారం రోజర్ పార్శ్వంలో ఉన్న మాజీ చాంప్ జకోవిచ్ సంచలన రీతిలో ఓటమి పాలు కాగా...తాజాగా నెంబర్ వన్ రఫెల్ నాదల్ కూడా విషాదకర రీతిలో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. మొత్తం మీద 9వ రోజు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్స్ సంచలనాలకు వేదికైంది. మారిన్ సిలిక్ (క్రొయేషియా)తో మంగళవారం పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో జరిగిన ఐదు సెట్ల హోరాహోరీ పోరులో స్పెయిన్‌బుల్ రఫెల్ నాదల్ వెనుకబడి నడుం గాయంతో వైదొలగాడు. దీంతో సిలిక్.. సెమీఫైనల్ చేరుకున్నాడు. మరో క్వార్టర్స్ పోరులో మూడో సీడ్ బల్గేరియా ఆటగాడు దిమిత్రోవ్‌ను అన్‌సీడెడ్ బ్రిటన్ ఆశాకిరణం కీల్ ఎడ్మండ్ కంగుతినిపించాడు. ఎడ్మండ్ సెమీ ఫైనల్లో సిలిక్‌తో తలపడతాడు. మహిళల విభాగం సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలినా స్విතోలినాకు అన్‌సీడెడ్ మెర్టెన్స్ (బెల్జియం) షాకిచ్చింది.




మెర్టెన్స్

నాదల్... నిష్క్రమణ

- గాయంతో వైదొలగిన రఫెల్
- సెమీస్‌లో సిలిక్ • వోజ్నియాకి కూడా
- దిమిత్రోవ్‌కు ఎడ్మండ్ షాక్
- స్వితోలినాను సాగనంపిన మెర్టెన్స్

మెల్‌బోర్న్: రఫెల్ నాదల్... ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో మరోసారి ఆగిపోయాడు. మంగళవారం నాదల్.. నడుం గాయం కారణంగా మారిన్ సిలిక్‌తో క్వార్టర్ ఫైనల్ పోరులో ఐదో సెట్లో 0-2తో వెనుకబడి వైదొలగాడు. అప్పటికే సిలిక్‌తో నాలుగు సెట్లలో హోరాహోరీగా తలపడి నాదల్ అలసిపోయాడు. రఫెల్ పోరు మధ్యలోనే తప్పుకునేప్పటకి 6-3, 3-6, 7-6(5), 2-6, 0-2తో ఉన్నాడు. 250 గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌లలో నాదల్ క్వార్టర్స్‌లో తప్పుకోవడం ఇది రెండోసారి మాత్రమే. 2010లో ఆండీ ముర్రేతో క్వార్టర్స్ పోరులో ఇలాగే వైదొలగాడు. తాజాగా నాదల్ నాలుగో సెట్లో నడుం గాయానికి చికిత్స కోసం మెడికల్ టైమౌట్ తీసుకున్నాడు. అతను మ్యాచ్ ఆసాంతం గాయంతో బాధపడ్డాడు. ఐదో సెట్లో ఆరో సీడ్ సిలిక్ తన సర్వ్‌ను బ్రేక్ చేయడంతో 0-2తో నాదల్ వెనుకబడ్డాడు. గాయం మరింతగా బాధించడంతో మ్యాచ్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. చైర్ అంపైర్, సిలిక్‌లతో నీరసంగా షేక్‌హ్యాండ్ ఇచ్చి వైదొలగాడు. తానిలా తప్పుకోవడం ఇదే తొలిసారి కాదని నాదల్ అన్నాడు. "నేను ఆశావహ దృక్పథం కలిగిన వ్యక్తిని. కానీ ఈ రోజు గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరుకునే అవకాశం చేజారింది" అన్నాడు. కెరీర్‌లో ఏడు గ్రాండ్ స్లామ్ క్వార్టర్స్ పరాజయాల్లో నాదల్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఇది ఐదోది. మూడో సెట్లోనే గాయం బాధించిందని రఫా చెప్పాడు. ఐతే నాలుగో సెట్ వరకు అది ప్రభావం చూపలేదన్నాడు. చాలా మంది ఆటగాళ్లు గాయాలకు గురవుతున్నారని మీడియా సమావేశంలో నాదల్ వాపోయాడు. "ఈ టోర్నీని నిర్వహిస్తున్న వారు ఏం జరుగుతోందో గమనించాలి. ఆటగాళ్ల ఆరోగ్యం గురించి వారు ఆలోచిస్తున్నారో తెలియదు. ఇలాంటి హార్డ్ కోర్టులపై ఆడడం వల్ల భవిష్యత్తులోనూ ఆటగాళ్ల జీవితం మీద ప్రభావం పడుతుంది" అన్నాడు. నాదల్‌తో పోరులో అద్వితీయంగా ఆడిన సిలిక్ ఫైనల్లో చోటు కోసం సెమీస్‌లో ఎడ్మండ్‌తో తలపడతాడు. 2010లో సెమీస్‌లో ముర్రే చేతిలో ఓడిన సిలిక్... 8 ఏళ్ల తర్వాత ఆ దశకు చేరుకున్నాడు.


ఎడ్మండ్

దిమిత్రోవ్ జోరుకు ఎడ్మండ్ బ్రేక్: ప్రపంచ నెంబర్ 3 దిమిత్రోవ్ (బల్గేరియా) జోరుకు అన్‌సీడెడ్ కీల్‌ఎడ్మండ్ (బ్రిటన్) అడ్డుకట్ట వేశాడు. క్వార్టర్ ఫైనల్ పోరులో ఎడ్మండ్ 6-4, 3-6, 6-3, 6-4తో దిమిత్రోవ్‌పై గెలిచాడు. గ్రాండ్ స్లామ్ టోర్నీలో సెమీస్ చేరిన ఆరో బ్రిటన్ ఆటగాడు.. 49వ ర్యాంకు ఎడ్మండ్. 23 ఏళ్ల ఎడ్మండ్ శక్తివంతమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో దిమిత్రోవ్‌కు దిమ్మతిరిగేలా చేశాడు. "ఈ అనుభూతి గొప్పగా ఉంది. చాలా సంతోషంగా కూడా ఉంది. రాడ్ లెవర్ ఎరీనాలో ఇదే నా తొలి మ్యాచ్" అని ఎడ్మండ్ అన్నాడు.

స్వితోలినాకు మార్టెన్స్ షాక్: అన్‌సీడెడ్ అరంగేట్ర బెల్జియం క్రీడాకారిణి ఎలిస్ మార్టెన్స్... నాలుగో సీడ్ ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్)కు షాకిచ్చింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఆమె 6-4, 6-0తో అలవోకగా స్వితోలినాపై గెలిచింది. 37వ ర్యాంకర్ మార్టెన్స్ టోర్నీలో ఇంతవరకు ఒక్క సెట్ కూడా ఓడిపోలేదు. 2012లో కిమ్ క్లియస్టర్స్ తర్వాత ఇక్కడ సెమీస్ చేరిన తొలి బెల్జియం క్రీడాకారిణి మార్టెన్సే. "నాకు మాటలే రావడంలేదు. ఏం చెప్పాలో తెలియడం లేదు. సర్వశక్తులూ ధారపోసి పోరాడా" అని 22 ఏళ్ల మార్టెన్స్ వ్యాఖ్యానించింది. మరో పోరులో వోజ్నియాకి (డెన్మార్క్) 6-0, 6-7 (3-7), 6-2తో అన్‌సీడెడ్ సురెజ్ నవర్రో (స్పెయిన్)పై అలవోకగా గెలిచింది. సెమీస్‌లో వోజ్నియాకి.. మార్టెన్స్‌తో తలపడుతుంది.

రికార్డు పదిలమా!

మధ్యాహ్నం 1.30 గం: నుంచి సోనీ టెన్ 1; టెన్ 3లో



భారత జట్టు టెస్టుల్లో అసలు ఓటమి ఎరుగని వేదిక... జొహాన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానం. గతంలో నాలుగు సార్లు ఆడిన టీమ్‌ఇండియా ఓ సారి గెలిచి... మూడుసార్లు డ్రాలతో గట్టెక్కింది. ప్రస్తుత సిరీస్‌లో కోహ్లిసేన ఇప్పటికే దక్షిణాఫ్రికా చేతిలో తొలి రెండు టెస్టుల్లోనూ ఓడి పరువు కాపాడుకోవడానికి వాండరర్స్‌లో అడుగు పెడుతోంది. బుధవారం భారత్-దక్షిణాఫ్రికాల చివరి టెస్టు ఆరంభం కానుంది. ఓ వైపు టీమ్‌ఇండియా పరువు కోసం తాపత్రయపడుతోంటే... మరోవైపు భారత్‌ను 3-0తో వైట్‌వాష్‌కు గురి చేయాలని దక్షిణాఫ్రికా సమరోత్సాహంతో ఉంది. 1992 నుంచి ఆరు సార్లు పర్యటించినా దక్షిణాఫ్రికా గడ్డపై భారత్ ఇంతవరకు వైట్‌వాష్‌కు గురైన సందర్భాలు లేవు. దీంతో అచ్చివచ్చిన వాండరర్స్‌లో చివరి టెస్టులో గెలిచి రికార్డును పదిలంగా ఉంచుకోవాలని భారత్ పట్టుదలగా ఉంది. గత రెండు టెస్టుల్లోనూ జట్టు కూర్పు విషమంలో విస్తుపోయే నిర్ణయాలు తీసుకున్న టీమ్‌ఇండియా యాజమాన్యం... చివరి టెస్టులోనూ మార్పులు తప్పక చేస్తుందనడంలో సందేహం లేదు. పేసర్ బుమ్రా స్థానంలో భువనేశ్వర్ రాక అనివార్యంగా కనిపిస్తోంది. టీమ్‌ఇండియా... వాండరర్స్‌లో గెలిచి రికార్డును కాపాడుకునేనా? వన్డేలకు ముందు విశ్వాసాన్ని ప్రోదిచేసుకునేనా? చూడాల్సిందే!

- వాండరర్స్... భారత్ పరువు నిలిపేనా!
- మళ్లీ భువనేశ్వర్!
- అశ్విన్ బెంచ్‌కే?
- నేటి నుంచి చివరి టెస్ట్
- క్లీన్‌స్వీప్‌పై దక్షిణాఫ్రికా కన్ను

జొహాన్నెస్‌బర్గ్

దక్షిణాఫ్రికా పర్యటనలో టెస్టు సిరీస్.. కోహ్లిసేనకు ఎన్నో పాఠాలు నేర్పింది. జట్టు కూర్పు నుంచి మైదానంలో ప్రదర్శనల వరకు గత రెండు టెస్టుల్లో కలిసి వచ్చింది లేదు. సిరీస్‌లో 0-3తో ఓడి నా భారత్ నెంబర్ వన్ ర్యాంకు చేజారదు. కానీ ఆ నెంబర్ వన్ జట్టు తన స్థాయికి తగినట్లు ఆడి గెలవకుంటే ఆ హోదాకు అర్థమే లేదు. భారత్‌ను వైట్‌వాష్ చేయాలని ఉవ్విళ్లూరుతున్న దక్షిణాఫ్రికా పేస్ దళం చేతిలో పరాభవానికి గురికాకూడదంటే.. విరాట్ కోహ్లి సరైన కూర్పుతో ఆఖరి టెస్టు బరిలోకి అడుగుపెట్టాలి. కేప్‌టౌన్‌లో 72 పరుగుల తేడాతో, సెంచూరియన్‌లో 135 పరుగుల తేడాతో గెలిచి ఆతిథ్య జట్టు సిరీస్‌ను 2-0తో తన జేబులో వేసుకుంది. కోహ్లి సారథ్యంలో భారత్‌కు విదేశాల్లో తొలి టెస్టు సిరీస్ ఓటమి. 2014లో అతని నేతృత్వంలో ఆస్ట్రేలియాలో ఓ టెస్టులో ఓడినా.. పూర్తిస్థాయి కెప్టెన్ ధోని. 2015 నుంచి వరుస విజయాలు సాధిస్తూ వచ్చిన కోహ్లిసేనకు ప్రస్తుత సిరీస్ బ్రేకులు వేసింది.

1 వాండరర్స్‌లో భారత్ విజయాలు. నాలుగు మ్యాచ్‌లాడి మూడు డ్రా చేసుకుంది.

అవకాశాలే ఎక్కువ. సోమవారం ఐదుగురు పేసర్లు నెట్స్‌లో బౌలింగ్ చేసినప్పటికీ తుది జట్టులో భువనేశ్వర్, ఇషాంత్, ఉమేశ్, షమిల నుంచే ముగ్గురిని ఎంపిక చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. నలుగురూ ఉన్నా ఆశ్చర్యం లేదు.

గెలిచింది ఒక్కసారే

కెప్టెన్ విరాట్ కోహ్లికి పరిస్థితులు ఒక్కసారిగా తారుమారయ్యాయి. గత ఆరు మాసాల్లో లంకలో విరాట్ సేన 3-0తో ఘన విజయం సాధించింది. ఆ దేశంలో ఈ ఘనత సాధించిన తొలి భారత జట్టు అతనిదే. ఇపుడు జట్టు భాగ్యరేఖలు తలకిందులయ్యాయి. భారత్ 1992 నుంచి ఇంతవరకు దక్షిణాఫ్రికాలో ఆరుసార్లు పర్యటించింది. 1996-97లో సచిన్ సారథ్యంలోని భారత జట్టు 3 టెస్టుల్లో 0-2తో ఓటమి పాలైంది. టీమ్‌ఇండియాకిదే అతిపెద్ద పరాజయం. 2006 నాటినుంచి దక్షిణాఫ్రికాలో సిరీస్‌లు ఆడిన భారత్ కనీసం ఓ టెస్టులో గెలుపు లేదా డ్రాతో తిరిగి వెళ్లింది. ఆ స్ఫూర్తితో కోహ్లిసేన గెలిచి పరువును కాపాడుకోవాలి. అందుకు వాండరర్స్ రికార్డే భారత ఆటగాళ్లకు సాయపడాలి. భారత్ ఇక్కడ 4 టెస్టులాడి ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు. 1992 నవంబరు, 1997 జనవరి, 2006 డిసెంబర్, 2013 డిసెంబరులో ఆ 4టెస్టులు జరిగాయి. 2006లో ద్రవిడ్ సారథ్యం లో టీమ్‌ఇండియా జయకేతనం ఎగురవేసింది. పేసర్ శ్రీశాంత్ (8-99) అద్భుత ప్రదర్శనతో జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు.

పదకొండేళ్ల అనంతరం...

దాదాపు 11 ఏళ్ల తర్వాత బౌన్స్, పేస్ కలిగిన పచ్చితో కూడిన పచ్చటి పిచ్‌ను నమ్ముకొని భారత్ విజయంపై విశ్వాసంతో చివరి టెస్టు బరిలోకి దిగుతోంది. వికెట్‌పై ఉన్న పచ్చికను ఇకపై తొలగించబోమని క్యురేటర్ ఆదివారం తెలిపాడు. అతను మాటకు కట్టుబడ్డాడు. మ్యాచ్‌కు 24 గంటల ముందు కూడా వికెట్ పచ్చటి తివాచీలా ఉంది. ఉపఖండంలోని పిచ్‌ను తలపించిన సెంచూరియన్ వికెట్.. సిరీస్‌ను సమం చేసే అవకాశం కోహ్లిసేనకిచ్చింది. ఇపుడు ఈ పచ్చటి పిచ్ కూడా అదే తరహా అవకాశం ఇస్తుందనడంలో సందేహం లేదు.

పాండ్య ఉంటాడు

ఆరుగురు బ్యాట్స్‌మెన్, పేసర్లతో బరిలోకి దిగాలనుకుంటున్న భారత జట్టులో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకుకూడా చోటుంటుంది. స్పిన్నర్ అశ్విన్ బెంచ్‌కే పరిమితం కావలసి ఉంటుంది. సెంచూరియన్లో రనౌట్ అయినా పాండ్యపై జట్టు నమ్మకం ఉంచింది. రెండో టెస్టులో కీపింగ్ పేలవంగా ఉన్నా పార్థివ్ పటేల్ కొనసాగే అవకాశాలే ఎక్కువ. మర్‌క్రమ్ అనుమానం: తొడ కండరం గాయానికి గురైన దక్షిణాఫ్రికా ఓపెనర్ మర్‌క్రమ్ చివరి టెస్టులో ఆడేది అనుమానమే. ఐతే అతను బుధవారం నాటికల్లా ఫిట్‌నెస్ సంతరించుకుంటాడని జట్టు ఆశిస్తోంది. ఆసీస్‌తో నాలుగు టెస్టుల సిరీస్ జరగనున్న నేపథ్యంలో దక్షిణాఫ్రికా తమ బెంచ్ బలాన్ని పరీక్షించొచ్చు. అపుడు మర్‌క్రమ్‌కు విశ్రాంతినిస్తారు. గాయంతో బ్యాట్స్‌మన్ తెంబా బవుమా టెస్టుకు దూరమయ్యాడు. ఆతిథ్య జట్టు కూడా ఐదుగురు పేసర్లతో బరిలోకి దిగాలనుకుంటే మహరాజ్ స్థానంలో క్రిస్ మోరిస్ జట్టులోకి వస్తాడు.



కోహ్లి తప్పుల్ని ఎవరైనా ఎత్తిచూపాలి

న్యూఢిల్లీ: మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ మరోసారి కెప్టెన్ విరాట్ కోహ్లిపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాడు. జట్టులో విరాట్‌కు ఎదురు చెప్పేవారు లేరని, మైదానంలో అతను చేసే తప్పుల్ని ఎత్తి చూపేవారు లేరని వీరూ అన్నాడు. "మైదానంలో కోహ్లి చేసే తప్పుల్ని ఎత్తి చూపగల ఆటగాడు ఎవరైనా ఉండాలి. కెప్టెన్‌కు సలహా ఇవ్వగల వారు జట్టులో నలుగురైదుగురు ఆటగాళ్లుంటారు. మైదానంలో తప్పుల్ని వారు ఆపగలరు. కానీ ప్రస్తుత జట్టులో అలాంటి వారు ఉన్నట్లు నాకనిపించడం లేదు. విరాట్ సెలెక్షన్‌ను సవాలు చేయగల వారు డ్రెస్సింగ్ రూమ్‌లో ఎవరూ లేరు. అతని స్థాయి ఆటగాళ్లు జట్టులో లేరు" అని వీరూ అన్నాడు.

ఆడతారా...తప్పుకుంటారా?

జొహానెస్‌బర్గ్: చివరి టెస్టుకు ముందు సహచరులతో నిర్మొహమాటంగా మాట్లాడినట్లు టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మంగళవారం వెల్లడించాడు. రెండో టెస్టులో ఓటమి అనంతరం 'మనకు మనం కఠినంగా ఉండాలని' చెప్పానన్నాడు. "ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడాను. తప్పు ఎలా జరిగిందీ.. ఎలా, ఎందుకు జరిగిందీ చర్చించాను" అని కోహ్లి వివరించాడు. "కుర్రాళ్లు అర్థం చేసుకున్నారు. మైదానంలో అడుగుపెట్టగానే పొరపాట్లను సరిదిద్దుకోవడానికి అవకాశం వస్తుంది. అంతర్జాతీయ క్రికెట్లో అలాగే పురోగతి సాధించాలి" అన్నాడు.

కెప్టెన్‌గా విరాట్ కష్టమే



జొహాన్నెస్‌బర్గ్: సుదీర్ఘ కాలానికి కెప్టెన్‌గా విరాట్ కోహ్లి ఎంపిక సరికాదని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ అన్నాడు. కోహ్లి కెప్టెన్సీ నైపుణ్యం పట్ల స్మిత్ సందేహాలు వ్యక్తం చేశాడు. "కోహ్లి భారత జట్టుకు సుదీర్ఘ కాలానికి పనికి వచ్చే కెప్టెన్‌లా నాకు కనిపించలేదు. టీమ్‌ఇండియా ఈ ఏడాది అంతానికి విదేశీ పర్యటనకు వెళ్లాలి. అపుడు అతనిపై ఒత్తిడి ఉంటుంది. మీడియా అతని ప్రదర్శనపై ఓ కన్నేసి ఉంచుతుంది. శల్య పరీక్ష చేస్తుంది. విదేశాల్లో జట్టు ఓడితే.. ఫామ్‌తో తంటాలు పడితే మీడియా విడిచిపెట్టదు. అపుడు భారత్‌కు మెరుగైన నాయకుడుంటే కోహ్లిపై అంత భారం పెట్టకూడదంటాను" అని స్మిత్ అన్నాడు.

రహానే ఉంటాడా?



వాండరర్స్ టెస్టుకు భారత జట్టులో కోహ్లి కనీసం ఒక్క మార్పయినా చేయడం అనివార్యంగా కనిపిస్తోంది. మూడు రోజుల విరామం అనంతరం ఆదివారం జట్టు తిరిగి ప్రాక్టీసు ఆరంభించాక రహానే నెట్స్‌లో సుదీర్ఘంగా బ్యాటింగ్ చేశాడు. గత రెండు రోజుల్లో నాలుగు గంటల పాటు ప్రాక్టీస్ సెషన్లో పాల్గొన్నాడు. రహానే జట్టులోకి వచ్చినా రోహిత్‌ను తప్పించాలన్న ఉద్దేశం జట్టు మేనేజ్‌మెంట్ ఉన్నట్లు లేదు. ఆరుగురు బ్యాట్స్‌మెన్‌కు తోడు బౌలింగ్ విభాగంలో పూర్తిగా పేసర్లతో బరిలోకి దిగే వ్యూహంతో సిద్ధమైనట్లు కనిపిస్తోంది. సెంచూరియన్ టెస్టుకు 48 గంటల ముందు కూడా టీమ్‌ఇండియా ఇదే వ్యూహంతో ఉంది. ఐతే పిచ్‌ను చూసిన తర్వాత ఆ ఆలోచనను విరమించుకుంది. ఇపుడు వాండ రర్స్ వికెట్ పచ్చికతో కళకళలాడుతుడూ పేస్, బౌన్స్‌కు అనుకూలించేదిగా ఉండడంతో జట్టు యాజమాన్యం ఆ వ్యూహంతోనే బరిలోకి దిగే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పిచ్... వాతావరణం: పిచ్‌పై 6 మిల్లీ మీటర్ల ఎత్తున పచ్చిక ఉంది. మ్యాచ్ జరిగే ప్రతి రోజు వర్షం పడే అవకాశముంది. సూర్యుడు ప్రతాపం చూపడంతో పిచ్‌పై పగుళ్లు ఏర్పడ్డాయి. ఎండ వల్ల సిబ్బందిని పిచ్‌పై రోల్ చేయగలి గారు. వికెట్‌పై పేస్, బౌన్స్ ఉంటుంది. క్యురేటర్‌ను తాము ప్రత్యేకంగా ఏమీ కోరలేదని డుప్లెసిస్ చెప్పాడు. కేప్‌టౌన్ కంటే మెరుగైన పిచ్ అని కోహ్లి భావిస్తున్నాడు. పగుళ్లు ఉన్నప్పటికీ వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

తుది జట్లు(అంచనా)

భారత్: 1, 2 స్థానాల్లో.. విజయ్, ధావన్, రాహుల్‌లలో ఇద్దరు, 4వ స్థానంలో కోహ్లి, 3, 5, 6 స్థానాల్లో... పుజారా, రహానే, రోహిత్, పాండ్యల నుంచి ముగ్గురు, 7వ స్థానంలో.. పార్థివ్ లేదా కార్తిక్, 8 నుంచి 11 స్థానాల వరకు... అశ్విన్, పాండ్య, భువనేశ్వర్, ఇషాంత్, షమి, ఉమేశ్, బుమ్రాల నుంచి నలుగురు.

దక్షిణాఫ్రికా: ఎల్గర్, మర్‌క్రమ్, ఆమ్లా, డివిలియర్స్, డు ప్లెసిస్, డి కాక్, ఫ్రుయిన్-ఫెహ్లువాయో-మహరాజ్, ఫిలాండర్, రబాడ, మోర్కెల్, ఎన్‌గిడి.

భువీ తిరిగి దళంలోకి...

విదేశాల్లో టెస్టు సిరీస్ కోల్పోగానే విరాట్‌పై విమర్శల జడివాన కురిసింది. ప్రత్యేకించి అతని దృక్పథం... జట్టు ఎంపికలపై తీవ్ర విమర్శనాస్త్రాలను అతను ఎదుర్కోవలసి వచ్చింది. వైస్ కెప్టెన్ అజింక్య రహానేను పక్కన పెట్టడంపై ఇటు కెప్టెన్, అటు కోచ్ రవి విమర్శలకు వెరవనప్పటికీ తొలి టెస్టులో భారత్‌కు అద్భుత అవకాశాలు కల్పించిన పేసర్ భువనేశ్వర్ కుమార్‌పై సెంచూరియన్ టెస్టుకు వేటు విషయంలో మాత్రం జట్టు యాజమాన్యం పునరాలోచనలో పడినట్లనిపిస్తోంది. దీంతో మూడో టెస్టుకు భువీ తిరిగి తుది జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. ఆశ్చర్యకరంగా రెండు టెస్టులకు తుది జట్టులో చోటు సంపాదించిన జస్ప్రీత్ బుమ్రా ఈ సారి బెంచ్‌కే పరిమితమయ్యే


ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఢాకాలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ బ్యాట్స్‌మన్ అనాముల్ హక్‌ను ఔట్ చేసిన జింబాబ్వే బౌలర్ కీల్ జెర్విస్. మ్యాచ్‌లో బంగ్లా 91 పరుగులతో గెలిచింది. ముందుగా బంగ్లా 9 వికెట్లకు 216 పరుగులు చేయగా... జింబాబ్వే 36.3 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ

లైఫ్

బుధవారం
24 జనవరి 2018

I



"నాకు కులం,మతం, పదవులు ముఖ్యంకాదు. నేను ప్రజలు చెల్లించే పన్నులను జీతంగా తీసుకుంటున్నా. అది వారి రెక్కల కష్టం. నా పరిధిలో నేను ఎంతమేరకు ప్రజలకు సేవచేస్తున్నాననేదే నాకు ముఖ్యం. ప్రజల గుండెల్లో ఇంత చోటుదక్కితే చాలు... అదే నాకు గొప్ప అవార్డు.. పెద్ద రివార్డు..."

తెలంగాణ - రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ డీజీపీ టీ.కృష్ణప్రసాద్



కాదేదీ కవితకు అనర్హం!.. అంటారు మహాకవి శ్రీశ్రీ....దానిని కాస్త మార్పు చేసుకుంటే ...కాదే సమస్యా..పరిష్కారానికి అనర్హం!.. అనొచ్చు. కాకపోతే సమస్యకు మూలాలు శోధించాలి. కారణాలను లోతుగా అధ్యయనం చేయాలి. పరిష్కార మార్గాలను అన్వేషించాలి. కార్యాచరణ రూపొందించుకోవాలి....కార్యరంగంలోకి దూకాలి... అప్పుడే ఎంతటి క్లిష్ట సమస్య అయినా దూది పింజలా తేలిపోతుంది. అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు. అదే చేశారు ఐపీఎస్ అధికారి తెన్నేటి కృష్ణ ప్రసాద్! విశాఖ ఏజెన్సీలోని గిరిజనం గుండెల్లో చైతన్యాన్ని రగిలించారు. నక్సల్స్‌కు ఆయువు పట్టైన ఏజెన్సీ ప్రాంతంలో వారికి నిలువ నీడలేకుండా చేశారు. అధికారుల మీద ఆగ్రహంతో నక్సల్స్‌కు అండగా నిలిచిన గిరిపుత్రుల విల్లంబులను.. వారి మీదికే గురిపెట్టేలా చేశారు. అతనే తెలంగాణ ప్రస్తుత రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ డీజీపీగా విధులు నిర్వహిస్తున్న టీ.కృష్ణప్రసాద్! పోలీసు అధికారి అనే కంటే ప్రజల్లో తానూ ఒకరిని అనే సామాజిక స్పృహతో విధులు నిర్వర్తిస్తూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మరోవైపు తన దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ పిలుపునకు ఆకర్షితుడై ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని .. విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారు.

లేదన్న బాధను వారిలోంచి తొలిగించడం జరిగింది. ఆ తర్వాత తల్లిదండ్రుల చేతనే ..నక్సల్స్‌లో చేరిన వారి బిడ్డలకు ఇండ్లకు రావాలని, జనజీవన స్రవంతిలో కలవాలని ఉత్తరాలు రాయించాము. ఈ ఉత్తరాలు...ఉడుకు రక్తం, ఆవేశం,ఇతర కారణాల వల్ల నక్సల్స్‌లో చేరిన వారిలో మార్పు తెచ్చింది. నా హయాంలో 374 మంది నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలిశారు. అందులో 60మంది ఆయుధాలతో లొంగిపోయారు. అలా లొంగిన వాళ్లకు ప్రభుత్వం ద్వారా పునరావాసం కల్పించాము. బాధిత తల్లిదండ్రులను ఆదుకోవడం, వారి పిల్లలను వారివద్దకు చేర్చడం అనేది నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది.

ఎర్రవల్లే ఎందుకంటే!

ఎర్రవల్లి గ్రామాన్నే ఎందుకు దత్తత తీసుకున్నానంటారా? ..నా చిన్నతనంలో ఆ గ్రామం నా మనస్సులో చెరగని ముద్రవేసింది. ఆ జ్ఞాపకం నన్ను నిత్యం వెంటాడింది. నా స్కూల్ ఏజ్‌లో మా నాన్న..వికారాబాద్ డీఎల్‌టీసీ (ఇప్పటి ఐటీఐ)ప్రిన్స్‌పాల్‌గా పనిచేసేవారు. నేను అప్పుడు విజయనగర్ కాలనీ, మెహిదీపట్నంలో చుదువుకుంటున్నా. సెలవు రోజుల్లో నాన్నదగ్గరకు వెళితే ఆయన బైక్ మీద పరిసర గ్రామాలకు తీసుకెళ్లేవాడు.అలా ఓ సారి అటవీ ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామం ఎర్రవల్లికి వెళ్లడం జరిగింది. అక్కడి పరిస్థితులు,పేదరికం, విద్య,ప్రజల ఆర్థిక పరిస్థితులు నాకు ఆవేదన కల్గించాయి.అప్పటి నుంచి ఆ జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. 2015లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్...గ్రామ జ్యోతి కార్యక్రమంలో భాగంగా, అధికారులు గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చినప్పుడు నా మదిలో మెదిలిన గ్రామం ఎర్రవల్లి.,. అందుకే వికారాబాద్ జిల్లాలోని (పాత రంగారెడ్డి జిల్లా) ఎర్రవల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నా. 15 మంది ఉత్సాహవంతులైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లచేత ఎర్రవల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాలలో సమగ్రసర్వే చేయించాను. ముఖ్యంగా

గిరిజనుల గుండెల్లో గుడారమేశా!

నేను-నా ప్రజలు

నక్సల్స్ ప్రభావం నుండి గిరిపుత్రులను తప్పించిన త్రీ టీ వ్యూహం

మూడు గుడారాల పద్ధతి

పరిష్కారం లేని సమస్య అంటూ ఏదీ ఉండదు. ఇది నా ప్రగాఢ విశ్వాసం. అయితే కాస్త ఓర్పు అవసరం. పోలీసు అధికారిగా ప్రజల్లో తిరిగినప్పుడు వారి సమస్యలు నన్ను మనోవేదనకు గురిచేసేవి. అందుకే అందరిలో ఒకరిగా కాకుండా..సాధ్యమైనంత వరకు.. నా పరిధిలో.. ప్రజా సమస్యలు పరిష్కారించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నా. కామారెడ్డి ఎఎస్పీగా, మెదక్, విశాఖపట్నం జిల్లాల్లో ఎస్పీగా,వరంగల్ రేంజ్ డీఐజిగా పనిచేశా. అప్పుడు అటు నక్సల్స్, ఇటు సాయుధ బలగాల మధ్య నలిగే ప్రజల స్థితి కలచివేసింది. విశాఖ ఎస్పీగా పని చేసినప్పుడు ఏజెన్సీప్రాంతంలో నక్సల్స్ సమస్యపై ఫోకస్ పెట్టాను. అందుకోసం నేను ప్రవేశపెట్టిన మూడు గుడారాల పద్ధతి(త్రీ-టెంట్స్) మంచి ఫలితాలను ఇచ్చింది. నక్సల్స్‌కు అండగా ఉండే గిరిజనాన్ని వారిపైనే తిరుగుబాటుచేసేలా చేసింది...ఎజెన్సీలో గిరిజనులు అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేస్తుంటారు. అటవీ అధికారులు, అటు రెవెన్యూ, ఇటు పోలీసు సాయంతో గిరిజనులను పోడు వ్యవసాయం చేసుకోకుండా అడ్డుకుంటారు. భూముల నుంచి తరిమేస్తారు. పోడు వ్యవసాయం గిరిజనానికి అనాదిగా వస్తున్న ఆచారం. గిరిజనం ఆచార,వ్యవహారాలకు అడ్డు తగిలితే సహించరు. ఎజెన్సీలో అదే జరిగింది. అధికారులకు, గిరిజనులకు మధ్య వైరం పెరిగింది. సాయుధ దళాల ఆయుధాల ముందు వారి బాణాలు ఎందుకు పనికిరావు కదా? అందుకే గిరిజనులు నక్సల్స్‌ను ఆశ్రయించేవారు. వాళ్లను అడ్డంపెట్టుకొని నక్సల్స్ ఏజెన్సీలో పట్టుసాధించి, విధ్వంసాలకు పాల్పడేవారు. నేను చేసిన అధ్యయనంలో ఈ నిజం తెలుసుకున్నా. అందుకే గిరిజనుల మనసు మార్చాలని, వారిని నక్సల్స్ సానుభూతి పరులుగా మారకుండా చేయాలని నిర్ణయించుకున్నా. అందులో భాగంగా త్రీ -టెంట్స్ పద్ధతి ప్రవేశపెట్టాను. ఇందులో భాగంగా ఏజెన్సీలోని గిరిజన ఆవాస ప్రాంతాల్లో మూడు శిబిరాలు ఏర్పాటు చేసేవాడిని. మొదటి శిబిరంలో గిరిజనుల సంప్రదాయాలకు అనుకూలంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవాళ్లం. వాళ్లకు సంబంధించిన నృత్యాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అధికారుల పట్ల వారికున్న వ్యతిరేకత తీవ్రత కొంత తగ్గేది. ఆ తర్వాత రెండో శిబిరంలో మెడికల్ క్యాంప్ నిర్వహించేవాళ్లం. విశాఖ నుంచి వచ్చిన డాక్టర్లు వారికి ఆరోగ్యపరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందించే వారు. దానితో అధికారుల పట్ల వారికి కాస్త సానుకూల ధోరణి కలిగేది. చివరగా మూడో శిబిరం....ఇది కీలకమైంది. ఇందులో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఉండేవారు. అక్కడి గిరిజనుల సమస్యలేంటో తెలుసుకుని, మేమే రికార్డు చేసుకునే వాళ్లం. ఆ తర్వాత నేనే స్వయంగా కలెక్టర్ వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించే వాణ్ణి. అలా వారి విద్య, ఆరోగ్యం, ఆహారం పట్ల శ్రద్ధ తీసుకున్నా. 1993-1996 మధ్య కాలంలో ఏకంగా నాలుగు సంవత్సరాలు పాటు, 46 త్రీ-టీ కార్యక్రమాలు నిర్వహించాను. ఒక వైపు మూడు మిటలరీ దళాల కూంబింగ్ జరుగుతుండగానే మా కార్యక్రమాలు సమాంతరంగా సాగించాము. నాకు బాగా గుర్తు 812 మంది గిరిజనులకు కంటికి సంబంధించిన క్యాటరాక్ట్ అపేరేషన్లు ఉచితంగా చేయించగలిగాను.

ప్రతి పీఎస్ రైటర్..... ఓ కాంపౌండర్!

ఏజెన్సీ ప్రాతంలో రోగాలు ఎక్కువ. అందుకే వారికి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాం. కాని ఏజెన్సీలో .. ఆస్పత్రుల కంటే పోలీస్ స్టేషన్లే వారికి అందుబాటులో ఉంటాయి. అందుకే ప్రతి పోలీస్ స్టేషన్ రైటర్‌ను ఒక కాంపౌండర్‌గా మార్చివేశాను. చిన్నచిన్న వ్యాధులకు ప్రథమ చికిత్స ఇచ్చేలా తర్ఫీదు ఇచ్చాము రైటర్లకు!.. స్థానికులు చిన్న అస్వస్థతకు గురైనా మందుల కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చేవాళ్లు. అలా పోలీసులు, గిరిజనులకు మధ్య మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. గతంలో వారికి పోలీసులంటే ఉండే భయం పోయింది. పోలీసులు మా హితులనే భావన కల్గింది. ఆ విధంగా గిరిజనానికి చేరువ కావడం ద్వారా ఏజెన్సీలో నక్సల్స్‌కు చెక్ పెట్టగలిగాను. చివరకు ఏజెన్సీలోకి అన్నలు వస్తే వాళ్లే తిరగబడి తమ బాణాలతోనే తరిమికొట్టారు. అప్పుడు అది దేశవ్యాప్తంగా ఓ సంచలనం. బీబీసీ న్యూస్ చానెల్ త్రీ-టెంట్స్ కార్యక్రమాన్ని టెలికాస్ట్ చేసింది. 1996లో గిరిజనంలో రగిలిన చైతన్యం కారణంగా



2006 వరకు ఏజెన్సీలో అడుగుపెట్టేందుకు నక్సల్ భయపడ్డారు. అప్పట్లో దాదాపుగా వారు ఉనికి ని కోల్పోయారనే చెప్పాలి. అది నా ఉద్యోగ ప్రస్థానంలో ఎనలేని సంతృపిని, పోలీసు అధికారిగా మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. 1993లో జనజీవన స్రవంతిలో కలిసిన నక్సల్స్‌కు ప్రభుత్వంతో మాట్లాడి 3 ఎకరాల భూమిని ఇప్పించడం, ఒక ఇల్లు కట్టించడం జరిగింది. ఇలా జనజీవన స్రవంతిలో కలిసిన నక్సల్స్‌కు పునరావాసం కల్పించడం.. దేశ చరిత్రలో అదే ప్రథమం!

ఉత్తర తెలంగాణలో..


2003లో వరంగల్ రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించా. ఈ రేంజ్‌లోని జిల్లాల్లో కూడా నక్సల్స్ ప్రభావం ఎక్కువే. ఇక్కడా దాని మీదే ఫోకస్ పెట్టాను. అయితే ఇక్కడి పరిస్థితులకు అనుకూలంగా కాస్త రూటుమర్చాను. నక్సల్స్ తల్లిదండ్రులపై దృష్టి సారించాను. చేతికి అందివచ్చిన కొడుకులు తీవ్రవాదంవైపు మొగ్గుచూపితే.. .వారు తిండికి, గుడ్డకు ఇబ్బందులు పడడం చూశా. అందుకే వరంగల్ పోలీస్ రేంజ్ పరిధిలోని ప్రతి పీఎస్..... అన్నల తల్లిదండ్రులను దత్తత తీసుకనేలా చేశాను. ప్రతి పండగకు వారి ఇండ్లకు వెళ్లి కొత్తబట్టలు ఇచ్చేవాళ్లు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు. ఆరోగ్య పరీక్షలు చేయించడం....మందులు ఇప్పించడం ..ఒక్క మాటలో చెప్పాలంటే మాకు కొడుకు

బడివయసు పిల్లలు ఎందుకు పాఠశాలకు వెళ్లడం లేదు? బడికి వెళ్లిన తర్వాత మధ్యలో ఎందుకు మానేస్తున్నారు? అనే విషయాన్ని మూలాల్లోకి వెళ్లి మరీ అధ్యయనం చేశాను. భవిష్యత్తుకు కరదీపికలాంటి విద్యకు ఎందుకు దూరమవుతున్నారో తెలుసు కున్న తర్వాత ..డ్రాప్ అవుట్, బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి, వారికి విద్యయొక్క ప్రాముఖ్యతను వివరించి చెప్పి, పిల్లలను పాఠశాలకు పంపేవిధంగా ప్రోత్సహించటం జరిగింది. ఆ విధంగా 65 మంది పిల్లలను బడిలో చేర్పించ గలిగాము. మొత్తానికి నేను దత్తత తీసుకోక ముందు 85 శాతం ఉన్న విద్యా నమోదు 2016లో 100 శాతానికి చేరింది. వారిని బడిలో చేర్పించి వదిలేస్తే తిరిగి డ్రాప్ అవుట్ అయ్యే అవకాశం ఉంది. అందుకే వారిని ప్రోత్సహించే పనిచేయాలి అందుకే 5మంది వికలాంగ విద్యార్థులకు వీల్ చైర్స్ సమకూర్చాను. అప్పుడు విద్యార్థుల ముఖాల్లో చూసిన ఆనందం కల్గించిన తృప్తి ..ఏ పదోన్నతీ కల్గించలేదు. విద్యార్థుల్లో విద్య పట్ల మక్కువ పెంచేందుకు 2016లోనే 100 మందికి స్కూల్ యూనిఫామ్స్, స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేశాను. ఇతర గ్రామాలకు చదువుకునేందుకు నడిచి వెళ్లే విద్యార్థినీ, విద్యార్థులు 36 మందికి ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశాను. గ్రామాన్ని అనుసంధానం చేస్తూ... వికారాబాద్ మరియు సదాశివపేటకు బస్సు సౌకర్యం కల్పించాను. నేలపై కూర్చొని చదువుకునే పిల్లలకోసం 36 స్టీల్ బెంచ్‌లను అందిచాను. ఆంగ్ల విద్యకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించి, శిక్షణ పొందిన ఇద్దరు ఇంగ్లీషు టీచర్లను నియమించి, వారికి నెలవారి జీతాలను నేను భరిస్తున్నాను. మనం ఎంత ప్రోత్సహించినా ఆర్థిక పరిస్థితులు ఏమాత్రం అనుకూలించని విద్యార్థులను సాంఘిక గురుకుల పాఠశాలల్లో చేర్పించాను. విద్యార్థుల్లో మానసిక, శారీక దృఢత్వం పెంచే ఆటలను ప్రోత్సహించాను. పాఠశాలకు క్రికెట్ కిట్లు, టెన్నిస్ కిట్లు సమకూర్చాను. తరగతి గదుల కొరతను అధిగమించేందుకు గ్రామస్తులతో మాట్లాడి స్థలసేకరణ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక 2017లో పోలీసు శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నోడల్ అధికారిగా నియమించడంతో పోలీసు కమిషనరేట్లు, జిల్లాల పరిధిలోని పోలీస్ స్టేషన్లతో పాటు పాఠశాలల్లో విరివిగా మొక్కలు నాటించే అదృష్టం దక్కింది.

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

కాగితం కళలు!

ఐడియా











ఇక్కడ కనబడుతున్న అందమైన కళాకృతులన్నీ కాగితంతో తయారయినవే. నిజమా అనేంతగా... నమ్మశక్యం కానట్టుగా ఉన్నాయి కదూ. కాగితాలను రకరకాల ఆకారాల్లో మడతలు పెట్టి...వాటికి రంగులువేసి...అందమైన భిన్న ఆకృతులను తయారు చేయటం ఇక్కడ చూడవచ్చు. పాతబడిన చెక్క, ఇనుము లాంటి వస్తువులకు కాగితాలను రకరకాల ఆకృతుల్లో అతికిస్తే...వాటి ఆకారమే మారిపోయి...ఒక అలంకార వస్తువుగా మారిపోతుంది. మన అవసరం, ఆలోచనను బట్టి..వీటిని ఎన్నిరకాలుగానైనా చేసుకోవచ్చు.











ఆమే... అధికురాలు!



ఈ రోజుకి కూడా అమ్మాయి పుట్టగానే... ఆమెకి పెళ్లి ఎలా చేయాలి... అని దిగులుపడే తల్లిదండ్రులు మనదేశంలో ఉన్నారు. అందుకే మనకు ఇంకా చిన్నారి పెళ్లి కూతుళ్లు ఉంటున్నారు. ప్రపంచంలోనే బాల్య వివాహాలు జరుగుతున్న దేశాల్లో భారత్ అగ్ర స్థానంలో ఉంది. పద్దెనిమిదేళ్లు దాటాకే ఆడపిల్లకు పెళ్లి చేయండి...అని ప్రభుత్వం ఒక పక్క చెబుతున్నా... పద్దెనిమిదో పుట్టినరోజుకే వివాహితులైపోతున్న బాలికల సంఖ్య 47శాతంగా ఉంది. బీహార్లో ఈ సంఖ్య 69శాతం ఉంటే రాజస్థాన్‌లో 65 శాతంగా ఉంది. ముఖ్యంగా 15-18 సంవత్సరాల మధ్య వయసులో ఎక్కువ మంది బాలికలకు వివాహాలు జరుగు తున్నాయి. ఎన్ని చట్టాలు చేసినా..ఎంతగా ప్రయత్నించినా ఈ పరిస్థితిలో మార్పు మాత్రం రావటం లేదు. అమ్మాయిల విషయంలో తల్లి దండ్రుల దృక్పథంలో మార్పు వస్తే తప్ప... బాల్య వివాహాలు ఆగవు. ముఖ్యంగా ఆడపిల్ల లంటే ఇంటికి భారం మాత్రమే... అనుకునే తల్లి దండ్రులు తెలుసు కోవాల్సిన విషయా లు చాలా ఉన్నాయి. ఆమె మగపిల్లాడికంటే ఎన్నో విధాలుగా...అధికురాలు. ఈ విషయాలకు తగినంత ప్రచారం లేకపోవడం వల్లనే ఆడపిల్ల ప్రగతి... అసాధ్యం గా మారింది-

- ★అమ్మాయిలు అబ్బాయిల కంటే బలహీనులు అని గుడ్డిగా నమ్ముతుంటారు. కానీ అబ్బాయిల్లో కంటే అమ్మాయిల్లో క్రమశిక్షణ ఎక్కువ. వారు నియమ నిబంధనలను బాగా పాటి స్తారు. బోర్, ఒత్తిడి లేకుండా ఎక్కువ సమయం పని చేయగలుగుతారు. ఇవన్నీ అధ్యయనాల్లో తేలినవే.
- ★ కంప్యూటర్ గేమ్స్ అన గానే.. .. అవి అబ్బాయిలకు మాత్రమే చెందినవని భావిస్తారు. కానీ ఈ ఆటల విషయంలో అమ్మాయిలే అబ్బాయిల కంటే మెరుగైన కంప్యూటర్ ప్రోగ్రామర్లని ఒక అధ్యయనంలో తేలింది.
- ★ఒక జాబ్ ఇంటర్వ్యూని...మగవారికంటే అమ్మాయిలే బాగా ఎదుర్కో గలరని...వెస్ట్రన్ ఒంటారియో యూనివర్శిటీ పరిశోధనలో తేలింది. అమ్మాయిలు..అబ్బాయిలకంటే బాగా ఇంటర్వ్యూకి ప్రిపేర్ కాగలరట.
- ★అమ్మాయిలు సరిగ్గా డ్రైవింగ్ చేయలేరనేది చాలామంది అభిప్రాయం... కానీ కారు యాక్సిడెంట్లలో మగవారు... ఆడవారికంటే 77శాతం ఎక్కువగా మరణానికి గురయ్యే ప్రమాదం ఉందని ఒక అధ్యయనంలో వెల్లడైంది.
- ★లాభదాయకమైన పద్ధతుల్లో పెట్టుబడులు పెట్టటంలో కూడా మహిళలదే పైచేయి అట. ఆడవాళ్లు...ఆవేశానికి గురికాకుండా ఆచితూచి పెట్టుబడులు పెడతారని...అమెరికా వాణిజ్య దిగ్గజం వారెన్ బఫెట్ అంతటి ధనవంతుడు అవడానికి కారణం అతను ఆడవాళ్లలా ఆలోచించి పెట్టుబడులు పెట్టడమేనని విశ్లేషకులు అంటున్నారు.
- ★ఆడవాళ్లు మగవారికంటే మంచి బాసులు మేనేజర్లు, టీమ్ కోఆర్డినేటర్లు కాగలరట. వారు ఇతరుల భావోద్వేగాలను చక్కగా అర్థం చేసుకుంటారు. వారి ఆలోచనలు మగవారికంటే ఎక్కువ హేతుబద్ధంగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.
- ★కూతుళ్లు కొడుకుల కంటే ఎక్కువగా తల్లిదండ్రులను ప్రేమగా చూసుకుంటున్నారు. అమెరికాలో 16శాతం మంది కొడుకులు తమ తల్లిదండ్రుల పట్ల శ్రద్ధగా ఉంటే...ఈ విషయంలో అమ్మాయిల సంఖ్య 36శాతం. కొడుకులే కుటుంబ వారసులు అనే సంప్రదాయం ఉన్నా మనదేశంలో కూడా తల్లిదండ్రులను పోషిస్తున్న కూతుళ్ల సంఖ్య ఈ మధ్యకాలంలో బాగా పెరుగుతోంది.
- ★కొడుకులు కుటుంబాలను పోషిస్తారనే మాట అటుంచి... తల్లిదండ్రుల నుండి కొడుకులే ఎక్కువగా ఆశిస్తారని మరొక అధ్యయనం చెబుతోంది. తల్లిదండ్రుల నుండి ఆర్థిక సహాయం ఆశించే కొడుకుల సంఖ్య 41శాతం ఉంటే...ఈ విషయంలో కూతుళ్ల సంఖ్య 31శాతం మాత్రమే. తల్లిదండ్రులనుండి డబ్బు తీసుకునే అలవాటు చిన్నప్పటినుండీ కొడుకులకే ఎక్కువగా ఉండటం వలన ఇలా జరుగుతుందట.



సప్తజన్మల పాపాలను హరించే రథసప్తమి

మాఘమాస సప్తమి రోజు సూర్యుడు రథాన్ని అధిరోహించి భూమి మీద తొలిసారిగా సాక్షాత్కరించాడని పురాణాలు చెబుతున్నాయి. మాఘశుద్ధ సప్తమిని రథసప్తమి అని పిలుస్తారు. ఆ రోజే సూర్యజయంతి అని పురాణములు పేర్కొన్నాయి. సూర్యునికి ఏడు అంకెతో సంబంధం ఉంది. ఆయన కాంతిలో సప్తవర్ణాలు ఉంటాయి. సప్తాశ్వ రథమారూఢం అని ఆయన ధ్యాన శ్లోకంలో ఉంది అంటే ఆయన ఏడు గుర్రాలు పూన్చిన రథంపై పయనిస్తాడని అర్థం.

చైత్రమాసంలో ధాత అనే పేరుతోను, వైశాఖమాసంలో అర్యముడు అనే పేరుతోను, జ్యేష్ఠమాసంలో మిత్రుడు అనే పేరుతోను, ఆషాఢమాసంలో వరుణుడు అనే పేరుతోను, తిరిగే సూర్యభగవానుడు మాఘమాసం పూషుడు అనే పేరుతో సంచారం చేస్తాడు. ఈ మాసంలోనే త్వష్టాపేరును ధరించిన సూర్యుడు మరికొన్ని గణాలను వెంటబెట్టుకుని చిత్రవర్ణంలో తొమ్మిదివేల కిరణాలతో వెలుగొందుతూ సంచరిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ మాసం నుంచే చలి తగ్గి వేడి పెరగడం మనం గమనించవచ్చు.

మఖా నక్షత్రం-సింహరాశిలో ఉంటుంది. సింహరాశికి అధిపతి రవి. ఆరోగ్యా న్నిచ్చేవాడు భాస్కరుడు. కనుక, మాఘమాసంలో సూర్యారాధన విశేష ఫలితాన్నిస్తుంది. మాఘమాసంలో ముఖ్యంగా నదీస్నానం, దీపారాధన, సూర్యునికి అర్ఘ్యప్రదానం, దానం చెప్పబడ్డాయి. నదీస్నానంతో బాహ్యశుద్ధి, సూర్యారాధనతో, దానములతో అంతశ్శుద్ధి కలుగుతుంది.

మాఘమాస ఆదివారాల్లో సూర్యుని పూజ ఎంతో విశిష్టమైంది. సూర్యుని పూజించిన వారికి ఆరోగ్యమహాభాగ్యం కలుగుతుంది. సూర్యునికి నిమ్మకాయలు పండ్లను నైవేద్యం చెయ్యాలి. ఈ మాసంలో సూర్యభగవానుని పూజిస్తే అనారోగ్యం దరిదాపులకు కూడా రాదని శాస్త్రాలు చెబుతున్నాయి. లోభత్వం ఉన్నవారికి అనారోగ్యాలు కలుగుతాయని అంటారు. సూర్యభగవానుని పూజించిన వారికి మాత్రం ఐశ్వర్యాలతో పాటు ఆరోగ్యం లభిస్తుందని బ్రహ్మ, మార్కండేయ, మత్స్య, బ్రహ్మాండ, భవిష్యాది పురాణాలు చెప్తున్నాయి. సూర్యారాధన గురించి రామాయణ భారత భాగవతాలు వివరిస్తున్నాయి. అంతేకాక ఋగ్వేద, యజుర్వేదాల్లో ఉపనిషత్తులలో కూడా సూర్య ప్రశస్తి ఉంది.

మాఘమాసంలో మందసప్తమి, భానుసప్తమి వ్రతాలు ఆచరిం చాల్సినవి. సూర్యభగవానుని కోసం వ్రతాలు నోములు నోయలేని వారు మాఘ శుద్ధ సప్తమి తిథినాడు రథసప్తమి వ్రతం చేస్తే సంపూర్ణమైన సూర్యానుగ్రహం లభిస్తుంది. ఈ రథసప్తమినాడు నదీస్నానం చేయాలి. జిల్లేడు ఆకులను తలమీద పెట్టుకుని దాని మీద రేగి పండును ఉంచి 'సప్త సప్త మహాసప్త సప్త ద్వీపా వసుంధరా సప్త జన్మ కృతం పాపం మాకరీ హంతి సప్తమీ' అని శ్లోకం చదివి స్నానం చేస్తారు. ఇలా చేస్తే ఈ జన్మలోనివే కాక ఏడు జన్మల్లో చేసిన పాపాలు పోతాయని పెద్దలు చెబుతారు. జిల్లేడు లేదా రేగు లేదా చిక్కుడు ఆకులను అక్షతలతో లేదా రేగుపళ్లతో తలమీద భుజాలమీద ఉంచుకొని స్నానం చేయటం కూడా ఒక సంప్రదాయం. **"సప్తార్క పత్రాణి సప్త బదరీ పత్రాణి సంయోజ్య శిరసి నిధాయ స్నానం కుర్యాత్"**. జిల్లేడు రేగు ఆకులను కలిపి శిరస్సు భుజముల మీద ఉంచి స్నానం చేయడం సంప్రదాయమే కాదు శాస్త్రాలు కూడా ఈ స్నానం మంచిదని చెబుతున్నాయి. ఆ తరువాత సర్వాలంకారాలతో ఓ రథాన్ని తయారు చేసి మంటపంలో దాన్నుంచి కుంకుమ, గంధాక్షతలతో పూజించి సూర్యభగవానుని ప్రతిమను ఆ రథంలో ఉంచి అర్చించాలి. చిక్కుడు కాయలకు చీపురుపుల్లలు గుచ్చి సూర్య రథం తయారుచేయడం కొన్ని ప్రాంతాల్లో ఆచారంగా ఉంది. సూర్యభగవానునికి ఎదురుగా ఆవుపి డకలతో దాలిచేసి, దానిమీద పాయసాన్ని తయారుచేసి సూర్యభగవా నునికి నివేదిస్తారు. మహాభారతంలో రథసప్తమి వ్రతాన్ని గూర్చి శ్రీకృష్ణభగవానుడే స్వయంగా ధర్మరాజుకు తెలిపాడు. మాఘమాస సప్తమి నాడు నదీస్నానం చేసి సూర్యునికి అర్ఘ్యమిచ్చి, దానములు చేస్తే ఆయురారోగ్య సంపదలు కలుగుతాయని పురాణాలు పేర్కొన్నాయి.

మానవులు తమతమ ఇష్టకార్యసిద్ధి కోసం సూర్యభగవానుని పూజిస్తే వారికి తప్పక కోరికలు నెరవేరుతాయి. సత్రాజిత్తు కూడా సూర్యభగవానుని ప్రార్థించి శమంతకమణిని పొందినట్టు పురాణాలు చెప్తున్నాయి. అలాగే వనవాస సమయంలో ధర్మరాజు సూర్యానుగ్రహంతో అక్షయ పాత్ర పొందాడు. పురాణ పురుషులెంతో మంది సూర్యారాధన చేసినట్టు చెప్తారు. రథసప్తమి వ్రతాచరణ వల్ల విజయం సిద్ధించటంతో పాటు ఆయురారోగ్యాలు వృద్ధి చెందటం తథ్యం.

- జంగం శ్రీనివాసులు
8374894743

భీష్మాష్టమి

మాఘ శుక్ల అష్టమిని భీష్మాష్టమని పద్మ పురాణంలో వివరంగా చెప్పబడివున్నది.

'మాఘే మాసి సితాష్ట్యమాం సతిలం భీష్మ తర్పణం
శ్రాద్ధంచ యే నరాఃకుర్యుఃతేస్యుః సంతతి భాగినః

మాఘ శుద్ధ అష్టమినాడు నువ్వులతో భీష్మునికి తర్పణం వదిలి శ్రాద్ధము చేసిన వారికి సంతానము కలుగును. అదేవిధంగా వారికి ఆ సంవత్సరం చేసిన పాపం నశించును. మాఘశుద్ధ అష్టమి నాడు భీష్మునకు తిల తర్పణం చేసి, అన్నదానం చేయవలెను.

వైయాఘ్రపాద గోత్రాయ సాంకృత్య ప్రవరాయచ
అపుత్రాయ దదామ్యేతత్ జలం భీష్మాయ వర్మణే
వసూనామవతారాయ శంతనోరాత్మ జాయచ
అర్ఘ్యం దదామి భీష్మాయ ఆబాల బ్రహ్మచారిణే



ఈ అర్ఘ్య తర్పణ మంత్రములతో శ్రాద్ధం చేసి అన్నదానం చేసినచో ఈప్సితార్థ(కోరుకున్నది) సిద్ధి కలుగును. అనగా కోరుకున్నది సిద్ధించును.



- డా॥ కందాడై రామానుజాచార్య

గో తులాభారమూ ఉంది



హిందూ ధర్మం ప్రకారం ఏ శుభకార్యమైనా గోవు సంబంధం లేకుండా సంపూర్ణం కాదు. గోమాత మనకిచ్చే పంచగవ్యాలు పాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గో మూత్రం కూడ అంత ప్రాముఖ్యంగలవే. పెళ్ళి, పూజ, నామకరణం, గృహ ప్రవేశం, అన్న ప్రాశన, ఉపనయనం మొదలైన వాటన్నిటిలోనూ గో సంబంధ ద్రవ్యాల వాడకం ఉంటుంది. గోవు ఆరోగ్యం, సంపద, జ్ఞానం, చైతన్యం కలిగించే సామర్థ్యం కలిగి ఉంది.

కార్తిక శుద్ధ పాడ్యమినాడు కృష్ణుడు గోవర్ధన పర్వత మెత్తిన రోజు. ఆ రోజు పూర్వాహ్ణ కాలంలో గోవుని, కృష్ణుణ్ణి పూజించాలి. దానిని మార్గపాళి గోవర్ధనుని పూజ అంటారు. గో ద్వాదశి, గో వత్స ద్వాదశి కూడా అలాగే ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. దానిని గురించి స్కాంద పురాణంలో విశదంగా వివరించారు. గోబర్ధన్ అనే పదంలోని గోబర్ అంటే గోమయం, ధన్ అంటే ధనం. మొత్తంగా గోమయం ధనం కలదని అర్థం చెబుతారు.

ఎద్దు ధర్మానికి సంకేతం. శంకరుని అవతారం 'నీల వృషభుడు'. శివుడు వృషభవాహనుడు. ప్రణవంతో కూడిన సురభ్యైనమః అనే దాన్ని సురభి షడక్షర మంత్రంగా పేర్కొంటారు.

ఇక శ్రీకృష్ణ తులాభారం అందరికీ తెలిసిందే. మేడారం వంటి చోట్ల బెల్లంతో తులాభారం చేస్తారు. అయితే గో తులాభారం అనేది కూడా ఉంది. గోవుతో సరితూగే గ్రాసాన్ని దానం చేయడమే ఈ తులాభారం. గో తులాభారం శ్రీకృష్ణ తులాభారంతో సమానమైనదని అంటారు. దానిని చూసినా, చేయించినా శివ విష్ణువులకు ప్రీతిపాత్రులవుతారని అంటారు. గో తులాభారంలో పాల్గొని విశేషమైన సేవ చేసిన వారు వైకుంఠంలో దృఢమైన గృహం పొందడం తథ్యం. గో గ్రాసం అంటే గోధుమలు, బియ్యం, ధాన్యం, చిట్టు, పొట్టు, తౌడు, బెల్లం మినుములు, పెసలు, కందులు ఉలవలు, జొన్న, మొక్కజొన్న, క్యాబేజీ,కాలిఫ్లవర్ వంటివి వాటిని గోవుకి సమర్పించడం వల్ల నవగ్రహ శాంతి కలుగుతుంది. ఇందువల్ల మానవు లకు సపర్వ సౌఖ్యాలు కలగుతాయి. గో మాత ఆశీస్సులు పొందడానికి ఇది గొప్ప మార్గం. గో భక్తులకు స్వర్గం కంటె పైనున్న గో లోకంలో స్థానం లభిస్తుంది. రాధాకృష్ణులు గో లోకంలో ఆలమందల మధ్య విహరిస్తుంటారని చెబుతారు. ఈ భూమిని భరించేవారు, ధరించేవారు అనగా అది సక్రమంగా ఉండేందుకు సహకరిస్తున్న ఏడు జీవసమూహాలలో గోవులు కూడా ఉన్నాయి.

- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

ధర్మం-మర్మం

లోకాలోకాచలము

సప్త ద్వీపాల అనంతరం లోకాలోక అచలమని ప్రదేశం ఉంటుంది. ఇది లోక అలోకములకు మధ్యన, చుట్టూ విస్తరించి ఉంటుంది. ఇది మానసరోత్తర పర్వతానికి, మేరు పర్వతానికి మధ్యన అంతే విస్తారమైన భూమితో బంగారుమయంగా ఉంటుంది. దీనిలో పడిన ఏ పదార్థము మరల లభించదు. అందువలన ఈ ప్రాంతానికి ఏ ప్రాణి చేరదు. ఈ విధంగా మూడు లోకముల చివర, మూడు లోకముల చుట్టూ సరిహద్దు పర్వతముగా అవధి పర్వతముగా భగవంతుడు ఏర్పరచిన పర్వతము లోకాలోక పర్వతము. దీని నుండే సూర్యాది గ్రహాలు, జ్యోతిర్గణముల యొక్క కిరణాలు తరువాత మూడు లోకములకు వ్యాపించి సంచరించగా ఈ కిరణములు మరల వెనకకు తిరిగి రావు. ఇవి యాభై కోట్ల యోజనముల విస్తీర్ణమున ఉన్న భూగోళమునకు నాల్గవ భాగమున ఉన్న లోకాలోకాచలం. ఈవిధంగా భూమండల విన్యాసం లోక విన్యాస కొలతలతో, లక్షణములతో ఉన్నదని పండితులు చెప్పి ఉన్నారు.

- డా॥ కందాడై

భగవద్గీత



అంకిత భక్తుడు నాకు అత్యంత ప్రియుడు

అధ్యాయం 7

శ్లోకం 18

ఉదారాః సర్వ ఏవైతే
జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్।
ఆస్థితః స హి యుక్తాత్మా
మామేవానుత్తమాం గతిమ్॥

తాత్పర్యం

ఈ భక్తులందరును నిస్సంశయంగా ఉదాత్తులే అయినా వీరిలో నా జ్ఞానమునందు స్థితుడైనవానిని నన్నుగానే నేను భావింతును. నా దివ్యమైన సేవ యందు నియుక్తుడైనందున అతడు అత్యుత్తమ పరమగతియైన నన్ను తప్పక పొందగలడు.

భాష్యం

భగవంతుని ఆశ్రయించే నలుగురూ భగవంతునికి ప్రియులే, వారు భగవంతునికి దగ్గరకు వచ్చి భౌతిక ప్రయోజనాలను తీర్చుకున్నా, భగవం తుని పట్ల శ్రద్ధ, ప్రీతి ఉండుట వలన భౌతిక కోరికలు తీరినప్పుడు సంతృప్తి చెంది, ఇంకా భక్తిలో ముందుకు కొనసాగే అవకాశం ఉంటుంది. అయితే భగవత్సేవకే అంకితమయిన భక్తుడు భగవంతునికి అత్యంత ప్రియము. అతనికి భగవంతుని సేవ తప్ప వేరే ధ్యాస లేదు, అలాగే భగవంతుడు కూడా అతనిని విడిచి ఉండలేడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

నియతి తప్పని నిష్ఠ



శ్రీరమణాశ్రమం
7-4-47

నిన్న, నిద్రాహార విహార నియతిని గురించి భగవాన్ సెలవిచ్చినదంతా వ్రాశాను. శ్రీవారది ఆచరణ రూపంగానే ఎన్నో విధాల బోధిస్తూ ఉంటారు. ఏమంటే, పాలూ, పెరుగూ ఇత్యాదులేమీ తినరు సరిగదా, పనిలేకుండా కూర్చునే వానికి రెండు ఇడ్డెన్లెందుకని ఉదయం అల్పాహార వేళ ఒకే ఇడ్డెనను తింటున్నారిప్పుడు. భోజనమూ అంతే. కూరా మొదలైనవన్నీ కలిపితే పట్టెడుంటుందేమో. అదైనా రుచి పాకాలతో విడివిడిగా తింటారా, వడ్డిస్తుంటే పులుసుతో సహా ఆధరువులూ, భక్ష్యాలూ అన్నీ కలిపి ఒకే ముద్దగా చేసి పెట్టుకుని ఆ తర్వాత అన్నంతో కలిపి తింటారు. ఈమధ్య ప్రసంగవశంగా "ఏదో ఒక్క ఆధరవు చేసుకొని అన్నం తింటే ఎంతో రుచిగా ఉంటుంది. ఇన్నెందుకో. పూర్వం అట్లాగే చేసేవాళ్లం. నేనిప్పటికీ ఆ నియమం వదల్లేదు" అని భగవాన్ సెలవిచ్చారు.

"కొండమీద ఉండగా ఎందరో అన్నం, పళ్లూ, భక్ష్యాలూ తెస్తూ ఉండేవాళ్లు. ఈ మూడు వేళ్లతో తీసుకొని అందరు తెచ్చినవీ తినేవాణ్ణి. ఎప్పుడు తెస్తే అప్పుడే. రోజల్లా తిన్నది అంతా కలిపితే పట్టెడన్నా అయ్యేది కాదు. ఆ భోజనం ఎంతో సుఖంగా ఉండేది. ఇప్పుడు ఆకువేసి అనేక పదార్థాలు వడ్డిస్తారు. పారవేయలేక తింటే భారంగా ఉంటుంది" అనిన్నీ అప్పుడప్పుడంటూ ఉంటారు భగవాన్.

నిద్ర విషయమూ అంతే. జయంతి, మహాపూజ ఇత్యాది ఉత్సవాలు జరిగితే పని అలసట వల్ల విద్యార్థులు బ్రాహ్మీముహూర్తంలో వేదపారాయణకు రాకున్నా, తాము యథాప్రకారం లేచి కూర్చుంటారు. వారి శరీరమే ఎప్పుడైనా అస్వస్థతగా ఉంటుందనుకో, సేవకులుండి "మరికొంచెం సేపు పడుకోరాదా?" అంటే "బ్రాహ్మీ ముహూర్తంలో పడకేమిటయ్యా? కావాలంటే మీరు పడుకోండి" అంటారట. ధనుర్మాసం వస్తుందా, తెల్లవారుజామున అరుణాచలేశ్వరాలయంలో పూజ ప్రారంభిస్తారు. అక్కడ మొదటి గుండు వేసేసరికి ఇక్కడ భగవాన్ లేచి కూర్చుంటారు. తమిళ్ పారాయణకు వచ్చేవారు నిద్రలేచి రావాలి గాని, భగవాన్ వారి సేవను స్వీకరించుటకు సదా సంసిద్ధులే.

విహారమూ మితమే గదా? ఈ నియమాలన్నీ, సాధకులకే కాని జ్ఞానులకు అవసరము లేదంటారు గాని, వారు లోకసంగ్రహార్థం అన్ని పాటిస్తారు. వైరాగ్య శిఖరాన్నుండి ఎప్పుడూ జారరు. నియతి తప్పని నిష్ఠా పట్టుదలా ఇత్యాదులన్నీ వారికి సహజంగానే ఉంటవి. వారి చర్యలన్నీ పాఠాలే.

ఆశీర్వాదాలు

8-4-47

ఈ మధ్య పెద్దన్నయ్య పిల్లలు, శాస్త్రీ, మూర్తీ, భగవాన్ కొక జాబు వ్రాశారు. ఏమంటే "చిరంజీవి భగవాన్ తాతయ్యకు, నమస్కారములు. ఏది కావాలంటే అదల్లా వచ్చేటువంటి మంత్రం నీకు వచ్చునా? వస్తే వెంటనే వ్రాసి పంపు. ఇట్లు నీ మనుమలు శాస్త్రీ, మూర్తీ" అని వ్రాశారు.

"చిరంజీవి తాతయ్యేమిటి? చిలిపిచేష్ట"లని నేనంటే "సత్యమే వ్రాశారమ్మా. చిరంజీవి భగవానుకాక వేరెవ్వరు? చిరకాలం జీవించే తాతకు నమస్కారం. కావాలన్నదల్లా వచ్చేట్టు ఆశీర్వదించు అన్నారు. తప్పేమి?" అన్నారు సుందరేశయ్యర్. భగవాన్ నవ్వుతూ "నా చిన్నతనంలో మా మేనత్త కుమారుడు రామస్వామి గారికి నేనిట్లాగే ఒక జాబు వ్రాశాను. కొన్నాళ్లు దిండుగల్లులో వారింట్లో ఉండి చదువుకున్నా గదా? ఒక సెలవులకు తిరుచ్చుళికి వచ్చాను. ఆ రామస్వామిగారికి ఉత్తరం వ్రాయాలని బుద్ధిపుట్టింది. ఏం వ్రాయాలే తెలియదు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: ప్రయాణాల విషయంలో ప్రతికూలత ఉంటుంది. పనులలో శ్రమ తగ్గుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. ఆర్థిక చిక్కులు పరిష్కరింపబడతాయి. శత్రుభీతి పోతుంది.

వృషభ రాశి: అనుకూల పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల ద్వారా అనుకూలత ఉంటుంది. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం తగ్గుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు అనుకూలం. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు తగ్గుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రతికూలత ఉంటుంది. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. కుటుంబ వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

మకర రాశి: ఆరోగ్య రీత్యా అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆదాయానికి అనుకూల పరిస్థితులు ఉంటాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలం.

కుంభరాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య క్రమశిక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార అనుకూలత ఉంటుంది.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com





వీధి బాలల దీదీ...

బిక్కుబిక్కుమంటూ..బిక్కముఖం వేసుకొని ఒకడు.. భయం భయంగా.. సార్ అంటూ అడుక్కుంటూ మరొకడు.. ఆకలి డొక్కలోకి కాళ్లు ముడుచుకుని.. సిమెంట్ బెంచ్‌పై దీనంగా పడుకొని ఇంకొకడు.. జారుతున్న నిక్కర్ని ఓ చేత్తో ఎగదోస్తూ.. మరో చేత్తో టీ కప్పులు అందిస్తూ.. వేరొకడు.. మనకు రైల్వే స్టేషన్లల్లో.. బస్టాండ్లలో నిత్యం దర్శమిచ్చే పిల్లల దృశ్యాలు! అయితే మనం వారిని చూసి జాలిపడతాం..మన దారిన మనం పోతాం..మరీ కాస్త దయాగుణం ఎక్కువుంటే.. అడిగే పిల్లోడి చేతిలో పావలో, పరకో వేస్తాం.....కాని బడిలోనో అమ్మ ఒడిలోనో ఉండాల్సిన పిల్లలు అలా ఎందుకున్నారు? అని మాత్రం ఆలోచించం..ఉరుకుల పరుగుల జీవితం కదా మనకు ఆ తీరిక కూడా ఉండదు మరి. కాని ఆమె మాత్రం అందరిలా చేయలేదు. అందరికి భిన్నంగా ఆలోచించింది. వీధిబాలల జీవితాల్లోకి తొంగి చూసింది. వారి జీవితాల్లోని చీకటి కోణాన్ని వెతికి పట్టుకుంది. దారి తప్పి వచ్చిన పిల్లలను, పారిపోయి వచ్చిన చిన్నారులను వారి వారి ఇండ్లకు చేర్చింది. అదీ సాధ్యం కాకపోతే వారిని చేరదీసింది.. అక్కున చేర్చుకుంది.. మానసికంగా మీకు నేనున్నాను అన్న భరోసా ఇచ్చింది. వారి చీకటిబతుకుల్లో వెలుగులు నింపుతూ..వీధి బాలల చేత ఆప్యాయంగా..దీదీ...అని పిలిపించుకుంటుంది,. ఇంతకు ఎవరామె? అంటే....డాక్టర్ ప్రవీణ్ నాయర్!..సలాం బాలక్ ట్రస్టు వ్యవస్థాపకురాలు. తమను చేరదీసి ఆశ్రయం కల్పించి ..ప్రేమను పంచుతున్న నాయర్‌ను.. ఆ పిల్లలు ముద్దుగా .. దీదీ!.. అని పిలుచుకుంటారు. సహజ సిద్ధమైన ఆమెలోని కరుణ స్వభావం, పిల్లలు సంక్షేమం పట్ల అభిరుచి కారణంగా నాయర్ పిల్లలతో అనుబంధం పెనవేసుకునేలా చేసింది. వివరాల్లోకి వెళితే...

25 మంది పిల్లలతో ప్రారంభం..

1998లో డాక్టర్ ప్రవీణ్ నాయర్, సంజయ్ రాయ్‌లు కలిసి సలాం బాలక్ ట్రస్టును స్థాపించారు. గ్రౌండ్ రిజర్వు పోలీస్ కేటాయించిన ...న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లోని చిన్న స్థలంలో,... 25 మంది పిల్లలతో..ముగ్గురు సిబ్బందితో మొదట సలాం బాలక్ ట్రస్టు ప్రారంభమైంది. ఆ ట్రస్టు ద్వారా ప్రస్తుతం ఆరు ఆశ్రయ గృహాలను (హోం షెల్టర్స్) నిర్వహిస్తోంది. వీధి బాలల జీవితాలలో మార్పురావాలంటే జీవిత నైపుణ్యాలు, జీవన ఆధారాలతో ముడిపడిన విద్యను అందించాలన్నది నాయర్ ప్రగాఢ విశ్వాసం. అంతేకాదు ఎదుగుతున్న పిల్లలలో వృత్తి శిక్షణ అనేది ఉపాధి నైపుణ్యాలను,సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తుందని నాయర్ నమ్మడం వల్లే......తాను స్థాపించిన సలాం బాలక్ ట్రస్టు ..వృత్తి విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. 1988నుంచి 2017 సంవత్సరాల మధ్యకాలంలో సలాం బాలక్ ట్రస్ట్ ద్వార వేలాంది వీధి బాలలు లబ్ధిపొందారు. ఇంటి నుంచి పారిపోయి వచ్చిన వారిలో చాలామంది తిరిగి తమ తమ ఇండ్లకు చేరుకున్నారు. కొందరు ఉద్యోగాలు పొంది హాయిగా జీవనం సాగిస్తున్నారు. అమె చేసిన,చేస్తున్న సేవలకు గాను.. 2017లో డెవలప్ మెంట్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ విభాగంలో నాయర్‌కు జమ్నాలాల్ బజాజ్ అవార్డుతో సహా ఆమె పలు అవార్డులు అందుకున్నారు. అంతకు ముందూ.. దేశ,విదేశీ సంస్థలు ఆమెను అవార్డులతో సత్కరించాయి.



వీధిబాలల పాలిటి కల్పతరువు

ప్రస్తుతం సలాంబాలక్ ట్రస్టు ఢిల్లీలో వీధిబాలల పాలిట కల్పతరువుగా మారిందని చెప్పడం అతిశయోక్తికాదు. ఈ ట్రస్టు .... వీధి బాలలను గుర్తించి వారిని వారివారి కుటుంబాల దగ్గరకు చేర్చే ప్రయత్నం చేస్తుంది. అలా చేర్చలేని పక్షంలో, తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురక్షితమైన, నివాస కేంద్రాలలో చేరుస్తుంది. ట్రస్టు ప్రస్తుతం ఓల్డ్ ఢిల్లీ రైల్వే స్టేషన్లో ఆసరా, అప్నాఘర్ అనే పేర్లతో రెండు..డీఎంఆర్‌సీ చిల్డ్రన్స్ హోం,(బాలుర కోసం), ఆరుషి మరియు రోజ్ (బాలికలకోసం) ఆవాస కేంద్రాలను సంతోషకరమైన వాతావరణంలో నిర్వహిస్తోంది. ఈ రెసిడెన్షియల్ సెంటర్లలో వీధి బాలల ఆలనా పాలనా ట్రస్టు చూసుకుంటుంది. వారి ఆరోగ్యం పట్ల పూర్తి శ్రద్ధ తీసుకోబడుతుంది. ఇక్కడ పిల్లలకు బలవర్ధకమైన ఆహారం, బట్టలు అందిస్తారు. విద్యతోపాటు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. కంప్యూటర్ ద్వారా వృత్తి కోర్సుల్లో, కమ్యూనికేషన్ స్కిల్స్ లో శిక్షణ ఇస్తారు. నృత్యానికి సంబంధించిన వర్క్‌షాపులు నిర్వహిస్తారు. జీవన నైపుణ్యాలతో కూడిన విద్యను అందిస్తారు. 29 సంవత్సరాలలో సలాం బాలక్ ట్రస్టు ద్వారా.. 80 వేల మందికి పైగా వీధిబాలలు లబ్ధి పొందారు.

వీధి బాలల కోసం..

కాంటాక్ట్ పాయింట్స్:

సలాం బాలక్ ట్రస్టు నిరంతరం వీధిబాలల సంక్షేమం కోసం పనిచేస్తోంది. అందుకోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఢిల్లీలోని బస్టాప్స్, రైల్వేస్టేషన్లు, మార్కెట్ ప్రాంతాలు, మురికి వాడల్లో సలాం బాలక్ ట్రస్టు తరుపున మొత్తం 26 కాంటాక్ట్ పాయింట్స్ నిర్వహిస్తోంది. ఈ సెంటర్ల ద్వారా ప్రతి ఏటా ఐదు వేలమంది పిల్లలు ఆశ్రయం పొందగల్గుతున్నారు. ఈ సెంటర్లలోపనిచేసే వారంతా ట్రస్టుకు చెందిన బాలలు, లేదా ట్రస్టు ద్వారా లబ్ధి పొందిన వారే కావడం విశేషం.

ద సిటీ వాక్ ప్రోగ్రామ్:

సాధారణ ప్రజల్లో వీధిబాలల పట్ల కరుణ,సానుకూల దృక్పథం పెంచేందుకు వీలుగా ఢిల్లీ వీధుల్లో ద సిటీవాక్ ప్రోగ్రామ్ కొనసాగిస్తున్నారు. వీధిబాలల జీవితాల్లోని చీకటి కోణాలు తెలిసి, ట్రస్టుకు చెందిన యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

మెంటల్ హెల్త్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్:

వీధి బాలల మానసిక అవసరాలు తీర్చడానికి 2003 నుంచి ట్రస్టు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఓల్డ్ ఢిల్లీ రైల్వే స్టేషన్, న్యూఢిల్లీ, సెంట్రల్ ఢిల్లీ జిల్లాలో చైల్డ్ హెల్ప్ లైన్‌ను (1098) ట్రస్టు నిర్వహిస్తోంది.

- చొల్లేటి

ఐశ్వర్యకు అరుదైన పురస్కారం



ఫ్రెంచ్ సంస్కృతిని భారతదేశంలో పెంపొందించాలనే ఉద్దేశ్యంతో కొన్ని సంవత్సరాలుగా ఆ రంగంలో కృషి చేస్తున్న ఐశ్వర్య టిప్నిస్‌కు ఈ సంవత్సరం ఫ్రాన్స్ టాప్ కల్చరల్ అవార్డులో ఔట్‌స్టాండింగ్ కమిట్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. ఆమె ఢిల్లీకి చెందినవారు. వయసు 37 సంవత్సరాలు. వృత్తిరీత్యా ఆర్కిటెక్ట్. భారతదేశంలో ఫ్రెంచ్ సంస్కృతిని పెంపొందించడానికి చేస్తున్న కృషికిగాను ఆమెకు ఈ అవార్డు ఇవ్వడం జరిగింది.

ఈ అవార్డును కళల రంగంలో నిష్ణాతులైన ప్రముఖులకు మాత్రమే అందజేస్తారు. ఆమెకు ఈ కళలో దాదాపు పదిసంవత్సరాల అనుభవముంది. 2011లో కామన్‌వెల్త్ ప్రొఫెషనల్ ఫెలోషిప్‌ను పొందారు. ఆర్కిటెక్ట్‌రాజ్‌గా అందరూ పిలిచే ఇబ్రహీం అల్కాజీ 2012లో ఈ బహుమతిని సాధించారు. ఈ కళకు ఆయన మూలపురుషుడు. కళల అభివృద్ధికి అకుంఠిత దీక్షతో కృషి చేసే వారికి ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఇది ఫ్రెంచ్ సాంప్రదాయంలో అత్యున్నత పురస్కారం.

న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌కోసం టిప్నిస్ అంకితమైంది. ఆ స్కూల్ డెవలప్ మెంట్‌కోసం దేశ సంస్కృతిని తెలిపేటట్లు స్కూల్ నిండా ప్రాజెక్టులు చేపట్టింది. మధ్యప్రదేశ్‌లోని మెహిద్‌పూర్ కోటను పునరుద్ధరించడానికి ఆమె చేసిన కృషి ఆమె పేరును నలుదిశలకు వ్యాపించేలా చేసింది. డెహ్రాడూన్‌లోని డూన్‌స్కూల్‌లో కూడా ఆమె కొన్ని ప్రాజెక్టులు చేపట్టింది. యునెస్కో అవార్డు ఫర్ హెరిటేజ్ కూడా ఆమె పొందారు. ఆమె విస్తృతమైన కృషితో ఫ్రెంచ్ వారసత్వాన్ని భారతదేశంలో పెంపొందించాలన్నదే ఆమె ఆశయం. అలా ఆమె పనితీరుతో చందేర్‌నగర్‌ను మార్చింది. ఆమె స్కాట్లాండ్‌లోని డుండీ యూనివర్శిటీ నుండి యూరోపియన్ అర్బన్ కాన్జర్వేషన్‌లో మాస్టర్ డిగ్రీని డిస్టింక్షన్‌లో పొందారు. బోన్‌జోర్ ఇండియా 2017 అనే అవార్డును కూడా ఆమె పొందారు. నో యువర్ ఇండో ఫ్రెంచ్ హెరిటేజ్ ఇన్ చందోర్‌నాగోర్, అనే స్లోగన్‌తో ఫ్రెంచ్ హెరిటేజ్ ప్రచారం మొదలుపెట్టారు. ఇది వెస్ట్‌బెంగాల్‌లో పాత ఫ్రెంచ్ కాలనీ. అంతేకాదు ఆమె యునెస్కో ముఖ్యమైన టీమ్‌లో సభ్యురాలు. ఈ టీమ్ ఎ వరల్డ్ హెరిటేజ్ పేరుతో కార్యక్రమాలను డార్జిలింగ్ హిమాలయన్ రైల్వేలో నిర్వహించాలనుకుంటున్నారు. ఆమె డూన్ స్కూల్‌కి కన్సల్టెంట్‌గా పనిచేస్తూ పురాతన, చారిత్రాత్మక బిల్డింగులను తమ కళలతో పునరుద్ధరిస్తున్నారు. దేశప్రజలకు ఫ్రెంచ్ సంస్కృతిని తెలియజేయాలనే సంకల్పంతోనే ఆమె ముందుకు సాగుతున్నారు.

నడివయసులో పతకాల వేట!

కొత్త చరిత్ర రాస్తున్న రాజస్థాన్ అథ్లెట్ స్నేహాజైన్

మహిళకు వివాహమైనదంటే తమ ఆశలు ముగిసినట్లేనని చాలామంది అనుకుంటూ ఉంటారు. కాని ఆమె జీవితంలో వివాహమే పెనుమార్పును తీసుకొచ్చింది. కోడళ్లను కట్నంకోసం రాచిరంపాన పెట్టే అత్తలున్న ఈకాలంలో నా క్రీడా భవిష్యత్తుకు బంగారు బాటను వేసింది మా అత్తగారే అని గర్వంగా చెబుతుంది స్నేహాజైన్. ఆమె క్రీడాజీవిత విశేషాలు మీకోసం...

రాజస్థాన్ మేటి మహిళా అథ్లెట్స్‌లో స్నేహా జైన్ పేరు నేడు తరచుగా వినిపిస్తోంది. జాతీయస్థాయిలో ఆమె ఎన్నో రికార్డులు సాధించారు. ఇప్పటివరకు ఆమె 149 బంగారు పథకాలను సాధించారంటే అతిశయోక్తి కాదు. ఆమె జీవితంలో పరుగుల పోటీ ఒక అంతర్భాగమై పోయిందనే చెప్పవచ్చు. ఆమె పరుగు ప్రారంభించి దాదాపు పదిసంవత్సరాలయ్యింది. ఆమె స్వయంకృషితో రాజస్థాన్‌లో మహిళా అథ్లెట్స్‌గా పేరు సంపాదించుకున్నారు. రాష్ట్రంలో జరిగే వందమీటర్లు, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్ పోటీలలో పాల్గొనేవారు. నేషనల్, ఏసియన్ ట్రాకులలో ఆమె ఎన్నో రికార్డులను సృష్టించింది. 40సంవత్సరాల స్నేహా జైన్ ఇద్దరు పిల్లలున్నాక కూడా వీటన్నింటిని సాధించిందంటే నమ్మశక్యం కలగదు. కాని ఇది అక్షరనిజం. ఆమె పెళ్లయిన తరువాతనే క్రీడారంగంవైపు దృష్టిసారించింది.

ఈమధ్యనే శ్రీలంకలో జరిగే ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌కి వెళ్లి ఉంటే ఆమె 150 వ పతకాన్ని కూడా సాధించేవారు. కాని వాళ్ల మామయ్యగారు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుండడం వల్ల ఆమె ఆ పోటీలకు హాజరు కాలేకపోయారు. పదిసంవత్సరాల క్రితం ఇలాగే 1996లో తనకు లభించిన మొదటి అవకాశాన్ని వదులుకోవలసి వచ్చింది. 1996లో ఆమె నేషనల్ అథ్లెటిక్స్‌కి స్క్వాడ్‌గా ఎంపిక కావాల్సి ఉంది. తల్లి యుటెరైన్ కాన్సర్‌తో బాధపడుతుండడంతో అనుకోని పరిస్థితుల్లో బెంగళూరు స్పోర్ట్స్ క్యాంప్ నుండి ఇంటికి బయలుదేరవలసి వచ్చింది. దీనితో ఒక మంచి అవకాశాన్ని ఆమె కోల్పోయారు. ఆవయసులో ఆమె జీవితం ఒక్కసారిగా స్తంభించిపోయింది. ఆసమయంలో ఆమె మీద చాలా ఒత్తిడి ఉండేది. అమ్మను, తమ్ముడిని ఆమె చూసుకోవాలని బంధువులు ఒత్తిడి తెచ్చేవారు. ముంబయికి అమ్మతో పాటు వెళ్లి వైద్యాన్ని అందించి తిరిగి తీసుకురావడం ఆమె బాధ్యతగా మారింది. ఆవిధంగా ఆమెకు క్లాసుకి వెళ్లి చదివే తీరికే ఉండేది కాదు. కొద్దిరోజులకు ఆమె తన తల్లిని కోల్పోయింది. ఆమె వివాహం జైన్‌తో అయ్యింది. మంచి అథ్లెట్ కాలేకపోయాననే బాధలో ఉన్న ఆమెను మహిళా అథ్లెట్‌గా వెలుగులోకి తీసుకువచ్చింది జైన్. 1989 మొదలు ఇప్పటివరకు ఆమె పరుగు సాగుతూనే ఉంది. ఆమెకు విద్యాభ్యాసాన్ని కూడా జైన్ చెప్పించారు. క్రీడా జీవితం కూడా కళ్లముందు నిలుచుంది. 1996 నుండి 2000మధ్యకాలంలో ఆమె కలల సాకారం కోసం ఏమీ చేయలేకపోయింది. ఆమె కల ఏమంటే దేశంకోసం పోరాడి పతకాలను సంపాదించాలన్నదే ఆమె ఆశయం.

''మా పెద్దక్క లత నా పెళ్లిని నిశ్చయించింది. అమ్మ పోయాక నా పెళ్లి అయితే బయటకు వెళ్లి మంచి జీవితాన్ని గడుపుతానని ఆమె ఆలోచించి ఈ నిర్ణయం తీసుకుంది. ఆమె ఆశించినట్టే మా అత్తగారు, నా భర్త నన్ను క్రీడారంగంలో ప్రోత్సహించారు. ఆమె ప్రోత్సాహంతో నేను వెనుదిరిగి చూడవలసిన అవసరం ఏర్పడలేదు. చాలామంది అత్తలు బయటకు పంపించడానికి ఆసక్తి చూపరు. తమకు ఇంటి పనులలో సాయపడమనే చెబుతుంటారు. కాని మా అత్తగారు అలా కాదు. నన్ను బాగా ప్రోత్సహించేవారు. ప్రాక్టీసింగ్‌కి ప్రతిరోజూ వెళ్లనిచ్చేవారు'' అని స్నేహాజైన్ అన్నారు.

''మొదటిసారి పోటీలో పాల్గొన్నప్పుడు ఎటువంటి పతకాలు పొందలేకపోయాను. అయినా నిరుత్సాహ పడలేదు. ఎందుకు పొందలేక పోయానని ఆలోచించాను. పరుగుపందెలకు నా శరీరం ఇంకా సన్నద్ధం చేయాలని గ్రహించాను. నేను మొదటిసారిగా మాస్టర్స్ నేషనల్ గేమ్స్ జైపూర్‌లో పాల్గొన్నాను. అందులోనేను లాంగ్‌జంప్‌లో రికార్డు సృష్టించాను. దాన్ని ఎవరూ అధిగమించలేకపోయారు. ఆ పోటీతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అప్పటినుండి పతకాలకోసం నా వేటను మొదలుపెట్టాను'' అని తెలిపారు.

పదిహేను సంవత్సరాల వివాహ జీవితంలో ఆమె ఇప్పటివరకు 149 బంగారు పతకాలను సాధించింది. ఆమె పేరుమీద జాతీయ స్థాయిలో, ఏసియన్ స్థాయిలో ఎన్నో రికార్డులను కైవసం చేసుకుంది. గత సంవత్సరం మధ్యప్రదేశ్‌లోని విదిషాలో 37వ మాస్టర్స్ నేషనల్ గేమ్స్, వందమీటర్ల పరుగులో, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, 4ఇంటు 100మీటర్ పరుగుపోటీలో, 4ఇంటు 400మీటర్లలో రిలే పోటీలో పాల్గొని ఐదు పతకాలను సాధించారు. భారతీయ వివాహ వ్యవస్థలో ఒక కోడలు ఇటువంటి పోటీలలో పాల్గొని ఇన్ని పతకాలను సాధించడం సాధారణ విషయం కాదు. అది క్రీడారంగమైతే అసలు చెప్పనవసరం లేదు. కాని ఆమె వివాహం చేసుకున్న ఇంటివారు ఆమెకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వబట్టే ఇవన్నీ సాధించగలిగానని ఆమె తెలిపారు.

''హైదరాబాద్‌లో జరిగే మొదటి నేషనల్స్‌కి వెళ్లినప్పుడు నా భర్త కూడా నాతోపాటు వచ్చారు. అప్పటికి ఒక కూతురు 2002లో పుట్టింది. నేను ఏపోటీకి వెళ్లినా ఆమెను తీసుకుని వెళ్లిపోయేదాన్ని. నేను సంవత్సరంలో మూడు నుండి నాలుగు నెలల కాలం ఇంటిలో ఉండేదాన్ని కాదు. ఏదో ఒక పోటీలలో పాల్గొనడానికి తిరుగుతూనే ఉండేదాన్ని. నా ప్రయాణానికి కుటుంబసభ్యులు ఎవరూ అడ్డంకులు చెప్పేవారు కాదు'' అని చెప్పారు.



నిజానికి జైన్ తన పరుగును ఇద్దరు పిల్లలకు ఐదు సంవత్సరాల వచ్చిన తరువాతనే మొదలు పెట్టింది. వాళ్ల స్ఫూర్తితోనే ఆమె ఈ రంగంలోకి వచ్చింది. కూతురు ఆర్చీ, కొడుకు వంశ్, ఆమె అడుగుజాడల్లో పరిగెత్తేవారు.



వంశ్ ఇప్పుడు పది చదువుతున్నాడు. స్కూల్‌లో మంచి ట్రాక్‌లో ఉన్నాడు. ఆర్చీ తొమ్మిదవ తరగతి. రాంచీ, జార్ఖండ్, హరిద్వార్, ఉత్తరాఖండ్ లో జరిగిన పోటీలలో ఆర్చీ రెండు అండర్ 14 నేషనల్ ఈవెంట్స్‌లో పాల్గొంది. ''ఆర్చీ నాతో పాటు రెండు సంవత్సరాల నుండి ప్రాక్టీసు చేస్తున్నది. నేనే ఆమె కోచ్‌ను. నాతరువాత ఆమె ప్రయాణం సాగేటట్టుగా శిక్షణను ఇస్తున్నాను. ఆర్చీ వందమీటర్ల స్ప్రింట్, వంద మీటర్ల హర్డిల్స్ పోటీలలో పాల్గొంటుంది'' అని గర్వంగా చెప్పారు.

ఆర్చీ తన తల్లి స్నేహాజైన్ ఉన్న బర్కతుల్లా స్టేడియంలో ప్రాక్టీసు చేస్తుంది. ఇంటికి ఇది రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటలు స్టేడియంలో ప్రాక్టీసు చేస్తారు. ఇద్దరు పిల్లలుండి కూడా ఎవరూ ఇలా క్రీడారంగంలో కాలుమోపి, ఇన్ని విజయాలు సాధించగలగడం ఇప్పటికి వరకు ఎవరు లేకపోవడం విశేషంగానే చెప్పు కోవాలి. ఆమె వదినగారి పిల్లలు చార్టెడ్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ కోర్సులను చదువుతున్నారు. భర్త ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్‌లో పనిచేస్తున్నారు. ఇద్దరు అన్నదమ్ములు సొంత వ్యాపారాలు బాగా నిర్వహించుకుంటున్నారు. ఆమె క్రీడారంగంలో నైపుణ్యానికి గుర్తింపుతో 1993లో పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ డిపార్ట్ మెంట్‌లో ఉద్యోగాన్ని సంపాదించారు. అప్పటికి ఆమె డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తిచేసింది. ఈ ఉద్యోగం స్పోర్ట్స్‌కోటాలో వచ్చింది. ఆమె ప్రస్తుతం జోధ్‌పూర్ స్టేషన్ రోడ్‌లో ఉన్న హెడ్ పోస్టు ఆఫీసులో పనిచేస్తున్నారు. ఆమె ఎప్పుడూ ట్రాక్ సూట్‌లో కనబడుతుంది. ఎందుకంటే ఆఫీసు అయినవెంటనే అట్నుంచి అటు స్టేడియంకు వెళ్లిపోతుంది. ఎక్కువ పతకాలు గెలిచినందుకు, క్రీడాకారిణి అయినందుకు నాకు డ్యూటీ సమయాల్లో రెండు గంటలు మినహాయించారు. నా విధులు నేను 10 నుంచి 4గంటల వరకు మాత్రమే నిర్వహిస్తాను. ఇవన్నీ కాకుండా ఆమెకు దేవుడిచ్చిన వరం మంచి అథ్లెటిక్ శరీరతీరును, ఆరోగ్యాన్ని కలిగి ఉండటం. మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఆమె ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యురాలు. నేషనల్ ఈవెంట్స్ నిర్వహించడంలో ఆమె అందెవేసిన చేయి. ఆమె ఇప్పుడు తన కలను సాకారం చేసుకునే పనిలో నిమగ్నమై ఉంది. మేలో సింగపూర్‌లో జరగబోతున్న ఏషియన్ మాస్టర్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె పాల్గొని 150వ బంగారు పతకాన్ని సాధించాలన్నదే ఆమె ఆశయం. ఆ ఆశయం నెరవేరాలని మనసారా కోరుకుందాం.



50 కోట్ల క్లబ్‌లో జై సింహా

జై సింహా చిత్రం 50 కోట్ల క్లబ్‌లో చేరింది అని చిత్ర కథానాయకుడు బాలకృష్ణ చెప్పారు. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన జై సింహా చిత్రం విజయోత్సవాన్ని హైదరాబాద్‌లో జరిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ నేను మద్రాసులో ఉన్నపుడు సినిమాలను కొనుగోలు చేసిన బయ్యర్ల మధ్య ఫంక్షన్స్ జరుగుతుండేవి. అలాంటి సందర్భంగా మళ్ళీ ఇక్కడ కనిపించింది. నా సినిమాల నిర్మాతలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తాను.

జై సింహా మంచి సక్సెస్ సాధించింది. అందరూ సంతోషంగా ఉన్నారు. నాకు రికార్డులు ముఖ్యంకాదు. పరిశ్రమ బావుండాలి. అందరి సినిమాలు బావుండాలని కోరుకునేవాడిని. అదే దృష్టితో సినిమాలు చేస్తాను. కె.ఎస్.రవికుమార్‌తో సినిమా చేయాలని ఎనిమిదేళ్ళ కల ఈ సినిమాతో నెరవేరింది. ఇందులో మంచి పాటలు, మాటలు, సంగీతం అన్నీ చక్కగా కుదిరాయి. అందుకే ఘనవిజయం సాధించింది అన్నారు.

జై సింహా పంపిణీదారులకు, సాంకేతిక నిపుణులు బాలకృష్ణ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్థసారధి రెడ్డి, శివారెడ్డి, ఫణి శక్తి పిక్చర్స్ రమేష్, విజయ్, మహేష్, కృష్ణతదితరులు పాల్గొన్నారు.

భాగమతి సెట్ చూసి అనుష్క ఆశ్చర్యపోయారు

భాగమతి పూర్తిస్థాయి హారర్ చిత్రం కాదు. హారర్ అంశం కొంత మాత్రమే ఉంటుంది. దాదాపు నలభై ఐదు రోజుల పాటు బంగ్లా సెట్ లో ఈ చిత్రం షూటింగ్ జరిగింది. అక్కడ చిత్రీకరించిన సన్నివేశాలు సినిమాకే హైలైట్ గా నిలుస్తాయి అని అంటున్నారు కళా దర్శకుడు రవీందర్‌రెడ్డి. అనుష్క ప్రధాన పాత్రలో అశోక్ జి. దర్శకత్వంలో యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని పాత్రికేయులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆ వివరాలేంటో ఆయన మాటల్లో....


రవీందర్‌రెడ్డి

మూడు కోట్లతో బంగ్లా సెట్

ఈ చిత్రకథను దర్శకుడు అశోక్ చెప్పినపుడు అత్యంత పురాతనమైన 400 ఏండ్ల కాలం నాటి బంగ్లా అవసరమనిపించింది. దాంతో అలాంటి బంగ్లా కోసం ముంబాయి వంటి అనేక ప్రాంతాలలో అన్వేషించాం. అయితే ఎంత వెతికినా మాకు అనుకూలమైన బంగ్లా దొరకలేదు. అదే సమయంలో అనుష్క డేట్స్ ఇచ్చారు. ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా తప్పనిసరి పరిస్థితులలో దాదాపు మూడు కోట్ల బడ్జెట్‌తో సెట్ వేశాం. దానికి ముందు సెట్ ఎలా ఉండాలనే దానిపై పరిశోధన చేశాం. ఆ తర్వాత స్కెచ్ వేసి, అందుకు తగ్గట్టుగా సెట్‌ను నిర్మించాం. 29 రోజుల్లోనే సెట్ నిర్మాణాన్ని పూర్తిగావించాం. అంత తక్కువ సమయంలో ఇంత పెద్ద సెట్‌ను వేయడం అంత సులువు కాదు. అందుకోసం ఓ కొత్త టెక్నిక్‌ను ఉపయోగించాం. సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ సెట్‌లోనే చిత్రీకరణ అధికభాగం జరిగింది. ఏదైనా సెట్‌కు పాతకాలంనాటి రూపు తీసుకురావడం ఆర్ట్ డైరెక్టర్‌కు పెద్ద ఛాలెజింగ్. ఆ విషయంలో నేను చాలా జాగ్రత్త పడుతుంటాను. తొలిసారి సెట్‌ను చూసి అనుష్క ఆశ్చర్యపోయారు. అంతేకాదు సెట్‌ను చూసిన తర్వాత తనపై మరింత బాధ్యత పెరిగిందని కూడా ఆమె ఆ సందర్భంగా చెప్పింది. మరోవైపు కొందరు సినీప్రముఖులు సైతం సెట్‌ను చూసి అభినందించడం ఆనందాన్ని కలిగించింది. ఈ సినిమాను అరుంధతితో పోల్చలేం. హారర్ సినిమాలంటే గుర్తొచ్చే అన్ని అంశాలను పక్కనపెట్టేసి ఓ కొత్తతరహాలో చేసిన హారర్ చిత్రమిది. దర్శకుడు అశోక్ మంచి ప్రతిభావంతుడు. అన్ని అంశాలపై ఆయనకు పట్టుంది. మా మధ్య మంచి కో-ఆర్డినేషన్ కుదిరింది. అందుకే సినిమా చాలా బాగా వచ్చింది. ఇప్పటివరకు నేను చేసిన సినిమాలన్నింటిలోకి ఈ సెట్‌ను అత్యుత్తమంగా భావిస్తున్నా.



బాలీవుడ్ అవకాశాలొచ్చాయి కానీ...

వచ్చిన ప్రతీ సినిమా అవకాశాన్ని అంగీకరించలేను. నాకు సంతృప్తిగా అనిపించిన సినిమానే చేస్తున్నాను. ఈ నేపథ్యంలో నేను చేసిన సినిమాలకంటే వదిలేసిన చిత్రాలే ఎక్కువ. బాలీవుడ్‌లో అవకాశాలొచ్చాయి కానీ తెలుగులో రాణించాలనుకుంటున్నా. అయితే బాలీవుడ్ ప్రొడక్షన్ డిజైనింగ్ అంతా ఓ వరుస క్రమంలో ఉంటుంది. అందుకే ఆయా చిత్రాల ఆర్ట్ వర్క్ అంతా చాలా ప్లానింగ్‌గా ఉంటుంది. తెలుగులో ఇప్పుడిప్పుడే ఆ పద్ధతిలో సినిమాలను చేస్తున్నారు. తప్పకుండా ఇక్కడ కూడా మార్పు వస్తుంది.

నటుడిగా అవకాశం వచ్చింది

ప్రస్తుతం నాగచైతన్య హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం, అలాగే మోహన్‌కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం. ఇంకా శర్వానంద్ సినిమాకు పనిచేస్తున్నాను. నటుడిగానూ ఓ తమిళ అవకాశం వచ్చింది కానీ నా మటుకు నేను కళా దర్శకుడిగానే మరింత పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను అంటూ ముగించారు.


బన్ని వాసు, లగడపాటిశ్రీధర్, రామజోగయ్యశాస్త్రి, వక్కంతం వంశీ, అల్లు అర్జున్

సైనికుల మనోధైర్యాన్ని చాటే పాట

దేశం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టే సైనికుల గురించి ఎంత చెపినా తక్కువే. ఇప్పుడు అలాంటి సైనికుల గొప్పతనాన్ని ఆవిష్కరిస్తూ నా పేరు సూర్య...నా ఇల్లు ఇండియా చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ నాయకానాయికలుగా రచయిత వక్కంతం వంశీని దర్శకుడిగా పరిచయం చేస్తూ, రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష లగడపాటి, శ్రీధర్ లగడపాటి, బన్నివాసు నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలోని రామానాయుడు సినీ విలేజ్‌లో జరుగుతోంది. ఫైట్ మాస్టర్ పీటర్‌హేన్స్ సారధ్యంలో యాక్షన్ సన్నివేశాలను ప్రస్తుతం చిత్రీకరిస్తున్నారు. కాగా రిపబ్లిక్ డే సందర్భంగా ఈ చిత్రంలోని సైనికులకు సంబంధించిన పాటను విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా లొకేషన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో గీత రచయిత రామజోగయ్యశాస్త్రి మాట్లాడుతూ, ఈ చిత్రంలో నాలుగు పాటలను రాసే అవకాశం నాకు లభించింది. సినిమాలలో రెగ్యులర్‌గా వచ్చే హీరోల ఇంట్రడక్షన్ పాటలకు భిన్నంగా ఈ చిత్రంలోని అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ పాట ఉంటుంది. మాతృభూమి కోసం ఎంతటి త్యాగానికైనా వెనుకాడని సైనికుల మనోధైర్యాన్ని, గొప్పతనాన్ని చాటే పాట ఇది. ఇలాంటి పాటను రాయడం అదృష్టంగా భావిస్తున్నాను. లోగడ నేను రాసి ప్రణవం పాట ఎంతో హైలైట్ కావడమే కాదు ఎన్నో ప్రశంసలు లభించాయి కూడా. దానికి మించేరీతిలో ఈ పాట ఉంటుంది. విశాల్-శేఖర్ సంగీతం ఆయువుపట్టుగా నిలుస్తుంది. బాలీవుడ్‌లో ఎన్నో హిట్స్ ఇచ్చిన వారి అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమైంది. స్వయంగా చూడబట్టే అనుభవరీత్యా ఆ మాట చెప్పగలుగుతున్నాను. ఇక దర్శకుడు వక్కంతం వంశీ విషయానికి వస్తే...కథారచయితగా ఎన్నో సూపర్‌డూపర్ హిట్స్ ఇచ్చిన ఆయనకు దర్శకుడిగా ఇది తొలి చిత్రమైనప్పటికీ అనుభవం ఉన్న దర్శకుడిలా ఆయన పనితనం కనిపిస్తోంది అని అన్నారు.

నిర్మాతలలో ఒకరైన శ్రీధర్ లగడపాటి మాట్లాడుతూ, అల్లు అర్జున్‌కు ఇండియన్ మైఖేల్‌జాక్సన్‌గా పేరుంది. డ్యాన్స్‌ను అద్భుతంగా చేసే ఆయన సినిమాకు సంగీతాన్ని అందించాలని చాలామంది సంగీత దర్శకులు కోరుకుంటుంటారు. విశాల్-శేఖర్ ఈ చిత్రానికి అందిస్తున్న సంగీతం అందరినీ అలరింపజేస్తుంది. రిపబ్లిక్ డేకు ఈ చిత్రంలోని సైనికుల పాటను విడుదల చేస్తాం. ఆ తర్వాత ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మరో పాటను విడుదలచేస్తాం. ప్రస్తుతం చిత్రీకరిస్తున్న ఫైట్ సన్నివేశాలు ఈ నెల 25 వరకు ఇక్కడే కొనసాగుతాయి. ఆ తర్వాత 25 రోజుల చిత్రీకరణ మిగిలి ఉంటుంది. జూన్ 14న ఈ చిత్రం చిత్రీకరణ ప్రారంభించినపుడే వేసవి సందర్భంగా ఏప్రిల్ 27న ఈ సినిమాను విడుదల చేస్తామని ప్రకటించాం. ఆ లక్ష్యంతోనే ముందుకు సాగుతూ విడుదల తేదీని లాక్ చేశాం అని చెప్పారు.


అనసూయ

పరిశోధనాత్మక పాత్రికేయురాలిగా

మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం గాయత్రి. ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకురానుంది. విష్ణు మంచు, శ్రియ ముఖ్యపాత్రల్లో కనిపిస్తారు. టీవీ యాంకర్ అనసూయ ఇందులో శ్రేష్ట జయరాం అనే పరిశోధనాత్మక పాత్రికేయురాలుగా నటిస్తోందని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రంలో ఇంకా నిఖిల విమల్, బ్రహ్మానందం ఇతర ముఖ్యపాత్రధారులు. శ్రీ లక్ష్మిప్రసన్న పిక్చర్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతోంది.

ఈ చిత్రానికి కథ మాటలు డైమండ్ రత్నబాబు, ఛాయాగ్రహణం సర్వేశ్ మురారి, సంగీతం తమన్, ఫైట్స్ కనల్ కణ్ణన్, దర్శకత్వం మదన్ రామిగా.

శివాని ఆరంగేట్రం


అడవి శేష్



డా.రాజశేఖర్, జీవిత తనయ శివాని హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఆమె నటించబోయే చిత్రం ఫిబ్రవరిలో మొదలుకానుంది. లక్ష్య ప్రొడక్షన్స్ పతాకంపై అడవి శేష్ హీరోగా వెంకట్ రెడ్డి దర్శకత్వంలో ఎం.ఎల్.వి. సత్యనారాయణ నిర్మించే చిత్రంలో శివాని నాయికగా నటించనుంది. హిందీలో విజయం సాధించిన 2 స్టేట్స్ చిత్రానికి ఇది రీమేక్. శివాని కోసం అనేక కథలు విన్నప్పటికీ, నటనకు అవకాసం ఉన్న పాత్ర లభించడంతో ఈ కథని ఎంచుకోవడం జరిగిందని, రొమాంటిక్ ఫ్యామిలీ కథా చిత్రంగా ఈ చిత్రం ఉంటుందని నిర్మాత చెప్పారు. దర్శకుడు వెంకట్‌రెడ్డి గతంలో వినాయక్ వద్ద దర్శకత్వ శాఖలో పనిచేశారు.

14 ఏళ్ళ తర్వాత కమర్షియల్ సినిమా చేశాను

- విక్రమ్

విక్రమ్, తమన్నా జంటగా నటిస్తున్న చిత్రం స్కెచ్. విజయ్ చందర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ప్రచారంలో భాగంగా విలేఖరుల సమావేశం ఏర్పాటుచేశారు. తొలుత డి.సురేష్‌బాబు మాట్లాడుతూ విక్రమ్ నాకు మంచి స్నేహితుడు. చాలా చిన్న రేంజ్ నుండి స్టార్‌గా ఎదిగాడు. పాతికేళ్ళ క్రితం ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలాగే కనిపిస్తున్నారు. పరిశ్రమకు మంచి సినిమాలు అవసరం. అప్పుడే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారు. తమన్ స్వరరచన చేసిన స్కెచ్ చిత్రం విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తాం అని చెప్పారు. తమిళంలో మాదిరిగానే తెలుగులో కూడా మంచి విజయం సాధిస్తుందని చిత్ర దర్శకుడు విజయ్ చందర్ అభిప్రాయపడ్డారు.

హీరోయిన్ తమన్నా మాట్లాడుతూ నాకు స్కెచ్ ప్రత్యేకమైన సినిమా. విక్రమ్‌గారితో పనిచేయాలని కెరీర్ ప్రారంభం నుండి అనుకుంటున్నా. పది సంవత్సరాల తర్వాత తీరింది. ఆయన నుండి చాలా నేర్చుకున్నాను. కమర్షియల్ సినిమాలకు నేను పెద్ద ఫ్యాన్‌ని, అలాంటి కమర్షియల్ అంశాల ఆధారంగా ఈ సినిమా తీశారు. అన్ని వర్గాలకు నచ్చే సినిమా అవుతుంది. నాకు, విక్రమ్‌గారి మధ్య వచ్చే ప్రేమ సన్నివేశాలు చక్కగా వచ్చాయి. ఎంజాయ్ చేస్తూ నటించాను. నాకు మెమొరబుల్ మూవీగా నిలిచిపోతుంది అన్నారు. హీరో విక్రమ్ మాట్లాడుతూ స్కెచ్ తమిళ, కన్నడ, మళయాల భాషల్లో పెద్ద హిట్ అయింది. తెలుగులో కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. డి.సురేష్‌బాబుగారు ఈ సినిమాను విడుదల చేస్తుండడం ఆనందంగా ఉంది. నేను విభిన్నమైన సినిమాలు చేస్తుంటాను అనే విషయం తెలిసిందే. పద్నాలుగేళ్ళ తర్వాత కమర్షియల్ సినిమా చేశాను. పాత విక్రమ్ వచ్చారని అందరూ అనుకుంటారు. అయితే ఇది రెగ్యులర్ కమర్షియల్ సినిమా మాత్రమే కాదు. నిజఘటనలతో తెరకెక్కించిన కమర్షియల్ మూవీ. కథ వినగానే థ్రిల్ అయ్యాను. విజయ్ బాగా తెరకెక్కించారు. ఇది థ్రిల్లర్ మూవీ. నా పాత్ర కాస్త డిఫరెంట్‌గా ఉండాలని ప్రయత్నించాను. తమన్నతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. తను మంచి నటి డాన్సర్ అని అన్నారు.


విజయ్‌చందర్, విక్రమ్, తమన్నా, డి.సురేష్‌బాబు